శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము

వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

౯వ భాగము

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

Volume-9

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము వివరణ

శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు

తెలుగు అనువాదం – కాజ సుధాకర బాబు

Sri Vishnu Sahasra Nama Stotram

Annotated commentary by : Sri Narasimhan Krishnamachari

Telugu Translation by : Kaja Sudhakara Babu

This work is published under

Creative Commons Non-Commercial License

The above license applies only to my translation, which is done with permission from the original author, Sri N. Krishnamachari.

Excerpts from other works reproduced in this work are not covered in the above license. Main examples of such reproductions are

(a) Telugu Translation of Bhagavdgitha Slokas, which are taken from the publication of Gita Press, Gorakhpur

(b) Excerpts from book of Sri Pemmaraju Rajarao (Especially translation of Purva Peethika)

(c) Excerpts from the book of Dr. Krovi Partha Saradhi

(d) Excerpts from other works which are mentioned in appropriate places.

All Photographs and pictures are by me (Kaja Sudhakara Babu) or taken from free sources such as Wikipedia.

<u>Cover Photo:</u>

Sculpture at Dwaraka Thirumala, West Godavari District, Andhra Pradesh.

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాంవరః |
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాగ్రజః || (81)

763. తేజోవృషః

- రక్షణ అనే తన వైభవాన్ని భక్తులపై వర్షించేవాడు.
- సూర్యునిరూపంలో వర్షమునకు మూలమైనవాడు.
- తన కాంతిని అన్నింటిపై వర్షించువాడు.
- తన భక్తుల రక్షణకై తన భీకరాయుధములను శత్రువులపై వర్షించువాడు.

ఓం తేజోవృషాయ నమః

తిజ్ - నిశానే - తడుపుట; తేజ్ - నిశానే, పాలనే చ - తడుపుట, రక్షించుట;

తేజస్ - కాంతి, ప్రకాశము, వైభవము

వృష్ - సేచనే - వర్షించుట, చల్లుట; వర్షతి ఇతి వృషః - వర్షించునది వృషః

ఈ ధాతువుల ఆధారముగా వివిధ వ్యాఖ్యలు ఉన్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'తేజ్' అనగా 'రక్షణ' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. **ఏవమ్ సుహృత్ పాలన లక్షణమ్ తేజో వర్షతి ఇతి తేజోవృషః**. ఇలా ఆయన తన రక్షణ అనే వైభవాన్ని సజ్జనులపై వర్షిస్తాడు గనుక ఆయన తేజోవృషుడు. శ్రీ భట్టులు కృష్ణావతారపరంగా వ్యాఖ్యానించిన నామాలలో ఈ నామం వస్తుంది. కనుక గోవుల, గోపబాలుర రక్షణ ఈ వ్యాఖ్యలో సూచింపబడింది.

తేజోఽభి వర్షతి యతః సుహృత్పాలన లక్షణమ్
తేజోవృష స్సమాఖ్యాతః వస్వర్ణో మిత్రవృద్ధిదః

తన మిత్రులను, సజ్జనులను కాపాడటము అనే తేజస్సును వర్షించువాడు తేజోవృషుడు. ఈ నామము అష్టాక్షరీమంత్రము. మిత్రులను పెంపొందించును. ఓం తేజోవృషాయ నమః.

బృందావవనంలో రాసలీల శిల్పాలు . వికీపీడియా చిత్రం

శ్రీ వి.వి. రామానుజన్ – భగవంతుడు తన భక్తులపై తన రక్షణ అనే తేజస్సు లేదా శక్తిని వెదజల్లును. గోకులంలోని అమాయకులు కన్నయ్యను మనసారా ప్రేమించారు. తల్లి ఆవు తన దూడకు పొదుగునిచ్చినట్లుగా శ్రీకృష్ణుడు గోకులవాసులపై తన కటాక్షాన్ని, రక్షణను వెదజల్లినాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'తేజస్సు' అనగా 'నీరు' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **తేజసామ్ అంభసామ్ ఆదిత్యరూపేణ వర్షణాత్ తేజోవృషః**. సూర్యునిద్వారా వర్షమును కురిపించేవాడు తేజోవృషుడు.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – **తేజాంసి ఆదాయ ఆదిత్యరూపేణ వర్షతివా**.

ధర్మచక్రము రచయిత – సముద్రంలో నీరు సూర్యునిద్వారా మంచినీరుగా మారి వర్షిస్తుంది. అలాగే భగవంతుని కారణంగా మనలోని మాలిన్యాలు నశించి మనసు పరిశుద్ధమవుతుంది. నీరు లేకుండానూ, దేవుడు లేకుండానూ జీవించడం అసాధ్యం.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – (తేజస్ - కాంతి). **శ్రీవిగ్రహాత్ తేజస్వినః ప్రభాకిరణాః సర్వతః ప్రసరన్తి**. ఆయన దివ్యమంగళ స్వరూపంనుండి అన్నింటిపైనా తేజస్సు ప్రసరిస్తుంది. అన్ని జీవులలోని చైతన్యము, కాంతి కూడా భగవంతుని కారణమువల్లనే కలుగుతుంది.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **స్వ-బంధు రక్షాయై చక్రాది దుఃసహాని తేజాంసి వర్షతి ఇతి తేజోవృషః**. తన బంధువులను (భక్తులను) కాపాడడంకోసం చక్రమువంటి తీవ్రమైన ఆయుధాలను (శత్రువులపై) వర్షించేవాడు తేజోవృషుడు.

764. ద్యుతిధరః

దివ్యప్రకాశము కలవాడు.

ఓం ద్యుతిధరాయ నమః

'ద్యుతిధరః' అనేపదము **'ఓజస్తేజోద్యుతిధరః'** అనే 276వ నామములో ఒక భాగంగా ఇంతకుముందు వచ్చింది. ద్యుతి - దీప్తౌ - ప్రకాశించుట. దేవతలకుండే దివ్యమైన కాంతిని వర్ణించడానికి ఈ పదాన్ని వాడుతారు. ధరః - ధరించుట, రక్షించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – చిన్నికృష్ణునిగా ఉన్నప్పుడే ఇంద్రునికూడా విస్మయపరచే కాంతి కలిగినవాడు ద్యుతిధరుడు.

అమానుషీం యో ధృతవాన్ ద్యుతిమైంద్రాది భావుకామ్

ఖ్యాత స్స హి ద్యుతిధరః వస్వర్ణః కాంతిదో మనుః

ఇంద్రాదిదేవతలనుకూడ మోహింపజేయగలది, మానవులకెవరికీ లేనిది అయిన కాంతిని ధరించిఉండేవాడు ద్యుతిధరుడు. ఈ నామము అష్టాక్షరీమంత్రము. కాంతిప్రదము. ఓం ద్యుతిధరాయ నమః.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **అతిశయ కాంతి సంపన్నః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుని సర్వాంగములు కాంతితో ప్రకాశించుచున్నవి గనుక ఆయన ద్యుతిధరుడు. (79వ శ్లోకములో **'సువర్ణవర్ణః హేమాంగః వరాంగః చందనాంగదీ'** అని భగవంతుని సౌందర్యమును, కాంతిని వర్ణించారు.)

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సూర్యుడు, చంద్రుడు, దేవతలు, మెరుపు, రత్నాలు ఇలా అన్నింటిలోని కాంతి భగవంతునివల్లనే కలుగుచున్నది. మనందరిలోని కాంతియును భగవంతుని అంశయే.

శ్రీ చిన్మయానంద – భగవంతుని అంశవలన మనలో కలిగిన కాంతియే మనకు చైతన్యమును, తెలివిని, ఆలోచనలను, భావోద్వేగములను కలిగించుచున్నవి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ద్యుతి - ప్రకాశము కలవాడు; ధర - రక్షించువాడు. **స్వయం ప్రకాశమానః సర్వమ్ ధరతి ఇతి, వాస్తవిక అర్థః ప్రకాశమానః సర్వస్య ఆధారశ్చ ఇతి.** కాంతి కలిగినవాడు, అన్నింటినీ అందరినీ రక్షించేవాడు ద్యుతిధరుడు.

ధర్మచక్రము రచయిత – ఇక్కడ 'ద్యుతి' అంటే కేవలం శారీరిక కాంతి కాదు. ఆత్మప్రకాశము. బాహ్యసౌందర్యం కారణంగా కామాది లక్షణాలు పెరుగుతాయి. ఆత్మప్రకాశంవలన భక్తి పెరుగుతుంది. ఇది ద్యుతిధరుని లక్షణము. 'రాముడుండే చోట కామము ఉండదు. కామముండే చోట రాముడుండడు.'

భగవంతుని ప్రతి అవయవము ప్రకాశమానము. భక్తిని పెంపొందించును. శ్రీ స్వామిదేశికన్ శ్రీ భగవద్ధ్యాన సోపానము, శ్రీ దేవనాయక పంచశతి వంటి స్తోత్రాలలో ఈ విషయం తెలియవస్తుంది.

765. సర్వశస్త్రభృతాంవరః

అన్ని అస్త్రములు ధరించినవారిలో శ్రేష్ఠుడు.

ఓం సర్వశస్త్రభృతాంవరాయ నమః

శస్ - హింసాయామ్ - ఖండించుట, బాధించుట; శస్త్రము - ఆయుధము.

భృ - ధారణ పోషణయోః - భరించుట, ధరించుట; భృత్ - ధరించినవాడు

వృ - వరణే - ఎన్నుకొనుట; వారితుమ్ అర్హః వరః - ఎన్నుకొనుటకు తగినవాడు, శ్రేష్ఠుడు వరుడు.

సర్వేషామ్ శస్త్ర భృతామ్ మధ్యే వరః శ్రేష్ఠః – ఆయుధములు ధరించినవారిలో శ్రేష్ఠుడు .

శ్రీహరి దుష్టరాక్షసుల సంహరణార్థము అనేక అవతారములలో వివిధ శస్త్రములను ధరించిన కారణమున ఆయన సర్వశస్త్రభృతాంవరుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – నరకుడు, జరాసంధుడు వంటి అసురులతో యుద్ధము చేసినపుడు గొప్పగా ఆయుధములు ప్రయోగించినవాడు సర్వశస్త్రభృతాంవరుడు. మానుషరూపంలో అవతరించినపుడు వివిధ ఆయుధాలు ప్రయోగించడం భగవంతున కొక లీల.

మనుష్య ధర్మ లీలస్య లీలాసా జగత్పతేః

అస్త్రాణ్యనేక రూపాణి యదరాతిషు ముంచతి – విష్ణుపురాణము 5.22.14

మనుష్యుని రూపంలో క్రీడిస్తున్న జగత్పతికి అనేక అస్త్రాలు ప్రయోగించడం కేవలం ఒక క్రీడ.

పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్

ఝుషాణామ్ మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ – గీత 10.31

పవిత్రమొనర్చువానిలో (లేదా వేగము కలవానిలో) నేను వాయువును. శస్త్రధారులలో శ్రీరామచంద్రుడను నేను. మత్స్యములలో మొసలిని నేను. నదులలో గంగానదిని నేను.

శ్రీ చిన్మయానంద – ఆయుధధారులలో భగవంతుడు శ్రేష్ఠుడు అనడానికి కారణం ఆయన ధర్మరక్షణకు, లోకముల పునరుద్ధరణ (constructive destruction) కు ఆయుధములు వాడుతాడు. అందుకే ఆయన చక్రము పేరు 'సు-దర్శనము'. అంతే కాక సాధనలలో ప్రగతిని పొందినకొలదీ భక్తుల బంధనములను తెంచివేసేవాడు నారాయణుడు. ఇలా అన్ని విధాలా ఆయన సర్వశస్త్రభృతాంవరుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుడు అన్ని జీవులకు స్వీయరక్షణార్థము కొన్ని ఆయుధములనిచ్చాడు (ఉదాహరణకు గోళ్ళు, కోరలు, కొమ్ములు). ఈ శస్త్రాలు మాత్రమే కాకుండా భగవంతుడు తన ఇచ్ఛానుసారము భూకంపమువంటి మహోత్పాతాలను కూడా వాడుతాడు.

ధర్మచక్రము రచయిత – రామకృష్ణాదులు శిష్టరక్షణ కొఱకు తమ ఆయుధములను వాడారు. ఇలా మంచి పనులకోసం శస్త్రాలను వాడినందున వారు శ్రేష్ఠులు. ప్రజాక్షయంకోసం శస్త్రాలు వాడకూడదు.

766. ప్రగ్రహః

- అర్జునుని స్వాధీనపరచుకొన్నవాడు.
- విశ్వాన్ని తన స్వాధీనంలో ఉంచుకొన్నవాడు.
- భక్తులు సమర్పించిన పత్రపుష్పాదులను ప్రీతితో స్వీకరించువాడు.
- భక్తుల మనస్సును, ఇంద్రియాలను తన అదుపులో ఉంచుకొనువాడు.
- భక్తుల శరణాగతిని స్వీకరించి, వారినెన్నడును వీడనివాడు.

ఓం ప్రగ్రహాయ నమః

ప్ర (ప్రత్యయము) - బాగుగా, ప్రత్యేకముగా; గ్రహ్ - ఉపాదానే - పట్టుకొనుట, తీసికొనుట.
ప్రకర్షణేన గృహ్ణాతి ఇతి ప్రగ్రహః. విశిష్టమైన, ఉత్తమమైన, ప్రత్యేకమైన విధముగా గ్రహించువాడు ప్రగ్రహుడు. 'గ్రహించుట' అనగా 'అదుపులో ఉంచుకొనుట' అని శ్రీ భట్టులు, 'తీసికొనుట' అని శ్రీ శంకరులు అర్థం చెప్పారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 697 నుండి 786వ నామమువరకు కృష్ణావతారపరముగా వ్యాఖ్యానించారు. వాటిలోనిదే అయిన ఈ నామమునకు శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్య – భగవానుడు అర్జునునికి సారధి అయినాగాని అర్జునుని తన అధీనంలో ఉంచుకొని తన మాట ప్రకారం నడిపించాడు. పగ్గములతో లాగినట్లుగా అర్జునుని తన ప్రేమతో స్వాధీనము చేసుకున్నవాడు ప్రగ్రహుడు.
పార్థసారధినానేన రశ్మిభిర్య ప్రగృహ్యతే
స ప్రగ్రహస్సమాఖ్యాతః సప్తవర్ణ ఉదాహృతః
పగ్గాలు వేసి గుర్రాలను స్వాధీనం చేసుకున్నట్లే, శ్రీ కృష్ణపరమాత్ముడు అర్జునుని స్వాధీనపరచుకొన్నందున 'ప్రగ్రహః' అని పిలువబడ్డాడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. ఓం ప్రగ్రహాయ నమః.

ప్రగ్రహము అనగా 'కళ్ళెము' అనే అర్థం కూడా ఉంది. కఠోపనిషత్తులో చెప్పిన ఆధ్యాత్మికోదాహరణం ప్రకారం – మానవశరీరమే రథము. దానికి కట్టబడిన గుఱ్ఱములే ఇంద్రియములు. గుఱ్ఱములను నియంత్రించునట్టి కళ్ళెము మనస్సు (**మనః ప్రగ్రహమేవ చ**). కళ్ళెమును బిగించువాడే బుద్ధియను సారథి. సారథిని శాసించు

యజమానుడే ఆత్మ (**ఆత్మానామ్ రథమ్ విద్ధి, శరీరమ్ రథమేవ చ, బుద్ధిం తు సారధిమ్ విద్ధి, మనః ప్రగ్రహమేవ చ**).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **ప్రకర్షణేన గృహ్ణాతి విశ్వమ్ ఇతి.** విశ్వములో అన్నింటినీ తన అధీనంలో ఉంచుకొనేవాడు ప్రగ్రహుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – (గ్రహ్ - తీసికొనుట) **భక్తైః ఉపహృతమ్ పత్ర పుష్పాదికమ్ ప్రగృహ్ణాతి ఇతి ప్రగ్రహః.** భక్తితో సమర్పించిన పత్రపుష్పాదులను స్వీకరించేవాడు 'ప్రగ్రహః'.

శ్రీ చిన్మయానంద – అన్ని విధముల జాతులు, పశుపక్ష్యాదులు, వృక్షములు, అన్నింటి పూజలను చివరికి స్వీకరించేవాడు గనుక భగవంతుడు ప్రగ్రహుడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థం శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్యకు దగ్గరగా ఉన్నది.
ధావతో విషయారణ్యే దుర్దాంత ఇంద్రియ వాజినః
తత్ప్రసాదేన అశ్మినేవ బధ్నాతి ఇతి వా ప్రగ్రవత్ ప్రగ్రహః
విషయారణ్యంలో పరుగులు తీసే ఇంద్రియాలనే గుర్రాలను అదుపులో ఉంచేవాడు ప్రగ్రహుడు. ఆయన అనుగ్రహంవలన భక్తులు ఇంద్రియలోలత్వాన్ని అధిగమించి ఆత్మజ్ఞానంవైపు పురోగమిస్తారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – ప్ర - ప్రకృష్ట - ప్రత్యేకమైన, ఉన్నత, దివ్య. **ప్రకృతో గ్రహః స్వీకారో యస్య ఇతి ప్రగ్రహః.** ఆయన స్వీకరణ చాలా ప్రత్యేకమైనది, విశిష్టమైనది.
స్వజనమ్ సకృదపి శరణాగతమ్ స్వీకృత్య పునః కదాపి
తమ్ న పరిత్యజతి ఇతి ప్రకృష్ట ఏవ గ్రహః ప్రభోః
భగవంతుడు భక్తుల శరణాగతిని మొదటిసారే దయతో స్వీకరిస్తాడు. తరువాత ఎన్నడూ ఆయన వారిని విడువడు.

767. నిగ్రహః

- శత్రువులను నాశనము చేయువాడు.
- సృష్టి అంతటినీ తన అధీనంలో పెట్టుకున్నవాడు.
- భక్తుల అహంకారమును అంతము చేయువాడు.

ఓం నిగ్రహాయ నమః

'నిగ్రహము' అనగా అదుపు చేయుట, అణచివేయుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – అర్జునునితో సంబంధం లేకుండానే కురుక్షేత్ర సంగ్రామంలో తన సారధ్యంలో శత్రువులను నాశనం చేసినవాడు నిగ్రహుడు.

యేన సారధి వైచిత్ర్యాత్ నిగ్రహం తేऽత్ర శత్రవః

స నిగ్రహ స్సమాఖ్యాతః సప్తార్ణ శ్శత్రునాశనః

పార్థసారధియొక్క సారధ్యనైపుణ్యంచేత అర్జునుడు శత్రువులను జయించగలిగాడు. అందుచేత భగవానుడు 'నిగ్రహః' అనబడుతున్నాడు. ఈ నామము సప్తాక్షరీమంత్రము. శత్రునాశకరము. ఓం నిగ్రహాయ నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వమ్ స్వవశేన నిగృహ్ణాతి ఇతి నిగ్రహః**. అంతటిని తన వశంలో ఉంచుకొని నిగ్రహించేవాడు నిగ్రహుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – **నిగృహ్ణాతి దైత్యాన్ ఇతి నిగ్రహః**. రాక్షసులను అణచివేసేవాడు నిగ్రహుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **నిగృహ్ణాతి విపథ గామినః ఇతి నిగ్రహః**. ధర్మమార్గము వదలి నడచేవారిని అదుపుచేయువాడు నిగ్రహుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **నిగృహ్ణాస్తే పార్థశాత్రవః కక దృష్టినా ఇతి నిగ్రహః**. పాండవుల శత్రువులపాలిటి యముడు నిగ్రహుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **నిశ్చయేన గృహ్యతే యేన ఇతి నిగ్రహః విష్ణుః**. విశ్వంలో అంతటినీ తన అధీనంలో ఉంచుకొని, సృష్టింపవలసినవానిని సృష్టిస్తూ, అంతం చేయవలసినవానిని అంతం చేసే విష్ణువే నిగ్రహుడు.

శ్రీ చిన్మయానంద – నిగ్రహ - చంపేవాడు, ఖండించేవాడు. భక్తులలోని అహంకారమును చంపేవాడు. వారి మనస్సులోని అహంకార మమకారాది దుర్గుణములను నాశనము చేసి ఆధ్యాత్మిక స్థితికి దోహదము చేయువాడు నిగ్రహుడు.

మరొక వివరణ – నిగ్రహః - తనలోనికి స్వీకరించువాడు. భగవంతుని ధ్యానించే భక్తులను తనలో లీనము చేసుకొనే దయాస్వరూపుడు నిగ్రహుడు.

768. వ్యగ్రః

అవ్యగ్రః

- తొందరపడువాడు (మహాభారత యుద్ధంలో తన భక్తుని శత్రువులను అంతం చేయడానికి).
- ఆది, అంతము లేనివాడు.
- అనేక విధములుగా చలించువాడు.

- అ-వ్యగ్రః (ద్వైత పాఠము) – సంశయం లేనివాడు.

- గరుడుని తన వాహనంగా కలిగినవాడు.

- భక్తుల మనోరథాలు తీర్చడంలో సదా నిమగ్నుడైనవాడు.

ఓం వ్యగ్రాయ నమః

ఓం అవ్యగ్రాయ నమః

అగి - గతౌ - వెళ్ళుట, అగ్ర - ముందు ఉండుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – మహాభారతయుద్ధంలో అర్జునుని శత్రుసంహారంలో జాప్యాన్ని సహింపలేనివాడు వ్యగ్రుడు.

యుద్ధ క్రమా సహిష్ణుత్వాత్ పార్థ విద్విడ్వినిగ్రహే

యోఽసౌ వ్యగ్ర స్సమాఖ్యాతః షడర్ణో వైరి నాశకః

యుద్ధంలో శత్రుసంహారంకోసం అర్జునుడు పడే శ్రమను సహింపలేనివాడు వ్యగ్రుడు. ఈ నామము షడక్షరి. శత్రునాశకము. ఓం వ్యగ్రాయ నమః.

యే యాన్తి యాన్త్వేవ శిని ప్రవీర।

యేఽవస్థితాః సత్వర తేఽపి యాంతు

భీష్మం రథాత్ పశ్యతపాత్యమానమ్

ద్రోణం చ సంఖ్యే సగణం మయాఽద్య

......రథాత్ అవప్లుత్య విసృజ్య వాహాన్ – మహాభారతము. భీష్మపర్వము 59.86

ఓ శినిప్రవీరా (సాత్యకీ)! పోయినవారు పోయారు. మిగిలిన వాళ్ళను, (లేదా ... పారిపోయేవాళ్ళను), అందరినీ ఒక్కపెట్టున తుదముట్టిస్తాను. రథంనుండి ఇప్పుడు భీష్ముడు నేలకొరగాలి. ద్రోణుడు సైన్యసమేతంగా నశించాలి. ... ఇలా అని కృష్ణుడు గుర్రాలను వదలి, రథం దిగి, భీష్మునివైపు సాగాడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 9.2.10 – దేవతలను రక్షించడానికి నీవేమైనా చేసి రాక్షసులను కడతేరుస్తావు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – అగ్రమ్ - కొన, అంతము, వినాశము. **విగతమ్ అగ్రమ్ అస్య ఇతి వ్యగ్రః**. అంతము లేనవాడు వ్యగ్రుడు. నాశనరహితుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **వివిధమ్ గమనమ్ యో విధత్తే స వ్యగ్ర ఉచ్యతే**. అనేక విధాలుగా కదిలేవాడు వ్యగ్రుడు. సృష్టిలో అన్నింటి చలనంలోనూ భగవంతుని వ్యగ్రత్వమును దర్శించవచ్చును.

శ్రీ సత్యసంధ యతిరాజ – ఈయన **'అవ్యగ్రః'** మరియు **'వ్యగ్రః'** అనే రెండు పాఠాలనూ పరిగణించారు.

అవ్యగ్రః – వ్యగ్రో న భవతి ఇతి అవ్యగ్రః. వ్యగ్రుడనగా ఏ మార్గం తీసుకోవాలో తెలియక సంశయాత్మకుడైనవాడు. అవ్యగ్రుడు అనగా సంశయం లేనివాడు.

వ్యగ్రః – విః గరుడో అగ్రే అస్య స వ్యగ్రః. గరుత్మంతుని (వి)పైనుండి విహరించేవాడు వ్యగ్రుడు.

శ్రీ పెమ్మరాజు రాజారావు రచననుండి – విసుగు, విరామము లేక తన భక్తుల మనోరధములను సదా ఇచ్చుచునుండువాడు వ్యగ్రుడు.

769. నైకశృంగః

- తన భక్తుల శత్రువులను అనేక విధాలుగా, అనేక ఉపాయాలతో హింసించేవాడు.
- నాలుగు వేదములు అనే కొమ్ములద్వారా పట్టుబడేవాడు (తెలియవచ్చువాడు).
- అకారము, ఉకారము, మకారము, నాదము అనే నాలుగు కొమ్ములు కలిగిన ప్రణవంద్వారా అందేవాడు.
- నాలుగు వేదములు అనే కొమ్ములద్వారా ధర్మమును ప్రవర్తింపజేసేవాడు.
- అనేక విధములుగా (జగత్)ప్రభుత్వమును నెరపువాడు.
- తన భక్తులకు కామితార్థములను అనేక విధములుగా ప్రసాదించువాడు.
- ఏకశృంగః – ఒక కొమ్ముగల శ్రీవరాహమూర్తిగా అవతరించినవాడు.
- అనేక కిరణములతో ప్రకాశించువాడు.
- ఆత్మరక్షణ కొఱకు, శత్రువులను బాధించడానికీ, వివిధ జీవులకు వివిధ అంగములు ఇచ్చినవాడు.

ఓం నైకశృంగాయ నమః

ఓం ఏకశృంగాయ నమః

శృ - హింసాయామ్ - చీల్చివేయుట, బాధించుట, చంపుట;

శృంగమ్ ఇతి దీప్తేర్నామ, హింసా సాధనమ్

తథా పరకృత బాధానివారణ సాధనామపి శృంగమ్

'శృంగము' అనగా ప్రకాశము, శిక్షించే సాధనము, ఇతరులు కలుగజేసే బాధనుండి రక్షించే సాధనము. శృంగము అంటే 'కొమ్ము' అనేది సాధారణ అర్థము. శ్రీ శంకరులు ఈ అర్థం గ్రహించారు. న - ఏకశృంగః – **నైక శృంగః**. ఒకటికంటే ఎక్కువ కొమ్ములు కలిగినవాడు నైకశృంగుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'శృంగము' అనగా 'హింసా సాధనము' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. న - ఏక - శృంగః – **నైకశృంగః**, అని చెబుతూ శ్రీ భట్టులు మహాభారతయుద్ధంలో శ్రీకృష్ణుని పాత్రను ఇలా వ్యాఖ్యానించారు. **బుద్ధి యోగః సారధ్యమ్ అనాయుధ గ్రహణ వ్యాజః ప్రాప్తకాలే తద్గ్రహణమ్ ఇతి బహువైరి బాధకమ్ అస్య ఇతి నైకశృంగః.** శత్రువులను బాధించడానికి ఆయన ఉపయోగించిన ఆయుధాలు – సరైన

సలహా ఇచ్చుట, రథం నడుపుట, ఆయుధం పట్టనని నియమం ఉన్నాగాని సమయం వచ్చినపుడు ఆయుధమును ధరించుట, పగటిని రాత్రిగా మార్చుట - ఇలా అనేక ఉపాయాలతో శత్రువుల పతనానికి కారణమైనవాడు నైకశృంగుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమోళి 6.4.10 – ప్రజల అహంకారంతో భారమైన భూమిని తేలికపరచడానికి భగవంతుడు మహాభారతయుద్ధం కలిగించాడు. అనేక అద్భుతాలు చూపాడు. అడుగడుగునా ఏదో మంత్రం వేసినట్లు నడిపాడు. చివరికి తన సంకల్పం నెరవేర్చుకొన్నాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – '**నైకశృంగః**' అనగా అనేక కొమ్ములు కలవాడు. ఇక్కడ అనేక కొమ్ములు అనగా నాలుగు వేదాలు నాలుగు కొమ్ములు. కొమ్ములను పట్టుకొంటే ఎద్దు అదుపులోనికి వచ్చినట్లుగా వేదాలద్వారా భగవంతుడు పట్టుచిక్కుతాడట – అని శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరించారు. శ్రీ శంకరులు ఋగ్వేదమునుండి ఉదాహరించారు.

చత్వారిశృంగా త్రయోऽస్య పాదా ద్వే శీర్షే సప్తహస్తాసోऽస్య
త్రిధా బద్ధో వృషభో రోరర్వీతి మహాదేవో మర్త్యాగ్ం అవివేశ – ఋగ్వేదము 4.58.3
నాలుగు కొమ్ములు, మూడు పాదాలు, రెండు శిరస్సులు, ఏడు చేతులు కలవాడై మూడుచోట్ల బంధింపబడిన వృషభరూపుడైన భగవానుడు (జీవుడు) మనుష్యులలో ప్రవేశించి శబ్దం చేస్తున్నాడు – ఒక వివరణ ప్రకారం ఇక్కడ నాలుగు కొమ్ములు అంటే నాలుగు వేదాలు. మూడు పాదాలు అంటే దైనిక యజ్ఞాలు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – శాయనభాష్యం ప్రకారం, **అకార ఉకార మకార నాదరూప శృంగ చతుష్టయోపేతః** – నాలుగు కొమ్ములు అంటే ఓంకారంలో ఉండే అకారము, ఉకారము, మకారము, నాదము.

ఇంకోవ్యాఖ్య ప్రకారం భగవంతుడు నాలుగు వేదాలద్వారా ధర్మమును ప్రవర్తింపజేయుచు లోకములను నియంత్రించుచున్నాడు.

శ్రీ చిన్మయానంద – పై ఋగ్వేద శ్లోకంలో 'చత్వారిశృంగా' అంటే నాలుగు అవస్థలు - జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయము. (మూడు పాదములు అంటే స్థూల శరీరము, సూక్ష్మ శరీరము, కారణ శరీరము). మాండుక్యోపనిషత్తులో ఆత్మకు నాలుగు పాదాలు అని చెప్పారు. అవి ఈ నాలుగు అవస్థలు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – శృంగము - ఆధిక్యము, ప్రభుత్వము. **నైకమ్ వివిధమ్ శృంగమ్ ప్రభుత్వమ్ యస్య ఇతి నైకశృంగః**. అనేక విధాలుగా భగవంతుడు జగత్ప్రభువు. (**శృంగమ్ ప్రభుత్వే శిఖరే** - మేదిని).

శ్రీ సత్యసంధ యతిరాజ – **న ఏక శృంగో, న ఏకాని - అనేకాని శృంగాణి యస్య వృషరూపే స నైకశృంగః** (వృష-ధర్మము). ధర్మమును ప్రవర్తింపజేయుటలో అనేకరూపములు ధరించువాడు నైకశృంగుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ మరొక వ్యాఖ్య – నా - ఏకశృంగః, నా - **పరమపురుషత్వాత్ నా** – 'నా' శబ్దము భగవంతుని పరమపురుషత్వమును సూచించును. ఏకశృంగః - ఒకే కొమ్ము కలవాడు - శ్రీవరాహమూర్తి.

ఏకశృంగః తతో భూత్వా వరాహో నందివర్ధనః

ఇమాంచ ఉధృత్వాత్ భూమిమ్ ఏకశృంగః – మోక్షధర్మము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మూడు వివరణలిచ్చారు –

(1) శృంగ - దీప్తి. అనేక కిరణాలు ప్రకాశించువాడు ఏకశృంగుడు.

(2) అనేకవిధములుగా (దుష్టులను) హింసించువాడు ఏకశృంగుడు.

(3) హింసనుండి అనేకవిధములుగా రక్షించువాడు ఏకశృంగుడు. ఉదాహరణకు సింహం గోళ్ళు, గేదెకొమ్ములు, ఏనుగు దంతాలు – ఇవన్నీ శత్రువులను బాధించడానికీ, తమతమను శత్రువులనుండి కాపాడుకోవడానికీ ఉపయోగపడుతాయి.

770. గదాగ్రజః

- గదునికి అన్న (గద+అగ్రజః).
- మంత్రముగా పుట్టునవాడు (ని-గదాగ్రజః).
- నడచే, మాట్లాడే వారందరియందును వ్యాపించినవాడు (గద+అగ్ర+జ).
- శబ్దము చేయువారిలో అగ్రగణ్యుడు (వేదముల మూలము).
- బ్రాహ్మణులను ఆరోగ్యముగా నుంచువాడు (అగదాగ్రజః).

ఓం గదాగ్రజాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – 'గదుడు' అనేవాని అన్న అయినందున కృష్ణుడు గదాగ్రజుడు. వసుదేవునికి 'సునామ' అనే భార్యయందు 'గదుడు' అనే పుత్రుడు జన్మించాడు.
(డా. క్రోవి పార్థసారధి రచన శ్రీ కైవల్యసారధి నుండి – వసుదేవుడు ఉగ్రసేనుని తమ్ముడైన దేవకునియొక్క ఏడుగురు కుమార్తెలను – దేవకి, శాంతి, దేవ, ధృతదేవ, ... అనేవారిని వివాహం చేసుకొన్నాడు. అంతే కాకుండా ఇతనికి రోహిణి, కౌసల్య, పౌరవి అనే భార్యలున్నారు. వసుదేవునికి రోహిణియందు బలరాముడు, గదుడు, సారణుడు అనే కుమారులు కలిగారు. కృష్ణునికంటె గదుడు చిన్నవాడు).

శ్రీ శంకరుల వ్యాఖ్య – ని-గదాగ్రజః, నిగదము - మంత్రము. **నిగదేన మంత్రేణ అగ్రే జాయత ఇతి 'ని' శబ్దలోపం కృత్వా గదాగ్రజః**. నిగదము అనగా మంత్రము. ఇందులో 'ని' అక్షరం లోపించినందువలన **'గదాగ్రజః'** అయినది. అనగా మంత్రమునకు ముందుగా (మంత్రమువలన ముందుగా) జన్మించినవాడు గదాగ్రజుడు.
(శ్రీ కైవల్యసారధి నుండి – **గద్యతే ఇతి గదః**. ఈ గదుడు మంత్రములనుండి ఆవిర్భవించాడు. మంత్రముగా ముందే జన్మించినవాడు వాసుదేవుడు).

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – రుక్మిణీదేవి తన లేఖలో శ్రీకృష్ణుని **'గదాగ్రజా!'** అని సంబోధించినది.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – గద+అగ్ర+జః = గదాగ్రజః.
గద - వ్యక్తాయామ్ వాచీ - మాట్లాడుట; అగ్ర - అగి, గతౌ - వెళ్ళుట, జః - జాత - అనుపవిష్ట - వ్యాపించుట, ప్రవేశించుట. **గదేషు గదనశీలేషు, అగ్రేషు గమన శీలేషు, అనుప్రవిష్టో జాత ఇవ ప్రతీయమానో** గదాగ్రజ **ఇతి విష్ణోర్నామ. శబ్దాయమానే** గమనశీలేషు **చ జీవిత శరీర ఏవ జీవాత్మానోऽవభాసః ఇతి ప్రకాశ ఇత్యర్థః.** నడచేవి, మాట్లాడేవి (అనగా అన్ని జీవులు)యుందు (ఆత్మరూపంలో) ప్రవేశించి ప్రకాశించేవాడు (అనగా చైతన్యస్వరూపుడు) అయన విష్ణువు గదాగ్రజుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ మరొక వ్యాఖ్య – **గదానామ్ వ్యక్తమ్ శబ్దమ్ కుర్వతామ్ ముష్యాణామ్ అగ్రజః జ్యేష్ఠః శ్రేష్ఠః.** శబ్దముచేయు వారందరిలోను శ్రేష్ఠుడు గదాగ్రజుడు. ఇక్కడ వేదములను తెలియజేయుట సూచింపబడినది. కనుకనే ఆయనను **'వాచస్పతి'** అని కూడ అందురు.

శ్రీ సత్యసంధ యతిరాజ – గదాగ్రజుడు అనగా గదునకు అన్న. ఈ భావమే కాకుండా శ్రీ యతిరాజులు **'అగదాగ్రజః'** అనే పాఠాన్ని కూడా పరిగణించారు. అగద - ఆరోగ్యవంతమైన, రోగము లేని; అగ్రజ - బ్రాహ్మణులు. **అగద నిరోగిణో అగ్రజా బ్రాహ్మణా ఇతి అగదాగ్రజః.** ఇక్కడ ఆరోగ్యంగా ఉండడమంటే వేదపఠనంద్వారా ఆధ్యాత్మికంగా పరిశుద్ధులై ఉండుట అని గ్రహింపవచ్చును.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్య – శ్రీ వేంకటేశ్వర వచనములు

వాసుదేవా! దేవకీ నందనా! గోపాలమూర్తీ! లక్ష్మీమనోహరా! భూకాంతాప్రియా! గోపికావల్లభా! రుక్మిణీ ప్రాణనాయకా! సత్యభామా మనోహరా! జాంబవతీ సుముఖా! కాళిందీ సరససల్లాపా! మిత్రవిందా భోగలోకైకరతా! భద్రా కుచకుంభవిహారా! నీ రాసగ్రహాది సరస సత్కథా ప్రసంగంబులు భాగవత పురాణంబులు. ఈ కథలు విన్నవారికిఁ బుణ్యంబు లనంతంబులై పరలోక సాధనంబులగునటే! యివి యెటువంటి విచిత్రంబులు! నీ కౌతుక క్రీడలు మోక్ష సాధనంబులట! శ్రీ వేంకటేశ్వరా!

చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః |
చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేదవిదేకపాత్ || (82)

771. చతుర్మూర్తిః

- నాలుగు రూపములు కలవాడు.
- వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు.
- విరాట్, సూత్రమాన, అవ్యాకృత, తురీయ రూపములు.
- కృతయుగంలో తెల్లగా, త్రేతాయుగంలో ఎర్రగా, ద్వాపరయుగంలో (పసుపు)పచ్చగా, కలియుగంలో నల్లగా ఉండేవాడు.
- విశ్వ, తైజస, ప్రజ్ఞా, తురీయ రూపములు.
- శ్రీవైకుంఠము, సత్యలోకము, శ్వేతదీపము, క్షీరాబ్ధిలలో ఉండేవాడు.

ఓం చతుర్మూర్తయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – నాలుగు రూపములు అనగా భగవానుని నాలుగు వ్యూహములు – వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు. ఈ వ్యూహావతారములు విభవావతారములకంటె ముందునుండి ఉన్నవి (రామకృష్ణాదులు విభవావతారములు). శ్రీకృష్ణ విభవావతారములో కూడ భగవానుడు నాలుగు మూర్తులలలో అవతరించాడు – బలభద్రుడు (కృష్ణుని అన్న), వాసుదేవుడు (కృష్ణుడు), ప్రద్యుమ్నుడు (కృష్ణుని కొడుకు), అనిరుద్ధుడు (కృష్ణుని మనుమడు). శ్రీరామ విభవావతారంలోకూడ భగవంతుడు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులుగా పుత్రకామేష్ఠి యాగము పాయసమునుండి ఉద్భవించెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – చతుర్మూర్తులనగా విరాట్, సూత్రమాన, అవ్యాకృత, తురీయ మూర్తులు. ఈ మూర్తులను గురించి శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఇలా వివరించారు – సృష్టిలో అన్నింటికంటె ముందుగా ఉన్న

మూలప్రకృతి (అవ్యాకృత) అవ్యక్త మూర్తితత్త్వము. ఈ మూలప్రకృతియొక్క స్థూలరూపము (అనగా భగవానుడు అంతర్యామిగా మూలప్రకృతిలో ప్రవేశించకముందు రూపము)ను 'విరాట్'మూర్తి అంటారు. మన బుద్ధిలోను, మనసులోను (సూక్ష్మరూపముగా) భగవానుడు అంతస్థితుడైయున్న ప్రాణశక్తియే 'సూత్ర'రూపము లేదా హిరణ్యగర్భుడు. పై మూడు రూపములకంటె భిన్నమైనది పరమపురుషుడు లేదా పురుషోత్తముడు. ఈ రూపములో అంతా భగవంతునియందే స్థితమైయున్నది. భగవంతుడొకడే యున్నాడు. ఇంకా జీవులు సంభవించలేదు.

శ్రీ చిన్మయానంద – నాలుగు యుగములలో నాలుగు రూపములు, వర్ణములు కలవాడు చతుర్మూర్తి. కృతయుగములో తెలుపు, త్రేతాయుగములో ఎరుపు, ద్వాపరయుగములో పీతవర్ణము (పసుపుపచ్చ), కలియుగములో నలుపురంగు ఉన్నవాడు. మరొక విధంగా – జాగ్రత్, స్వప్న, సుషుప్త, తురీయ అవస్థలు. సూక్ష్మరూపంలో విశ్వ, తైజస, ప్రజ్ఞా, తురీయ స్థితులు. స్థూలరూపంలో విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వర, పరమాత్మ రూపములు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – చతుర్మూర్తులనగా విశ్వ, తైజస, ప్రజ్ఞా, తురీయ రూపములు. శరీరములు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు అని మూడు విధములు.
స్థూల శరీరము – బయటకు కనిపించే రూపము – విశ్వ రూపము.
సూక్ష్మ శరీరము – మనసు, ప్రాణము – తైజస రూపము.
కారణ శరీరము – పాత జన్మల జ్ఞాపకాలతో కూడినది – ప్రజ్ఞారూపము.
ఈ మూడు స్థితులలోను జీవుడు శరీరమును 'నేను' అనుకొంటాడు. వీటిని అధిగమించినది తురీయ స్థితి.

విశ్వమూర్తి – స్థూల శరీరము – జాగ్రత్ అవస్థ
తైజస మూర్తి – సూక్ష్మ శరీరము – స్వప్న అవస్థ
ప్రజ్ఞామూర్తి – కారణ శరీరము – సుషుప్త అవస్థ
తురీయమూర్తి – తురీయము – తురీయావస్థ.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ –

వైకుంఠం ప్రథమ మూర్తిః సత్యలోకే తథాऽపరా
శ్వేతద్వీపే తృతీయ చ చతుర్థీ క్షీరసాగరే.
శ్రీవైకుంఠములోను, సత్యలోకములోను, శ్వేతద్వీపములోను, క్షీరసాగరములోను ఉన్న భగవానుని రూపములు చతుర్మూర్తులు.

772. చతుర్బాహుః

నాలుగు చేతులు కలవాడు.

- దేవకికి నాలుగు చేతుల రూపంలో దర్శనమిచ్చినవాడు.

- వాసుదేవుడు. శంఖ, చక్ర, గదా, పద్మములు ధరిచినవాడు.

- మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే నాలుగు చేతులతో జీవులను నియంత్రించువాడు.

- ధర్మార్థకామమోక్షములనే నాలుగు పురుషార్థములను ప్రసాదించువాడు.

- నాలుగు వేదములద్వారా తెలియవచ్చువాడు.

ఓం చతుర్బాహవే నమః

15వ శ్లోకంలో 142వ నామముగా **'చతుర్భుజః'** అని చెప్పబడినది. **చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్రః చతుర్భుజః**. ప్రస్తుతము 82వ శ్లోకములో 772వ నామముగా **'చతుర్బాహుః'** అని చెప్పబడినది. **చతుర్మూర్తిః చతుర్బాహుః చతుర్వ్యూహః చతుర్గతిః**. ఈ 'చతుర్బాహుః' మరియు 'చతుర్భుజః' నామములు ఇంచుమించుగా ఒకేవిధంగా అనిపిస్తాయి.

శ్రీ భట్టులు భగవంతుని వ్యూహావతారములను వర్ణించే సందర్భంలో 142వ నామము 'చతుర్భుజః' వచ్చింది. కనుక శ్రీ భట్టులు ఆ నామమును 'శంఖ చక్ర గదా పద్మ ధారియైన శ్రీవాసుదేవుడు' అని వ్యాఖ్యానించారు.

ఈ 772వ నామము 'చతుర్బాహుః' ను శ్రీ భట్టులు శ్రీకృష్ణావతారపరంగా వ్యాఖ్యానించారు. ఇది విభవావతారము. భగవంతుడు దేవకీదేవికి నాలుగు చేతులతో జన్మించాడు గనుక చతుర్బాహువు.

వ్యూహమూలా పరావస్థా నిరుపాధిక రూపతః
చత్వారో బాహవో యస్య స చతుర్బాహురుచ్యతే.
పరా వాసుదేవునిగా దేవకి గర్భాన నాలుగు భుజములతో అవతరించినవాడు చతుర్బాహువు.

15వ శ్లోకము 142వ నామము 'చతుర్భుజః'కు శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణములు –

చతుర్భుజమ్ ఉదారాంగమ్ చక్రాద్యాయుధ భూషణమ్ – విష్ణుపురాణము.

తమసః పరమో ధాతా శంఖ చక్ర గదాధరః – రామాయణము. యుద్ధకాండ 114.15

భుజైర్చతుర్భిః సమేతమ్ – మహాభారతము. మోక్షపర్వము 5.34

ఈ 82వ శ్లోకము 772వ నామము 'చతుర్బాహుః' కు ప్రమాణములు –

తమద్భుతమ్ బాలకమ్ అంబుజేక్షణమ్ చతుర్భుజమ్ – భాగవతము 10.3.9

ఉపసంహార సర్వాత్మన్ రూపమేతచ్చతుర్భుజమ్

జానాతు మాऽవతారమ్ తే కంసోऽయమ్ దితి జన్మజః – విష్ణుపురాణము 5.3.13

ఓ పరమాత్మా! నాలుగు భుజాలతో ఉన్న ఈ రూపాన్ని ఉపసంహరించుకో. దైత్యజాతికి చెందిన కంసుడు నీ అవతారాన్ని గురించి తెలిసికొనకూడదు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 8.8.1 – ఆళ్వారును కౌగిలించుకోవడంకోసమే భగవంతునికి రెండు బదులు నాలుగు చేతులున్నాయి.

అదృష్ట పూర్వమ్ హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే
తదేవ మే దర్శయ దేవరూపమ్ ప్రసీద దేవేశ జగన్నివాస – గీత 11.45
కిరీటినమ్ గదినమ్ చక్రహస్తమ్ ఇచ్ఛామి త్వా ద్రష్టుమహం తథైవ
తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో! భవ విశ్వమూర్తే – గీత 11.46

మునుపు ఎన్నడును చూడని ఆశ్చర్యకరమైన ఈ రూపమును కాంచి మిక్కిలి సంతసించితిని. కాని భయముచే నా మనసు కలవరపాటు పొందినది. కనుక, దేవేశ! చతుర్భుజయుక్తుడవై నాకు దర్శనమిమ్ము. ఓ దేవేశ! జగన్నివాస! ప్రసన్నుడవు కమ్ము. కిరీటమును, గదను, శంఖ చక్రములను ధరించిన నీ రూపమును చూడగోరుచున్నాను. ఓ సహస్రబాహో! విరాడ్రూపా! నీ చతుర్భుజ రూపమును నాకు చూపుము.

శ్రీ ఆండాళ్. తిరుప్పావై 30 – క్షీరసాగరమును మథించి దేవతలకు అమృతమొసంగిన మాధవుని, కేశవుని, సంపూర్ణ చంద్రునివంటి ముఖముగల గోపకన్యలు కీర్తించి వ్రేపల్లెలో వ్రతపరికరములు పొందిన విధమును, శ్రీవిల్లిపుత్తూరులో వసించుచు వికసించిన పద్మముల మాలను ధరించిన శ్రీ విష్ణుచిత్తుల కుమార్తెయగు గోదాదేవి శబ్దార్థరసభరితములయిన ముప్పది పాశురములలో వివరించెను. దీనిని విడువక అనుసంధానమొనర్చువారు **గొప్ప పర్వతముల బోలిన నాలుగు భుజములును**, ఎఱ్ఱని కన్నులును, లక్ష్మీకరమగు ముఖమును, సర్వైశ్వర్యములును గలవాడైన శ్రియఃపతియగు నారాయణునివలన ఏచోటను సాటిలేని కృపను బడసినవారలై, బ్రహ్మానందానుభవమును కలవారైయుందురు (శ్రీ ఎన్. విజయరాఘువాచార్యులు, శ్రీ సంపన్నుడుంబై రంగకృష్ణమాచార్యులు అనువాదం, కూర్పు నుండి).

శ్రీ పెరుక్కారణై శ్రీచక్రవర్త్యాచార్యులు – భగవంతుని నాలుగు బాహువులు నాలుగు పురుషార్థములను అనుగ్రహించడానికి ఉన్నాయి. భక్తుల రక్ష అవుసరాలనుబట్టి చేతులు పెరుగుతాయి. గజేంద్రుని రక్షించడానికి ఎనిమిది చేతులతో వచ్చాడు. శ్రీ సుదర్శనాళ్వారులు ఎనిమిది చేతులతో ఎనిమిది ఆయుధాలతో విరాజిల్లుతున్నాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుని చతుర్బాహురూపము సంప్రదాయకంగా వాసుదేవుని సూచిస్తుంది. శ్రీమహావిష్ణువును నాలుగు భుజాలతో – శంఖము, చక్రము, గద మరియు పద్మము లేదా ధనుస్సులతో – భావిస్తారని శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరించారు.

శంఖచక్రగదాపాణే ద్వారకానిలయాచ్యుత గోవింద పుండరీకాక్ష రక్షమామ్ శరణాగతమ్ – నిత్య ప్రార్థన

శ్రీ కృష్ణదత్త భరద్వాజ భాగవతంనుండి ఉదాహరించారు.

చతుర్భుజః శంఖ గదాబ్జ చక్రః పిశంగవాసా నలినాయతేక్షణః – భాగవతము 8.18.1

తమద్భుతమ్ బాలకమ్ అంబుజేక్షణమ్ చతుర్భుజమ్ శంఖ చక్ర గదాయుదార్యుధమ్ – భాగవతము 10.3.9

15వ శ్లోకంలో 'చతుర్భుజః' నామానికి శ్రీ చిన్మయానంద వివరణ – భగవానుని శంఖ చక్ర గదా పద్మములు లోకంలో ధర్మాన్ని నిలపడానికి, మోక్షమార్గం చూపడానికి ఉన్నాయి.

ప్రస్తుత 'చతుర్బాహుః' నామానికి శ్రీ చిన్మయానంద వివరణ – భగవంతుని నాలుగు చేతులు మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములను సూచించును. వీనిద్వారా అన్ని కార్యములు భగవంతుని అధీనంలో ఉంటాయి. మరోవిధంగా పద్మము చిత్తమును, శంఖము బుద్ధిని, గద అహంకారమును, చక్రము మనస్సును సూచించును.

శ్రీ సత్యసంధ యతిరాజ –

(1) **భుంక్తే భునక్తి ఇతి భుజః, చతుర్ణామ్ ధర్మ అర్థ కామ మోక్షాణామ్ భుజః చతుర్భుజః**. అర్థులైనవారికి ధర్మార్థకామమోక్షములను ప్రసాదించును గనుక చతుర్భుజుడు.

(2) **చతుర్భ్యః వేదేభ్యః భవతి ఇతి చతుర్భుగ్ జ్ఞానమ్ తేన జాయతే అభివ్యజ్యతే ఇతి చతుర్భుజః**. నాలుగు వేదాలద్వారా తెలియవచ్చువాడు విష్ణువు చతుర్భుజుడు.

773. చతుర్వ్యూహః

- నాలుగు వ్యూహములు కలవాడు – వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అను నాలుగు వ్యూహావతారములు.
- విభవావతారములో నాలుగు రూపములలోనున్నవాడు – శ్రీకృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు.
- నలుగురు పురుషుల విభూతులు కలవాడు – శరీరరూపుడగు పురుషుడు, ఛందోరూపుడగు పురుషుడు, వేదరూపుడగు పురుషుడు, మహద్రూపుడగు పురుషుడు.
- నాలుగు వేదములద్వారా ఆయన ఆధిపత్యము తెలియును.
- మూడు వేదములు, వాక్కు అను నాల్గు శబ్దముల రూపములో ఉన్నవాడు.
- నాల్గు విధములైన మహిమలు (వ్యూహములు) చూపినవాడు.

ఓం చతుర్వ్యూహాయ నమః

సమస్త వ్యస్త షాడ్గుణ్య వ్యూహావస్థా చతుష్టయమ్

చతుర్వ్యూహ ఇతి ఖ్యాతః చతుర్వర్గప్రదోమనుః

సకల షడ్గుణములతో వాసుదేవునిగను, రెండు రెండు గుణాతిశయములతో సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే రూపాలను, ఈ రకంగా చతుర్వ్యూహాలను ధరించినవాడు. ఈ నామము అష్టాక్షరీమహామంత్రము. చతుర్విధ పురుషార్థప్రదము. ఓం చతుర్వ్యూహాయ నమః.

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

15వ శ్లోకము. 140వ నామము. చతుర్వ్యూహః – **చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్రః చతుర్భుజః**

82వ శ్లోకము. 773వ నామము. చతుర్వ్యూహః – **చతుర్మూర్తిః చతుర్బాహుః చతుర్వ్యూహః చతుర్గతిః**

ఊహ్ - వితర్కే - వివరించుట, తర్కించుట, అనుగ్రహించుట. **విశిష్టా ఊహా వ్యూహా.** ప్రత్యేకమైన పనుల కొరకు నాలుగు రూపములు ధరించినవాడు 'చతుర్వ్యూహః'.

ఆగమకోశము 4వ భాగము (శ్రీ ఎస్.కె. రామచంద్రరావు – కల్పతరు పరిశోధన అకాడమీ)నుండి – 'వ్యూహ' అనగా విభజించుట, పంచుట, అమర్చుట. పరవాసుదేవుడైన నారాయణుడు సృష్టి స్థితి లయాది కార్యములను నిర్వహించుటకై తనను తాను నాలుగు వ్యూహావతారములుగా సృజించుకొనెను. పాంచరాత్రాగమములో ఇది చాలా ముఖ్యమైన సిద్ధాంతము. వైకుంఠములోని పరవాసుదేవుడు నిశ్చలమైన, అలలు లేని, అంతు తెలియని, లోతు తెలియని, కాలస్థలాదులచే పరిచ్ఛిన్నముగాని, విభజింపరాని స్వరూపము. వైకుంఠములో ఈయన సమక్షములో అనంతజ్ఞానానందము విలసిల్లును. ఈయనచెంత నిత్యసూరులు (వారెన్నడును పునర్జన్మ పొందరు), ముక్తులును ఉందురు. ఈ పరవాసుదేవమూర్తి జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజములనే షడ్గుణములను పరిపూర్ణముగా కలిగియుండును. భగవంతుని వ్యూహావతారములు వివిధ కార్యముల నిర్వహణార్థము ఆయా గుణములు ప్రధానముగా కలిగి సంభవించును. ఇట్టివి నాలుగు వ్యూహములు – (వ్యూహ)వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు.

వాసుదేవుడు – జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజోమయము.

సంకర్షణుడు – జ్ఞాన, బల మయము.

ప్రద్యుమ్నుడు – ఐశ్వర్య, వీర్య మయము.

అనిరుద్ధుడు – శక్తి, తేజో మయము.

ప్రతి వ్యూహావతారమునందును షడ్గుణములు సంపూర్ణముగానుండును. కాని కొన్ని గుణములు ఆయా వ్యూహములకు ప్రధానమైనవి.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

15వ శ్లోకములో 'చతుర్వ్యూహః' – వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు.

82వ శ్లోకములో 'చతుర్వ్యూహః' – కృష్ణావతారము అనే విభవావతారములో నాలుగు రూపములు – కృష్ణుడు (వాసుదేవుడు), బలరాముడు (కృష్ణుని అన్న, సంకర్షణుడు), ప్రద్యుమ్నుడు (కృష్ణుని కుమారుడు, ప్రద్యుమ్నుడు), అనిరుద్ధుడు (కృష్ణుని మనుమడు, అనిరుద్ధుడు). భగవంతుని వివిధ వ్యూహావతారములకు వివిధ వాహనములు, రంగులు, అంగములు, ఆభరణములు, ఆయుధములు, ధ్వజములు చెందియున్నవి. ఇవన్నీ భక్తుల ధ్యానారాధనకు అనుకూలంగా భగవంతుడు ధరించాడు.

నమస్తే వాసుదేవాయ నమః సంకర్షణాయ చ

ప్రద్యుమ్నాయ అనిరుద్ధాయ సాత్వతాం పతయే నమః – భాగవతము 10/40.21

శ్రీ శంకరుల వ్యాఖ్య –

15వ శ్లోకంలో 'చతుర్వ్యూహః' – వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు. ఇందుకు శ్రీ శంకరులు వేదవ్యాసుని రచనను ఉదాహరించారు –

వ్యూహాత్మానమ్ చతుర్ధావై, వాసుదేవాది మూర్తిభిః

సృష్ట్యాదీన్ ప్రకరోత్యేష, విశ్రుతాత్మా జనార్దనః

విశృతాత్ముడు, జనార్దనుడు అనబడే ఆయనే సృష్ట్యాది కార్యక్రమాలు నిర్వహించుకొనడానికి తనను తాను వాసుదేవాది నాలుగు వ్యూహాలుగా విభజించుకొన్నాడు.

82వ శ్లోకంలో 'చతుర్వ్యూహః' – అనగా 'విభూతులు' అన్న అర్థంలో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. అనగా నాలుగు పురుషులు. **శరీరపురుషః ఛందఃపురుషో వేదపురుషో మహాపురుషః** (ఐతరేయారణ్యకము 3.2.9). ఈ దేహంలో నాలుగు విధాలైన పురుషులు (వ్యూహాలు) ఉండును.

శరీర పురుషుడు – చేతనుల శరీరంలోని ఆత్మ.

ఛందః పురుషుడు – సరిగ్గా ఉచ్చరించిన మంత్రాలు అనే ఆత్మ.

వేద పురుషుడు – వేదముల రూపంలోని ఆత్మ.

మహాపురుషుడు – కాలంరూపంలోని ఆత్మ.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **చతుర్భిః వేదైః వ్యూహ్యతే పరేశత్వేన వృధ్యతే యం ఇతి చతుర్వ్యూహః**. ఋగ్, యజుర్, సామ, అధర్వణములనే నాలుగు వేదముల రూపంలో ఆయన పరమేశ్వరత్వం నిరూపితమైనది గనుక ఆయన చతుర్వ్యూహుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **చత్వారి వాక్ పరిమితా పదాని** (ఋగ్వేదము 1.164.45). ఇవి వాక్కులో నాలుగు విభాగములను సూచించును. తరువాతి ఉక్తిలో 'గ్రహించే బ్రాహ్మణులు వానిని ఎరుగుదురు' అని ఉంది. ఈ నాలుగు విభాగములు అనగా మూడు వేదములు, సామాన్యమైన భాష (మాటలు) అని శ్రీ రాల్ఫ్ గ్రిఫిత్ వివరించారు.

ధర్మచక్రము రచయిత పూర్తిగా భిన్నమైన వివరణ ఇచ్చారు – నాలుగు వ్యూహములు అనగా నాలుగు గొప్పతనములు లేదా నాలుగు మహిమలు. అవి ఏవనగా

(1) లీలామాత్రంగా సృష్టిలయాది కార్యములు చేయుట.

(2) రాసక్రీడద్వారా పరాభక్తి మహాత్మ్యమును తెలియజేయుట.

(3) లెక్కలేనంతమంది గోపికలకు ఒకేమారు నాథునిగా ఉండి జీవాత్మ, పరమాత్మల మధ్య సంబంధము చూపుట.

(4) గాంధారి శాపాన్ని మౌనంగా స్వీకరించి వృష్ణివంశం నాశనాన్ని జరుగనిచ్చుట.

774. చతుర్గతిః

- ధర్మము, అధర్మము, కామము, మోక్షము అను నాలుగు పురుషార్థములను ప్రసాదించువాడు.
- ఇంద్రపదవి, బ్రహ్మపదము, కైవల్యము, మోక్షము అను నాలుగు పదములను భక్తులకు ప్రసాదించేవాడు.
- వృషభగతి, గజగతి, వ్యాఘ్రగతి, సింహగతి అనే నాలుగు విధాలయిన నడకలు కలవాడు.
- నాలుగు వర్ణములకు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు), నాలుగు ఆశ్రమములకు (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమములు) గమ్యము.
- ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు అను నాలుగు విధములైన భక్తులకు ఆశ్రయమైనవాడు.

ఓం చతుర్గతయే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఉపాసక అభియోగ తారతమ్య కృత క్రమాత్ చతుస్రః ప్రాప్తయః అస్మిన్ ఇతి చతుర్గతిః.** ఉపాసకుల అర్హతనుబట్టి నాలుగు విధాలైన ఫలాలను (గతులను) ప్రసాదించేవాడు చతుర్గతి. ఈ నాలుగు గతులు ఏవో శ్రీ భట్టులు చెప్పలేదు. తరువాతి వ్యాఖ్యాతలు ఈ నాలుగు గతులు ఏవి అనే విషయంలో రెండు అభిప్రాయాలు చెప్పారు (1) ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు పురుషార్థాలు (2) (శ్రీ అణ్ణాంగారాచార్య స్వామి) ఇంద్రపదవి, బ్రహ్మ పదవి, కైవల్యము, మోక్షము అనే నాలుగు పదములు.

శ్రీ సుందరకాండము 35.19 – హనుమంతుడు సీతమ్మవారికి శ్రీరాముని వర్ణిస్తూ ఇలా అన్నాడు.

చతుర్దశ సమద్వంద్వః చతుర్దంష్ట్రః <u>చతుర్గతిః</u>

మహోష్ఠహనునాసశ్చ పంచస్నిగ్ధోఽష్టవంశవాన్

శ్రీరాముడు పదునాలుగు జతలు అవయవములు సమప్రమాణములో కలవాడు. నాలుగు దంష్ట్రలు (సూదివలె మొనదేలిన దంతములు) కలవాడు. **నాలుగు మృగముల (సింహము, పెద్దపులి, ఏనుగు, వృషభము) నడకవంటి నడక కలవాడు.** అందమైన పెదవులు, చుబుకము, నాసిక కలవాడు. ఓ దేవీ! ఆ రాముడు నిగనిగలాడు ఐదు భాగములు (నేత్రములు, పలువరుస, చర్మము, పాదములు, కేశములు)

కలవాడు. జానకీ! ఆయన శరీరము చేతిప్రేళ్ళు, కాలిప్రేళ్ళు, కరములు, నాసిక, నయనములు, కర్ణములు, ప్రజనము అను అష్టవంశములు తగిన ప్రమాణములో కలవాడు (గీతాప్రెస్ ప్రచురణలోని అనువాదము).

నాలుగు నడకలను సూచిస్తూ శ్రీమద్రామాయణంలో రాముని నడకనిలా వర్ణించారు – **గజ సింహ గతి వీరో శార్దూల వృషభోపమౌ.** శ్రీరంగం ఉత్సవంలో ఎంపెరుమాన్ ఊరేగింపులో నాలుగు విధాలైన నడకలుంటాయి – వృషభ గతి (గర్వము, విజయానందము సూచించు ఎద్దు నడక) , మత్తగజగతి (రాజసం ఉట్టిపడే ఏనుగు నడక), వ్యాఘ్రగతి (పులిలా బెదురులేని నడక), సింహగతి (అన్ని మృగములకు రాజైన, ఎదురు లేని సింహం నడక).

శ్రీ ఆండాళ్ తిరుప్పావై 23వ పాశురములో భగవానుని సింహగతిని ఇలా వర్ణించినది. (భావశ్రీ అనువాదము)
వర్షర్తునందు పర్వత కుహరమందునన్
నిశ్చలస్థితిని నిదురించు శౌర్యపు సింహ
మదియె మేల్కొని, తీవ్రమగు దృష్టి నీక్షించి
వాసించు మేని రోమములు నిగుడగ జేసి
దోర్లి దోర్లియు మేని దులుపుకొని, మెయి సాచి
గర్జించి, గుహనుండి గడగి వెల్వడ వచ్చు
పగిది గానుగ పూవువంటి మెయి చాయతో
నీదు భవనమునుండి నేర్పునన్ విచ్చేసి
అపురూప సింహాసనమున కొలువున్నావు
కరుణించి మా కార్యమెరుగ ప్రార్థించెదము

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'గతి' అనగా 'లక్ష్యము' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **ఆశ్రమానామ్ వర్ణానామ్ చతుర్ణామ్ యథోక్తకారిణామ్ గతిః చతుర్గతిః.** నాలుగు ఆశ్రమములకు, నాలుగు వర్ణములకు గతియైనవాడు చతుర్గతి. నాలుగు ఆశ్రమములనగా బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము. చతుర్వర్ణములనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. వర్ణాశ్రమ ధర్మాలు సక్రమంగా పాటించినట్లయితే భగవత్ప్రాప్తి కలుగుతుంది.

శ్రీ బలదేవ విద్యాభూషణ, శ్రీ సత్యసంధ యతిరాజ – నాలుగు విధాలైన భక్తులకు ఆశ్రయమైనవాడు చతుర్గతి.
చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ – గీత 7.16
ఓ భరతశ్రేష్ఠ! అర్జున! శుభకర్మలను ఆచరించుచు సుఖసంపదలను కోరుకొనువారు (అర్థార్థులు), శారీరిక మానసిక సంతాపములకు గురియైన ఆర్తులు, ఐహిక విషయములపై ఆసక్తిని వీడి పరమాత్మ

తత్వ్జ్ఞానమును పొందుటకు ఇచ్ఛగలవారు (జిజ్ఞాసువులు), పరమాత్మ ప్రాప్తించిన జ్ఞానులు అను చతుర్విధ భక్తులు నన్ను భజింతురు.

ఉదాహరణలు: అర్థార్థులు – సుగ్రీవుడు, విభీషణుడు, ధ్రువుడు; ఆర్తులు – గజేంద్రుడు, జరాసంధునిచే బంధింపబడిన రాణులు, ద్రౌపది; జిజ్ఞాసులు – పరీక్షిత్తు, ఉద్ధవుడు; జ్ఞానులు – శుకుడు, సనకాదులు, నారదుడు, భీష్ముడు.

(ఈ రచన అంతటా గీతాశ్లోకాల అనువాదం గీతాప్రెస్, గోరఖ్ పూర్ వారి ప్రచురణనుండి తీసుకొనడమైనది. శ్రీ మద్భగవద్గీత తత్వవివేచనీ హిందీ వ్యాఖ్య – రచన: శ్రీ జయదయాల్ గోయందకా – తెలుగు అనువాదము: డా. ఎమ్. కృష్ణమాచార్యులు, డా. గోలి వెంకటరామయ్య)



(మత్స్యావతార చిత్రం. వికీపీడియా నుండి)

775. చతురాత్మా

- వ్యూహావతారములుగా నాలుగు రూపములు కలవాడు – వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు.
- రామ, కృష్ణ విభవావతారములలో నాలుగేసి రూపములు కలవాడు.
- సృష్టి, స్థితి, లయ కార్యములలో నాలుగేసి విభూతులు కలవాడు.
- చాతుర్య ఆత్మా చతురాత్మా – ఏ విధమైన బంధములు లేకుండా అతి పరిశుద్ధమైన ఆత్మ కలవాడు.
- మనసు, చిత్తము, బుద్ధి, అహంకారముల కార్యములకు కారణమైనవాడు.
- విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయములనే నాలుగు రూపములలో జీవునకు ఆధారమైనవాడు.
- ఆర్తుడు, అర్థార్థి, జిజ్ఞాసువు, జ్ఞాని అనే నాలుగు విధముల భక్తులకు అంతర్యామి.
- (చతుర = కుశల, తయారు) నాలుగు ముఖముల బ్రహ్మను సృష్టించినవాడు.
- జీవ, అంతరాత్మ, పరమాత్మ, జ్ఞానాత్మ అనే నాల్గు విధములయిన ఆత్మలుగానున్నవాడు.

ఓం చతురాత్మనే నమః

ఈ నామము రెండుమార్లు స్తుతింపబడినది.

15వ శ్లోకము. 139వ నామము. చతురాత్మా – **చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్రః చతుర్భుజః**

82వ శ్లోకము. 775వ నామము. చతురాత్మా – **చతురాత్మా చతుర్భావః చతుర్వేదవిదేకపాత్**

'ఆత్మ' అనే పదం ఒక్కో జీవుని ఆత్మగురించి సాధారణంగా వాడుతారు. కాని ఒక్కోమారు పరమాత్మగురించి కూడ చెబుతారు. **చతుర్మూర్తిః** (82-771), **చతురాత్మా** (15-139, 82-775), **చతుర్వ్యూహః** (15-140, 82-773) –

అనే ఈ మూడు నామముల అర్థాలలోను కొంత సారూప్యం ఉంది. కనుక ఈ వ్యాఖ్యానాలగురించి కొంత పునరాలోకన ఇక్కడ ఇవ్వబడింది.

ఇంతకుముందు చెప్పినట్లుగా శ్రీ భట్టులు తమ వ్యాఖ్యలో 1000 నామములను 44 సమూహాలుగా విభజించారు. ఒక్కో సమూహంలోనూ భగవంతుని ఒక్కోగుణానుభవానికి ప్రాధాన్యతనిచ్చారు. వాటిలో 123 నుండి 146 వరకు నామములు భగవంతుని వ్యూహావతార వర్ణన పరంగా వ్యాఖ్యానించారు. కనుక 139 వ నామము 'చతురాత్మా', 140వ నామము 'చతుర్వ్యూహః' లు భగవంతుని నాలుగు వ్యూహముల గురించి వర్ణిస్తున్నాయి. ఇక 775వ నామము 'చతురాత్మా' మరియు 773వ నామము 'చతుర్వ్యూహః'లను శ్రీకృష్ణావతారపరంగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. ఇలా ఒక్కో నామమునకు సందర్భానుసారంగా ఒక్కో గుణాన్ని విశదీకరించారు. ఇలా భగవంతుని వివిధ గుణానుభవాలు మనకు లభిస్తున్నాయి. అంతేగాక ఈ స్తోత్రంలో పునరుక్తిదోషం లేదని నిరూపితమౌతున్నది.

శ్రీ శంకరుల వ్యాఖ్యానంలో అటువంటి సమూహాలు లేవు. కనుక ఒక నామానికి దాని ముందు వెనుక నామములతో ప్రత్యేకమైన సంబంధం కనిపించదు. అయితే శ్రీ శంకరులుకూడా పునరుక్తి దోషం లేకుండా వ్యాఖ్యానించారు. ఒకేనామం పలుమార్లు వచ్చినపుడు ఒకోమారు ఒకో క్రొత్త అర్థం చెప్పారు. ఉదాహరణకు – 'చతురాత్మా' నామము మొదటిసారి వచ్చినపుడు 'చతుర్' అంటే 'నాలుగు' అనే అర్థంలో, సృష్టి స్థితి లయ కార్యాలలో నాలుగేసి విభూతులు కలవాడు – అని వ్యాఖ్యానించారు. రెండవమారు ఇదే 'చతురాత్మా' నామమును 'చతుర-ఆత్మా' (చాతుర్యమ్ చతుర్) అనే అర్థంలో, ఆత్మను పరిశుద్ధంగా ఉంచుకొనేవాడు – అని వ్యాఖ్యానించారు శ్రీ శంకరులు. ఇక 'చతుర్మూర్తి' అనగా నాలుగు యుగాలలో నాలుగు రంగులు కలవాడు – అని వ్యాఖ్యానించారు.

ఇక ప్రస్తుత 'చతురాత్మా' నామమును గురించి –

శ్రీ భట్టుల వ్యాఖ్య –

15వ శ్లోకము. 139వ నామము. చతురాత్మా – **వాసుదేవాది రూపత్వాత్ చతురాత్మా ఇతి కథ్యతే**. ఇక్కడ 'ఆత్మ' అనగా రూపము. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములుగానున్నవాడు చతురాత్మ.

82వ శ్లోకము. 775వ నామము. చతురాత్మా –

స్థూల సూక్ష్మే జాగ్రదాదౌ చాతురాత్మ్య ప్రకాశనాత్

చతురాత్మా స విజ్ఞేయః వస్వర్ణో మనురుత్తమః

జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయము అనే నాల్గు అవస్థలలోను భగవంతుడు స్థూల మరియు సూక్ష్మ రూపములలో భక్తులకొరకు ప్రకాశించుచుండును గనుక చతురాత్మ. ఈ నామము అష్టాక్షరీ మంత్రము.

మహత్తరమైనది. ఓం చతురాత్మనే నమః. అనగా భగవంతుడు అన్నివేళలా అన్నియెడలా భక్తులకు అందుబాటులో ఉండును.

శ్రీ శంకరుల వ్యాఖ్య –

15వ శ్లోకము. చతురాత్మా – భగవంతుడు సృష్టి, స్థితి, లయము అనే మూడు కార్యములలోను నాలుగేసి విభూతులుగా ఒప్పుచుండును.

సృష్టియందు (హరి) – బ్రహ్మ, దక్షాదులు, కాలము, సకల జీవులు.

స్థితియందు (విష్ణవు) – విష్ణువు, మన్వాదులు, కాలము, సకల జీవులు.

లయయందు (జనార్దనుడు) – రుద్రుడు, యమాదులు, కాలము, సకల జీవులు.

బ్రహ్మ దక్షాదయః కాలః తథైవ అఖిల జంతవః

విభూతయా హరిరేతా జగతః సృష్టిహేతవః

విష్ణుర్మన్వాదయః కాలః సర్వభూతాని చ ద్విజ

స్థితేర్నిమిత్త భూతస్య విష్ణోరేతా విభూతయః

రుద్రః కాలః అంతకాద్యశ్చ సమస్తాశ్చైవ జంతవః

చతుర్ధా ప్రళయాయైతా జనార్దన విభూతయః – విష్ణుపురాణము 1.22, 30.32

82వ శ్లోకము. చతురాత్మా – **రాగద్వేషాది రహితాత్ చతుర ఆత్మా మనో అస్య ఇతి చతురాత్మా**. ఇక్కడ చతురమైన ఆత్మ అనే అర్థంలో శ్రీ శంకరులు వ్యాఖ్యానించారు. రాగద్వేషములు లేని పరిశుద్ధమైన ఆత్మ, ఆలా ఉంచుకొనే చాతుర్యం కలిగినవాడు చతురాత్మ.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థము – **మనో బుద్ధి అహంకార చిత్తాఖ్యాంతఃకరణ చతుష్టయ ఆత్మకత్వాత్ చతురాత్మా**. మనసు, బుద్ధి, అహంకారము, చిత్తము అనే నాలుగు అంతఃకరణలకు ఆధారమైనవాడు చతురాత్మ.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ –

మనో బుద్ధిరహంకారః చిత్తమ్ కరణమ్ అంతరమ్

సంశయో నిశ్చయో గర్వస్మరణమ్ విషయానీ

మనసు – సంశయము – ఏదో చేయాలనుకొనేది.

బుద్ధి – నిశ్చయము – ముందు వెనుకలు ఆలోచించేది.

చిత్తము – స్మరణము – పాత జ్ఞాపకాల అనుభవాన్ని పరిగణించేది.

అహంకారము – గర్వము – చేసినందుకు గర్వించేది.

శ్రీ చిన్మయానంద 'చత్వారాత్మా' అనే పాఠాంతరాన్ని గ్రహించారు. అంతఃకరణ చతుష్టయము అనే నాలుగు రూపాలలో వ్యక్తమయ్యే అనంత ప్రకాశమే చత్వారాత్మ.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి 'నృసింహతాపిని' ఆధారంగా మరొక వివరణ ఇచ్చారు – **ఓత, అనుజ్ఞాత, అనుజ్ఞైకరస, అవికల్ప - అథ తురీయశ్చతురాత్మా తురీయావసిత్వాత్ ఏకైకస్య ఓతానుజ్ఞాత్రనుజ్ఞైకల్పైః**.. పరమాత్ముడు నాలుగు రూపాలలో ప్రకాశిస్తున్నాడు.

(1) జీవుల స్థూల శరీరము (విశ్వ శరీరము)నకు ఆధారమైన 'విరాట్ రూపము'. విశ్వ శరీరమును, విరాట్ రూపమును కలిపి 'ఓత ప్రోత స్వరూపము' అంటారు.

(2) జీవుల సూక్ష్మ శరీరము (తైజస శరీరము)నకు ఆధారమైన 'సూత్ర రూపము'. తైజస శరీరము, సూత్ర రూపములు కలిపి 'అనుజ్ఞాత రూపము'.

(3) జీవుల మరో శరీరము పేరు కారణ శరీరము. ఇది పాత జన్మల జ్ఞాపకాలను కలిగి ఉంటుంది (ఉదాహరణ: పసిబిడ్డ పాలకోసం ఏడవాలని తెలుసుకోవడం). కారణ శరీరమునే 'ప్రాజ్ఞాశరీరము' అని కూడా అంటారు. ప్రాజ్ఞాశరీరమునకు ఆధారమైన పరమాత్మ రూపమును 'అనుజ్ఞైక రసము' అంటారు.

(4) ఈ మూడు రూపాలకంటే పరమైనది, బ్రహ్మజ్ఞానంవల్ల మాత్రమే తెలియవచ్చే పరమాత్మ రూపమును 'అవికల్పము' అంటారు.

ఇలా ఓత, అనుజ్ఞాత, అనుజ్ఞైకరస, అవికల్పములనే నాలుగు రూపములు కలిగిన పరమాత్మ చతురాత్మ.

శ్రీ టి.ఎస్. రాఘవన్ – మార్కండేయపురాణం ఆధారంగా, పరమాత్ముడు సకల జీవుల శరీరములందును విశ్వ, తైజస, ప్రాజ్ఞ, తురీయములనే నాలుగు రూపములలో ప్రవేశిస్తున్నాడు.

పరమాత్మా చతుర్రూపః సర్వప్రాణి శరీరగః

విశ్వశ్చ తైజసః ప్రాజ్ఞా స్తురీయశ్చేతి కథ్యతే.

జాగ్రదవస్థలో విశ్వరూపము, స్వప్నావస్థలో తైజసరూపము, సుషుప్తావస్థలో ప్రాజ్ఞారూపము, వీటన్నింటిని మించి తురీయావస్థలో తురీయరూపములోను పరమాత్ముడుంటాడు.

మాండూక్యోపనిషత్తులో ఈ అవస్థల గురించి చెప్పారు. ఆత్మకు నాలుగు పాదాలున్నాయి –

(1) జాగ్రదవస్థ మొదటి పాదం. దీనికి అధిపతి వైశ్వానరుడు. ఇతడికి ఏడు అంగములు, 19 నోళ్ళు ఉన్నాయి.

(2) స్వప్నావస్థ రెండవ పాదం. దీనికి అధిపతి తైజసుడు. వీనికి ఏడు అంగములు, 19 నోళ్ళు ఉన్నాయి.

(3) సుషుప్తి మూడవ దశ. అధిపతి ప్రాజ్ఞుడు.

(4) నాల్గవ దశ తురీయము. అధిపతి ఆత్మ. ఈ దశ అంతరము కాదు, బాహ్యము కాదు. అచేతన కాదు. ఇంకోదానితో సంబంధం పెట్టి చెప్పలేనిది. మనస్సు గ్రహించలేదు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **చతుర్ణామ్ ఆర్త అర్థార్థీ జిజ్ఞాసు ముముక్షుణామ్ ఆత్మా అంతర్యామీ ప్రియ ఇతి చతురాత్మా**. భగవంతుని అర్చించే నాలుగు విధాల భక్తులకు – దుఃఖమునుండి ఉపశమనము కోరువారు, సుఖము ధనము వంటివానిని కోరువారు, జ్ఞానము కోరువారు, మోక్షము కోరు జ్ఞానులు – ఈ నాలుగు విధాల భక్తులకు అంతర్యామి గనుక చతురాత్మ.

శ్రీ సత్యసంధ యతిరాజ – **చతుర్షు ధర్మ అర్థ కామ మోక్షేషు జనానామ్ యోగ్యతానుసారేణ ఆత్మా మనో యస్మాత్ స చతురాత్మా**. జనుల యోగ్యతనుబట్టి వారికి ధర్మార్థకామమోక్షములను పురుషార్థములను ప్రసాదించువాడు చతురాత్మ.

శ్రీ సత్యసంధ యతిరాజ మరొక వివరణ – **చత్వార ఆత్మానః ఆత్మా, అంతరాత్మా, పరమాత్మా, జ్ఞానాత్మా లక్షణా యస్య ఇతి చతురాత్మా**. భగవంతునిలో నాలుగువిధాలైన ఆత్మల లక్షణాలున్నాయి. ఆత్మ, అంతరాత్మ, పరమాత్మ, జ్ఞానాత్మల సంపూర్ణ గుణములు కలిగినవాడు చతురాత్మ.

పరమాత్ముడు ఆత్మరూపంలో మన హృదయాలలో వసించును. అంతరాత్మరూపంలో ఆత్మలో వసించును.

తైత్తరీయోపనిషత్తులో **'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ'** అని ఉంది. భగవంతుడు ప్రాణమయుడు, మనోమయుడు, అన్నమయుడు, విజ్ఞానమయుడు, ఆనందమయుడు. ఇందులో మనోమయ, ఆనందమయ విభూతులు జ్ఞానాత్మ స్వరూపములు. బృహత్ సంహితలో ఇలా ఉన్నది –

ఆత్మా అంతరాత్మా హరిరేక ద్వి-విధా స్థితః
నివిష్టో హృదయే నిత్యమ్ రసం పిబతి కర్మజమ్.

776. చతుర్భావః

- సృష్టి, స్థితి, రక్షణ, శాస్త్ర ప్రదానాది స్థూల సూక్ష్మ కార్యాలను తన నాలుగు వ్యూహముల ద్వారా ప్రకటింపజేయువాడు.
- నాలుగు వర్ణములు, నాలుగు ఆశ్రమములు, నాలుగు పురుషార్థములు, ఇలా నాలుగేసి సమూహములకు మూలము.
- నాలుగు విధములైన జీవులను సృష్టించినవాడు.

ఓం చతుర్భావాయ నమః

భూ - సత్తాయామ్ - ఉండుట, నివసించుట, జన్మించుట;

భావ - ఉండువాడు - ఉండుటకు కారణమైనవాడు, స్వయముగా ఆవిర్భవించినవాడు, ఇతరుల ఆవిర్భావానికి కారణమైనవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భావ - భావన - వ్యక్తపరచుట. ఇంతకుముందు నామమువలెనే ఈ నామమునకు కూడా శ్రీ భట్టులు వ్యూహావతారములతో సంబంధము చూపారు. సృష్టి, స్థితి, రక్షణ, శాస్త్రముల ప్రాచుర్యము అనేవి నాలుగు కార్యములు. ఇవి వ్యూహావతారములలో ఇలా వ్యక్తమవుతున్నవి. (అభివ్యంజనము = వ్యక్తము). వాసుదేవ – సృష్టి; సంకర్షణ – స్థితి; ప్రద్యుమ్న – రక్షణ; అనిరుద్ధ – శాస్త్రప్రదానము.

శాస్త్రదానాది పంచాభివ్యంజనాత్ స్థూలసూక్ష్మయోః చతుర్భావస్సమాఖ్యాత మున్యర్లక్ష్య గతిప్రదః. సృష్టి, స్థితి, రక్షణ, శాస్త్ర ప్రదానాది కార్యాలను తన నాలుగు వ్యూహముల ద్వారా ప్రకటింపజేయువాడు చతుర్భావుడు. ఓం చతుర్భావాయ నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ధర్మార్థకామమోక్షాఖ్య పురుషార్థ చతుష్టయమ్ భవతి - ఉత్పాద్యతే అస్మాత్ ఇతి చతుర్భావః**. నాలుగు విధాలైన పురుషార్థములకు ఆధారమైనవాడు చతుర్భావుడు.

శ్రీ చిన్మయానంద 'నాల్గింటికి మూలము' అనే భావాన్ని మరింత విస్తరించారు – నాలుగు వర్ణములు, నాలుగు పురుషార్థములు, నాలుగు ఆశ్రమములు వంటివానికి మూలమైనవాడు చతుర్భావుడు.

చాతుర్వర్ణం మయాసృష్టం గుణకర్మవిభాగశః
తస్య కర్తారమపి మాం విద్ధ్య కర్తారమవ్యయమ్ – గీత 4.13

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములవారిని వారి గుణకర్మలననుసరించి నేను సృష్టించితిని. ఈ సృష్టి కార్యక్రమమునకు నేనే కర్తనైనను, శాశ్వతుడను, పరమేశ్వరుడను ఐన నన్ను వాస్తవముగ 'అకర్త'గా తెలిసికొనుము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **స్వకృత వ్యవస్థయా చతుర్విధమ్ సృష్టిమ్ ఉత్పాదయతి**. తన సంకల్పమాత్రమున నాలుగు విధములైన జీవులను సృష్టించినవాడు చతుర్భావుడు. ఆ నాల్గు విధాల జీవులు (1) గ్రుడ్డునుండి జనించేవి. ఉదా:పక్షులు, పాములు (2) ఝుంకారము చేసేవి. ఉదా: ఈగలు, దోమలు, తేనెటీగలు. (3) చెట్లు (4) మానవులు.

777. చతుర్వేదవిత్

- నాలుగు వేదములు తెలిసినవారు ఆయననెరుగుదురు.
- నాలుగు వేదములు పూర్తిగా తెలిసినవాడు భగవంతుడు మాత్రమే.
- నాలుగు వేదములు తెలియునట్లు అనుగ్రహించువాడు.

ఓం చతుర్వేదవిదే నమః.

'చతుర్-వేద-విత్' అనగా నాలుగు వేదములు పూర్తిగా తెలిసినవాడు. 14వ శ్లోకంలో ఇలాంటిదే 'వేదవిత్' అనే నామం వచ్చింది.

భగవంతుడొక్కడు మాత్రమే పూర్తిగా నాలుగు వేదములు తెలిసినవాడు. తక్కిన వేదజ్ఞానులంతా భగవానుని అనంత వ్యూహ, విభవములలో లేశమాత్రమే అనుభవిస్తారు.

పరావర విభాగానాం కో విదా స్వయమేవయే

చతుర్వేదవిదిత్యుక్తః వస్వర్ణో నిగమప్రదః

నాలుగు వేదముల సారమూ స్వయంగా తెలిసినవాడు. ఈ నామము అష్టాక్షరీమంత్రము. వేదజ్ఞానప్రదము. ఓం చతుర్వేదవిదే నమః. (ఈ శ్లోకం, దాని భావంలో అచ్చుతప్పులున్నాయనిపించింది. కనుక కొంచెం మార్చాను – కా.సు.బాబు.)

చతుర్వేదైః విద్యతే కణికామా తతయా జ్ఞాయతే ఇతి చతుర్వేదవిత్. నాలుగు వేదాలు తెలిసినవారుకూడా ఆ పరమేశ్వరుని మహిమను కొద్దిగానే తెలుసుకోగలుగుతారు.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ

వేదైశ్చ సర్వైరహమేవవేద్యో వేదాన్తకృత్ <u>వేదవిదేవ</u> చాహమ్ – గీత 15.15

సమస్త ప్రాణుల హృదయములలో అంతర్యామిగానున్నవాడను నేనే. నానుండియే స్మృతి, జ్ఞానము, అపోహనము (సందేహమును తొలగించుట) కలుగుచున్నవి. వేదములద్వారా తెలిసికొనదగినవాడను నేనే. వేదాంతకర్తను, వేదవిజ్ఞుడను కూడా నేనే.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి (1.3.10)లో – **మఱైమాయ నాల్ వేదత్తుళ్ నిన్ఱ మలర్ చ్చుడారే** – అన్నారు. శ్రీ వేదాంతదేశికన్ ఈ పాశురంలో 'మఱై', 'వేదం' అనే రెండు పదాల వాడకాన్ని విశ్లేషించారు. 'మఱై' అనగా భక్తులుకానివారినుండి దాచిపెట్టబడిన గొప్ప రహస్యము. 'వేదము' అనగా గొప్ప భక్తులకు తెలియజేయబడిన ఆ రహస్యము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **యథావత్ వేత్తి చతుర్ణామ్ వేదానామ్ అర్థమ్ ఇతి చతుర్వేదవిత్**. నాలుగు వేదముల అర్థము ఉన్నదున్నట్లుగా తెలిసినవాడు ఆయనొక్కడేగనుక ఆయన 'చతుర్వేదవిత్'. శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఇదే అర్థం చెప్పారు. **చత్వారో వేదా ఋగాదయః తాన్ అవశేషాన్ వేత్తి ఇతి చతుర్వేదవిత్**.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు నాలుగు వేదములను పూర్తిగా తెలిసినవాడు మాత్రమే కాదు. స్వయముగా నాలుగు వేదములు ఆయనే. కనుక వేదములను, వాని అర్థములను బాగుగా అధ్యయనము చేసినవారికి మాత్రమే భగవంతుని తెలిసికొనుట సాధ్యము.

శ్రీ బలదేవ విద్యాభూషణ భిన్నమైన అనుభవాన్ని చెప్పారు – **చతురో వేదాన్ వేదయతి భక్తాన్ ఇతి చతుర్వేదవిత్**. తన భక్తులకు నాలుగు వేదములు తెలిసికొనుటను సాధ్యం చేసేవాడు 'చతుర్వేదవిత్'. అనగా భగవంతునిపట్ల గాఢమైన భక్తివలన మాత్రమే వేదములను అభ్యసించేవారికి వేదములు అవగతమగును.

778. ఏకపాత్

- మానవులలో ఒకనిగా అవతరించినపుడు తన మహిమలో ఒక భాగము (అంశ)ను మాత్రమే వ్యక్తపరచేవాడు.
- విశ్వరూపంలో ఆయన విభూతి ఆయనలో నాల్గవ భాగమే.
- (ఏకపో-అత్) ఏకైక రక్షకునిగా సదా కాపు కాచేవాడు.

ఓం ఏకపదే నమః

ఓం ఏకపాదే నమః (శ్రీ సత్యదేవో వాసిష్ఠ, శ్రీ కృష్ణదత్త భరద్వాజ)

పాదము అంటే మూడు అర్థాలున్నాయి (1) నాల్గవ భాగము (2) కాలి పాదము (3) భాగము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **ఏకాంశేనా వశీర్ణత్వాత్ ఏకపాదితి కథ్యతే.** ఒకే అంశతో అవతరించినవాడు ఏకపాత్ భగవంతుడు మనలో ఒకనిగా అవతరించినపుడు తన మహిమలో కొద్ది భాగమును మాత్రమే వ్యక్తపరచును (అంటే అర్థం అవతార సమయంలో భగవంతుని గొప్పతనంలో ఒక భాగం మాత్రమే ఉంటుందని కాదు. ఆయన తన సంపూర్ణమైన గుణాలు కలిగియుండును కాని వానిలో కొద్దిభాగమును మాత్రమే బయటకు వ్యక్తపరచును. శ్రీమద్రామాయణములో శ్రీరాముడు **'అహం మానుషం మన్యే'** – నేను మానవునిగా అనుకొంటున్నాను – అనడం ఇందుకొక ఉదాహరణ. శ్రీ స్వామిదేశికన్ తమ శరణాగతి దీపిక 17వ శ్లోకంలో విభవావతాముల పరిపూర్ణతను వివరించారు. శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణములు –

అంశావతారో బ్రహ్మర్షే! యోఽయం యదుకులోద్భవ – విష్ణుపురాణము 5.1.2 – ఓ బ్రహ్మర్షీ! యదుకులంలో శ్రీకృష్ణుని అవతారం ఆయనలోని ఒక అంశ మాత్రమే.

అంశాంశేన అవతీర్య ఉర్వ్యామ్ – విష్ణుపురాణము 5.1.3 – తన అంశలో ఒక అంశగా ఈ జగత్తులో అవతరించాడు.

విష్ణోరర్ధమ్ మహాభాగమ్ పుత్రమ్ ఇక్ష్వాకు నందనమ్ – బాలకాండ 18.12 – విష్ణువుయొక్క అర్ధమహాభాగము ఇక్ష్వాకువంశంలో పుత్రుడు రామునిగా అవతరించెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరుల వ్యాఖ్య పురుషసూక్తంలో ఉన్న విషయానికి సరిపోతుంది.

ఏతావాన్ అస్య మహిమా

అతో జ్యాయాగ్ంశ్చ పూరుషః

పాదోఽస్య విశ్వభూతాని

త్రిపాదస్యామృతమ్ దివి

త్రిపాదూర్ధ్వ ఉదయత్పురుషః

పాదోऽస్యేహా భవాత్ పునః

తతో విశ్వంగ వ్యక్రామత్

సాశనానశనే అభి

భగవంతుని మహిమలో నాల్గవభాగం మాత్రమే వ్యక్తమయ్యింది. తక్కిన మూడు వంతులు ఆయన పరమపదమునందలి నిత్యవిభూతి. ఇక్కడ నాల్గవ భాగము, మూడు భాగాలు అనగా అనంతంలో కొద్దిభాగము, అధికభాగము అని అర్థం చేసుకోవాలి.

శ్రీ శంకరులు గీతనుండి ఉదాహరించారు –

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున

విష్టభ్యామహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ – గీత 10.42

అథవా, ఓ అర్జున! ఇంతకంటెను విపులముగా తెలిసికొని ప్రయోజనమేమి? ఈ సంపూర్ణ జగత్తును కేవలము నా యోగశక్తియొక్క ఒక్క అంశతోడనే ధరించుచున్నాను.

శ్రీ బలదేవ విద్యాభూషణ స్మృతులనుండి ఉదాహరించారు.

అండానామ్ తు సహస్రానామ్ సహస్రాన్యయుతాని చ

ఈ దృశానామ్ తథా తత్ర కోటి కోటి శతాని చ

ఈ కనిపించే వేలాది బ్రహ్మాండములు ఆయనయందలి చాలా చాలా కొద్ది భాగం మాత్రమే.

శ్రీ సత్యసంధ యతిరాజ – 'ఏకపో-అత్ - ఏకపాత్' అని గ్రహించారు. అత్ - సాతాత్యగమనే - సదా వెళ్ళుచుండుట - అతతి. **ఏకపో ముఖ్యపాలకః సన్ అతతి.** ఆయన ఒక్కడే రక్షకుడు. కనుక మనలను సదా కనిపెట్టియుండును.

పా - రక్షణే, పాతి - రక్షించుట, అనే ధాతువునుండి కూడ 'ఏకపాత్' అనగా 'ఏకైక రక్షకుడు' అనే అర్థం వస్తుంది.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సమావర్తోనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః |
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా || (83)

779. సమావర్తః

- భక్తులకొరకు మరల మరల అవతరించువాడు.
- సంసార చక్రమును బాగుగా త్రిప్పువాడు. మరల మరల సృష్టికార్యము చేయువాడు.
- తన భక్తులకు సహాయం చేయడం గురించి సదా యోచించువాడు.

ఓం సమావర్తాయ నమః

ఇక్కడ 'సమ్' అనునది ఉపసర్గ. సమ్ - బాగుగా, అన్ని ప్రక్కలనుండి; వృత్ - వర్తనే - ఉండుట, ఆక్రమించుట, కొనసాగుట. **ఆవర్తతే చక్రవత్ భ్రామయతి ఇతి ఆవర్తః**. చక్రంలాగా తిరిగేది 'ఆవర్తః'.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు జన్మరహితుడైనాగాని భక్తులకోసం మరల మరల అవతరిస్తుంటాడు గనుక 'సమావర్తః'.

ఏతాదృశం హి సర్వత్ర సర్వదా సర్వథాపి చ
వ్యూహస్య విభవస్యాపి యస్యాస్త్యావర్తనంత్వితి
సమావర్త స్సమాఖ్యాతః వస్వర్ణో జన్మనాశకః

ఈ రకంగా వ్యూహావతారాలు, విభవావతారాలు అన్ని చోట్ల, అన్నివిధాలా, ఎల్లప్పుడూ ధరిస్తూనే ఉండేవాడు 'సమావర్తః'. ఈ నామము అష్టాక్షరీమంత్రము. జన్మరాహిత్యమును ప్రసాదించును. ఓం సమావర్తాయ నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సంసారచక్రస్య సమ్యగ్ ఆవర్తకః ఇతి సమావర్తః**. సంసారచక్రమును బాగుగా త్రిప్పువాడు 'సమావర్తః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సమ్యగ్ ఆవర్తయతి సంసారచక్రమ్ ఇతి సమావర్తః**.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సమ్యగ్ తాన్ ఆవర్తయతి పునః పునః సృజతి ఇతి సమావర్తః**.

ఈశ్వరః సర్వభూతానామ్ హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా – గీత 18.61
అర్జునా! శరీరరూప యంత్రములను అధిరోహించి సర్వప్రాణుల హృదయములందును అంతర్యామిగానున్న పరమేశ్వరుడు తన మాయచేత వారివారి కర్మలననుసరించి వారిని భ్రమింపజేయుచున్నాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ మరొక వ్యాఖ్య – **సమీచీనః ఆవర్తనశ్చింతనమ్ స్వజన అవనమయమ్ యస్య ఇతి సమావర్తః**. భక్తుల మేలుకోసం ఏమి చేయాలన్న విషయంచుట్టూ భగవంతుని ఆలోచనలు తిరుగుతుంటాయి.

780. నివృత్తాత్మా

అనివృత్తాత్మా

- భగవంతుని స్వభావము దివ్యము. అన్నింటికంటె ఉత్తమము. అది ప్రాకృతము కాదు.
- నరనారాయణావతారము. నివృత్తిధర్మమును నరునకు బోధించిన నారాయణుడు. సన్యాసమార్గము చేకొన్నవాడు.
- నివృత్తిధర్మము పాటించేవారి ఆత్మ. కర్మఫలములను ప్రసాదించువాడు.
- ('అనివృత్తాత్మా' - శ్రీ శంకరుల పాఠము) అంతటా ఉన్నవాడు గనుక దేనినుండి వెనుదిరుగడు.
- ప్రళయకాలంలో జీవులను తనయందు ఇముడ్చుకొనువాడు.
- అంతటా, అన్నింటా సంపూర్ణంగా వ్యాపించినవాడు.
- అర్హతలేనివారు చేయు యాగములపట్ల విముఖుడు.
- ప్రళయము, సృష్టివంటివాని ప్రభావము ఆయనపై యుండదు.
- తన యశస్సు, కీర్తనలపట్ల విముఖుడు.

ఓం నివృత్తాత్మనే నమః

ఓం అనివృత్తాత్మనే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్యానం ప్రకారం ఈ నామము నాలుగుసార్లు వస్తుంది. ఇలా నాల్గుసార్లు వచ్చే ఇంకొక్క నామము **'ప్రాణదః'** మాత్రమే.

శ్లోకము	నామము	శ్రీ భట్టుల పాఠము	శ్రీ శంకరుల పాఠము
25	231	నివృత్తాత్మా	నివృత్తాత్మా
48	453	నివృత్తాత్మా	విముక్తాత్మా
64	604	నివృత్తాత్మా	నివృత్తాత్మా
83	780	నివృత్తాత్మా	అనివృత్తాత్మా / నివృత్తాత్మా

25వ శ్లోకము. 231వ నామము. నివృత్తాత్మా – **ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః**

48వ శ్లోకము.453వ నామము.

శ్రీ భట్టుల పాఠము ప్రకారము: నివృత్తాత్మా – **సర్వదర్శీ నివృత్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్**

శ్రీ శంకరుల పాఠము ప్రకారము: విముక్తాత్మా – **సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్**

64వ శ్లోకము. 604వ నామము. నివృత్తాత్మా – **అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృచ్ఛివః**

83వ శ్లోకము. 780వ నామము.

శ్రీ భట్టుల పాఠము ప్రకారము: నివృత్తాత్మా – **సమావర్తో నివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః**

శ్రీ శంకరుల పాఠము ప్రకారము: అనివృత్తాత్మా – **సమావర్తోऽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః**

48వ శ్లోకము 453వ నామము, 64వ శ్లోకము 604వ నామము వివరణలో ఈ నామమునకు చెప్పబడిన వివిధ అర్థములు ఇవ్వడమైనది. మరికొన్ని విషయములు ఇక్కడ చర్చిస్తున్నాము.

శ్రీ భట్టుల వ్యాఖ్యలో రెండు విశేష లక్షణములున్నాయి. (1) శ్రీ భట్టులు ప్రధానంగా భగవంతుని సౌలభ్యాన్ని, సౌశీల్యాన్ని ప్రస్తుతించారు. భక్తుని దృక్పథంలో ఇవి ప్రధానలక్షణాలని శ్రీ భట్టుల భావన. శ్రీ శంకరులు ప్రధానంగా భగవంతుని పరత్వము (సర్వాధిక్యత)ను తమ వ్యాఖ్యలో తెలియజేశారు. (2) శ్రీ భట్టులు 1000 నామములను 44 సమూహాలుగా విభజించారు. ఒక్కో సమూహంలోను ఒక్కొక్క విభూతి లేదా అవతారము లేదా గుణము ప్రధాన విషయము. ఈ రెండవ లక్షణం పరంగా 'నివృత్తాత్మా' నామము చెప్పబడిన సందర్భాలు ఇవి.

25వ శ్లోకము 231వ నామము 'నివృత్తాత్మా' – శ్రీ భట్టులు 226నుండి 247వ నామము వరకు 'పురుషసూక్తంలో ప్రతిపాదించిన విరాట్ స్వరూపం' పరంగా వ్యాఖ్యానించారు. నివృత్తాత్మ = దివ్య, అప్రాకృత స్వరూపుడు.

48వ శ్లోకము 453వ నామము 'నివృత్తాత్మా' – శ్రీ భట్టులు 451 నుండి 463వ నామము వరకు భగవంతుని నరనారాయణావతార పరంగా వ్యాఖ్యానించారు. నివృత్తాత్మ = నివృత్తిధర్మమును పాటించువాడు.

64వ శ్లోకము 604వ నామము 'నివృత్తాత్మా' – శ్రీ భట్టులు 590 నుండి 606వ నామము వరకు భగవంతుని కర్మఫలప్రదానగుణం పరంగా వ్యాఖ్యానించారు. నివృత్తాత్మ = నివృత్తిధర్మం పాటించేవారి ఆత్మ.

83వ శ్లోకము 780వ నామము 'నివృత్తాత్మా' – శ్రీ భట్టులు 697నుండి 786వ నామము వరకు శ్రీకృష్ణావతారపరంగా వ్యాఖ్యానించారు. నివృత్తాత్మ = ప్రవృత్తి ధర్మము పాటించేవారి మధ్యలో ఉన్నప్పటికీ తానుమాత్రం నివృత్తిధర్మము పాటించును.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతునికి బ్రహ్మవిద్య బోధిస్తూ వేదంలోని రెండు మార్గాలను చెప్పాడు. (1) ప్రవృత్తి మార్గము - లౌకికము. (2) నివృత్తి మార్గము - మోక్షదాయకము. ఈ రెండింటిలోనూ మానవుడు ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకోవాలి. శ్రీకృష్ణుడు మానవుల మధ్యలో ఉన్నాగాని ఆయనకు కర్మబంధాలు వర్తించవు. విషయవాసనలు అంటవు. కనుక ఆయన నివృత్తాత్మ.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు –
25వ శ్లోకములో 'నివృత్తాత్మా' – **సంసార బంధన నివృత్త ఆత్మా స్వరూపమ్ అస్య ఇతి నివృత్తాత్మా**. ఇహలోక బంధములు ఆయనకు వర్తించవు గనుక నివృత్తాత్మ. శ్రీ భట్టుల వ్యాఖ్య కూడా ఇందుకు సరిపోతుంది.

48వ శ్లోకములో 'విముక్తాత్మా' – **స్వభావసిద్ధేన విముక్త ఆత్మా యస్య ఇతి విముక్తాత్మా**. స్వభావసిద్ధంగా, అనగా ఏ విధమైన కర్మఫలంగా కాకుండా, విముక్తుడైన ఆత్మ విముక్తాత్మ.

64వ శ్లోకములో 'నివృత్తాత్మా' – **స్వభావతో విషయేభ్యో నివృత్త ఆత్మా మనః అస్య ఇతి నివృత్తాత్మా**. తన స్వభావం ప్రకారం ప్రాపంచిక విషయాలనుండి విముఖుడైనవాడు నివృత్తాత్మ. శ్రీ భట్టులు కూడా ఇదే అర్థం చెప్పారుగాని నరనారాయణావతారానికి అన్వయించారు.

83వ శ్లోకములో 'అనివృత్తాత్మా' – **సర్వత్ర వర్తమానత్వాత్ స నివృత్తః కుతోऽపి అనివృత్తాత్మా**. భగవంతుడు అన్నిచోట్లా ఉంటాడు. కనుక దేనినుండైనా వెనుదిరగడం అనేది ఆయనకు వర్తించదు. అలా ఆయన అనివృత్తాత్మ.

శ్రీ సత్యసంధ యతిరాజ మూడు అర్థాలు చెప్పారు.
(1) **నివృత్తాత్మనో యేన ప్రలయ ఇతి.** ప్రళయకాలంలో జీవులను తనయందు ఇముడ్చుకొనేవాడు నివృత్తాత్మ.
(2) ని - నితారమ్ - పూర్తిగా, వృత్తః - సకలవిషయే ప్రవృత్తః. అన్నింటా ఉండేవాడు, అనగా అంతటా వ్యాపించినవాడు నివృత్తాత్మ.
(3) **అయోగ్య కృత యజ్ఞాదిభ్యో నివృత్తో వా ఆత్మా మనో యస్య స నివృత్తాత్మా.** అయోగ్యులు ఒనరించిన యజ్ఞములపట్ల విముఖుడైనవాడు నివృత్తాత్మ.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 64వ శ్లోకము 'నివృత్తాత్మా' – నివృత్త - అసంగ - సంబంధము లేనివాడు. **భగవాన్ విష్ణుః సృష్టికాలే ప్రళయకాలే చ సృష్టిమ్ ప్రళయౌ యథాక్రమమ్ విదధదపి, స్వస్వరూపవతో నివృత్తాత్మా భవతి అసంగః, ప్రళయకాలే వా సృష్టేర్ నివర్తత ఇతి నివృత్తాత్మా విష్ణురుక్తో భవతి.** భగవంతుడు విష్ణువుకు ప్రళయకాలంలో అంతం లేదు. సృష్టిలో జన్మ లేదు. అనగా ప్రళయము, సృష్టితో సంబంధము లేనివాడు గనుక నివృత్తాత్మ.

శ్రీ వి.వి. రామానుజన్ – అనేక బ్రహ్మాండములు, జీవులు, చరాచరములతో కూడిన సృష్టి చేసిన భగవానుడు అన్నింటికిని స్వామి. కాని ఆయనకు దీనిపట్ల మమకారము, గర్వమువంటివి లేవు. సృష్టిని కాపాడుటే ఆయన లక్ష్యము. కనుక భగవంతుడు నివృత్తాత్మ. ఈ నామముద్వారా మనము ఇంద్రియనిగ్రహము నేర్చుకొని భగవంతుని ధ్యానించాలని శ్రీ చిన్మయానంద వ్యాఖ్యానించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఒడ్డున ఉన్నవాడే ఊబిలోచిక్కుకున్నవానిని బయటకు లాగగలడు. అలాగే పూర్తిగా బంధవిముక్తుడైన భగవంతుడే మనలను భవబంధములనుండి తప్పించగలడు.

ధర్మచక్రము రచయిత – శ్రీమహావిష్ణువును 'నివృత్తాత్మ'యని ధ్యానము చేయుటద్వారా మనము విషయలోలత్వము, అహంకార మమకారాది బంధములనుండి విముక్తులము కాగలము. శ్రీరాముని జీవితం నివృత్తాత్ముని వర్తనమునకు స్పష్టమైన ఉదాహరణ.

శ్రీ శంకరుల పాఠం గురించి – ఇంతకుముందు చెప్పినట్లుగా శ్రీ భట్టులు 'నివృత్తాత్మా' అని చెప్పిన ఈ నాలుగు నామములకు శ్రీ శంకరుల పాఠం ఇలా ఉంది. 25, 64వ శ్లోకములు – నివృత్తాత్మా; 48వ శ్లోకము – విముక్తాత్మా; 83వ శ్లోకము – అనివృత్తాత్మా. ఇలా వ్యాఖ్యానకర్తలు పాఠాంతరాలు చెప్పడానికి మూడు కారణాలు ఉండవచ్చును.

(1) ఆయా వ్యాఖ్యానకర్తలకు కలిగిన ప్రత్యేక భగవదనుభవములు.

(2) తమ తమ సిద్ధాంతాలకు బలం చేకూర్చే వివరణలకు మరింత అవకాశం.

(3) పునరుక్తిదోష నివారణ.

శ్రీ శంకరులు చెప్పిన ఈ పాఠాలను పరిశీలిస్తే వానిలో ప్రత్యేకించి అద్వైతవాదం పెద్దగా కనుపించదు. కనుక 1వ మరియు 3వ కారణాలవల్ల ఈ పాఠాంతరాలు సంభవించి ఉండవచ్చును.

విముక్తాత్మా

- స్వభావసిద్ధంగా బంధాలు లేని (ముక్తుడైన) ఆత్మ. ఎందుకంటే ఆయన జన్మరహితుడు. కర్మప్రభావ రహితుడు.

- ఆత్మలను (జీవులను) విముక్తులు చేసేవాడు.

ఓం విముక్తాత్మనే నమః

శ్రీ శంకరులు 48వ శ్లోకంలో 'విముక్తాత్మా' అనే పాఠం చెప్పారు. ముచ్ - మోక్షణే - విడిపించుట, వదలుట, వి- (ఉపసర్గ). **స్వభావసిద్ధేన విముక్త ఆత్మా యస్య ఇతి విముక్తాత్మా**. స్వభావసిద్ధంగా, అనగా ఏ విధమైన కర్మఫలంగా కాకుండా, విముక్తుడైన ఆత్మ విముక్తాత్మ. భగవంతుడు జన్మరహితుడు. ఆయనకు కర్మఫలములంటవు. ఆయన త్రిగుణాతీతుడు. కనుక సదా విముక్తుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ ద్వైతసిద్ధాంతావలంబి. ఈయన కూడా 'విముక్తాత్మా' అనే పాఠం గ్రహించారు. కాని ఈయన చెప్పిన అర్థం భిన్నంగా ఉంది. **విముక్తా ఆత్మానో జీవా యేన ఇతి విముక్తాత్మా**. ఎవనివలనైతే జీవులు విముక్తులగునో అతడు (భగవంతుడు) విముక్తాత్మ.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'నివృత్తాత్మా', 'విముక్తాత్మా' అనే నామములకు భేదం లేదు. రెండింటి భావము ఒక్కటే.

ధర్మచక్రము రచయిత వివరణ – నాలుగు విధాలైన కర్మలున్నాయి: నిత్య, నైమిత్తిక, కామ్య, నిషిద్ధ కర్మలు. (1) నిత్యకర్మలు: ఉదాహరణకు త్రికాల సంధ్యావందనం. ఇవి తప్పక చేయాలి. వీటిని ఆచరిస్తే పుణ్యం రాదు. కాని ఆచరించకపోవడం పాపం. (2) నైమిత్తిక కర్మలు: ఉదాహరణకు ఏకాదశి ఉపవాసము. వీనిని ఆచరించడంవలన నిర్దిష్టమైన ఫలాలు లభిస్తాయి. (3) కామ్యకర్మలు: ఉదాహరణకు వ్రతాలు, యజ్ఞాలు. ప్రత్యేకమైన ఫలాన్ని ఆశించి చేసేవి. (4) నిషిద్ధ కర్మలు: చేయగూడనివి. భగవంతునికి ఏ విధమైన కర్మఫలాలు అంటవు. ఎందుకంటే ఆయనకు కావలసిన ప్రయోజనాలు లేవు. ఆయన అన్నిపనులనూ జీవులకొరకే చేస్తాడు.

అనివృత్తాత్మా

- దేనినుండీ మరలనివాడు.

ఓం అనివృత్తాత్మనే నమః

శ్రీ శంకరులు 83వ శ్లోకంలో ఈ పాఠాన్ని గ్రహించారు. **సర్వత్ర వర్తమానత్వాత్ స నివృత్తః కుతోఽపి అనివృత్తాత్మా**. భగవంతుడు అన్నిచోట్లా ఉంటాడు. కనుక ఆయన దేనినుండైనా దూరం కావడం లేదా వెనుదిరగడం అనేది ఎలా జరుగుతుంది? కనుక ఆయన అనివృత్తాత్మ.

781. దుర్జయః

- భక్తివల్ల తప్ప మరి దేనిద్వారాను జయింపరానివాడు.

- జయింపరానివాడు.

- దుఃఖమును జయించడానికి మనకు సాధ్యం చేసేవాడు.

- సమాధివంటి కష్టమైన ఆచరణలద్వారా చిక్కేవాడు.

ఓం దుర్జయాయ నమః

క్షీరసాగర మధనం. 1870 కాలపు చిత్రం. వికీపీడియానుండి

దుస్ (ఉపసర్గ); జీ - జయే - జయించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు భక్తివలన, భక్తిలో ఒక అంగమైన శరణాగతివలన మాత్రమే వశమగును. మరేవిధంగాను మనుషులకుగాని, దేవతలకుగాని లొంగడు.

శక్యా దేవ మనుష్యాద్యైః వశీకర్తుం న శక్యతే
అన్వేష్టుం వాపి యస్యస్యాత్ దుర్జయ స్పష్టవర్ణకః

దేవతలుగాని, మనుష్యులుగాని తమ శక్తిసామర్థ్యాలచేత ఆయనను వెతకడానికి, వశంచేసుకోవడానికి సాధ్యంకాదు గనుక ఆయన దుర్జయుడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. ఓం దుర్జయాయ నమః.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – శాస్త్రానుసారము భగవంతుని ఆదేశానుసారము వర్తించేవారి హృదయములందు భగవంతుడు దుర్జయరూపంలో స్థితుడైయుండును. కనుక అలాంటి సదాచారపరులు తప్పక విజయం సాధిస్తారు.

ఈ నామానికి, మరికొన్ని నామాలకు ఉన్న సారూప్యాన్ని మనం గమనించదగును.

అపరాజితః – 721వ నామము, 76వ శ్లోకము

అపరాజితః – 866వ నామము, 92వ శ్లోకము

అజితః – 553వ నామము, 59వ శ్లోకము

దుర్జయః – ఈ 781వ నామము, 83వ శ్లోకము

ఈ నామములకు శ్రీ భట్టులు సందర్భానుసారంగా ఇచ్చిన వ్యాఖ్యలను పరిశీలించుదాము.

(59-553) **అజితః** – ఈ నామము శ్రీ భట్టులు భగవంతుని శుద్ధసత్త్వస్వరూపునిగా వర్ణించే సందర్భంలో వచ్చింది. భగవంతుడు పరమపదంలో ఉంటాడు. పరమపదమునకు అజితా, అపరాజితా, అయోధ్యా వంటి పేర్లు కూడా ఉన్నాయి. అక్కడ సమస్తమూ శుద్ధసత్త్వమయమే. అక్కడ నశించే పదార్థము ఉండదు గనుక చావు పుట్టుకలు ఉండవు. కనుక భగవంతునికి అజితుడనే పేరు ఉంది.

(76-721) **అపరాజితః**, (83-781) **దుర్జయః** – ఈ రెండు నామములు శ్రీ భట్టులు భగవంతుని శ్రీకృష్ణ విభవావతారమును కీర్తించే సమూహంలో వస్తున్నాయి. కనుక శ్రీ భట్టులు 'అపరాజితః' అనగా 'పరాజయము రానీయనివాడు' అని అర్థం చెప్పి మహాభారత యుద్ధానికి సంబంధించిన ఉదాహరణలు చెప్పారు. ఇక ప్రస్తుత నామము 'దుర్జయః' అనగా, భగవంతుడు భక్తివల్ల మాత్రమే వశమౌతాడు. అదికూడా ఆయన దర్శనమివ్వాలనుకొన్నప్పుడే. అనగా మనంతట మనం ఆయనను వెదకాలంటే అది సాధ్యం కాదు.
యన్ న దర్శితవాన్ ఏష కస్తదన్వేష్టుమ్ అర్హతి.

(92-866) **అపరాజితః** – ఈ నామము శ్రీ భట్టులు భగవంతుని 'దుష్టనిగ్రహ గుణము'ను కీర్తించే సమూహంలో వస్తుంది. అనగా భగవంతుడు దుష్టులను శిక్షించేగుణం గురించిన నామములు. ఇక్కడ 'అపరాజితః' నామమునకు శ్రీ భట్టులు చెప్పిన అర్థము – భగవంతుడు అందరికీ, అన్నింటికీ ప్రభువు. ఆయనను ఎలాగైనా, ఎప్పుడైనా నిగ్రహించడం సాధ్యం కాదు. కేవలం భగవంతుని ఆశీస్సు ఉంటే మనకు ఎదురుండదు.
యస్య మంత్రీ చ గోప్తా చ సుహృచ్చైవ జనార్దనః
హైః త్రైలోక్యనాథః సన్ కిమ్ ను తస్య నిర్జితమ్ – మహాభారతము. ఉద్యోగపర్వము.
ఎవరికైతే శ్రీహరి రక్షకుడు, మిత్రుడు, శ్రేయోభిలాషిగా ఉంటాడో అలాంటివారికి జయించరానిది ఏముంటుంది?
ఇలా ఈ నాలుగు నామాలు భగవంతుని అపరాజితత్వాన్నే వివిధగుణానుభవాలతో నిరూపిస్తున్నాయి.

ఇక ఈ నామాలకు శ్రీ శంకరులు చెప్పిన అర్థాలు –

59వ శ్లోకము. **అజితః** – **కేనాప్యవతారేషు న జితః ఇతి అజితః**. ఏ అవతారములోను జయింపబడనివాడు అజితుడు.

76వ శ్లోకము. **అపరాజితః** – అంతఃశత్రువులైన కామాదులను, బాహ్యశత్రువులైన రాక్షసులను పూర్తిగా జయించినవాడు అపరాజితుడు.

ప్రస్తుత 83వ శ్లోకము. **దుర్జయః – జేతుమ్ న శక్యత ఇతి దుర్జయః**. ఎవరివల్లను ఆయనను జయించడం సాధ్యంకాదు కనుక ఆయన దుర్జయుడు.

92వ శ్లోకము. **అపరాజితః – శత్రుభిః న పరాజితః ఇతి అపరాజితః**. దేవతలుగాని, మానవులుగాని ఆయనను జయించలేరుగనుక ఆయన అపరాజితుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ ప్రస్తుత 'దుర్జయః' నామమునకు, **జేతుమ్ న శక్యః దుర్జయః** – అన్న భావమే కాకుండా మరొక వ్యాఖ్య కూడా ఇచ్చారు. **దుఃఖస్య జయో యస్మాత్ ఇతి దుర్జయః**. మనం దుఃఖాన్ని జయించడం సాధ్యం చేసేవాడు గనుక దేవుడు దుర్జయుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **దుః సాధేన సమాధినా జీయతే హృది వశీ క్రియతే ఇతి దుర్జయః**. సమాధివంటి క్లిష్టమైన సాధనలద్వారా వశమగువాడు దుర్జయుడు.

782. దురతిక్రమః

- అతిక్రమింప వీలుకానివాడు.
- సంసారదుఃఖమునుండి బయటపడడానికి భగవంతుడు తప్ప వేరే ఉపాయం లేదు.
- ఆయన ఆజ్ఞను ఉల్లంఘిస్తే కలిగే ఫలితాలగురించిన భయంవల్ల ఎవరూ ఆయన ఆజ్ఞను ఉల్లంఘించరు.
- దుఃఖములు ఆయన జోలికి పోవు.
- ఆయన ఆజ్ఞను అతిక్రమిస్తే దుఃఖం కలుగుతుంది.

ఓం దురతిక్రమాయ నమః

క్రమ - పదవిక్షేపే - అడుగువేయుట; అతిక్రమ - దాటుట, ఉల్లంఘించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – సంసారదుఃఖాన్ని దాటడానికి శ్రీమహావిష్ణువుతప్ప వేరే ఉపాయం లేదు.
అతిక్రమ్య స్వపన్మూలం సర్వేషాం ప్రాపకాంతరమ్
నాస్తీతి సర్వపాపఘ్నం స స్మృతో దురతిక్రమః
దేవతలకు, మానవులకు కూడా సకలపాపాలను హరించే తన పాదాలుతప్ప వేరొక గత్యంతరం లేదు అని ఆయన గురించి చెప్పబడినందున ఆయన దురతిక్రముడు. ఓం దురతిక్రమాయ నమః.
శ్రీ భట్టులు పెక్కు ఉదాహరణలు చెప్పారు –
యదా చర్మవదాకాశమ్ వేష్టయిష్యన్తి మానవః
తదా దేవమ్ అవిజ్ఞాయ దుఃఖస్యాన్తమ్ నిగచ్ఛతి – శ్వేతాశ్వరోపనిషత్తు 6.20

ఆకాశాన్ని చుట్టుముట్టి ఒక చిన్న తోలుసంచిలో ఉంచడం ఎంత అసంభవమో, దేవుడిని తెలుసుకోకుండా దుఃఖాన్ని దాటడం అంతే అసంభవం.

వాసుదేవమ్ అనారాధ్య కో మోక్షమ్ సమవాప్నుయాత్ – వాసుదేవుని ఆరాధించకుండా మోక్షము ఎవరికి లభిస్తుంది?

ని హి విష్ణుమృతే కాచిత్ గతిరన్యావిధీయతే
ఇత్యేవమ్ సతతమ్ వేదా గాయంతే నాత్ర సంశయః – లింగపురాణము 24.43
మోక్షానికి విష్ణువుతప్ప వేరుగతి లేదు అని వేదములు ఘోషిస్తున్నాయి. ఇందులో సందేహం లేదు.

శ్రీ వి.వి. రామానుజన్ కాకాసురవృత్తాంతాన్ని ఉదాహరించారు. ముల్లోకాలూ తిరిగినా కాకాసురునికి రాముడే గతి అయ్యాడు. హనుమంతుడిలా చెప్పాడు – శ్రీరాముడు ఎవరినైనా చంపాలని తలిస్తే ఇక వానికి ఇంద్రుడు కాని, బ్రహ్మకాని, రుద్రుడుకాని ముల్లోకాలలోనూ ఎవరూ రక్షణనివ్వలేరు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుని శాసనానికి ఎదురులేదు. ఆయన ఆజ్ఞను అతిక్రమించే ధైర్యం ఎవరికీ లేదు.
శ్రీ శంకరులు అందుకు చెప్పిన ఉదాహరణ –
భయాత్ అస్య అగ్నిస్తపతి భయాత్ తపతీ సూర్యః
భయైరింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః
ఆయన అంటే ఉన్న భయంవలన అగ్ని జ్వలించును. సూర్యుడు మండును. ఇంద్రుడు, వాయువు, ఐదవవాడైన యముడు ఆయన అంటే భయంతోనే తమతమ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

శ్రీ సత్యసంధ యతిరాజ – **దుఃఖస్య అతిక్రమో యస్య స దురతిక్రమః.** దుఃఖమును అతిక్రమించినవాడు దురతిక్రముడు. అనగా దుఃఖము ఆయనజోలికి పోదు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యో భాగవతమ్ నియమమ్ ఉల్లంఘుతే స శాశ్వత దుఃఖమేవ ఆప్నోతి ఇతి దురతిక్రమః.**
శ్రీ బలదేవ విద్యాభూషణ – **దుఃఖాదః అతిక్రమః శాసన ఉల్లంఘునమ్ అస్య ఇతి దురతిక్రమః.**
పైరెండు వ్యాఖ్యల అర్థమూ ఇంచుమించు ఒక్కటే. భగవంతుని శాసనాన్ని ఉల్లంఘించినందుకు దుఃఖం ఫలితం.

783. దుర్లభః

784. దుర్గమః

785. దుర్గః

786. దురావాసః

ఈ నాలుగు నామముల భావం ఇంచుమించు ఒకేలా ఉంటుంది.

దుర్లభః – అందడానికి కష్టమైనవాడు.

దుర్గమః – అందరానివాడు, కనరానివాడు, తెలియరానివాడు.

దుర్గః – ప్రవేశింప వీలులేనివాడు.

దురావాసః – ఆయన నివాసం మన కందడం కష్టం.

కనుక ఈ నాలుగు నామముల వ్యాఖ్యానంలోను శ్రీ భట్టులు, శ్రీ శంకరులు పునరుక్తిలేకుండా చెప్పినవైనం ఆసక్తికరంగా ఉంటుంది.

ఓం దుర్లభాయ నమః

ఓం దుర్గమాయ నమః

ఓం దుర్గాయ నమః

ఓం దురావాసాయ నమః

783. దుర్లభః

జితేంద్రియులైన భక్తులకు, తీవ్రమైన సాధనవలన మాత్రమే లభించువాడు.

ఓం దుర్లభాయ నమః

784. దుర్గమః

- ఆయన తీవ్రమైన ప్రకాశం కారణంగా ఆయనను సమీపించలేరు, చూడలేరు.
- ఆయన నిజస్వరూపాన్ని ఎంతో కష్టంద్వారానే తెలియవచ్చును.
- ఉపనిషత్తులు తదితర శాస్త్రాలలో చెప్పిన కష్టమైన అన్వేషణవల్లనే తెలియవచ్చువాడు.

ఓం దుర్గమాయ నమః

785. దుర్గః

- అవిద్య అనే దృఢమైన కోటవల్ల మనకు దూరమైనవాడు.

- సాధనలో ఎదురైయ్యే అనుకోని అనేక అవరోధాల కారణంగా మనకు తెలియడం కష్టమైనవాడు.

- దుష్టులైన రాక్షసులకు దుఃఖము, బాధ కలిగించేవాడు.

- మనం నేర్చుకోవడానికి కష్టమైన సామగానం ఆయనను కీర్తిస్తుంది.

ఓం దుర్గాయ నమః

786. దురావాసః

- ఆయన నివాసమైన శ్రీవైకుంఠం మనకు అందరానిది.

- ధ్యానమగ్నులైన యోగులకు కూడా ఆయన స్వరూపం మనస్సులో ఎక్కువసేపు నిలవదు.

- ఆయన అన్నిచోట్లా, అన్నింటా ఉన్నాడు గనుక ఆయన ప్రత్యేకంగా ఇక్కడుంటాడని చెప్పలేము.

- కనీస జీవనావసరాలు కూడా అందుబాటులో లేవనిపించే జీవుల ప్రాణాలుకూడా నిలిపేవాడు.

ఓం దురావాసాయ నమః

శ్రీ కృష్ణదత్త భరద్వాజ ఈ నాలుగు నామములనుగురించి సంక్షిప్తంగా ఇలా చెప్పారు – భగవంతుని ఆరాధించి కాంక్షించే భక్తులకు ఆయన అవరోధాలు తొలగించి ఎలాగో తన అక్కున చేర్చుకొంటాడు. దుష్టులకు మాత్రం ఆయన అందరానివాడు.

ఇప్పుడు ఈ నామములకు వివిధ వ్యాఖ్యాతల అనుభవాలను పరిశీలించుదాము.

శ్రీ భట్టుల వ్యాఖ్యలు –

భగవంతుడు అందడానికి కష్టమనేది ప్రధానమైన అర్థం. ఏదైనా వస్తువు లేదా స్థానాన్ని అందుకోవడానికి ఎలాంటి అవరోధాలు ఉండవచ్చును?

(1) ప్రయత్నించేవానిలో లోపాలు.

(2) దేనికోసం ప్రయత్నిస్తున్నామో ఆ వస్తువుయొక్క విశిష్టగుణాలు.

(3) యత్నించేవానికి, గమ్యానికి మధ్యనున్న అడ్డంకులు.

(4) గమ్యం అయిన స్థానంవల్ల కలిగిన పరిమితులు.

ఈ నాల్గువిధాలైన పరిమితులు ఆధారంగా శ్రీ భట్టులు ఈ నాల్గు నామాలను వ్యాఖ్యానించారు.

783. దుర్లభః

లభ్ – ప్రాప్తౌ - అందుకొనుట. **అజితేంద్రియ దుష్ప్రాప్తో దుర్లభః స చ కథ్యతే.** ఇంద్రియాలను జయించనివారికి అందనివాడు దుర్లభుడు. అనగా జితేంద్రియులకు మాత్రమే దేవుడు అందుతాడు. ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణలు:

తస్యాప్యన్యమనస్కస్య సులభో న జనార్దనః (విష్ణుధర్మము 73.6). భగవంతుడు కాక ఇతర విషయాలపై మనసు పెట్టినవారికి జనార్దనుడు సులభుడు కాడు.

అప్రాప్యః కేశవో రాజన్! ఇంద్రియైః అజితై నృణామ్ (మహాభారతము. ఉద్యోగపర్వము 7.8.21). ఓ రాజా! ఇంద్రియములను అదుపులో పెట్టుకోలేని మానవులకు కేశవుడు లభించడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ చెప్పిన ఉదాహరణ –

జన్మాంతర సహస్రేషు తపోదాన సమాధిభిః

నరాణామ్ క్షీణపాపానామ్ కృష్ణే భక్తిః ప్రజాయతే.

అనేక జన్మల అనంతరం, తపస్సు, దానము, సమాధివంటి సాధనలవలన, పాపములు క్షీణించుటవలన నరులకు కృష్ణునిపై భక్తి కలుగుతుంది.

784. దుర్గమః

నేత్రదుర్బలానామ్ ఇవ మధ్యాహ్న భాస్కరః

అప్రదృశ్య తేజః దండా పూపికయో దుర్గమః

బలహీనమైన కన్నులున్నవాడు మధ్యాహ్నసూర్యబింబాన్ని చూడలేనట్లే, బలహీనమైన మనస్సున్నవారు వేలసూర్యుల తేజస్సుగల భగవంతుని తెలుసుకొనలేరు. ఇక్కడ శ్రీ భట్టులు 'దండపూపికా న్యాయము'ను ప్రస్తావించారు. ఒక గదిలో పుల్లకు మిఠాయి గుచ్చిఉందనుకోండి. ఎలుకలు ఆ పుల్లను తినివేశాయంటే ఇక మిఠాయినికూడా ఎలుకలు తినివేసి ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు.

నేత్రదుర్బల వృత్తీనాం మధ్యాహ్న ద్యుమణేర్యథా

ప్రాప్తిర్దుష్కర తేజస్త్వాత్ దుర్గమః పరికీర్తితః

నేత్రదృష్టి బలంగా లేనివారు మధ్యాహ్నపు సూర్యుని చూడలేరు. అలాగే అత్యంత కాంతివంతుడైన సర్వేశ్వరుని ఎవరూ చూడలేరు. అలా ఆయన దుర్గముడు.

785. దుర్గః

అవిద్యాః ఆవరణైః దుష్ప్రవేశ్చ దుర్గః. కోటచుట్టూ అగడ్తలు ఉన్న కారణంగా మనకు కోటలో ప్రవేశించడం కష్టం అవుతుంది. అలాగే భగవంతునికీ, మనకూ మధ్య అడ్డంకిగా అవిద్య ఉంది. దాన్ని ఛేదించి భగవంతుని చెంత చేరడం చాల కష్టం.

దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా

మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే – గీత 7.14

నా మాయ త్రిగుణాత్మకమైనది. అలౌకికమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని కేవలము నన్నే నిరంతరము భజించువారు ఈ మాయను అధిగమించి సంసార సముద్రమునుండి బయటపడగలరు.

సత్యమును ఇంద్రియములద్వారాను, మనస్సుద్వారాను, బుద్ధిద్వారాను తెలిసికొనలేమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. **యతో వాచో నివర్తన్తే** (తైత్తరీయ 2.9.1)

786. దురావాసః

భగవంతుని పరమపదము మనకు అందరానిదని శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు. **ఏవం చ దూరే దుష్కరః తత్పద ఆవాస ఇతి దురావాసః.**

దుష్కరావాసభూమిత్వాత్ దురావాస ఇతీరితః

దురారిణస్తు దుర్మార్గా మనస్తాన్నిహంతి యః

పాపులకు దుర్లభమైన నివాసము కలవాడు దురావాసుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు –

783. దుర్లభః

దుర్లభయా భక్త్యా లభ్యత ఇతి దుర్లభః. ఎంతో అసాధారణమైన భక్తిద్వారా మాత్రమే లభించువాడు దుర్లభుడు. ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన ఉదాహరణలు –

జన్మాంతర సహస్రేషు తపో జ్ఞాన సమాధిభిః

నరాణామ్ క్షీణపాపానామ్ కృష్ణే భక్తిః ప్రజాయతే

వేలాది జన్మలో సాగించిన తపస్సు, జ్ఞానము, సమాధివంటి వానివలన పాపము క్షీణించి నరులలో కృష్ణునిపట్ల భక్తి జనించును.

పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా

యస్యాంతఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ – గీత 8.22

ఓ పార్థ! సమస్త భూతములు (ప్రాణులు) ఆ పరమాత్మయందే అంతర్గతములైయున్నవి. ఆ సచ్చిదానంద ఘన పరమాత్మ చేతనే ఈ జగత్తంతయు వ్యాప్తమై (పూర్ణమై)యున్నది. అట్టి సనాతన, అవ్యక్త పురుషుడు అనన్య భక్తి ద్వారా మాత్రమే లభ్యుడగును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి కఠోపనిషత్తు (1.2.7)నుండి ఉదాహరించారు.

శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః శృణ్వతోపి బహవో యమ్ న విద్యః

ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః
దానిని గురించి వినడంకూడా ఎందరికో సాధ్యం కాదు. విన్నవాళ్ళలో కూడా కొద్దిమందే దానిని అర్థం చేసుకోగలరు. అది ఉపదేశించడానికి మంచి గురువు కానీ, ఉత్తముడైన శిష్యుడు కానీ దొరకడం చాలా కష్టం. తగిన గురువునుండి దానిని తెలిసికోవడం అద్భుతం.

784. దుర్గమః

దుఃఖేన ఆయాసేన గమ్యతే, జ్ఞాయతే, జ్ఞాప్యతే వా దుర్గమః. చాలా కష్టంమీద తెలియవచ్చేవాడు దుర్గముడు. శ్రీ శంకరుల వ్యాఖ్యలో గమనించదగిన విషయం – 'దుర్లభః' నామమునకు 'లభ్యత' (అనగా, లభించేవాడు) అనే పదాన్ని, 'దుర్గమః' నామానికి 'జ్ఞాయత' (అనగా, తెలియవచ్చేవాడు) అనే పదాన్ని వాడారు. భగవంతుడు భక్తిద్వారా లభిస్తాడు. శాస్త్రపఠనాదుల ద్వారా తెలియవస్తాడు. రెండూ కష్టమైనవే.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుని గురించి శ్రవణం, మననం, నిధిద్యాసనం అన్నీ కష్టమైనవే. **నాఽయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహుధ్నా శ్రుతేన** (కఠోపనిషత్తు 1.2.23).

785. దుర్గః

అంతరాయ ప్రతిహత్యైః దుఃఖాత్ అవాపయత ఇతి దుర్గః. భగవంతుని చేరుకోవడానికి అనేక అంతరాయములు ఉంటాయి. వాటిని అధిగమిస్తేనే ఆయనను చేరుకోవచ్చును.

786. దురావాసః

దుఃఖేన ఆవాసయతే చిత్తే యోగిభిః సమాధౌ ఇతి దురావాసః. యోగులకు కూడా ఆయనను ఎప్పుడూ చిత్తంలో నిలుపుకోవడం సాధ్యం కాదు. అలా ఆయన దురావాసుడు.
శ్రీ చిన్మయానంద గీత (6.33)నుండి ఉదాహరించారు –

యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్
ఓ మధుసూదనా! సమభావమునుగూర్చి నీవు చెప్పిన ఈ యోగముయొక్క స్థిరస్థితిని మనశ్చాంచల్య కారణమున తెలిసికొనలేకున్నాను.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **దుస్సాధ్యా ప్రపత్యా వాస్యతే హృది ఇతి దురావాసః**. కష్టమార్గమైన ప్రపత్తి ద్వారానే మనసులో నిలిచేవాడు దురావాసుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – భగవంతుడు పొందడానికీ, తెలుసుకోవడానికీ, చేరుకోవడానికీ, నిలుపుకోవడానికీ కష్టమైనవాడు. కాని నిజమైన భక్తునికి సులభుడు. ఈ భావంలో శ్రీ కృష్ణదత్తభరద్వాజ ఈ నాలుగు నామాలనూ ఇలా వ్యాఖ్యానించారు.

783. **<u>దుర్లభః</u> – దుఃఖేన లభ్యో మృదువేగ ఆరాధకైః ఇతి దుర్లభః**. కొద్దిపాటి యత్నంతో ఆయనను ఆరాధించేవారికి లభించడం కష్టమైనవాడు దుర్లభుడు.

784. **<u>దుర్గమః</u> – దుఃఖేన ఆయాసేన గమ్యతే జ్ఞాయయతే మంతమతిమాద్భిః ఇతి దుర్గమః**. బుద్ధిమంతులు కాకుండా ఆయనను అన్వేషించేవారికి ఆయన తెలియరాడు గనుక దుర్గముడు.

785. **<u>దుర్గః</u> – దుఃఖేన గమ్యతే ప్రాపయతే అ-తీవ్ర సంవేగైః ఇతి దుర్గః**. తీవ్రమైన ఉద్వేగం లేకుండా ఆయనకోసం యత్నించేవారికి అందరానివాడు దుర్గుడు.

786. **<u>దురావాసః</u> – దుఃఖేన ఆవాసయతే హృద్యే అసమాహితైః ఇతి దురావాసః**. ధ్యానంలో నిమగ్నులు కానివారికి హృదయంలో నిలవడు గనుక ఆయన దురావాసుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ, ఇతరుల వ్యాఖ్యలు –

<u>783. దుర్లభః</u>

శ్రీ వాసిష్ఠ – భగవానుడు అన్నింటా, అంతటా ఉన్నాడు. మనందరిలో ఉన్నాడు. మన ప్రతిపని వెనుకా అసలు శక్తి ఆయనే. అయినాగాని ఆయన స్వరూపం తెలుసుకోవడం అసాధ్యం. జీవుడికి తన జనన మరణాల గురించే తెలియదు. ఇక భగవంతునిగురించి ఏమి తెలుస్తుంది? మార్కండేయునివంటి చిరంజీవులకే భగవంతునిగురించి సంపూర్ణంగా తెలియలేదు. కనుక భగవంతుడు దుర్లభుడు.

<u>784. దుర్గమః</u>

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుని గుణాలు ఆయన సృష్టిలో ప్రతిబింబిస్తుంటాయి. భగవంతుడు మనందరిలోను మనతో ఉన్నాగాని అందనంత దూరంలో ఉన్నాడు. అలా ఆయన దుర్గముడు. ఈ శరీరంనుండి జీవుడు బయటకు పోయేటపుడు శరీరాన్ని వెంట తీసికొని వెళ్ళలేడు. దుర్గమత్వానికి ఇది ఒక ఉదాహరణ.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **దుః సాధేన ఉపనిషద్ విచారేణ గమ్యతే బుధ్యతే ఇతి దుర్గమః**. ఉపనిషత్తుల అధ్యయనం, విచారణ అనే కష్టమైన మార్గంద్వారా తెలియవచ్చేవాడు దుర్గముడు.

<u>785. దుర్గః</u>

శ్రీ వాసిష్ఠ – భగవంతుడు అనంతుడు. ప్రయత్నించే శక్తినిబట్టి ఆయనగురించి మరికొంత తెలిసికోవచ్చును గాని సంపూర్ణంగా తెలుసుకోవడం సాధ్యం కాదు. మానవుల అంతఃకరణలే వారి పరిమితులు.

శ్రీ సత్యసంధ యతిరాజ – **దుర్గో దుఃఖమ్ గమయతి దైత్యాన్ ప్రతి ఇతి దుర్గః**. దుష్టులైన రాక్షసులకు దుఃఖం కలిగించేవాడు 'దుర్గః'.

శ్రీ బలదేవ విద్యాభూషణ – గై - శబ్దే - పాడుట. తెలుసుకోవడానికి కష్టమైన సామగానం ఆ దేవునిగురించి కీర్తిస్తుంది.

786. దురావాసః

శ్రీ వాసిష్ఠ – భగవంతుడు అన్నిచోట్లా, అన్నింటా ఉంటాడు. కనుక ఆయన నివాసం ఇది అని చెప్పడం సాధ్యం కాదు. **అంతరిక్షమ్ ఉతోదరమ్ దివమ్ యశ్చక్రే మూర్ధానమ్ తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః** (అధర్వ వేదము 10.7.32). బ్రహ్మమునకు భూమియే పీఠము. గాలి ఉదరము. ఆకాశమే శిరస్సు. అట్టి బ్రహ్మమునకు నమస్కారము.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – **దుర్గతమపి ప్రాణివర్గమ్ యథావ్యవస్థమ్ దుఃఖమ్ అనుభవంతమ్ ఆవాస్యతి ఇతి దురావాసః**. నీరు, గాలివంటి కనీస జీవనావసరాలుకూడా అందుబాటులో లేని ప్రాణుల జీవనానికి కూడా తగు వ్యవస్థను ఏర్పాటు చేసినవాడు దురావాసుడు.

787. దురారిహా

- దుష్టులైన శత్రువులను నశింజేయువాడు.
- భక్తులమనస్సులలో దురాలోచనలను నశింపజేయువాడు.

ఓం దురారిఘ్నే నమః

787నుండి 810వరకు నామములను శ్రీ భట్టులు బుద్ధావతారపరంగా వ్యాఖ్యానించారు.

దుర్ - ఆ - అరి - హా = చెడు - సంపూర్ణముగా - శత్రువులను - నాశనం చేయుట.

దుఃఖమ్ సమంతాత్ అర్పయతి ప్రాపయతి ఇతి దురారి, దురారిః తాన్ హన్తి ఇతి దురారిహా. దుఃఖము కలిగించేవారు చెడుశత్రువులు. అలాంటి చెడుశత్రువులను పూర్తిగా నాశనం చేసేవాడు 'దురారిహా'.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు దుష్టులైన అసురులను వేదవిముఖులను చేసి వారిని బలహీనులను చేస్తాడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణము (3.18.34)నుండి ఉదాహరించారు.

మాయామోహేన తే దైత్యాః ప్రకారైః బహుభిః సదా
వ్యుత్థాపితా యథా నైషాం త్రయీమ్ కశ్చిత్ ఆరోచయత్
హతాశ్చ తేఽసురా దేవైః సన్మార్గ పరిపంథినః

అసురులను అనేక రకాలుగా మోహింపజేయగా వారందరూ వేదమార్గమును వదలి భ్రష్టులయ్యారు. సాధుమార్గ విరోధులయ్యారు. అప్పుడు వారు సులభంగా దేవతలచే చంపబడ్డారు.

ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయం – వేదానుష్ఠానంవలన రాక్షసులు కూడా సత్ఫలితాలను పొంది బలవంతులౌతారు. రావణాదులు తపస్సు, యాగమువంటి కార్యములద్వారా శక్తిమంతులై లోకాలను బాధించారు. అలాంటప్పుడు భగవంతుడు యుక్తితో వారిని పెడత్రోవ పట్టించి వేదాలనుండి విముఖులను చేశాడు.

మాయామోహోయోఽయమ్ అఖిలాన్ దైత్యాన్సాన్ మోహయిష్యతి
తతోవధ్యా భవిష్యన్తి వేదమార్గ బహిష్కృతః
స్థితౌ స్థితస్య మే వధ్యా యావంతః పరిపంథినః
బ్రహ్మణో యేఽధికారస్య దేవదైత్యాదికాః సురాః – విష్ణుపురాణము 3.17.42,43
నా మాయామోహమయమైన రూపము దైత్యులను మోహితులను చేస్తుంది. వారు వేదమార్గమునుండి వైదొలగుతారు. అప్పుడు వారిని తేలికగా హతం చేయవచ్చును. ఎందుకంటే రాక్షసులుగానీ, దేవతలుగానీ, ఇతరులుగానీ వేదములకు వ్యతిరేకమైనవారు నా శక్తికారణంగా నశిస్తారు. లోకరక్షణార్థం నేనిలా చేస్తాను.

ఈ వ్యాఖ్య సందర్భంగా శ్రీ భట్టులు ప్రత్యేకంగా బుద్ధావతారాన్ని పేర్కొన్నారు. **ఇదమ్ దౌర్లత్యమ్ అప్రాపిసు పాపవిషయే ప్రయచ్ఛన్ బుద్ధావతారమ్ నియచ్ఛతి దురారి-హా.** (787నుండి 810వరకు నామములను శ్రీ భట్టులు బుద్ధావతారపరంగా వ్యాఖ్యానించారు.)

శ్రీ వి.వి. రామానుజన్ తిరువైమొళి (5.10.4)నుండి ఉదాహరించారు – నీవు బుద్ధాది అవతారాలలో అవైదిక ధర్మాన్ని బోధించడం, అమృతాన్ని పంచే విషయంలో మోహినిగా సురులను మోహింపజేయడం – ఇవన్నీ నా హృదయాన్ని కరిగిస్తాయి. స్వామీ! నీవీ పనులను ఎందుకు చేస్తున్నావు?

స్వామి దేశికన్ దయాశతకము 47 – **మాయాశాస్త్రాణ్యపి దమయితుమ్ త్వత్ప్రపన్న ప్రతీపాన్**. నీ భక్తుల శత్రువులను అదుపులో ఉంచడంకోసం నీవు మాయా శాస్త్రాన్ని కూడా పుట్టించావు.

కౌషీతకీ ఉపనిషత్ 3.9 – **ఏష ఉ ఏవైనమ్ అసాధుకర్మ కారయతి తమ్ యమధో నినీషతే**. ఆయన వారిని సత్కర్మలనుండి దూరంచేసి వారి నాశనానికి కారణమౌతాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – దురారి అనగా మన మనస్సులో ఉన్న దురాలోచనలు. **దుర్మతిః తామ్ హన్తి ఇతి దురారిహా.** భగవంతుని శరణుజొచ్చితే దురాలోచనలను నాశనం చేస్తాడు. **తత్సవితుర్వరేణ్యమ్ భర్గో దేవస్య**

ధీమహి ధియో యో నః ప్రచోదయాత్. అనే మంత్రం ద్వారా మనం మన దురాలోచనలను హరించేలా పూజ జరుపుతున్నామని శ్రీ వాసిష్ఠ సూచించారు.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు కరుణామయుడై మనలోని రాక్షస భావాలను నాశనం చేస్తాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **డోలయతే ఉత్క్షేపయతే ధర్మమార్గోయైః తే దులాః, దేలా ఏవ దురాః, తే ష అరయః ఇతి దురారయః, తాన్ హన్తి దురారిహా.** (దులా - ఉత్క్షేపే - చలించుట, ఊగుట). ధర్మమార్గమును భ్రష్టుపట్టించేవారు శత్రువులు. అలాంటి శత్రువులను నాశనం చేసేవాడు 'దురారిహా'.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **దుష్టారిమ్ ప్రతిగచ్ఛన్తి ఇతి దురారిణః కామాదయః తాన్ హతవాన్ ఇతి తత్ర సాహాయ్యకారిత్వాత్ న అతికష్టమ్ ఇతి అర్థః.** భగవంతుని దయవలన కామాది శత్రువులను జయించడం కష్టంకాదు అని అర్థం.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శుభాంగో లోకసారంగః సుతంతుస్తంతువర్ధనః |
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాగమః || (84)

788. శుభాంగః

- అసురులను మోహించి, వంచించేంత సమ్మోహనకరమైన రూపం కలిగినవాడు.
- నిజమైన భక్తులు ఆయన దివ్యమంగళ విగ్రహాన్ని ధ్యానిస్తారు.
- భక్తితో సాధన చేసేవారికి అష్టాంగయోగమును సఫలం చేసేవాడు.
- అందమైన నడక కలవాడు.
- తన సుందర మంగళ రూపంతో అంతటా సదా వ్యాపించినవాడు.
- విశ్వంలో అన్నింటినీ అందంగా నడిపేవాడు.
- శాస్త్రములపట్ల, గురువచనములపట్ల విశ్వాసంలాంటి శుభగుణాలను తన భక్తులకు కలుగజేసేవాడు.

ఓం శుభాంగాయ నమః

ఈ నామం రెండుమార్లు వస్తుంది.

63వ శ్లోకము. 593వ నామము. శుభాంగః – **శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః**

84వ శ్లోకము. 788వ నామము. శుభాంగః – **శుభాంగో లోకసారంగః సుతంతుః తంతువర్ధనః**

'అంగము' అనగా ఏదైనా విషయంలో ఒక భాగం, శరీరంలోని ఒక అవయవము, ముఖ్యమైన విషయం – ఇలా అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్యలు –

63వ శ్లోకము. 593వ నామము. **శుభాంగః** – భక్తుల అర్హతలనుబట్టి వారికి భగవంతుడు ఫలములను ప్రసాదించు గుణమును కీర్తించే నామముల సందర్భంలో శ్రీ భట్టులు ఈ నామాన్ని వ్యాఖ్యానించారు. ఇక్కడ 'అంగము' అనగా 'భాగము' అన్న అర్థంలో, భక్తులకు భక్తిసాఫల్యం నిమిత్తం అష్టాంగయోగ మార్గమును ప్రసాదించినవాడు శుభాంగుడు.

84వ శ్లోకము. 788వ నామము. **శుభాంగః** – ఈ నామమును శ్రీ భట్టులు బుద్ధావతారపరంగా చెప్పారు. అసురులను సమ్మోహనపరచి, వారిని పెడమార్గంలో నడిపించడం ఎలా? **కథమ్ తాన్ అనుప్రవిష్టః? శుభాంగః.** అన్నివిధాల వారిని నమ్మించే రూపంతో.

మాయామోహన వేషేణ విప్రలభ్యాసురానపి
అనుప్రవిష్టస్తాక్యేసా శుభాంగ ఇతి కథ్యతే

రాక్షసులతో నమ్మదగినవాడు అనిపించుకొని, మంచివేషంలో వారిని వంచించి, వారిలో ప్రవేశించివారిని మోసము చేసేవాడు. శుభాంగుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు –
63వ శ్లోకములో **శుభాంగః** – **సుందరీమ్ తనుమ్ ధారయన్ శుభాంగః.** సుందరమైన శరీరము ధరించినవాడు శుభాంగుడు.

84వ శ్లోకములో **శుభాంగః** – **శోభనైః అంగైః ధ్యేయత్వాత్ శుభాంగః.** శుభకరమైన అంగములు కలిగియున్న రూపముతో ధ్యానింపబడువాడు శుభాంగుడు.

ఇలా 84వ శ్లోకంలోని 'శుభాంగః' నామమును శ్రీ భట్టులు కపటవేషంగాను, శ్రీ శంకరులు భక్తులు ధ్యానించే రూపంగాను వ్యాఖ్యానించారు. భక్తుల శత్రువులను నాశనం చేయడానికొకటి, భక్తుల ధ్యానంకొరకు మరొకటి అనుకోవచ్చును.

రామాయణం బాలకాండలో వాల్మీకి నారదుడిని ఇలా అడిగాడు – ఈ ప్రపంచంలో గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్యము కలవాడు, దృఢవ్రతుడు ఎవరు? అందుకు జవాబుగా నారదుడు చెప్పిన మూడు శ్లోకాలు. బాలకాండ 1-9, 10, 11:

బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రుబర్హణః
విపులాంసో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః
మహోరస్కో మహేష్వాసో గూఢజత్రుః అరిందమః
ఆజానుబాహుః సుశిరః సులలాటః సువిక్రమః
సమస్సమవిభక్తాంగః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః

(శ్రీమాన్ ఎస్.టి.పి.వి. కోనప్పాచార్యులుగారి అనువాదము): అతడు ప్రశస్తమయిన బుద్ధి గలవాడు. నీతి గలవాడు. ఉత్తమమయిన మాటలు గలవాడు. అఖండమైన ఐశ్వర్యము గలవాడు. శత్రువులను వధించువాడు. ఉన్నతములగు మూపులు గలవాడు. గొప్ప చేతులు గలవాడు. శంఖమువంటి కంఠము గలవాడు. ఉన్నతమయిన చెక్కిళ్ళు గలవాడు. అతడు విశాలమగు రొమ్ము గలవాడు. గొప్ప ధనుస్సు గలవాడు. కండచే బలిసి కనబడనట్టి మూపుల సంధి ఎముకలు కలవాడు. శత్రువుల నణగద్రొక్కువాడు. మోకాలివరకు పొడవయిన చేతులు గలవాడు. మంచి లక్షణములతో కూడిన శిరస్సు కలవాడు. శుభలక్షణములు గల నుదురు గలవాడు. శోభనమగు నడక గలవాడు. అతడు మిక్కిలి పొడుగుగాని, పొట్టిగాని కాక సమమయిన శరీరము గలవాడు. హెచ్చుతగ్గులు లేక సమముగా విభజింపబడిన అవయవములు గలవాడు. మెరుగుతోకూడిన వన్నెగలవాడు. గొప్ప పరాక్రమము కలవాడు. బలిసిన రొమ్ముగలవాడు. విశాలమగు నేత్రములు గలవాడు. ప్రశస్తమయిన కాంతిగలవాడు. మంగళకరమగు లక్షణములు గలవాడు.

సుందరకాండము 35వ సర్గము 9నుండి 22వ శ్లోకము వరకు హనుమంతుడు శ్రీశుభాంగుడైన శ్రీరాముని అందమును సీతమ్మకు వర్ణించి చెప్పెను. ఇందుకు ఒక కారణము తాను నిజమైన రామదూతనని సీతకు నమ్మకము కలిగించుటకు. మరొక కారణము శ్రీరాముని వర్ణనము సీతమ్మకు ఆనందకరము.

శ్రీ బలదేవ విద్యాభూషణ –

శుభాని దర్శకానామ్ మంగళోత్పాదకాని అంగాని

చరణ వదన నయనాదీని యస్య ఇతి శుభాంగః

భగవంతుని పాదములు, ముఖము, కన్నులు, సమస్త అంగములు ఆయనను ధ్యానించేవారికి శుభకరములు గనుక ఆయన శుభాంగుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ 'అగి' - గతౌ - వెళ్ళుట – అనే ధాతువు ఆధారంగా మూడు అర్థాలు చెప్పారు –

(1) **శోభమానో అంగతి - గచ్ఛతి యః స శుభాంగః.** సుందరమైన నడక గలవాడు శుభాంగుడు. (శ్రీరంగం పెరుమాళ్ళు ఉత్సవంలో సింహగతి, గజగతివంటి నడకల ప్రదర్శన ఉంటుంది.)

(2) **అంగనమ్ - సర్వకాలికమ్ సార్వదేశికమ్ చ వ్యాపనమ్; శుభమ్ అంగనమ్ యస్య స శుభాంగః.** తన శుభకరమైన రూపంతో అంతటా వ్యాపించి ఉండేవాడు శుభాంగుడు.

(3) **శోభాయన్ జగత్ గమయతి ఇతి శుభాంగః.** జగత్తును చక్కగా నడిపించువాడు శుభాంగుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – అంగయతి - కలిగించును, అనే అర్థంలో,

శుభాని గురుశాస్త్రోక్త విశ్వాస స్వప్న ఆస్వాసన

లక్షణాని అంగయతి ఉత్పలంభయతి ఇతి శుభాంగః

శాస్త్రములపట్ల విశ్వాసము, గురువులపట్ల విశ్వాసమువంటి శుభలక్షణాలను తన భక్తులకు భగవంతుడు కలిగించును గనుక ఆయన శుభాంగుడు.

789. లోకసారంగః

- లోకంలో మనడానికి పైపై మార్గాలు (భోగ, మోక్ష మార్గాలు) ఉపదేశించినవాడు (లోకసారము చెప్పినవాడు).
- పూవులలోని మకరందాన్ని తుమ్మెద (సారంగము) గ్రహించినట్లుగా లోకసారము తెలిసినవాడు.
- వేదముల సారమైన ప్రణవముద్వారా పొందదగినవాడు.
- భక్తిచే ఆకర్షితుడైనవాడు.
- మోక్షమునిచ్చువాడు. జ్ఞానులు ఆయనను కోరుకుంటారు.
- భక్తులు ఆయన శుభగుణములను కీర్తించెదరు.

ఓం లోకసారంగాయ నమః

ద్వారకాతిరుమలలో బుద్ధుని విగ్రహం
వికీపీడియానుండి



శ్రీ భట్టుల వ్యాఖ్య – **లోకే యత్ సారమ్ తత్ గచ్ఛతి ఇతి లోకసారంగః**. వేదాలకు దూరమైనది, మరియు లోకజీవనానికి తగినది అయిన తాత్కాలికవిధానము (లోకసారము – భోగము, మోక్షము) బోధించినవాడు లోకసారంగుడు. రెండే విషయాలు ముఖ్యమని ఆయన (బుద్ధావతారంలో) బోధించాడు. (1) జీవితం ఆనందంగా గడపడం (2) చివరిలో మోక్షం పొందడం. **కురుష్వమ్ మమ వాక్యాని యది ముక్తిమ్ అభీష్ట థ** (విష్ణుపురాణము 3.18.5). ముక్తి కావాలంటే నా మాటల ప్రకారం నడవండి. బుద్ధావతారం గురించి పూర్తి అవగాహన కొరకు విష్ణుపురాణము 3.17, 318 అధ్యాయాలు చదవాలి (అని శ్రీ కృష్ణమాచారి వ్రాశారు)

న్యాయానపేతం యత్సారం భోగ నిర్వాణ వర్త్మ చ
లోకే తదచ్ఛతి సదా లోకసారంగ ఈరితః

రాక్షస సంహారానికి తగినటువంటి న్యాయమైన భోగ, మోక్ష సాధనాలు తెలిసినవాడు లోకసారంగుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువిరుత్తమ్ 96 – నిన్ను ఆరాధించుట కొరకు నీవే అనేక మార్గాలు ప్రసాదించావు. వాటిలో కొన్ని పరస్పర విరుద్ధమైనవి కూడాను. నీవే అనేక దేవతలను సృష్టించావు. కాని ఎవరూ నీకు సరిరారు.

శ్రీ వెంకటస్వామి రెడ్డియార్ – ఈ అనేక మార్గాలలో కొన్ని ప్రత్యేకించి రాజస తామస ప్రవృత్తి కలిగినవారికోసం ఉద్దేశింపబడ్డాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు – శ్రీ శంకరులు 'లోక-సార-అంగ' అనే పదవిభజన ఆధారంగా రెండు అర్థాలు చెప్పారు.

(1) **లోకానామ్ సారమ్ సారంగవత్ భృంగవత్ గృహ్ణాతి ఇతి లోకసారంగః**. లోకముల సారమును సారంగము అనగా తుమ్మెదవలె గ్రహించువాడు లోకసారంగుడు.

(2) **లోక సారః ప్రణవః, తేన ప్రతిపత్తవ్య ఇతి లోకసారంగః**. లోకముల సారము ప్రణవము (వేదముల సారము). అట్టి ప్రణవము ద్వారా అందువాడు లోకసారంగుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ రెండు అర్థాలు చెప్పారు – లోక్ - దర్శనే - చూచుట; శృ - గతౌ - వెళ్ళుట; అంగ - వెళ్ళుట. పాణిని సూత్రము 3.3.17 ప్రకారము 'సారః' అనగా ఒకేచోట ఉంటూ (కదలకుండా ఉంటూ) వెళ్ళేది (శృ-స్థిరౌ). ఉదాహరణకు చందన సారము. **స్థిరో భవతి ఇతి సారః**. కాలంతో కదలనిది సారము, అనగా భక్తి అని శ్రీ వాసిష్ఠ వివరించారు. **లోకే సారో భగవతి ప్రేమా**. ఇలాంటి నిశ్చలమైన భక్తి భగవంతునివైపే వెళుతుంది. **లోకసారంగః, లోక సారః తద్ గచ్ఛతి - ప్రాప్నోతి, తత్ ప్రతి ఆకృష్టో భవతి ఇతి లోకసారంగో విష్ణుః**.
(1) లోకసారమైన భక్తికి లక్ష్యమైన విష్ణుభగవానుడు లోకసారంగుడు.
(2) భక్తిపట్ల ఆకర్షింపబడే విష్ణుభగవానుడు లోకసారంగుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – లోక - సః - రంగః లోకసారంగః; సన్ - దానే - ఇచ్చుట; రంజ్ - రాగే ఇష్టపడుట. **లోకమ్ వైకుంఠాది లోకమ్ సనోతి దదాతి ఇతి లోక సాః, రంజయతే జ్ఞానినః అత్ర ఇతి రంగః, లోక సాః అసౌ రంగశ్చ ఇతి లోకసారంగః**. లోకము అనగా వైకుంఠమును ఇచ్చువాడు 'లోక సాః'. మరియు జ్ఞానులు అట్టి ఎవరిపట్ల భక్తి కలిగియుందురో అతడు లోకసారంగుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – 'సారంగము' అనగా శంఖము, ఒక సంగీత వాయిద్యము అనే అర్థాలు కూడా ఉన్నాయి. **లోకాః హరిభక్తజనాః సారంగా మోనోద్వతద్ గుణా గాయకా యస్య స లోకసారంగః**. హరిభక్తులు (లోకులు) ఎవరి మంగళగుణాలను కీర్తిస్తారో అతడు లోకసారంగుడు.

790. సుతన్తుః

- అసురులను పట్టి బంధించి ఉంచడానికోసం బలమైన త్రాళ్ళున్న వల కలిగియున్నవాడు.
- తననుండి విశ్వమును విస్తరింపజేసినవాడు.
- బ్రహ్మవంటి ఉత్తమ సంతానము కలిగినవాడు.
- యాదవవంశంలో పుట్టి ఆ వంశాన్ని వర్ధిల్లజేసినవాడు.

ఓం సుతన్తవే నమః

'సు' అనేది ఉపసర్గ. 'తన్తు' పదము 'తను' అనే ధాతువునుండి వచ్చింది. తను - విస్తారే - వ్యాపించుట, వెళ్ళుట. 'తన్తు' అనగా దారము, తీగ వంటి అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'తన్తు' అనగా 'దారముల వల' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. దుష్టులను వశపరచుకోవడానికి, వారిని పట్టియుంచడానికి అందమైన మరియు బలమైన వల (భగవంతుని నిర్మలమైన ధ్యానరూపము) కలిగియున్నవాడు సుతన్తువు. శ్రీ భట్టులు 787నుండి 810వ నామము వరకు బుద్ధావతారపరంగా వ్యాఖ్యానించారని గమనించదగును.

తంతుః కృత్రిమ శాంత్యాది రూపస్తద్రహణాయ పై

సుతన్తుః శోభనస్యేతి సప్తార్ణో దోషనాశకః

రాక్షసులను వశపరచుకోవడానికి అనేక రూపములు ధరించినవాడు. ఈ నామము సప్తాక్షరీమంత్రము. దోషనాశకము. ఓం సుతన్తవే నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **శోభనః తన్తుః విస్తీర్ణః ప్రపంచోऽస్య ఇతి సుతన్తుః**. దీనికి అనువాదకులు రెండు విధాల అర్థాలు చెప్పారు. (1) విశ్వమంతటా అందముగా విస్తరిల్లినవాడు (2) ఆయననుండి సమస్త జగత్తు విస్తరిల్లినది (ఉడనుండి దారప్పోగు విస్తరిల్లినట్లుగా).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – (తను - విస్తారే) **తన్యత ఇతి తన్తుః, శోభన తన్తుః యస్య స సుతన్తుః విష్ణుః, శోభనమ్ తన్యతే విశ్వమ్ యేన స సుతన్తు ఇతి అర్థః**. సృష్టినుండి ప్రళయందాకా సమస్తము ఆయననుండి విస్తరిస్తూనే ఉంటుంది. ఉదాహరణకు ముసలి జీవులు మరణించడానికి ముందు క్రొత్త జీవులు పుట్టడము. ఇలా ఆయననుండి విశ్వం విస్తరిల్లుతుంటుంది. అలా విశ్వమంతా చక్కగా వ్యాపింపజేసిన విష్ణువే సుతన్తువు.

శ్రీ సత్యసంధ యతిరాజ – **శోభనః తన్తుః చతుర్ముఖాది సంతానో యస్య స సుతన్తుః**. బ్రహ్మవంటివారు తన చక్కనైన సంతానముగా కలిగినవాడు 'సుతన్తుః'.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – వసుదేవుని సుతునిగా జన్మించి యదువంశమును వర్ధిల్లజేసినవాడు సుతన్తువు.

791. తన్తువర్ధనః

- సంసారబంధనాలను (తంతువులను) మరింత దృఢంగా చేసేవాడు.
- తననుండి విస్తరించిన జగత్తును కాపాడేవాడు.
- తాను సృజించిన జగత్తును తనయందే విలీనం చేసుకొనేవాడు.
- వసుదేవుని వంశమును ప్రద్యుమ్నాదులద్వారా వృద్ధిచేసినవాడు.

ఓం తన్తువర్ధనాయ నమః

'వర్ధన' అనే పదం 'వృధ్' (వృద్ధౌ) అనగా 'పెరుగుట' అనే ధాతువునుండి వచ్చింది. కనుక ఈ నామమును ఇంతకుముందు నామము 'సుతన్తుః'కు పొడిగింపుగా భావింపవచ్చును.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

ఏవం పాపరూచిభిః అంసుభిరువ

సంసార తన్తుమ్ సన్తనోతి ఇతి తన్తువర్ధనః.

ఈ విధంగా సంసారబంధనాలను (తంతువులను) వృద్ధిచేసేవాడు. అలా పాపకృత్యాలపట్ల మక్కువను పెంచి, దుష్టులను, అసుర స్వభావీకులను నాశనం చేసేవాడు తంతువర్ధనుడు.

అంశుభిః పాపరుచిభిః తంతుః సంసార నామకమ్

యస్సంతనోతి సదా తంతువర్ధన ఈరితః

పాపకర్మలయందు మక్కువను పెంచుతూ, సంసారబంధనాలను మరింత దృఢం చేసేవాడు. వైదికకర్మలకన్నా అవైదికకర్మలను చేసినట్లయితే ఫలితము ఎక్కువగా ఉంటుందని నమ్మించి సంసారబంధనాలను బాగా పెంచేవాడు తంతువర్ధనుడు.

(ఈ రచనలో కొన్ని నామాలకు శ్రీ భట్టుల వ్యాఖ్యను వివరిస్తూ సుమారు ఒకే విధమైన రెండు శ్లోకాలు ఇవ్వబడ్డాయి. వానిలో ఒకటి డా. క్రోవి పార్థసారధి 'శ్రీకైవల్య సారధి'లో ఉదాహరించినది. మరొకటి శ్రీ కృష్ణమాచారి తమ ఆంగ్ల వ్యాఖ్యలో ఉదాహరించినది)

శ్రీ భట్టులు గీతనుండి, విష్ణుపురాణమునుండి ఉదాహరించారు.

తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్

క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు – గీత 16.19

అట్లు ఇతరులను ద్వేషించు పాపాత్ములను, క్రూరులైన నరాధములను మాటిమాటికిని ఈ సంసారమునందు అసురీయోనులలోనే నేను పడవేయుచుందును.

త్రయీమార్గ సముత్సర్గమ్ మాయామోహేన తేఽసురాః

కారితాస్తన్మయా హ్యాసన్ తథాఽన్యే తత్ప్రచోదితాః

తైరప్యన్యేఽపరే తైశ్చ తైరప్యన్యే పరే చతే – విష్ణుపురాణము 3.18.32

అలా మాయామోహితులైన అసురులు వేదవిముఖులై, వారే గురువులై, ఇతరులనుకూడా పెడత్రోవ పట్టిస్తారు. ఆ క్రమంలో అందరూ వేదాలకు దూరమౌతారు. ఇలా భగవంతుడు తంతువర్ధనుడై బంధాలు పెంచుతాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు రెండు అర్థాలు చెప్పారు.

(1) **తమేవ తంతుమ్ వర్ధయతి ఇతి** – తననుండి విస్తరించిన జగత్తును కాపాడేవాడు (వర్ధిల్లజేసేవాడు) తంతువర్ధనుడు.

(2) **వర్ధయతి - ఛేదయతి ఇతి వా తన్తువర్ధనః**. ప్రళయకాలంలో జగత్తును తనయందు విలీనం చేసుకొనేవాడు (ఛేదయతి) తంతువర్ధనుడు.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – 'సుతన్తుః' నామము వ్యాఖ్యను కొనసాగిస్తూ – ప్రద్యుమ్నాదులద్వారా వసుదేవుని వంశాన్ని వర్ధిల్లజేసినవాడు తంతువర్ధనుడు.

792. ఇంద్రకర్మా

- దేవతలు, ఇంద్రుని కొరకు ఈ పనులన్నీ చేసినవాడు.
- ఇంద్రుని శక్తికి కారణమైనవాడు.
- తన పరమేశ్వరత్వము ప్రతిఫలించే పనులు చేయువాడు.

ఓం ఇంద్రకర్మణే నమః

ఇంద్ - పరమైశ్వర్యే - గొప్ప శక్తి కలిగియుండుట; ఇంద్ - ప్రథమ ('రాన్' ప్రత్యయము చేర్చుటవల్ల). 'ఇంద్రుడు' అనగా దేవతలలో ఇంద్ర పదవి కలిగినవాడు. శ్రీ భట్టులు 'ఇంద్రుడు' అనే అర్థంలోనూ, ఇతరులు 'ప్రథమ' అనే అర్థంలోనూ వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంద్రాది దేవతల మొరలను ఆలకించి భగవానుడు బుద్ధావతారం ధరించాడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణము (3.17.36)నుండి ఉదాహరించారు –

తమ్ ఉచుః సకల దేవాః ప్రణిపాత పురస్సరమ్
ప్రసీద నాథ! దైత్యే భయః త్రాహి ఇతి శరణార్థినః
దేవతలంతా ఆయనకు ప్రణమిల్లి ఇలా కోరారు – నాధా! మమ్ములను అసురులనుండి రక్షించుము. నీవే శరణు. ఈ భాగం విష్ణుపురాణంలో బుద్ధావతారానికి ఉపోద్ఘాతంగా వస్తుంది.

ప్రపన్నేంద్రాద్యర్థతయా దైత్యసంహార రూపకమ్
కర్మ యస్యాస్తీంద్రకర్మా హ్యష్టార్ణో మనురుత్తమః
ఇంద్రాది దేవతలు తనను శరణుజొచ్చినపుడు వారిని రక్షించడంకోసం దైత్యసంహారం చేసేవాడు ఇంద్రకర్మ. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. శ్రేష్ఠమైనది. ఓం ఇంద్రకర్మణే నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ఇంద్రస్య కర్మేవ కర్మా అస్య ఇతి ఇంద్రకర్మా, ఐశ్వర్య కర్మేత్యర్థః**. ఇంద్రునివలె గొప్ప గొప్ప కార్యములు చేసేవాడు ఇంద్రకర్మ.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవానుడు ఇంద్రుని అంతర్యామి గనుక ఇంద్రుని కర్మలు భగవంతుని కర్మలే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఇంద్ - పరమైశ్వర్యే; **ఇంద్రాణి కర్మాణి యస్య, పరమైశ్వర్యశాలిని కర్మాణి యస్య స ఇంద్రకర్మా**. భగవంతుని కార్యములు ఆయన పరమైశ్వర్యత్వమును సూచించును. గ్రహగతులను నిర్దిష్ట మార్గములోనుంచుట, సూర్యునికి శక్తినొసంగుట వంటివి. అలా ఆయన ఇంద్రకర్మ.

శ్రీ చిన్మయానంద – ఎల్లప్పుడూ గొప్ప మంగళకరమైన కార్యములొనరించువాడు ఇంద్రకర్మ.

793. మహాకర్మా

గొప్ప పనులు చేసేవాడు.

ఓం మహాకర్మణే నమః

ఈ నామము రెండుమార్లు వస్తున్నది.

72వ శ్లోకము. 677వ నామము. మహాకర్మా – **మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః**

84వ శ్లోకము. 793వ నామము. మహాకర్మా – **ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాగమః**

72వ శ్లోకములోని 'మహాకర్మా' –

శ్రీ భట్టుల వ్యాఖ్య – క్రిమికీటకాదులను కూడా క్రమముగా ఉద్ధరించి శ్రీహరి తన సన్నిధానమున చేర్చుకొనును. ఇది గొప్ప పని. కనుక ఆయన 'మహాకర్మా'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – మహాజగత్తువంటి సృష్టికార్యాలు చేసేవాడు 'మహాకర్మా'.

84వ శ్లోకములోని 'మహాకర్మా' – **మహన్తి కర్మాణి యస్య స మహాకర్మా**. గొప్పగొప్ప పనులు చేసేవాడు మహాకర్మ. అయితే ఈ గొప్ప పనులు ఏమిటి అనేది చెప్పడంలో వ్యాఖ్యాతల అనుభవం మనకు అందుతుంది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవానుడు కరుణామయుడు. అయితే ప్రపన్నులను కాపాడడంకోసము ఒకోమారు భగవంతుడు మోసపూరితము అనిపించే కార్యాలు చేస్తుంటాడు. కాని ఇవన్నీ భక్తుల సంరక్షణార్ధము చేసే న్యాయమైన గొప్ప పనులే. **ఏవమ్ ప్రపన్న పరిపాలనార్థత్వాత్ దురాచార దండనార్థత్వాత్ పరమ కారుణికస్యైవ విప్రలంభ సంభవః, ఏవమ్ న్యాయ వృతత్త్వాత్ మహాకర్మా.**

పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే – గీత 4.8

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందును.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మహాన్తి వియదాదీని భూతాని కర్మాణి కార్యాణి అస్య ఇతి మహాకర్మా.** ఆకాశమువంటి (పంచ) భూతములను సృష్టించుట అనే గొప్ప కార్యమును చేసినందున ఆయన మహాకర్మ.

శ్రీ చిన్మయానంద – పంచభూతములతో ఈ మహాజగత్తును సృష్టించుట, దానిని నిర్దిష్ట విధానములో నడుపుట, సదా పునఃసృష్టి కొరకు ఉన్నవానిని అంతం చేయుట, ఇవన్నీ మహాద్భుతమైన కార్యాలు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **మహత్ మహనీయమ్ దివ్యమ్ కర్మ యస్య ఇతి మహాకర్మా.** ఆయన పనులన్నీ దివ్యమైనవి గనుక ఆయన మహాకర్మ.

జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః

త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున – గీత 4.9

ఓ అర్జున! నా జన్మ (అవతారము)లు, కర్మములు దివ్యములు. అనగా నిర్మలములు, అలౌకికములు. ఈ తత్త్వరహస్యమును తెలిసికొనినవాడు తనువును చాలించిన పిమ్మట మరల జన్మింపడు సరిగదా! నన్నే చేరును.

శ్రీ బలదేవ విద్యాభూషణ భాగవతంలో కృష్ణుడు ఇంద్రుని ఛత్రాన్ని, అదితి కుండలాలను వారికి అందజేయడంగురించి ప్రస్తావించారు. **మహాన్తి భౌమ వధ మణి పర్వ ఛత్ర అదితి కుండల ఆనయనాని కర్మాణి యస్య సా మహాకర్మా.** ఈ విషయం భాగవతం దశమస్కంధము 59వ అధ్యాయంలో వస్తుంది. (నరకాసురవధ వృత్తాంతము 10.59.2)

ఇంద్రేణ హృతచ్ఛత్రేణ హృతకుండల బంధునా

హృత అమర అద్రిస్థానేన ఇంద్రేణ జ్ఞాపితో భౌమచేష్టితమ్

సభార్యో గరుడారూఢః ప్రాగ్జ్యోతిషపురం యయౌ

తననుండి నరకాసురుడు బలవంతంగా లాగుకొన్న తన రాజఛత్రాన్ని, తన తల్లి కుండలాలను, సుమేరు పర్వతాలలో తన ఆసనమైన మణిపర్వతాన్ని తిరిగి లభింపజేయమని ఇంద్రుడు కృష్ణుని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడు సత్యభామాసమేతుడై గరుత్మంతుని అధిరోహించి నరకాసురుడుండే ప్రాగ్జ్యోతిషపురంవైపు వెళ్ళాడు. ఈ అధ్యాయంలో నరకాసురవధ వర్ణింపబడింది. తరువాత 43వ శ్లోకంలో కృష్ణుని 'అతర్క్యకృత్', అనగా తర్కానికి అందని గొప్పపనులు చేసేవాడు, అని వర్ణించారు. 'మహాకర్మా', 'అతర్క్యకృత్' నామములు ఒకే అర్థాన్ని ఇస్తాయి.

794. కృతకర్మా

- అసురులకు తాను బోధించిన విషయాన్ని తానుకూడా స్వయంగా ఆచరించినవాడు (వారిని నమ్మించడానికి).
- సాధింపవలసినదంతా సాధించినవాడు.
- సృష్ట్యాది కార్యక్రమాలను చక్కగా సాగించువాడు.
- వేరెవ్వరూ సాధింపలేని కార్యాలను చేసినవాడు.

ఓం కృతకర్మణే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్వయమ్ అనుష్ఠితా తదాచారః**. తాను అసురులకు ఏవైతే (అవైదిక కర్మలను) బోధించాడో, వాటిని తానుకూడా స్వయంగా ఆచరించినవాడు ఇలా ఆయన అసురులు వేదవిముఖులు అవ్వడానికి, అలా నాశనమవ్వడానికి కారణమయ్యాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **న కర్తవ్యమ్ కించిదపి కర్మ అస్య విద్యత్ ఇతి కృతకర్మా**. ఆయన అన్నీ సాధించినవాడు. ఇంక ఆయన చేయవలసిన పనులేవీ లేవు. ఇందుకు శ్రీ కృష్ణదత్త భరద్వాజ గీత (3.22)నుండి ఉదాహరించారు.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి – గీత 3.22

ఓ అర్జునా! ఈ ముల్లోకములయందును నాకు కర్తవ్యము అనునదియే లేదు. అట్లే పొందదగిన వస్తువులలో నేను పొందనిదియు లేదు. ఐనను నేను కర్మలయందే ప్రవర్తిల్లుచున్నాను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **కృతమేవ జత లక్షణమ్ పునః పునః కరోతి.** సృష్టి, రక్షణ, వినాశమువంటి కార్యాలను మళ్ళీ మళ్ళీ చేసేవాడు కృతకర్మ. **యథా పూర్వమ్ అకల్పయత్** (ఋగ్వేదము 10.190.3). పూర్వము ఎలా ఉండేదో అలానే సృష్టించాడు.

శ్రీ వాసిష్ఠ మరొక అర్థం కూడా చెప్పారు – **అన్యైః కర్తుమ్ అనర్హమ్ బహుభిరపి యత్కర్మ, తత్ కరోతి ఇతి కృతకర్మా.** ఇతరులు చేయలేని అనేక పనులను తాను చేసేవాడు కృతకర్మ. శ్రీ వాసిష్ఠ చెప్పిన ఉదాహరణలు: ప్రతిదినం క్రమం తప్పకుండా సూర్యోదయాస్తమయాలు, సృష్టిరచనా విధానము.

శ్రీ బలదేవ విద్యాభూషణ తమ చైతన్యసంప్రదాయానుసారంగా ఈ నామమును శ్రీకృష్ణలీలాపరంగా వ్యాఖ్యానించారు. ఇంకెవ్వరూ చేయలేని కర్మలను చేయువాడు కృతకర్మ. ఉదాహరణకు నరకాసుర సంహారము, పదహారువేలమంది రాజకన్యల విముక్తి, సత్యభామ కొరకు పారిజాత వృక్షాన్ని తెచ్చుట, బాణాసురునిపై యుద్ధంలో రుద్రుని జయించుట, ఉషా అనిరుద్ధులను విడిపించుట వంటివి.

795. కృతాగమః

- బౌద్ధము, జైనము వంటి ఆగమములను కూడా బోధించినవాడు.

- ఋగ్యజుస్సామఅధర్వణ వేదములకు మూలము.

- పాంచరాత్రాగమమును బోధించినవాడు.

- వివిధ అవతారాలద్వారా మరల మరల ప్రత్యక్షము అయ్యేవాడు.

ఓం కృతాగమాయ నమః

గమ్ - గతౌ - వెళ్ళుట, వచ్చుట; ఆగమము - వచ్చినది; **ఆగమ్యతే అనేన ఇతి ఆగమో వేదః**. జ్ఞానమును తెలియజేయునది ఆగమము, వేదము. **కృత ఆగమో యస్య స కృతాగమః**. ఆగమమును చేసినవాడు కృతాగముడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు బుద్ధావతారపరంగా తమ వ్యాఖ్యను కొనసాగించారు. **బుద్ధ అర్హత సామయిక ఆగమః కృతాగమః**. తన బోధనలపట్ల విశ్వాసం కలిగించడానికి బౌద్ధ, జైన ఆగమములను బోధించినవాడు కృతాగముడు. (శ్రీ వి.వి. రామానుజన్ – ఈ ఆగమములు సామాన్యబుద్ధికి ఆకర్షణీయంగా ఉండి ప్రజలను తమవైపునకు తిప్పుకొన్నాయి.)

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కృతో వేదాత్మక ఆగమో యేన కృతాగమః**. వేదాది ఆగమములను నిర్మించినవాడు కృతాగముడు. బాదరాయణ ఉపనిషత్తునుండి శ్రీ శంకరులు ఉదాహరించారు. **అస్య మహతో భూతస్య నిశ్వసితమ్ ఏతత్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదో అధర్వాంగీరస ఇతిహాసః పురాణమ్ విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణ్యనువ్యాఖ్యానాని వ్యాఖ్యానాని..........** ఋక్ యజుర్ సామ అధర్వణ వేదములు పరమేశ్వరుని నిశ్వాసము.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **పాంచరాత్రస్య కృత్స్నస్య కర్తా నారాయణః స్వయమ్**. పాంచరాత్రాగమమునకు స్వయముగా నారాయణుడే కర్త. అలా ఆయన కృతాగముడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – ఆగమ - ప్రవేశము; **కృతస్తత్ చరితాని ప్రకాశ్య ద్వారకాయామ్ ఆగమో యేన స కృతాగమః**. శ్రీకృష్ణభగవానుడు అనేక లీలలు చూపిన అనంతరం ద్వారకలో ప్రవేశించాడు గనుక కృతాగముడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఆగమము - ప్రత్యక్షమగుట. భగవంతుడు సూర్యుని రూపంలోను, వివిధ అవతారాలుగాను మరల మరల ప్రత్యక్షమగును గనుక కృతాగముడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

శ్రీ వేంకటేశ్వర వచనములు – శ్రీ తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు.

వైకుంఠనాథా! హిరణ్యగర్భాదులకుఁ దండ్రివైన నిన్ను, సనకాదులకును ఏలికవైన నిన్ను, దివిజులకు రక్షకుండవైన నిన్ను, మునులకు వరదుండవైన నిన్ను, జ్ఞానులకుఁ బరదైవతంబైన నిన్ను, జగంబులకు మూలకారణమవైన నిన్ను యశోదా నందగోపులు పుత్త్రుండవని పెంచిరి; గోపికా జనంబులు పతివని తలంచిరి; పాండవలు బావమఱఁదివని భావించిరి. వీరలటువంటి మమకారంబులనుభవించిరి. మఱికొందరు ముచికుంద దధిభాండ కమలాకర భీష్మాదులు పరతత్త్వమైన నారాయణుండవని భజియించి బ్రహ్మపదమునుం బొందిరి. ఇన్ని విధంబుల వారికి నీవొక్కండవే గుఱి. ఎటువలె భావించిన నటువలె నౌదువు. వివేకింప నేర్చినవారి పాలిటి నిధానమవుదువు; శ్రీ వేంకటేశ్వరా!

హిరణ్యగర్భా! నీకుఁ బాన్పైన శేషుండు బ్రహ్మాండంబెత్తుకొనియె; నీకు వాహనంబయిన గరుత్మంతుం డమృతంబుఁ గొని చనియె; నీ కూఁతురైన గంగాభవాని హరు శిరస్సునెక్కె; ధ్రువుండు బ్రహ్మలోకం బతిక్రమించె; నారదుండు సురలకుఁ బోరువెట్టుచున్నాడు; రుక్మాంగదుండు యమలోకంబుం బాడుచేసె; శుకుండు వైరాగ్యంబు చూఱఁగొనియె; ఇందుచేతను నీ దాసులు నీకంటె నధికులౌట తేటపడియె; శ్రీ వేంకటేశ్వరా!

ఉద్భవః సుందరః సుందో రత్ననాభస్సులోచనః |
అర్కో వాజసనః (వాజసనిః) శృంగీ జయంతః సర్వవిజ్జయీ || (85)

796. ఉద్భవః

- మోక్షమార్గము ఉపదేశిస్తున్నట్లు నటిస్తూ సంసారబంధములనుండి బయటపడినవాడు.
- తన ఇష్టానుసారము, ఇచ్ఛవచ్చినపుడు, ఇచ్ఛమైనచోట జన్మించే ఉత్కృష్ట జన్మము కలవాడు.
- ఉన్నతమైన స్థానంలో ఉండేవాడు (సూర్యమండలము, శ్రీవైకుంఠము).
- అత్యున్నతులైన దేవతలను సృజించినవాడు.
- ధర్మరక్షణ కొరకు మరల మరల ఉద్భవించినవాడు.

ఓం ఉద్భవాయ నమః

ఈ నామము రెండుమార్లు స్మరింపబడినది.

41వ శ్లోకము. 375వ నామము. ఉద్భవః – **ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః**

85వ శ్లోకము. 796వ నామము. ఉద్భవః – **ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః**

శ్రీ భట్టులు పరవాసుదేవుడైన లక్ష్మీపతిపరంగా వ్యాఖ్యానించే సందర్భంలో 375వ నామము, మరియు బుద్ధావతారపరంగా వ్యాఖ్యానించే సందర్భంలో 796వ నామము వచ్చాయి.

'ఉత్' ఒక ఉపసర్గ. భూ - సత్తాయామ్ - ఉండుట, జీవించుట, జనించుట; ఉద్భవ - మూలము, ఆధారము, సృష్టి. 'ఉత్' అనే ఉపసర్గకు గ్రహించిన అర్థాన్ని బట్టి వివిధ వ్యాఖ్యాతల వ్యాఖ్యానాలలో వైవిధ్యం వస్తుంది.

ఉత్ - ఉద్గత - పైకి లేచుట; ఉత్ - ఉత్కర్ష - గొప్ప; ఉత్ - ఉత్తమ - శ్రేష్ఠమైన; ఉత్ - ఉచ్చై - ఎత్తైన, అధికమైన, ఉన్నతమైన

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు రెండుమార్లూ 'ఉత్' అనగా 'ఉద్గత' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **ఉద్గతః భవాత్ ఇతి ఉద్భవః**. సంసారచక్రమునుండి రక్షించువాడు ఉద్భవుడు.

41వ శ్లోకములో 'ఉద్భవః' – భగవంతుడు తన నిజమైన భక్తులను సంసారమునుండి లేవనెత్తును గనుక ఉద్భవుడు. ఇక్కడి 'ఉద్భవః' నామం గురించి ఇంకా శ్రీ భట్టులు చెప్పిన విషయం – యశోదచే రోటికి కట్టబడిన చిన్నికృష్ణుని ధ్యానించడంవలన మనం సంసారబంధంనుండి విముక్తులము కావచ్చును.
దామోదరమ్ బంధహరమ్.

85వ శ్లోకములో 'ఉద్భవః' – భగవంతుడు బుద్ధునిగా అసురులను సంసారతరణోపాయం విషయంలో పెడమార్గం పట్టించిన ఉద్భవుడు. **ముక్త్యుపదేశ నాటకేన భవాత్ ఉద్గత ఇతి ఉద్భవః**. ముక్తి గురించి ఆయన తప్పుమార్గం ఉపదేశించాడు మరియు తాను ఆ విధానంలో ముక్తుడయినట్లు నటించాడు.
మోక్షోపదేశ నటనాత్ భవాదుద్భవ స్థితః
ఉద్భవ స్స చ విజ్ఞేయః సప్తార్ణః పాపనాశకః
మోక్షమార్గము ఉపదేశిస్తున్నట్లుగా నటిస్తూ, సంసార బంధనాలనుండి బయటపడ్డట్లుగా కనిపించేవాడు ఉద్భవుడు. పునర్జన్మ లేనట్లుగా ఉండేవాడు. ఈ నామము సప్తాక్షరి. పాపాలను హరిస్తుంది.
ఓం ఉద్భవాయ నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 41వ శ్లోకంలోని 'ఉద్భవః'కు శ్రీ శంకరులు రెండు వ్యాఖ్యలు ఇచ్చారు.
(1) **ప్రపంచ ఉత్పత్తి ఉపాదాన కారణత్వాత్ ఉద్భవః**. భగవంతుడు జగత్తునకు సృష్టికర్త. దానికి ముఖ్యకారణము. కనుక ఆయన ఉద్భవుడు.
(2) **ఉద్గతో భవాత్ ఇతి ఉద్భవః**. పుట్టుక, ఐహిక జీవనమువంటివి లేనివాడు ఉద్భవుడు. **ఉద్గతమ్ అపగతమ్ జన్మ అస్య, సర్వ కారణత్వాత్**. అన్నింటికీ ఆయనే కారణము. కనుక ఆయనకు జన్మముగాని, మూలముగాని లేవు. కనుక ఆయన ఉద్భవుడు.

85వ శ్లోకంలోని 'ఉద్భవః' – **ఉత్కృష్టమ్ భవమ్ జన్మ స్వేచ్ఛయా భజతి ఇతి ఉద్భవః**. ఆయన జన్మ ఉత్కృష్టమైనది. ఎందుకంటే ఆయన ఇచ్చానుసారము ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా జన్మించును. కనుక ఆయన ఉద్భవుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **ఉత్తమో భవో యస్య స ఉద్భవః**. ఆయన జన్మ ఉత్తమ (ఉత్కృష్టమైనది గనుక ఆయన ఉద్భవుడు. (భాగవతము 10.3) శ్రీ కృష్ణుని జన్మ సమయంలో అనేక అద్భుతాలు జరిగాయి. ఆయన

పద్మాల్లాంటి కన్నులు తెరచుకొని ఉన్నాయి. బిడ్డకూ, తల్లికీ బొడ్డు కలిసి లేదు. అప్పుడే ప్రసవమైన బిడ్డలా కాకుండా ఆయన స్వచ్ఛంగా, శంఖచక్రాధులు ధరించియున్నాడు. ఆ సమయంలో సముద్రపు అలలు తీరాన్ని తాకుతూ భేరీధ్వనులు చేస్తున్నాయి. జన్మములేని ఆ పరమపురుషుడు దేవకికి జనించినపుడు అనేక శుభసూచకాలు పొడగట్టాయి.

శ్రీ సత్యసంధ యతిరాజ – **భవాత్ సంసారాత్ ఉత్పత్తేర్ వా ఉద్గత ఇతి ఉద్భవః**. సంసారము, జన్మము వంటివానికి అతీతుడు గనుక ఉద్భవుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ చెప్పిన మరొక అర్థము – **ఉత్కృష్టః పార్వత్యాదిభ్యో భవో యేన ఇతి ఉద్భవః**. పార్వతివంటి గొప్ప గొప్ప దేవతలకు సృష్టికర్త గనుక ఆయన ఉద్భవుడు.

శ్రీ చిన్మయానంద – ఉద్భవ - మూలము, కారణము. అన్నింటికీ మూలకారణమైనందున భగవంతుడు ఉద్భవుడు.

సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః
తా సాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా – గీత 14.14

ఓ అర్జున! నానా యోనులందు జన్మించు ప్రాణులను తన గర్భమున ధరించు మూలప్రకృతియే ఆ ప్రాణులకు తల్లి. బీజ స్థాపనము చేయు నేను వాటికి తండ్రిని. అనగా సర్వప్రాణులకును ప్రకృతియే తల్లి. నేనే జనకుడను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – ఉత్ - ఉద్ ఉపసర్గ ఉచ్ఛై అర్థే - 'ఉత్' అనగా ఉన్నతమైన, బాగా పైన అని అర్థము. భూ - సత్తాయామ్ - ఉండుట; **ఉచ్ఛైః భవనమ్ యస్య స ఉద్భవః**. బాగా పైన తన స్థానమును కలిగియున్నవాడు ఉద్భవుడు. ఉదాహరణకు సూర్యమండలము, శ్రీ వైకుంఠము.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – ధర్మ సంరక్షణ కొరకు మరల మరల అవతరించు (జన్మించు)వాడు ఉద్భవుడు. **ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే** (గీత 4.8).

797. సుందర

- అందమైనవాడు.
- ఉపసుందుని ద్వారా సుందుని చంపినవాడు (సుంద-రః).
- ఎంతగానో ఆరాధింపబడేవాడు.
- అందమైన శంఖము పాంచజన్యము కలిగినవాడు (సున్-దరః).
- వివిధ జీవులను, జీవుల భాగాలను చక్కగా విభజించినవాడు.

ఓం సుందరాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తద్ దృష్టి మనోహరః సుందరః** (బుద్ధుడు). అసురుల దృష్టిలో అందంగా ఉండి వారిని ఆకర్షించినవాడు సుందరుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **విశ్వాతిశాయి సౌభాగ్యశాలిత్వాత్ సుందరః**. లోకాలను మించిన అందం భగవంతుని సహజ లక్షణం కనుక ఆయన సుందరుడు.

శ్రీ తిరుమంగైయాళ్వారు పెరియతిరుమొళి (9.2)లో భగవంతుని – ఓహో! ఎంతటి మనోహరమైన అందము? దీనినెలా వర్ణించను? – అన్నారు. శ్రీ నారసింహుని అందం ఎక్కడా పట్టక పొంగి పొరలుతున్నదని శ్రీ తిరుమళిశయాళ్వారు నాన్ముగన్ తిరుమొళి (21)లో అన్నారు. అయ్యో! ఎలాంటి అందం? – అని శ్రీ తిరుప్పాన్ ఆళ్వారు అన్నారు (అమలనాడి పిరాన్ 9).

శ్రీ చిన్మయానంద – ఇక్కడ 'అందం' అంటే చిత్తమునకు లభించే శాంతి. ధ్యానంద్వారా సమాధి స్థితికి చేరుకున్నపుడు ఇలాంటి శాంతి లభిస్తుంది. అది శ్రీమన్నారాయణుని రూపమే. అందుకే ఆయనను ఉపనిషత్తులలో **'శాంతమ్ శివమ్ సుందరమ్'** అన్నారు.

శ్రీ సత్యసంధ యతిరాజ రెండు అర్థాలు చెప్పారు –

(1) **సుందరః సౌందరవాన్.** అందమైనవాడు సుందరుడు. దర-శంఖము; **శోభనం దరః శంఖో యస్య ఇతి సుందరః**. అందమైన పాంచజన్యము అనే శంఖాన్ని కలిగినవాడు సుందరుడు.

(2) **సుందమ్ ఉపసుందేన రేపయతి నాశయతి సుంద-రః**. ఉపసుందునిద్వారా సుందుని చంపించినవాడు సుందరుడు. సుందోపసుందులు నికుంభుని కొడుకులు. తమకు బయటివారితో చావులేకుండా వరం పొందారు. అప్పుడు వారు లోకాలను బాధింపసాగారు. ఇంద్రుడు పంపిన తిలోత్తమ కారణంగా వారిద్దరూ పరస్పరం పోరి మరణించారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సుతరామ్ ద్రియతే ప్రశస్యత ఇతి సుందరః**. సుతరామ్ - సదా; దృయతే - దృ - పూజించుట, ఆరాధించుట. సదా పూజింపబడువాడు సుందరుడు.

ప్రసాదాభిముఖమ్ శాశ్వత ప్రసన్న వదనేక్షణమ్
సునాసమ్ సుభ్రువమ్ చారుకపోలమ్ సురసుందరమ్ – భాగవతము 4.8.45
సదా భక్తులను అనుగ్రహించుటకు ఇచ్ఛగించేవాడు, ప్రసన్నముఖం, కన్నులు కలవాడు, చక్కని ముక్కు, చెక్కిళ్ళు కలవాడు, దేవతలందరిలోను సుందరుడు అయిన భగవంతుని భక్తితో ధ్యానింపవలెను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – దృ - విదారణే - చింపుట, విడదీయుట; సు (ఉపసర్గ) - చక్కగా; **సు - సుష్ఠు నిర్దోషమ్ విదారణమ్ యః కురుతే స సు-దరః, సన్నేవ వర్ణాగమేన సుందర ఇత్యుక్తో భవతి.** భగవంతుడు వివిధ జీవుల

శరీర భాగాలను చక్కగా విభజించాడు గనుక సుందరుడు. శ్రీ వాసిష్ఠ వ్రాసిన శ్లోకంలోని భాగం – **స సుందరో విష్ణు రనంతరూపో యోనిః సమగ్రమ్ వివిధమ్ దృణాతి**. అనంతమైన రూపములుగల విష్ణువు వివిధ జీవులను వివిధ రకాలుగా విభజించాడు.

శ్రీ మేప్పత్తూర్ నారాయణ భట్టాత్రి రచించిన శ్రీమన్నారాయణీయము లోని శ్లోకాలు – (తెలుగు తాత్పర్యము రచన - ??)

సూర్యస్పర్థికిరీట మూర్ధ్వతిలక - ప్రోద్భాసి ఫాలాంతరం
కారుణ్యాఽఽకుల నేత్ర మార్ద్రహసితో - ల్లాసం సునాసాపుటమ్
గండోద్యన్మ కరాభకుండలయుగం - కంఠోజ్వలత్ కౌస్తుభం
త్వద్రూపం వనమాల్యహారపటల - శ్రీవత్సదీప్రం భజే

శ్రీకృష్ణపరమాత్ముడు సూర్యునికన్న దివ్యమైన తేజస్సుతో ప్రకాశించే కిరీటముతోను, కస్తూరితిలకము దిద్దిన ఫాలమధ్యముతోను, అందమైన కనులు, దయార్ద్రమైన చిరునగవు, చెక్కిళ్ళపై ప్రకాశించే కుండలములు, కంఠమందు ప్రేలాడే కౌస్తుభరత్నము, వనమాల, ఇతర ఆభరణములు కలిగి మిక్కిలి సౌందర్యవంతుడై యున్నాడు.

కేయూరాంగద కంకణోత్తమ మహా - రత్నాంగుళీయాంకిత
శ్రీమద్బాహుచతుష్క సంగత గదా - శంఖారి పంకేరుహామ్
కాంచిత్కాంచన కాంచి లాంఛిత లసత్ - పీతాంబరాలంబినీ
మాలంబే విమలాంబుజద్యుతిపదాం - మూర్తిం తవార్తిచ్ఛిదమ్

భుజములపైన ధరించిన కేయూరములు, భుజంమీద మోచేతిపైభాగాన ధరించే అంగదములు, రత్నపు ఉంగరాలతో అలంకరింపబడి శోభిల్లుతూ శంఖము, చక్రము, గద, పద్మము అనే ఆయుధాలను చేతులయందు ధరించి, బంగారు మొలనూలుతో అలంకరించబడిన పట్టుపీతాంబరమును ధరించి, దీనుల ఆర్తిని పోగొట్టే ఆ దేవదేవునకు ప్రణామాలు అర్పిస్తున్నాను.

798. సుందః

- చాలా మృదుహృదయునిగా కనుపించి అసురులని నమ్మించినవాడు.
- భక్తులపట్ల కరుణ కలవాడు.
- భక్తులకు సుఖసంతోషాలు ప్రసాదించేవాడు.
- జీవులన్నింటికీ అవుసరమైన ద్రవములను (జలములను) ప్రసాదించువాడు.

ఓం సుందాయ నమః

సు (ఉపసర్గ); ఉన్ద్ - క్లేదనే - తడుపుట, మెత్తబరచుట; **సుష్ఠు ఉనత్తి ఇతి సుందః**. చక్కగా తడి చేయువాడు సుందుడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు తన సుందర రూపముచేతను, నడవడికచేతను అసురుల హృదయములను కరిగించి, వారు తన మోసమును నమ్మేలా చేశాడు గనుక సుందుడు. ఈ భావము బుద్ధావతారానికి, మోహిని అవతారానికి కూడా వర్తిస్తుంది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – ఆయన కరుణామయుడు గనుక అందరిని కరిగించును. అందువలన ఆ దయార్ద్ర హృదయుని సుందుడు అంటారు.

ఒక్కమారు ఆయనవైపు తిరిగితే మనలోని దుర్వాసలను హరించి, పాపములను క్షమించి తన అక్కున చేర్చుకొనును అని శ్రీ చిన్మయానంద వివరించారు. **తన్నొక్కసారి ప్రేమతో పిలచిన తన్నైన నిచ్చున్** – భాగవతము.

శ్రీ సత్యసంధ యతిరాజ – **సుమ్ సుఖమ్ దదాతి ఇతి సుం-దః.** తన భక్తులకు సుఖమును ఇచ్చువాడు సుందుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యో వృష కర్మణా సమ్యగ్ ఉన్నతి, లోకేఽపి చ పశ్యామః, మనుష్యో జలేన క్వచిత్ బహుకృత్వః సించతి, క్వచిచ్చ అల్పశః, ఏషా యో నియమో స తస్యైవ వ్యాపకస్య విష్ణోః.** ప్రతి జీవికి తగినంత జలమును, ఇతర ద్రవములను ఇచ్చువాడు, మొక్కల కొరకు వర్షమును కురిపించువాడు అగు విష్ణువు సుందుడు.

799. రత్ననాభః

- రత్నమువంటి బొడ్డు గలవాడు.
- ఆయన బొడ్డునుండి జన్మించిన బ్రహ్మ మనుష్యులలో రత్నమువంటివాడు.
- 'అరత్ననాభః' – అసురులను నాశనము చేయువాడు.
- సాగరరూపంలో తన బొడ్డుయందు రత్నములు కలవాడు.

ఓం రత్ననాభాయ నమః

ఇక్కడ 'రత్నము' అందమును సూచించును. రము - క్రీడాయామ్ - ఆడుట, ఆనందించుట - అనే ధాతువునుండి 'రత్న' శబ్దము వచ్చినది. 'నాః' - బంధనే - కట్టుట - అనే ధాతువునుండి 'నాభి' శబ్దము వచ్చినది. 'నాభి' అనగా బొడ్డు. నాభి కలిగినవాడు 'నాభః'.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **పాండిత్య విడంబన మృష్టోదర వ్యక్త రమ్య నాభీ రత్ననాభః.** అసురులను నమ్మించడంకోసం తన పాండిత్యాన్ని వ్యక్తపరచడానికి తన చక్కని బొడ్డు (పొట్ట)ను చూపినవాడు రత్ననాభుడు. శ్రీ వి.వి. రామానుజన్, శ్రీ వేదాంతదేశికన్ ల అనువాదం ప్రకారం, బుద్ధావతారంలో భగవంతుడు

వాదాలలో తన పాండిత్యాన్ని చూపే సందర్భాలలో పొట్ట నిమురుకొన్నాడు. అప్పుడు ఆయన నాభి అందమైన రత్నంవలె కనిపించింది. **సురత్ననాభ ఇత్యుక్తః యః పాండిత్య విడంబనాత్ మృష్టోదర రమ్య సత్పలదో మనుః.** సకల శాస్త్రాలు నిండియున్న ఆ బొజ్జయందు అలరారుచున్న రత్నమువంటి నాభి కలవాడు. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. శాస్త్రపాండిత్యప్రదము. ఓం రత్ననాభాయ నమః. (శ్రీ కైవల్యసారథిలో ఇచ్చినది).

శ్రీ శంకరుల వ్యాఖ్య – **రత్న శబ్దేన శోభా లక్ష్యతే, రత్నవత్ సుందరా నాభిః అస్య ఇతి రత్ననాభః.** సుందరము, మంగళప్రదము అయిన నాభి ప్రదేశము కలవాడు రత్ననాభుడు.

శ్రీ చిన్మయానంద వివరణ – ధ్యానము చేసే భక్తుల ఆలోచనలకు మూలస్థానము నాభి. ఆలోచనల గురించి కొందరు సిద్ధులు ఇలా చెప్పారు. అన్ని ఆలోచనలూ అనంతంనుండి ఉద్భవిస్తాయి. అలా బీజప్రాయంలో వాటిని 'పరా' అంటారు. అక్కడినుండి అవి ఆయా వ్యక్తులకు కొంచెం కొంచెం కనబడతాయి (అవగతమవుతాయి). వాటిని 'పశ్యన్తీ' అంటారు. తరువాతి దశలో అవి వ్యక్తమైనపుడు వానిని 'మధ్యమా' అంటారు. చివరిదశలో అవి కార్యరూపం దాల్చినపుడు 'వైఖరీ' అంటారు. ఇలా పరిణామక్రమంలో 'పశ్యన్తీ' దశలో ఆలోచనలు నాభి ఆధారంగా ఉంటాయి. అందరి ఆలోచనలకూ మూలం భగవంతుని 'రత్ననాభి'. కనుక భగవంతుడు రత్ననాభుడు. విష్ణువు నాభినుండి బ్రహ్మ జనించాడు అనడంలో అంతరార్థం ఇదే కావచ్చును.

శ్రీ సత్యసంధ యతిరాజ 'రత్ననాభః', 'అరత్ననాభః' అనే రెండు పాఠాలనూ గ్రహించి రెండు అర్థాలు చెప్పారు.
(1) రత్ననాభః – **రత్నం పుం రత్నమ్ చతుర్ముఖో నాభౌ యస్య.** పురుషులలో రత్నమైన బ్రహ్మ ఎవని నాభినుండి జన్మించాడో ఆ పరమపురుషుడు రత్ననాభుడు.
(2) అరత్ననాభః – నాభ - హింసాయామ్ అభావేపి - చంపుట, బాధించుట. **అరత్నాన్ అరత్ - దైత్యాన్ నభతి ఇతి అరత్ననాభః.** అసురులను నాశనం చేసేవాడు అరత్ననాభుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **రత్నమ్ నాభౌ యస్య ఇతి రత్ననాభః.** నాభియందు రత్నము కలవాడు రత్ననాభుడు. భగవంతుడు సాగరంలో రత్నాలు సృష్టించాడు. అవి ఆయనకు నాభివలె ఉన్నవి. **స రత్ననాభో భగవాన్ వరేణ్యో లోకే సముద్రే విదధాతి రత్నమ్.**

800. సులోచనః

- అందమైన కనులు గలవాడు.
- శ్రేష్ఠమైన జ్ఞానము కలవాడు.
- సంపూర్ణమైన జ్ఞానము, దృష్టి కలవాడు.

- సకల జీవులకు దృష్టినిచ్చేవాడు.

ఓం సులోచనాయ నమః

'సు' (ఉపసర్గ); లోచ్ - దర్శనే - దృష్టి;

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తథా హృదయాళు చోర లోచనః సు-లోచనః**. అందరి హృదయాలను దొంగిలించే (ఆకర్షించే) సమ్మోహనకరమైన కనులు కలవాడు సులోచనుడు. శ్రీ భట్టులు ఈ వ్యాఖ్యను కూడా బుద్ధావతారపరంగా చెబుతూ విష్ణుపురాణం (3.18.16)నుండి ఉదాహరించారు. **పునశ్చ రక్తాంబర ధృక్ మాయామోహః అజితేక్షణః**. ఆయన ఎఱ్ఱని దుస్తులు ధరించియున్నాడు. ఎన్నడూ ఓడిపోని కన్నులు గలవాడు. తన మాయచే అందరినీ మోహింపజేశాడు.

ఆయన కన్నుల అందం అసురులను మోహింపజేయడానికి మాత్రమే కాదు. భక్తులను తనయెడకు తీసికోవడానికీ ఉపయోగపడుతుంది. నాచియార్ తిరుమొళి (11.2)లో ఆండాళ్ తల్లి ఇలా అన్నది – శ్రీరంగంలో ఉన్న నా అమృతమూర్తీ! అందమైన శిరోజాలు, అందమైన నోరు, అందమైన కన్నులు కలవాడా! అందమైన నాభియందు అందమైన పద్మం కలవాడా! నీ అందంతో నన్ను నీ వశం చేసుకున్నావుగదా!. – ఇలా భగవంతుని కన్నులు, తిరుమేని అందం గురించిన ప్రస్తావనలు నాలాయిరంలో అనేకంగా ఉన్నాయి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'లోచన' అనగా కన్నులు, జ్ఞానము అనే రెండు అర్థాలను గ్రహించారు. **శోభనమ్ లోచనమ్ నయనమ్ జ్ఞానమ్ వా అస్య ఇతి సులోచనః**. శోభనమైన కన్నులు, జ్ఞానము కలిగినవాడు సులోచనుడు.

శ్రీ చిన్మయానంద వివరణ – ఇక్కడ అందము అనగా శరీరసౌందర్యమనే గాదు. భగవంతుడు తన సృష్టి అంతటిని, దాని లక్ష్యమును స్పష్టముగా చూచును అని కూడా గ్రహించవలసియున్నది. భగవంతుడు సకల భువనాలలోనూ ఇప్పుడు జరుగుచున్నది, ఇదివరకు జరిగినది, ముందు జరుగబోవునది కూడా చూచును. అనగా ఆత్మజ్ఞానము కలిగినవాడు గనుక ఆయన సులోచనుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుడు (1) అందమైన కనులు గలవాడు (2) సకల జీవులకు దృష్టినిచ్చువాడు (సూర్యుడు) (3) ఆయనకు సూర్యచంద్రులే కన్నులు. కనుక ఆయన సులోచనుడు. **సమ్యగ్ లోచన్తే ప్రాణినో యస్మిన్ ఉదితే సతి ఇతి సులోచనః సూర్యః – చంద్ర సూర్యౌ చ నేత్రే**

801. అర్కః

- స్తుతింపబడినవాడు, ఆరాధింపబడినవాడు.

- సూర్యునిరూపంలో ఉన్నవాడు.

ఓం అర్కాయ నమః

అర్క - తాపనే, స్తవనే చ - వేడిచేయుట, స్తుతించుట. **అర్చ్యత స్తూయత ఇతి అర్కః**. ఋచ్ - స్తుతౌ - స్తుతించుట; అర్చ్ - పూజాయామ్ - పూజించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అత్యంత ధార్మిక ఇతి స్తుతస్తైః అర్కః ఈరితః**. తన భక్తులచేత మిక్కిలి ధార్మికుడని స్తుతి చేయబడ్డవాడు 'అర్కః'. **అర్క్యతే స్తూయత్ ఇతి అర్కః**. బుద్ధావతారంలో విరోధులచేత కూడా ఇంతవాడు అంతవాడు అని స్తుతింపబడినవాడు అర్కుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **బ్రహ్మాదిభిః పూజ్యతమైరపి అర్చనీయత్వాత్ అర్కః**. బ్రహ్మాదులచేతకూడా పూజింపబడినవాడు అర్కుడు. శ్రీ కృష్ణదత్త భరద్వాజకూడా ఇదే భావాన్ని చెబుతూ భాగవతం (!2.13.1)నుండి ఉదాహరించారు. **యమ్ బ్రహ్మ వరుణేంద్ర మరుతః స్తువన్తి దివ్యైః స్తవైః**. బ్రహ్మ, ఇంద్రుడు, వరుణుడు, వాయువువంటివారు ఆయనను దివ్యస్తుతులతో స్తుతిచేయుదురు.

శ్రీ చిన్మయానంద – 'అర్క' అనగా సూర్యుడు. శ్రీమన్నారాయణుడు సూర్యునిరూపంలో ప్రత్యక్షదైవమై యున్నాడు. లోకమునకు కాంతి, వేడిమి ప్రసాదిస్తున్నాడు. అన్ని జీవులందును అంతర్యామియై యున్నాడు. ఆయన లేకుంటే జీవం లేదు.

802. వాజసనః

వాజసనిః

- అన్నమువంటివానిపై (ఐహిక విషయములందు) రుచిని (ఆసక్తిని) కలిగించినవాడు.
- అన్నము కోరినవారికి అన్నమును ప్రసాదించువాడు.
- సకల జీవులకు ఆహారము లభింపజేయువాడు.

ఓం వాజసనియే నమః

ఓం వాజసనయే నమః

శ్రీ భట్టులు ఈ నామమును 'వాజసనిః' అనీ, శ్రీ శంకరులు 'వాజసనః' అనీ చెప్పారు. శ్రీ సత్యదేవో వాసిష్ఠ రెండు పాఠములను ఇచ్చారు. మరియు 'వాజసనిః' అనేది 'వైదిక పాఠము' అన్నారు. బహుశా ఇందుకు కారణం వేదాలలో 'వాజసనిః' అని చెప్పబడి ఉండడం కావచ్చును. ఉదాహరణకు ఋగ్వేదము 9.110.11, 3.51.2, 10.91.15.

వాజ - అన్నము, ఆహారము; సన్ - సంభక్తౌ, దానే - ఇచ్చుట, విభజించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **నాస్తిక్య వాదేన ఐహికమ్ అన్నాదికమేవ సంభజతి ఇతి వాజసనిః**. తన నాస్తిక వాదముతో అన్నమువంటి ఐహిక భోగములపట్ల రుచిని కలిగించినవాడు (బుద్ధావతారంలో). **క్షపణకః వ్రతమ్ హేదమ్ యత్ ప్రాతః ప్రాతః దధ్యోదన కబళాన్ గృహ్ణాతే ఇతి**. క్షపణకులు (బౌద్ధ భిక్షువులు) ప్రొద్దున్నే పెరుగన్నం తింటారు.

అన్నాదీన్నైహికాన్యేయ యస్మాన్మహ్యం భవంతి హి
స వాజసనిరిత్యుక్తః వస్వర్ణోऽన్నప్రదో మనుః

అన్నము మొదలగు ఐహిక ఫలములయందు రుచిని పుట్టించినవాడు 'వాజసని'. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. అన్నమును ఇస్తుంది. ఓం వాజసనియే నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వాజమ్ - అన్నమ్ అర్థినామ్ సనోతి - దదాతి ఇతి వాజసనః**. కోరినవారికి అన్నమును ఇచ్చువాడు వాజసనుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు జీవులకు జన్మమునకు ముందే అన్నమును సిద్ధము చేయును. ఉదాహరణకు బిడ్డ పుట్టేసరికి తల్లి రొమ్ములో పాలు సిద్ధంగా ఉంటాయి.

శ్రీ చిన్మయానంద – భగవంతుడు సకలజీవుల శరీరమునకు, మనస్సుకు, బుద్ధికిని కూడా పౌష్టికత కలుగజేయును.

గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా
పుష్ణామి చౌషధీః సర్వా సోమో భూత్వా రసాత్మకః – గీత 15.13

పృథ్వియందు ప్రవేశించి, నేను నా శక్తిద్వారా సకల భూతములను ధరించి, పోషించుచున్నాను. రస స్వరూపుడనై, అనగా అమృతమయుడైన చంద్రుడనై ఓషధులకు, అనగా వనస్పతులన్నింటిక పుష్టిని చేకూర్చుచున్నాను.

803. శృంగీ

- కొమ్ములు కలవాడు.
- నెమలి పింఛము చేత ధరించి , కొమ్ము ఉన్నవానిలా కనుపించినవాడు.
- మత్స్య, వరాహ అవతారాలలో కొమ్ము కలిగినవాడు.
- చేత గోవర్ధనగిరి శిఖరము ధరించినవాడు.
- ప్రతి జీవికీ తన శృంగము (శక్తి) ప్రదర్శించుకొనే అవకాశం కలిగించినవాడు.
- తన భక్తులకు పునర్జన్మ భయాన్ని నాశనం చేసేవాడు.

ఓం శృంగిణే నమః

ఉదయగిరిలోని శ్రీవరాహమూర్తి శిల్పం. వికీపీడియానుండి.

'శృంగము' అనగా కొమ్ము. కొండ శిఖరము (కొండ కొమ్ము), ఆధిపత్యము, గర్వము (శృంగభంగము) వంటి అర్థాలను కూడా సూచిస్తుంది. 'శృంగ' అనే పదము ఇంతకు ముందు కొన్ని నామాలలో వచ్చినది. **మహాశృంగః** (57వ శ్లోకము, 540వ నామము), **నైకశృంగః** (81వ శ్లోకము, 869వ నామము).

శ్రీ భట్టుల వ్యాఖ్య – బుద్ధావతారంలో భగవంతుడు అహింసాసూచకంగా చేత నెమలిపింఛము ధరించి, ఒక కొమ్ము కలవానిలా అగుపించాడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణము (18.2)నుండి ఉదాహరించారు.

తతో దిగంబరో ముండో బర్హిపత్రధరో ద్విజ

మాయామోహోఽసురాన్ శ్లక్ష్ణమ్ ఇద వచనమబ్రవీత్

అతడు దిగంబరుడై, బోడిగుండుతో, చేత నెమలిపింఛము ధరించి, మృదువుగా ఇట్లు పలికెను. (చేత నెమలి పింఛము ధరించుట జైన భిక్షువుల ఆచారాలలో ఒకటి. 'పృథురాయ్ చరిత్ర' అనే హిందీ కవిత ప్రకారం అమరసింహుడనే బౌద్ధుడు నెమలిపింఛం ధరించాడు. – శ్రీ హెచ్. హెచ్. విల్సన్ తమ అనువాదంలో ఇచ్చిన పాదపీఠిక).

కరేఽస్తి పింఛికా యస్య శృంగీ హంస విడంబనాత్

సర్వ ప్రపంచ మిథ్యాత్వ సంవిదాత్మత్వ వాదినః

ప్రపంచం మిథ్య, జ్ఞానమే ఆత్మ అని వాదించే బుద్ధుడు తాను అహింసావాదినని తెలియజెయ్యడానికి నెమలిపింఛాన్ని చేత ధరించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ప్రళయ అంభసి శృంగవాన్ మత్స్యవిశేషరూపః శృంగీ**. ప్రళయాంభోనిధిలో శ్రీమత్స్యావతారుడై తన కొమ్మునకు తగిలించిన నావయందు సత్యవ్రతాదులను సాగరము దాటించినవాడు శృంగి.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – ఈ నామమును శ్రీవరాహావతారమునకు కూడా అన్వయింపవచ్చును. పాతాళాంతర్గతయైన భూమిని శ్రీవరాహమూర్తి తన కొమ్ముతో లేవనెత్తెను. 58వ శ్లోకము, 542వ నామము '**మహావరాహః**'.

శ్రీ సత్యసంధ యతిరాజ – **శృంగాణి గోవర్ధన శృంగాని అస్య సన్తి ఇతి శృంగీ**. గోవర్ధనగిరి శిఖరాన్ని తన చేత ధరించినవాడు శృంగి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – శృంగ - శక్తి, ప్రవాహము. భగవంతుడు సకల జీవులకు తమ శక్తిని ప్రదర్శించే విధానం ఇచ్చాడు. ఉదాహరణకు పాములు కోరలు, తేలుకు తోక శృంగములుగా నున్నవి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – శృ - హింసాయామ్ - బాధించుట, చంపుట. **శృణతి భవభయమ్ ఇతి శృంగమ్ అవిచింత్య సామర్థ్యమ్ తదస్య ఇతి శృంగీ**. తన భక్తులలో పునర్జన్మ అనే భయాన్ని నాశనం చేసేవాడు శృంగి.

804. జయంతః

జయించువాడు.

ఓం జయంతాయ నమః

జీ - జయే - గెలుచుట. **జితవాన్ ఇతి జయంతః**.

శ్రీ భట్టుల వ్యాఖ్య – మాయాశాస్త్రముల సృష్టికూడ భగవానుని లీలయే. మంచి చెడులు ఒక కారణంచేత ఆయనవల్ల ఏర్పడుతాయి. **ఆస్తిక్యవాదినః సంవిదాత్మత్వ ప్రపంచమిథ్యత్వవాద్యైః జితవాన్ ఇతి జయంతః**. ప్రపంచము మిథ్య అనే మాయావాదంతో ఆస్తికులను ఓడించినవాడు జయంతుడు. దీనికి కారణాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే అసురులలో కొందరు ఆస్తికకర్మలద్వారా గొప్ప శక్తులు సాధించి లోకులకు కీడు చేస్తారు (ఉదాహరణకు – శుక్రాచార్యుడు, రావణుడు). అలాంటివారిని తన నాస్తికవాదనలతో పెడమార్గం పట్టించి నిజమైన భక్తులను ఉద్ధరించేవాడు గనుక భగవానుడు జయంతుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అరీన్ అతిశయేన జయతి, జయహేతుర్వా జయంతః**. తన శత్రువులపై జయం పొందేవాడు జయంతుడు. ఇలా భగవంతుడు దేవతల పక్షాన, పాండవుల పక్షాన ఉండి వారి శత్రువుల పరాజయానికి కారణమయ్యాడు.

శ్రీ చిన్మయానంద – భగవంతుని జయంతగుణమువలన మనం తుచ్ఛమైన కోరికలను జయింపవచ్చును.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **జయతి సఖాన్ బహుయుద్ధే వాగ్యుద్ధే వా ఇతి జయంతః**. మాటలలోను, ఆటలపోటీలలోను శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ తన మిత్రులలో జయం పొందేవాడు గనుక జయంతుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యోహో సర్వదా జయతి, న కదాచిత్ పరాజయమ్ లభత ఇతి జయంతః**. ఎల్లప్పుడూ జయించేవాడు, ఎప్పుడూ పరాజయం పొందనివాడు జయంతుడు. భగవంతుని అధీనంలో సమస్త విశ్వమూ నడుస్తుంది. భగవంతుడు ఎవరి పక్షాన ఉంటాడో వారు తప్పక జయం పొందుతారు.

ఏవమ్ హి యో వేత్తి జయంతమగ్ర్యమ్ విష్ణుమ్ స సర్వమ్ జయతీతి బోధ్యమ్
యస్యాస్తి సవ్యే భగవాన్ జయంతః కిమ్ శాత్రవస్తస్య నరస్య కుర్యుః
భగవంతుని అండ, ఆశీస్సులు ఉంటే ఎన్ని ఆయుధాలైనా, ఏమైనా గాని వారి విజయాన్ని ఆపలేవు.

శ్రీ వేదాంతదేశికుల కామాసికాష్టము 6 –
త్వయి రక్షతి రక్షకైః కిం అనన్యైః
త్వయి చారక్షతి రక్షకైః కిం అనన్యైః
నీవు రక్షకుడవైతే ఇతర రక్షకులతో పని ఏమిటి? నీవు రక్షింపకుంటే ఇంక ఇతర రక్షకులేమి చేయగలరు?

స్వామిదేశికన్ అభీతిస్తవము 5 – **కదాచన కుతశ్చన క్వచ న తస్య నస్యాత్ భయమ్**. భగవంతుని భక్తులకు ఎప్పుడూ, ఎక్కడా, ఎలాగూ భయం లేదు.

ఋగ్వేదము 1.91 21 – **జయంతమ్ త్వమ్ అనుమదే సోమ.**
ఋగ్వేదము 10.103.8 – **దేవసేనానామ్ అభిభంజతీనామ్ జయంతీనామ్ మరుతో యంత్వగ్రమ్.**

805. సర్వవిజ్జయీ

- అన్నీ నేర్చుకున్నవారిని జయించినవాడు.
- అంతా తెలిసినవాడు మరియు సదా జయించువాడు.
- అంతా తెలిసిన మునులకు ప్రియమైనవాడు.

ఓం సర్వవిజ్జయినే నమః

సర్వ - మొత్తము (సరతి ఇతి సర్వః); విద్ - జ్ఞానే - తెలిసికొనుట; విద్ - విచారణే - ఆలోచించుట, వాదించుట; జీ - జయే - గెలుచుట; సర్వ-విద్-జయీ – సర్వవిజ్జయీ.

శ్రీ భట్టుల వ్యాఖ్య – తన మధురమైన భాషణముతోను, ఒప్పించే వాదంతోనూ పండితులనందరినీ ఓడించినవాడు 'సర్వవిజ్జయీ'. ఇలా తన (నాస్తిక) వాదంతో అందరినీ ఓడించి, తద్వారా వేదవిదులైన దుష్టులను నాస్తికులుగా చేశాడు. అలా కాకుంటే అలాంటి అసురులు గొప్ప శక్తులు సంపాదించి ధార్మికులను బాధిస్తారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ఈ నామమును 'సర్వవిత్' మరియు 'జయీ' అనే నామముల జంటగా పరిగణించారు. **సర్వవిషయమ్ జ్ఞానమ్ అస్య ఇతి సర్వవిత్**. అన్ని విషయాలు తెలిసినవాడు 'సర్వవిత్' **అభ్యంతరాన్ బాహ్యాన్ హిరణ్యాక్షాదిన్ శ్చ దుర్జయాన్ జేతుమ్ శీలమ్ అస్య ఇతి జయీ**. (కామాది) అంతఃశ్శత్రువులను, హిరణ్యాక్షునివంటి బాహ్యశత్రువులను జయించే గుణం కలిగినవాడు 'జయీ'. కనుక 'సర్వవిజ్జయీ'.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఈ రెండు నామములను ఇలా జోడించారు. భగవంతుడు 'సర్వవిత్' కనుక కామక్రోధాది అంతఃశత్రువులను జయింపగలడు.

ముండకోపనిషత్తు 1.1.9, 2.2.7 – **యః సర్వజ్ఞః సర్వవిత్.**

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – శత్రువు రహస్యాలు తెలిస్తే శత్రువును జయించడం సాధ్యం. భగవానుడు అన్నీ తెలిసినవాడు 'సర్వవిత్' గనుక అందరినీ జయించే 'జయీ'. అలా ఆయన 'సర్వవిజ్జయీ'.

శ్రీ చిన్మయానంద – తమ పాండిత్యంగురించి గొప్పగా చెప్పుకునేవారు కూడా సమాధిస్థితిలో శ్రీమన్నారాయణుని సన్నిధానంలో నిశ్శబ్దంగా ఉంటారు. కనుక ఆయన సర్వవిజ్జయి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – 'సర్వవిత్' అనగా అన్నీ తెలిసిన బ్రహ్మవంటివారిని సూచించును. వారందరికంటె గొప్పవాడు గనుక భగవంతుడు సర్వవిజ్జయి.

సర్వమ్ విదన్తి ఇతి సర్వవిదో బ్రహ్మాదయః

తానపి నిరతిశయ సర్వజ్ఞతాయ జయతి ఇతి సర్వవిజ్జయీ

శ్రీ బలదేవ విద్యాభూషణ 'సర్వవిత్' అనగా 'అన్నీ తెలిసినవాడు' అని ఇతరులు చెప్పిన అర్థాన్నే చెప్పారు. కాని ఆయన 'జయీ' అనగా 'గౌరవింపబడువాడు' అని అర్థం చెప్పారు. సర్వవిత్సు వసిష్ఠ వామదేవాదిషు జయో మహోత్కర్షోऽస్య నిత్యమ్ అస్తి ఇతి సర్వవిజ్జయీ. అంతా తెలిసిన జ్ఞానులైన వసిష్ఠుడు, వామదేవుడు వంటివారిచే కూడా గొప్పగా గౌరవింపబడువాడు గనుక భగవంతుడు సర్వవిజ్జయి.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సువర్ణబిందురక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః |
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః || (86)

806. సువర్ణబిందుః

- తన చతురమైన వాదనతో వైదికమతమును మరుగుపరచినవాడు (బుద్ధుడు).

- బంగారురంగు అవయవములు కలిగిన సుందరుడు.

- మంగళప్రదమైన ప్రణవమంత్రస్వరూపుడు.

- సుందరమైన స్వరూపము కలవాడు మరియు సృష్టిలో అన్నింటిని చక్కగా విభజించినవాడు.

- శుభకరమైన అక్షరములున్న వేదములనెరిగినవాడు.

- నుదుటిపైన, కపోలములపైన బంగారు రంగుగల చందన చిహ్నములు కలిగినవాడు.

ఓం సువర్ణబిందవే నమః

సు (ఉపసర్గ); వృ - వరణే - ఏరుకొనుట; వర్ణము అనగా రంగు, అక్షరము అనే అర్థాలున్నాయి. బింద్ - అవయవే - విడదీయుట; విద్ - జ్ఞానే - తెలిసికొనుట. **'బ', 'వ'యోరభేదః** – అనే వ్యాకరణసూత్రము ప్రకారము 'విందు' మరియు 'బిందు' అనే పదాలకు ఒకే అర్థం తీసికొనవచ్చును. శ్రీ భట్టులు 'బిది' - అపలాపే - దాచివేయుట - అనే అర్థంలో వ్యాఖ్యానించారు. 'బిందు' అంటే ఇంకా తిలకము (నుదుటిపై బొట్టు), అనుస్వరము (ॐ లో చుక్క), జింక వంటి పైని చుక్కలు – వంటి అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు బుద్ధావతారపరంగా తమ వ్యాఖ్యను కొనసాగించారు.

ఆస్తికత్వాపలాపేన పటుభిః పదకాక్షరైః

సువర్ణబిందురక్షోభ్యః నవార్ణః పాపనాశనః
తనయొక్క నేర్పుతో, వాదనాపటిమతో, అందమైన పదజాలం (సువర్ణములు)తో వైదకమతాన్ని అపలపించి (మరుగుపరచి), నాస్తికమతమునందు ఆసక్తిని పెంపొందించువాడు సువర్ణబిందువు. ఈ నామము నవాక్షరీ మంత్రము. పాపములను హరించును. ఓం సువర్ణబిందవే నమః. ఈ విధంగా వేదముల ధర్మాన్ని మరుగుపరచడంద్వారా దుష్టులకు ఆ మతంవల్ల కలిగే లాభాలను నివారించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'బిందు' అనగా 'అవయవములు' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **బిందవః అవయవాః సు-వర్ణ సదృశౌ అస్య ఇతి సువర్ణబిందుః**. బంగారురంగు అవయవాలు కలిగినవాడు సువర్ణబిందువు. 79వ శ్లోకంలో 743నుండి 746వరకు నామములు – **సువర్ణవర్ణః, హేమాంగః, వరాంగః, చందనాంగదీ** – కూడా భగవానుని శరీరసౌందర్యాన్ని కీర్తిస్తున్నాయి.

శ్రీ వాసిష్ఠ కూడా ఈ అర్థంలో ఒక వ్యాఖ్య చెప్పారు. **సు-శోభనమ్, వరణీయమ్ దృశ్యమ్ రూపమ్ యస్య స సువర్ణః, సువర్ణ బిందవః అవయవః యస్య స సు-వర్ణ-బిందుః**. శోభనకరమైన రంగు, అందమైన అవయవములు కలవాడు సువర్ణబిందువు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భక్తులు ఒనరించిన యజ్ఞాలలో అగ్నికుండంనుండి బంగారువర్ణంలో అవతరించువాడు సువర్ణబిందువు. బ్రహ్మదేవుడు కాంచీపురంలో యజ్ఞం చేసినపుడు భగవంతుడు కంచిపెరుమాళ్ళు అర్చామూర్తిగా ఉద్భవించాడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక వ్యాఖ్య – వర్ణము - అక్షరము; బిందువు - అనుస్వరము. **శోభనో వర్ణః అక్షరమ్ బిందుసా యస్మిన్ మంత్రే తన్-మంత్రాత్మా వా సువర్ణబిందుః**. ఏ మంత్రమునందు సుందరమగు అక్షరమును మరియు బిందువు (అనుస్వరము) కలదో అట్టి మంత్రము అనగా ఓంకారము గలవాడు, అనగా ప్రణవ స్వరూపుడు.
తైత్తరీయోపనిషత్తు 1.81 – **ఓం ఇతి బ్రహ్మ**.
కఠోపనిషత్తు 1.2.15 – **తత్ తే పదమ్ సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్**.

శ్రీ వాసిష్ఠగారి మరొక వివరణ – బింద్ - అవయవే - విడదీయుట; బిందతి - అవయవాన్ కరోతి - విభజించువాడు. చక్కని రూపము కలవాడు (సువర్ణ) మరియు సకల జీవులను చక్కగా విభజించువాడు, కాని అవి కలిసి జీవించునట్లు చేయువాడు. ఉదాహరణకు – చెట్లను కొమ్మలు, ఆకులు, పూలు – ఇలా విభజించును. సౌరమండలమును గ్రహములుగా విభజించును. **యథాయమ్ సూర్యస్తథాయమ్ సమస్త ప్రపంచః పరస్పరమ్ అవయవ-అవయవ విభావమ్ ఆపన్నః, పత్ర-ఫల-పుష్ప-శాఖాదీని వృక్షస్యేవ.**

శ్రీ సత్యసంధ యతిరాజ – బిందు - అక్షరము; విద్ - జ్ఞానే; సువర్ణ - వేదములు. **శోభనా వర్ణా యస్మిన్ స సువర్ణో వేదః, తస్య బిందుః జ్ఞాతా సువర్ణబిందుః**. వేదములు తెలిసినవాడు సువర్ణబిందువు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సు-వర్ణో లలాటస్థో బిందుః అస్య ఇతి**. నుదుటిపై బంగారురంగు బొట్టు కలవాడు. లేదా బంగారురంగు నుదుటిపై బొట్టు కలవాడు సువర్ణబిందువు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సువర్ణమివ పీతాభా బిందవః చందన బిందవో యస్య చిబుక, కపోల మస్తకే స సు-వర్ణ బిందుః**. బుగ్గలు, తల, చిబుకముపై చందనపు అలంకరణ కలవాడు సువర్ణబిందువు.

బెంగళూరు శ్రీహరివైకుంఠక్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి.
వికీపీడియా చిత్రం.

807. అక్షోభ్యః

- గంభీరమైన చిత్తము కలవాడు, కలతచెందనివాడు.
- రాగద్వేషములు లేనివాడు.
- మారీచుని భయపెట్టినవాడు.

ఓం అక్షోభ్యాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది –

86వ శ్లోకము. 807వ నామము. అక్షోభ్యః – **సువర్ణబిందుః**
అక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః
107వ శ్లోకము. 999వ నామము. అక్షోభ్యః – **రథాంగపాణిః**
అక్షోభ్యః సర్వప్రహరణాయుధః

క్షుభ్ - సంచలనే - కలతనొందుట, క్షోభించుట, చలించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **గంభీరాశయత్వేన అవికార్యః**. బుద్ధునిగా భగవంతుడు వాదించినపుడు ఎవరూ ఆయనను ఎదుర్కొనలేరు. ఎందుకంటే ఆయన గాంభీర్యం అలాంటిది.
గంభీరాశయత్వేన వ్యాధికారతయా చ సః
అక్షోభ్యః సప్తవర్ణస్యాత్ అక్షోభ్యత్వ ప్రదాయకః
గంభీరమైన హృదయం కలవాడు. అధికారము కలవాడు. పరులచే కలతనొందింప తగనివాడు. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. కలతలు లేకుండా చేస్తుంది. ఓం అక్షోభ్యాయ నమః.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **రాగాదిభిః శబ్దాది విషయైశ్చ, త్రి-దశ-అరిభిశ్చ, న క్షోభత ఇతి అక్షోభ్యః.** రాగద్వేషములు, శబ్దాది విషయములు, మూడులోకములలోని శత్రువులు, ఎవరూ ఇతనిని కలతనొందింపలేరు గనుక ఆయన అక్షోభ్యుడు.

శ్రీ చిన్మయానంద గీతలోని స్థితప్రజ్ఞ లక్షణములను (2.54నుండి 2.61వరకు) ప్రస్తావించారు. ఈ స్థితప్రజ్ఞస్వభావమే అక్షోభ్యుడైన భగవానుని స్వభావము.

శ్రీ సత్యసంధ యతిరాజ మరొక క్రొత్త అనుభవాన్ని మన ముందుంచారు. ఆయన 'సువర్ణబిందుః' మరియు 'అక్షోభ్యః' అనేవి రెండూ కలిపి **'సువర్ణ-బిందు-రక్ష-భ్యః'** అనే ఒకే నామంగా పరిగణించారు.. **సువర్ణ బిందవో యస్మిన్ తత్ సువర్ణ బిందు - సువర్ణ బిందువత్ రక్షశ్చ సువర్ణబిందు - రక్షో మారీచః, తమ్ భ్యాసయతి భీషయతి ఇతి సువర్ణబిందు-రక్షో-భ్యః.** సువర్ణబిందువులు, అనగా వంటిపై బంగారుచుక్కలు కలిగిన లేడి. 'రక్ష' అనగా అలాంటి రాక్షసుడు మారీచుడు. భ్య - భయ - భయపెట్టినవాడు. ఇలా మారీచుని భీతావహుని చేసినవాడు సువర్ణబిందురక్షోభ్యుడు, అనగా శ్రీరాముడు.

808. సర్వవాగీశ్వరేశ్వరః

- వాక్పతులందరికి ప్రభువు.
- వాక్చాతుర్యము కలవారిలో అత్యున్నతుడు.

ఓం సర్వవాగీశ్వరేశ్వరాయ నమః

వాక్కుపై ఆధిపత్యము కలవారందరికీ అధిపతియైనవాడు సర్వవాగీశ్వరేశ్వరుడు. సర్వ-వాక్-ఈశ్వర-ఈశ్వర. ఈ సర్వవాగీశ్వరులు ఎవరు అనే విషయంపై వివిధ వ్యాఖ్యానాలు ఆధారపడినాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు బుద్ధావతారపరంగా వ్యాఖ్యానించారు. వాదాలలో ఇతర పండితులందరిపైనా బుద్ధునిదే పైచేయి.

వాద వాఙ్మయత్వోః పారం యో గచ్ఛతి స విశ్రుతః

రవ్యర్ణో వాక్ప్రద ఇతి సర్వవాగీశ్వరేశ్వరః

ప్రతివాదులతో వాదించుటయందుగాని, ఇతరుల హృదయాలను ఆకర్షించేటట్లు మాట్లాడడంలోగాని తనకు మించినవాడు లేడు అని పేరుపొందినవాడు. ఈ నామము ద్వాదశాక్షరి. వాక్పటుత్వమునిస్తుంది. ఓం సర్వవాగీశ్వరేశ్వరాయ నమః. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే భగవంతుడు బుద్ధావతారంలో నాస్తికత్వాన్ని సమర్థిస్తూ, శాస్త్రవిరుద్ధంగా వాదించాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – సర్వవాగీశ్వరుడనగా బ్రహ్మ. అట్టి బ్రహ్మకు ప్రభువు గనుక నారాయణుడు సర్వవాగీశ్వరేశ్వరుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – సర్వవాగీశ్వరుడనగా రుద్రుడు. అట్టి రుద్రునకు ప్రభువు సర్వవాగీశ్వరేశ్వరుడు. **సర్వేషామ్ వాచః సర్వవాచః తా సామ్ ఈశ్వరస్య రుద్రస్య చ ఈశ్వరత్వాత్ సర్వ-వాగ్-ఈశ్వర-ఈశ్వరః.**

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సర్వః శ్రుత్యాది లక్షణా వాచో యత్ర స సర్వవాక్, నిఖిలశాస్త్ర ప్రతిపాద్య ఇత్యర్థః, యత్ ఈశ్వర - ఈశ్వరవిధి - రుద్రాది నియామకః.** బ్రహ్మ, రుద్రుడు మరియు శాస్త్రపండితులు సర్వవాగీశ్వరులు. వారికి ఈశ్వరుడు సర్వవాగీశ్వరేశ్వరుడు.

శ్రీ చిన్మయానంద – కేనోపనిషత్తునుండి: **కేనేషితామ్ వాచమ్ ఇమమ్ వదన్తి**? ఎవరివలన మాటలు వెలువడును? **తదేవ బ్రహ్మమ్ తద్విద్ధి**. బ్రహ్మము కారణంగా. మాటలు అంటే కేవలం శబ్దాలు, ఇంద్రియాలు కాదు. వానికి కారణమైనవాడు నారాయణుడు.

శ్రీ వాసిష్ఠ – వాచస్పతి, అగ్ని, విద్యుత్ వంటివారు వాక్పతులు. వారందరికీ ప్రభువు సర్వవాగీశ్వరేశ్వరుడు. అనేకవిధాల జీవులున్నాయి. వాటికి శబ్దాలు చేసే శరీరభాగాలు వివిధంగా ఉన్నాయి. వీటన్నింటికీ కారణం నారాయణుడే.

809. మహాహ్రదః

- గొప్ప సరస్సు - పాపులను ముంచివేసేది. పుణ్యపురుషులు మరల మరల స్నానం చేసేది.
- లోతైన నీటితో సంబంధంకలవాడు - కాళీయమర్దనము, క్షీరసాగరశయనము సూచింపబడినవి.
- భూమి ఎండిపోకుండా ఉండేందుకుగాను మహాసాగరములను సృష్టించినవాడు.

ఓం మహాహ్రదాయ నమః

హ్రాద - అవ్యక్తే శబ్దే - గర్జించు ధ్వని, అర్థం కాని శబ్దము చేసేది హ్రదము. **హ్రదతే ఇతి హ్రదః**; మహాహ్రదము- గొప్ప హ్రదము (సాగరము).

శ్రీ భట్టుల వ్యాఖ్య – బుద్ధావతారపరంగా,

యత్ర పాపకర్మణః అ-పునరుత్థానమ్ నిమజ్జన్తి

పుణ్యకృతో గాహమ్ గాహమ్ తృప్యన్తి స మహాహ్రదః

పాపులు మరల లేవకుండా మునిగిపోయే సరస్సు. పుణ్యాత్ములు మరల మరల స్నానం చేసి ఆనందించే సరస్సు మహాహ్రదము. అలా భగవంతుడు మహాహ్రదుడు.

తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్

క్షిపామ్యజస్రమ్ శుభాన్ ఆసురీష్వేవ యోనిషు – గీత 16.9

అట్లు ఇతరులను ద్వేషించు పాపాత్ములను, క్రూరులైన నరాధములను మాటిమాటికిని ఈ సంసారమునందు ఆసురీయోనులలోనే నేను పడవేయుచుందును.

శ్రీ వి.వి. రామానుజన్ – ప్రవాహం మధ్యలోసుడిగుండాలు ఎలాంటివో పాపాత్ములైన అసురులకు భగవానుడు అలాంటివాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అవగాహ్య తదానందమ్ విశ్రమ్య సుఖమ్ ఆస్తే యోగిన ఇతి మహాహ్రదః**. ఎవనియందు మునిగి యోగులు పరమానందమును అనుభవింతురో అట్టి చల్లని సరోవరము గనుక ఆ మహాత్ముడు మహాహ్రదుడు. శ్రీహరి శరణాగతి సర్వతాపహరణము.

శ్రీ సత్యసంధ యతిరాజ – **మహాన్ హ్రదో యస్య కాళీయమర్దన కాలే వా సముద్రశయన కాలే వా స మహాహ్రదః**. కాళీయ మర్దన కాలములోను, సాగరశయన కాలములోను లోతైన నీటితో సంబంధము కలవాడు మహాహ్రదుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ –

మహాహ్రదో విష్ణురమోఘ కర్మా కరోతి విశ్వమ్ బహు సాధనాప్తమ్

మహాహ్రదమ్ స కురుతే సముద్రమ్ శుష్యేన భూః సూర్య ఖరాంశుపాతైః

సూర్యుని తాపమువలన భూమి ఎండిపోకుండా గొప్ప సాగరములను సృష్టించినవాడు విష్ణువు. అలాంటి అమోఘమైన పనులను చేసినవాడు మహాహ్రదుడు.

810. మహాగర్తః

- పాపులను సంసారమనే గొప్ప కందకములో (గోతిలో) పడద్రోయువాడు.
- మహాభారతంలో గొప్ప సారధి, రధికుడు.
- గరుడధ్వజముగల గొప్ప రధముపై పయనించువాడు.
- శేషాచలంవంటి గొప్ప పర్వతాలపై నివసించేవాడు.
- విశ్వమంతా దేనినుండి ఉద్భవించి, దేనియందు నివసించి, దేనిలో విలీనమౌతుందో ఆ పెద్ద కందకము.

ఓం మహాగర్తాయ నమః

గృర్ - నిగరణే - మ్రింగివేయుట, బయటకు తెచ్చుట. 'గర్త' అంటే పెద్ద గోయి (కందకము, అగడ్త), రధము అనే అర్థాలున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'గర్త' అంటే అగడ్త (గోయి) అనే అర్థంలో వ్యాఖ్యానించారు. **ఏవమ్ బాహ్య కుదృష్టి వినిస్విష్ట నష్టాత్మనామ్ రౌరవాది గర్తా అస్మాత్ ఇతి మహాగర్తా**. దుర్మార్గులైనవారిని భగవంతుడు రౌరవాది నరకాలలో పడవేస్తాడు. ఆ నరకాలే మహాగర్తలు. అలా వాటిలో పడద్రోసేవాడు మహాగర్త.

పాపాక్రాంత తయానష్ట ప్రజ్ఞానామ్ రౌరవాదయః

గర్తా యస్మాన్మహాగర్తః స స్మృతో వసువర్ణకః

ధర్మవిరుద్ధమైన మార్గమునవలంబించిన పాపకర్ములను, జ్ఞానము లేనివారిని రౌరవాది నరకాలలో పడవేసేవాడు మహాగర్త. ఈ నామము అష్టాక్షరీ మంత్రము. ఓం మహాగర్తాయ నమః.

శ్రీ భట్టులు గీత (9.3)నుండి ఉదాహరించారు –

అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప

అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసార వర్త్మని

ఓ పరంతప! ఈ ధర్మమార్గమునందు విశ్వాసములేని పురుషులు నన్ను పొందజాలరు. కనుక వారు మృత్యురూప సంసారచక్రమునందు పరిభ్రమించుచుందురు.

శ్రీ భగవద్రామానుజుల గీతాభాష్యంలో ఈ శ్లోకం వ్యాఖ్యానం ప్రకారం – ధర్మమార్గంలో చరించడానికి అర్హత పొంది, మరల అశ్రద్ధ, అవిశ్వాసాల కారణంగా ఆ మార్గాన్ని విడచినవారిని గురించి ఈ గీతాశ్లోకంలో చెప్పబడింది. **"అహో! మహాదిదం ఆశ్చర్యం!"** ఇది చాలా ఆశ్చర్యం గదా! (ధర్మం తెలిసి ఉండీ నరకంలో పడడం) అని భగవద్రామానుజులు చివరిలో వ్యాఖ్యానించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'గర్తా' అనగా కందకము, రధము అనే రెండు అర్థాలలోనూ వ్యాఖ్యానించారు. భగవంతుని మాయ దాటరాని కందకము (అగడ్త) గనుక ఆయన మహాగర్త. ఇందుకు శ్రీ శంకరులు గీత (7.14)నుండి ఉదాహరించారు –

దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా

మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే

నా మాయ త్రిగుణాత్మకమైనది. అలౌకికమయినది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని కేవలము నిరంతరము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి సంసార సముద్రమునుండి బయటపడగలరు.

శ్రీ శంకరులు 'గర్త' అనగా 'రధము' అనే అర్థంలో కూడా నిరుక్తము (3.5) ఆధారంగా వ్యాఖ్యానించారు.

రధోऽపి గర్తా ఉచ్యతే, గృణాతేః స్తుతి కర్మణః

స్తుత తమమ్ యానమ్, 'ఆరోహథో వరుణమిత్ర గర్తమ్' – నిరుక్తము 3.5

శ్రీ శంకరుల వ్యాఖ్య – **గర్తా శబ్దో రధ పర్యాయో నైరుక్తైరుక్తః, తస్మాత్ మహారధః మహాగర్తః**. అర్జునుని రధసారధిగా మహాభారతయుద్ధంలో రాణించిన భగవంతుడు మహాగర్త.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ‘రథికుడు’ అనే అర్థంలో వ్యాఖ్యానించారు – **మహాన్ గర్తో గరుడధ్వజ రథో యస్య ఇతి మహాగర్తా.** గరుడధ్వజంతో కూడిన గొప్ప రథం కలిగినవాడు మహాగర్త.

శ్రీ సత్యసంధ యతిరాజ – మహా-అగ-ర్ – మహాగర్త. అగ-కొండ; ర్-గతువా కర్తారి క్తః - వెళ్ళువాడు. **మహాన్తశ్చ తే అగాశ్చ శేషాచలాదయః తత్త ఋచ్ఛతి ఇతి మహాగర్తః.** శేషాచలంవంటి గొప్ప పర్వతాలకు వెళ్ళువాడు (నివసించువాడు) మహాగర్త.

శ్రీ బలదేవ విద్యాభూషణ – భగవంతుడు మహాగర్త, అనగా పెద్ద గొయ్యి. ఎందుకంటే అంతా ఆయనలోనే ఉంటుంది.

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య స చరాచరమ్
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి – గీత 11.7
ఓ అర్జున! నా ఈ రూపమునందు ఒకేచోట స్థితమైయున్న సమస్త చరాచర జగత్తును చూడుము. అంతేగాక ఇంకను నీవు చూడదలచుకొనిన వాటినన్నింటినీ చూడుము.

భగవంతుడు బుద్ధావతారం ధరించి దుష్టులైన అసురులను పెడత్రోవన పట్టించాడన్న అర్థంలో శ్రీ భట్టులు వ్యాఖ్యానించిన నామాలలో ఈ ‘మహాగర్తా’ నామము చివరిది. ధర్మం తప్పినవారిని భగవంతుడు శిక్షించే విధానం గురించి కంటెను భక్తులపట్ల భగవంతుని సౌశీల్యము, సౌలభ్యము అనే గుణాలను స్మరించి గానం చేయడం మరింత ఆనందదాయకము. కాని ఇక్కడ మనం గమనింపవలసిన విషయము ఏమంటే సృష్టిలోని సమస్త కార్యములు భగవంతుని ఇచ్ఛానుసారమే జరుగుతాయి. ఈ ప్రస్తావనలో బుద్ధావతారమును అర్థం చేసుకోవాలి. కర్మఫలాలను అందింపజేయడంలో ఇదొక ఘట్టము.

ఇక్కడినుండి కొన్ని నామములు భగవానుని శిష్టపరిపాలనను కీర్తిస్తాయి.

811. మహాభూతః

- మహాత్ములను తనవారిగా గ్రహించేవాడు.
- త్రికాలములచేత అవిచ్ఛిన్నముగాని స్వరూపము కలవాడు.
- పంచభూతములు తనయందు కలవాడు.

ఓం మహాభూతాయ నమః

భూ - సత్తాయామ్ - ఉండుట, సంభవించుట. భూతము అనగా ఉండునది. నేల, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అనే పంచభూతములనుకూడా భూతములు అంటారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య –

నిగ్రాహకత్వం కథితం స్వస్యైవాజ్ఞాతం ఘనాత్

స్వాజ్ఞానువర్తినాం పుంసా మనుగ్రాహస్తథోచ్యతే

మహాభూతో మహాత్మానః స్వభూతా స యస్యచోచ్యతే

ఇంతవరకు తన ఆజ్ఞను ఉల్లంఘించువారి విషయము, వారిని శిక్షించే విషయము చెప్పారు. ఇప్పుడు తన ఆజ్ఞను పాలించేవారిని తాను (భగవంతుడు) ఎలా అనుగ్రహించేదీ చెప్పబడుచున్నది. మహాత్ములను అందరినీ తనవారిగా గ్రహించేవాడు 'మహాభూతః'. **మహాన్తః భూతాః యస్య స మహాభూతః**. లోకంలో గొప్పవారు, మహనీయులు అతని సొత్తు గనుక ఆయన మహాభూతము. ఇక్కడ మహాత్ములు అనగా భగవంతునియందే మనసు లగ్నము చేసిన భక్తులు.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి 2.3.6 – శ్రీహరి తన భక్తులనుండి ఎడబాటును భరించలేడు. భక్తులు కూడా ఆయననుండి వేరు కాలేరు. కనుక వారిని బాధ పెట్టకుండా ఉండడానికి భగవంతుడు సదా భక్తుల హృదయంలో దీపంలా వెలుగుతుంటాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కాలత్రయా నవచ్ఛిన్న స్వరూపత్వాత్ మహాభూతః**. భూత, భవిష్యత్, వర్తమాన కాలములచే పరిమితము కానివాడు మహాభూతము.

ఇక్కడ మళ్ళీ మనం గమనించవచ్చును – శ్రీ శంకరులు భగవంతుని పరతత్వమును, శ్రీ భట్టులు భగవంతుని సౌలభ్య సౌశీల్యతను ప్రముఖంగా కీర్తించారు. రెండూ శ్రీనివాసుని కళ్యాణగుణములే. కాని ఎన్నో పాపములు తెలిసీ తెలియక చేసే మనలాంటివారికి ఆ దేవుని సౌలభ్య సౌశీల్యతలు ఎంతో ఆశను, ఊరటను ఇస్తాయి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ, శ్రీ సత్యసంధ యతిరాజ – పంచభూతములు ఆయనయందే జనించినవి. ఆయనయందే ఉన్నవి. కనుక ఆయన మహాభూతము. **మహాన్తి భూతాని ఆకాశాదీని యస్మాత్ ఇతి మహాభూతః**.

అన్నమయ్య కీర్తన

పుడమి నిండరి బట్టెభూతము కడు - బొడవైన నల్లనిభూతము

కినిసి వోడమింగెడి భూతము - పునుకవీపు పెద్దభూతము

కనలి కవియు చీకటి భూతము - వొనుగు సోమపుమోము భూతము

చేటకాళ్ళ మించినభూతము - పోటుదారల పెద్దభూతము

గాటపు జడల బింకపుభూతము - జూటరి నల్లముసుగు భూతము

కెలసి బిత్తలే తిరిగేటి భూతము - పొలుపుదాంట్ల పెద్దభూతము
బలుపు వేంకటగిరిపై భూతము - పులుగుమీది మహాభూతము

812. మహానిధిః

- తన భక్తులను అధికప్రేమతో నిధివలె ఆదరించువాడు.
- తన భక్తులకు ఆయనే పెన్నిధి.
- విశ్వమునందు అన్నింటికీ ఆశ్రయమైనవాడు.
- భక్తులు అవుసరంకొద్దీ దోచుకొనే నిధి.

ఓం మహానిధయే నమః

ని (ఉపసర్గ); ధా - ధారణ పోషణయో ర్దానే చ – ధరించుట, పోషించుట, ఇచ్చుట. **నితరామ్ ధీయతే పుష్యత ఇతి, నిధీయతే అత్ర ఇతి నిధిః.** నిలువ చేయునది నిధి. నితరామ్ - పూర్తిగా, ఎల్లపుడూ; నిధి - ఆశ్రయము, నివాసస్థలము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తే నిధివత్ అతి-ప్రియ అస్య ఇతి మహా-నిధిః.** భక్తులను ఎంతో ప్రేమతో, తన నిధివలె చూచుకొనువాడు మహానిధి.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి 10.7.8 – భగవంతునికి పాలకడలి అంటే ఎంత ఇష్టమో, వైకుంఠం అంటే ఎంత ఇష్టమో, నా శరీరమన్నా అంతే ఇష్టము. ఆయనకూ, దివ్యదేశాలకూ ఉన్న సంబంధమే ఆయనకూ, నా దేహానికీ ఉంది. ఆయన నాపై ఆధారపడియున్నాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వభూతాని అస్మిన్ నిధీయన్త ఇతి మహానిధిః.** అన్ని భూతములు ఆయనయందు స్థితమైయున్నాయి. ప్రళయకాలమునందు అన్ని భూతములను తనయందు నిధివలె దాచుకొనును గనుక ఆయన మహానిధి.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **మహాన్తః సూర్యాదయోऽపి గ్రహా యత్ర పక్షిణా ఇవ నిహితా ఇతి మహతామ్ నిధిత్వాత్ స మహా-నిధిః.** సూర్యుడు, గ్రహములు మొదలగునవన్నియు ఆయనయందు పక్షులవలె ఒదిగియుండును గనుక ఆయన మహానిధి.

శ్రీ చిన్మయానంద – భగవంతునినుండే అన్నీ వెలువడుతాయి. ఆయనయందే అన్నీ నిలుస్తాయి. మరియు భక్తులు తమ ఇష్టానుసారము దోచుకొనదగిన నిధి ఆయన.

శ్రీ తిరుమంగైయాళ్వారు తిరుక్కురమ్ తాండకమ్ 1 – మన అవసరానికి తప్పక లభించే నిధి. మనకు ఆధారంగా నిలిచే స్తంభము ఆయన.

శ్రీ తిరుమంగైయాళ్వారు పెరియతిరుమోళి 7.1.7 – నీ కరుణకంటె నాకు వేరుదిక్కు లేదు. నాకు అవుసరానికి దాచుకొన్న నిధి నీవు.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి 6.7.11 – ముందు అవుసరాలకు దాచుకొన్న నిధి మధుసూదనుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ ఈ నామును రెండు గుణాల మేలుకలయికగా వివరించారు – **శ్రీ భగవాన్ హి భక్తైః ప్రధమమ్ పూజ్యతే తతశ్చ తస్య మనోమయీ ప్రతిమా హృదయే నిధీయతే ధ్యాయతే చ**. భక్తులు ప్రధమంగా పూజించే మహాత్ముడు (మహా) శ్రీ భగవానుడు. మరియ భక్తులు ఆయను నిధివలె హృదయంలో దాచుకొందురు. ఓం మహానిధయే నమః.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోऽనిలః
అమృతాశోऽమృతవపుస్సర్వజ్ఞః సర్వతోముఖః || (87)

813. కుముదః

- ప్రకృతిమండలములో మహాత్ములతో (భక్తులతో) కలిసి ఆనందించేవాడు.

- దుష్టులను సంహరించి భూమికి ఆనందము కలిగించేవాడు.

- మంగళకరమైన పరమపదమును ప్రసాదించేవాడు.

- నీలికలువల దండను ధరించేవాడు.

ఓం కుముదాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

63వ శ్లోకము. 596వ నామము. కుముదః – **శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః**

87వ శ్లోకము. 813వ నామము. కుముదః – **కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోऽనిలః**

కు-ముదః – కుముదః. కై - శబ్దే - ధ్వనించుట. **కౌతు ధన్వతి ఇతి కుః**. ధ్వని చేసేది 'కుః'. **కుః పృథివీ పృథ్వీ** (అమరకోశము). ముద - హర్షే - సంతోషించుట. **మోదత ఇతి ముదః, మోదయతి ఇతి ముదః**. సంతోషించునది, సంతోషింపజేయువాడు;

కు-ము-దః – కుముదః. కు - భూమి, ము - ముక్తి, ద - ఇచ్చువాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – కౌ - ప్రకృతిమండలే- ప్రాకృతలోకం (భూమి)యందు కూడా, ముద - మోదతే - సంతోషించువాడు (భక్తుల సాంగత్యంలో).

ప్రాకృతే మండలే భూమౌ మోదనాచ్చ మహాత్మభిః

ముక్తి భూమి ప్రదానాద్వా కుముదః పరికీర్తితః

ప్రకృతిమండలమునందు మహాత్ములతో ఆనందించువాడు. భూమిమీద మోక్షమునిచ్చువాడు. పరలోకానికి సంబంధించిన మోక్షమునుకూడా ఇచ్చువాడు (ఇహపరములను ప్రసాదించువాడు) కుముదుడు.

శ్రీ వి.వి. రామానుజన్ వివరణ – భగవానుడు మానవజన్మమెత్తినందువలన ఎన్నో కష్టాలు అనుభవించాలి. అరణ్యకాండము (67.24)లో రాముడు ఇలా అన్నాడు – **రాజ్యాత్ భ్రంశః వనే వాసః సీతా నష్టః హతో ద్విజః.** నేను రాజ్యాన్ని కోల్పోయాను. అడవులలో ఉంటున్నాను. సీత దూరమైంది. ఇప్పుడు ఈ పక్షి (జటాయువు) కూడా చంపబడింది – ఇన్ని కష్టాలు ఉన్నా భగవంతుడు రామునిగా అత్రి, భరద్వాజుడు, అగస్త్యుడు వంటి మునుల సాంగత్యంలో సంతోషించాడు.

శ్రీ చిన్మయానంద – ఈ సృష్టిని చేయడం, దానిని నడపడం అనే బృహత్తర, అనితర కార్యాలు భగవంతునికి ఆనందాన్ని కలుగజేస్తాయి ఎందుకంటే ఇవి ఆయనకు మాత్రమే సాధ్యమయ్యే పనులు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **కుమ్ ధరణీమ్ భార అవతరణమ్ కుర్వన్ మోదయతి ఇతి కు-ముదః.** భూమి భారాన్ని తగ్గించి (దుష్టులను నాశనం చేసి) సంతోషించేవాడు కుముదుడు. ఈ దుష్టనిగ్రహణ కొరకే ఆయన అవతరిస్తాడు. భక్తులను రక్షిస్తాడు.

ఇక్కడ కూడా శ్రీ శంకరులు మరియు శ్రీ భట్టుల వ్యాఖ్యానాలలో అనుభవ భేదాన్ని మనం గమనింపవచ్చును. ఇద్దరూ 'ముదము' అనగా 'ఆనందము' గురించే చెప్పారు. శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారం భగవంతుడు దుష్టులను శిక్షించి, భూభారం తగ్గించి సంతోషం పొందుతాడు. శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారం భగవంతుడు భూమిపై భక్తుల సాన్నిహిత్యంలో ఆనందం పొందుతాడు. శ్రీ శంకరులు భగవంతుని శక్తిని ప్రధానంగా చెప్పగా శ్రీ భట్టులు భగవంతుని భక్త సౌలభ్య సౌశీల్య గుణాలను వర్ణించారు.

శ్రీ ఎమ్. వి. రామానుజాచార్య – కు - భూమి, ము - ముక్తి, దః - ఇచ్చువాడు. ముక్తి లోకము, అనగా పరమపదమును ఇచ్చువాడు కుముదుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – కు - ఆకాశము (కై-శబ్దే). **శబ్దవత్ ఆకాశే మోదయతి ఇతి కుముదః, శబ్దాశ్రయే ఖే మోదత ఇతి కుముదః సూర్యః.** సూర్యునిగా ఆకాశంలో వెలుగుతూ సంతోషించేవాడు కుముదుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **ఉత్పలధరో కుముదః.** నీలికలువ పూలమాలను ధరించువాడు కుముదుడు.

814. కున్దరః

- (కుంద-రః) పరతత్వ జ్ఞానమును ప్రసాదించేవాడు.
- (కున్-దరః) అనేక జన్మలలో పేరుకుపోయిన పాపములను తొలగించువాడు.

- (కుంద-రః) కుంద పుష్పములువంటి స్వచ్ఛమైన, పరిశుద్ధమైన ఫలములను ప్రసాదించేవాడు.
- (కుమ్-దరః) హిరణ్యాక్షుని వెతుకుతూ వరాహరూపంలో భూమిని పెకలించినవాడు.
- కామితార్థములను ప్రసాదించువాడు.
- (కుమ్-దరః) భూమిని పెకలించి సముద్రములను సృష్టించినవాడు.
- (కుంద-రః) భక్తులు సమర్పించే కుంద పుష్పములను స్వీకరించి ఆనందించువాడు.

ఓం కున్దరాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు నామము '**కుముదః**'లో 'కు' అనగా 'భూమి' అన్న అర్థం చెప్పడమైనది. ఇప్పుడు '**కుందరః**' నామంలో శ్రీ భట్టులు 'కు' అంటే 'భూమి'కి బదులు 'ముక్తిభూమి' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. 'కుందము' అనగా ముక్తిభూమి నిచ్చేది. అనగా పరతత్వ జ్ఞానము. అలాంటి పరతత్వ జ్ఞానమును ప్రసాధించువాడు కుందరుడు.
శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి 2.3.2 – నాకు నిజమైన జ్ఞానమును ప్రసాదించిన ఆచార్యుడవు నీవే.

తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే – గీత 10.10
అట్లు నిరంతర ధ్యానాదులద్వారా నాయందే లగ్నమనస్కులై భక్తిశ్రద్ధలతో నన్నే భజించువారికి నేను బుద్ధియోగమును ప్రసాధించెదను. దానిద్వారా నన్నే పొందుదురు.

నిరుక్తి రచయిత ఈ నామమునకు ఇచ్చిన వ్యాఖ్య – **కుమ్ అవ్యయమ్ పాప-వాచి, తస్య దారణాత్ కున్దరః**. 'కు' అనగా పాపమును సూచించును. దానిని ఛేదించువాడు కున్దరుడు. అనేక జన్మలలో ప్రోగుపడిన పాపములను పటాపంచలు చేయువాడు కున్దరుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ ఈ నామమునకు చెప్పిన మూడు అర్థాలలో ఇదికూడా ఒకటి. **త్యజేత్ కు-జన సంగమమ్** – అని అమరకోశ వ్యాఖ్యానం ఉంది. పాపుల తోడు కూడదని దాని అర్థము. శ్రీ వాసిష్ఠ వ్యాఖ్య – **కుమ్ - పాపమ్ దృణాతి స్వ-సేవానామ్ ఇతి కుమ్-దరః**. తన భక్తుల పాపములను చీల్చివేసేవాడు కుందరుడు. **స ఏవ బుద్ధిమ్ జరితుర్-విశోధ్య సు-మేధసమ్ తమ్ కురుతే స విష్ణుః**. అలా వారి పాపములను తొలగించి బుద్ధికి జ్ఞానమును కలుగజేయువాడు విష్ణువు. (మిగిలిన రెండు అర్థాలు తరువాత చెప్పబడినవి).

శ్రీ శంకరులు కూడా ఈ నామమునకు మూడు అర్థాలు చెప్పారు
(1) **కుంద పుష్పాని శుద్ధాని ఫలాని రాతి దదాతి ఇతి కుంద-రః**. కుందపుష్పములు (మల్లెలు? మొల్లలు?) వలె పరిశుద్ధమైన ఫలములను ప్రసాదించువాడు కుందరుడు.

(2) **కుందపుష్ప తుల్యాని శుద్ధాని ఫలాని లాతి ఆదత్తే ఇతి కుందరః**. (లా-ఆదానే దానేచ – గ్రహించుట). కుందపుష్పముల వంటి పరిశుద్ధమైన నివేదనలను స్వీకరించువాడు కుందరుడు. ఇక్కడ 'ల' మరియు 'ర' ధాతువులను ఒకదానిబదులు మరొకటి వాడవచ్చునన్న సూత్రమును గ్రహించాలి (ర-ల-యోః ఏకత్వాత్ స్మరణాత్).

(3) శ్రీవరాహావతారపరంగా (కుమ్-భూమి, దార-చీల్చుట) **కుమ-ధరామ్ దారయామాస హిరణ్యాక్ష జిఘుంశయా వారాహమ్ రూపమ్ ఆస్థాయ ఇతి వా కున్-దరః**. శ్రీవరాహమూర్తియై హిరణ్యాక్షుని వెదుకుతూ భూమిని పెకలించినందున కుందరుడు.

శ్రీ వాసిష్ఠ 'కము - కాంతౌ - కోరుకొనుట' అనే అర్థంలో కూడా వ్యాఖ్యానించారు. (ఉనాది సూత్రము 4.98 అబ్దాదయశ్చ) **కామయత ఇతి కుందః కమనీయః**. ప్రీతితో కోరుకొనబడునది కుందము. **కమనీయమ్ వాంఛితమ్ దదాతి ఇతి కుంద-రః**. ఇష్టంగా కోరుకున్నదానిని ప్రసాదించేవాడు కుందరుడు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – **కుమ్-పృథ్వీమ్ దారయతి ఇతి కుందరః. స కుందరో నామ విదార్య భూమిమ్ స ఆత్మశక్త్యా కురుతే సముద్రమ్.** భూమిని చీల్చి సాగరములను సృష్టించినవాడు కుందరుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – **భక్త సమర్పిత కుందపుష్పేణ రమతి ఇతి కుంద-రః**. భక్తులు సమర్పించిన కుందపుష్పములు స్వీకరించి సంతోషించువాడు కుందరుడు.

815. కుందః

- పరతత్వ జ్ఞానమును అంచెలంచెలుగా ప్రసాదించువాడు.
- భక్తుల పాపములను శుభ్రపరచి, అవి తిరిగిరాకుండా చేసేవాడు.
- కుంద (మల్లె) పుష్పములవలె స్వచ్ఛమైన, సుందరమైనవాడు.
- కుంద పుష్పములవంటి స్వచ్ఛతను భక్తులకు ఇచ్చేవాడు.
- 'కుంతః' – 'కుంత' అనే శూలమును ధరించినవాడు.
- కుంత శూలమువలె పదునుగా భక్తుల పాపములను తొలగించేవాడు.
- కశ్యప ఋషికి భూమిని దానమిచ్చినవాడు.
- భూమిపైనుండి దుష్టులైన క్షత్రియులను నాశనము చేసినవాడు.
- సూర్యకాంతి, వర్షమువంటివానిద్వారా భూమిని పరిశుద్ధము చేయువాడు.

ఓం కుందాయ నమః

ఇంతకుముందు నామము 'కుందరః' వివరణలో చెప్పినట్లుగా 'కు' అంటే భూమి, పాపము అనే రెండు అర్థాలున్నాయి. 'కుందము' అనగా మల్లెపూవు. '**కుందరః**', '**కుందః**'నామములమధ్య కొంత సారూప్యత ఉన్నది. 'ద' అనే శబ్దనికి 'దదాతి' (ఇచ్చును), 'దాయతి' (శుభ్రము చేయును), 'ద్యాతి' (తొలగించును) అనే అర్థాలు చెప్పుకొనవచ్చును. ఇలా వివిధ అర్థాలు వస్తాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'కుంద' అనగా 'పరతత్వ జ్ఞానము' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. 'కుందః' అనగా అలాంటి జ్ఞానాన్ని ప్రసాదించేవాడు. ఇంతకుముందరి నామము 'కుందరః'కు కూడా ఇదే అర్థాన్ని చెప్పారు. కాని తేడా ఏమిటంటే – ధ్యాన యోగాది సాధనలద్వారా జ్ఞానమును సంపాదించడం మొదలుపెట్టినవారికి పరాభక్తి, పరాజ్ఞానము, చివరిగా పరమభక్తి, ఇలా అంచెలంచెలుగా ప్రసాదించేవాడు 'కుందః'.

శ్రీ భట్టులు 'కు' అనగా 'పాపము' అనే అర్థంలో మరొక వ్యాఖ్యానంకూడా చెప్పారు. (దైప్ - శోధనే - శుద్ధి చేయుట). **పాపమ్ దాయతి శోధయతి ఇతి కుందః**. ఇక్కడ కూడా 'కుందరః' మరియు 'కుందః' నామములకు చెప్పిన స్వల్ప అంతరాన్ని గమనించాలి. **పాపమ్ దారయతి ఇతి కుందరః, అపి చ విదారితమ్ పాపమ్ శోధయతి ఇతి కుందః**. భక్తుల పాపములను తొలగించువాడు కుందరుడు. అలా తొలగించిన పాపములు తిరిగిరాకుండా వాటిని (పాపాలను) శుద్ధి చేసేవాడు కుందుడు.

కుమవ్యయం పాపవాచి కుందరస్తస్య దారణాత్
భక్తేభ్యః పరభక్త్యాది ప్రదానాత్కుంద ఉచ్యతే
విదారితుం పాపజితం కుందశ్శోధయతీతివా

శ్రీ వాసిష్ఠ చెప్పిన అర్థాలలో ఇదికూడా ఒకటి. **కుమ్ ఇతి పాపార్థకమ్ అవ్యయమ్, తద్ ఖండయతి ఇతి కుందః. యద్ వా కుమ=పాపమ్ దాయతి+శోధయతి ఇతి కుందః** (దో - అవఖండనే, దైప్ - శోధన).

శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి పాశురము (2.6.1)లో 'కుంద' అనే నామమును వాడారు. శ్రీదేవుడు భక్తుల పాపములను తొలగించి, వాటిని దుర్మార్గులకు కర్మఫలంగా ఇస్తాడట. ఇక్కడ 'కుందము' అనగా మల్లెపూవు అనే అర్థాన్ని గ్రహింపవచ్చును. మల్లెపూవువలె స్వచ్ఛమైనవాడు లేదా మల్లెవంటి స్వచ్ఛతను ప్రసాదించేవాడు కుందుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు కూడా ఈ నామమునకు బహుళ వ్యాఖ్యలు చెప్పారు

కుందోపమ సుందరాంగత్వాత్ స్వచ్ఛతయా స్ఫటికనిర్మలః కుందః. కుందపుష్పమువలె అందమైనవాడు, స్వచ్ఛమైనవాడు కుందుడు.

కశ్యపునికి భూమి ('కు')ని దానముగా ఇచ్చినవాడు గనుక భగవంతుడు కుందుడు.

కార్తవీర్యుని చేతులు ఖండిస్తున్న పరశురాముడు. 1870 కాలపు చిత్రం. వికీపీడియా నుండి

సర్వపాప విశుధ్యార్థమ్ వాజిమేధేన చేష్టవాన్

తస్మిన్ యజ్ఞే మహాదానే దక్షిణామ్ భృగునందనః

మారీచాయ దదౌ ప్రీతః కశ్యపాయ వసుంధరామ్ – హరివంశము 31.106

తన పాపములను పోగొట్టుకోవడానికి భృగునందనుడు (పరశురాముడు) అశ్వమేధయాగం చేశాడు. ఆ యాగంలో మహాదానంలో భాగంగా ప్రీతితో భూమినంతటినీ కశ్యపునికి (మరీచుని కుమారుని) దానమిచ్చాడు.

శ్రీ శంకరులు చెప్పిన మూడవ అర్థము – **కుమ్ పృథ్వీమ్ ద్యాతి ఖండయతి వా కుందః**. భూమిపై దుష్టక్షత్రియులను నాశనం చేసినవాడు కుందుడు.

నిః క్షత్రియామ్ యశ్చ చకార మేదినీమ్ అనేకశో బాహువనమ్ తథాంచినత్

యః కార్తవీర్యస్య స భార్గవోత్తమో మమాస్తు మాంగల్య వివృద్ధయే హరిః – విష్ణుధర్మము 43.37

భూమిపై దుష్ట క్షత్రియులను అనేకమార్లు సంహరించినవాడు, కార్తవీర్యుని బాహువులను ఖండించినవాడు అయిన భార్గవరాముడు నాకు శుభములు ప్రసాదించుగాక.

శ్రీ వి.వి. రామానుజన్ తిరుప్పావై పాశురము (**నిన్ కైయిల్ వేల్ పోట్రి**) ఆధారంగా ఈ నామమునకు –'కుంత' అనే శూలమును ధరించినవాడు – అని అర్థం చెప్పారు. అలాగే శ్రీ ఉత్తమూర్ వీరరాఘవాచార్యస్వామి శ్రీ నమ్మాళ్వారు పాశురంలో 'కుంత' అనే పదాన్ని ఉదాహరించారు. ఈ ప్రకారంగా ఈ నామమును '**కుందః**' బదులుగా '**కుంతః**' అని పరిగణింపవచ్చును. భక్తుల పాపాలను హరించడంలో శూలంవలె పదునైనవాడు అని అర్థము.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన మరొక అర్థము – కు - భూమి; ద - దాయతి - శోధయతి - శుద్ధి చేయువాడు. **పృథ్వీమ్ వర్షణేన శోధయతి ఇతి కుందః**. భూమిని వర్షమువంటివానితో పరిశుద్ధము చేయువాడు కుందుడు.

816. పర్జన్యః

- మేఘమువలె తన అనుగ్రహాన్ని వర్షించి, భక్తుల తాపత్రయములను దూరముచేయువాడు.
- ఆయన కారణంగా ఉత్తమ జన్మలు సంప్రాప్తించును.
- రక్షించువాడు.

ఓం పర్జన్యాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – అజ - అర్దనే - చెడగొట్టుట. **స్వ తత్త్వ జ్ఞాన దానేన నిత్యం తాపత్రయాపహా పర్జన్యస్స స్సమాఖ్యాతః**. భక్తులకు తనను గురించిన తత్త్వాన్ని ప్రసాదించి తాపత్రయములనుండి కాపాడువాడు పర్జన్యుడు.

తాపత్రయములనగా మూడు విధములైన తాపములు – (1) ఆధ్యాత్మిక తాపము : తన శరీరము, ఆత్మలవలన కలిగే తాపము. వ్యాధులు, మానసిక బాధలవంటివి. (2) ఆధిదైవిక తాపము : దేవతల కారణంగాను, కర్మలవలన, యక్ష రాక్షస పిశాచాదులవలనను కలిగే బాధలు. (3) ఆధిభౌతిక తాపము : ఇతర జంతువులు, వ్యక్తులు, ప్రకృతి కారణాలు వంటివానివలన కలిగే బాధలు. ఈ మూడు విధములైన తాపములను తన అనుగ్రహంతో వర్షించి చెదరగొట్టే కరుణామయుడు పర్జన్యుడు. భగవంతుని ఆళ్వారులు పలుమార్లు మేఘంతో పోల్చారు.
శ్రీ తిరుమంగైయాళ్వారు తిరునేడుమ్ దండకము 30 – నీవు కొందరికి వర్షమేఘం వంటివాడవు. మరికొందరికి అగ్నిలాంటివాడవు. అనేకులకు చల్లని వర్షంవంటివాడవు.
స్వామిదేశికన్ శరణాగతి దీపిక 23 – **తాపత్రయేణ విహితమ్ న భజన్తి సంతః సంసార ఘర్మ జనితేన సమాధిమన్తః**. నీ పట్ల భక్తియోగంలో మగ్నులైనవారు సంసారమనే అగ్నియందు జనించిన తాపత్రయములవలన బాధపడరు.

శ్రీ శంరుల వ్యాఖ్య – **పర్జన్యత్వాత్ ఆధ్యాత్మికాది తాపత్రయమ్ సమయతి ఇతి.** మేఘములు తమ వర్షముతో భూమిని చల్లబరచినట్లుగానే భగవంతుడు ఆధ్యాత్మికాది తాపత్రయములను శమింపజేయును గనుక ఆయన పర్జన్యుడు.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – **సర్వాన్ కామాన్ అభివర్షతి ఇతి పర్జన్యః**. కోరుకున్నవాటిని వర్షించేవాడు పర్జన్యుడు. కొండలంత వరములు గూపెడువాడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ 'పరిజన్యః' అని చెప్పారు. **పరిత ఆసీనా జనాః పరిజనాః, తేభ్యో హిత-తమః ఇతి పరిజన్యః, 'ఇ'కార లోపే పర్జన్యః**. ఆయనను ఆశ్రయించుకొని ఉన్నవారు (భక్తులు) పరిజనులు. వారికి, అనగా పరిజనులకు హితము చేయువాడు పరిజన్యుడు. 'ఇ'కార లోపము వలన పర్జన్యుడు.

శ్రీ వాసిష్ఠ – పృష్ - సేచనే - చల్లుట. **పర్షతి - సించతి ఇతి పర్జన్యః**. వర్షించువాడు పర్జన్యుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా ఇదే అర్థం చెప్పారు. **తస్యామ్ చింతభూమౌ వర్షతి నిజరూప అమృతమ్ ఇతి పర్జన్యః**. తన భక్తుల మనస్సులలో తన స్వరూపామృతాన్ని వర్షించేవాడు పర్జన్యుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – **పరమ్ జన్యమ్ యస్మాత్ పర్జన్యః**. ఎవని కారణంగా ఉత్తమ జన్మలు లభిస్తాయో ఆయన పర్జన్యుడు.

శ్రీ వాసిష్ఠ ఈ నామమునకు ఆరు రకాల వ్యుత్పత్తులను సూచించారు. వాటిలో ఒకటి – 'పృ'-పాలన పోషణయోః - రక్షించుట, నింపుట. దీనికి 'అన్య' ప్రత్యయము కలిసినప్పుడు 'పర్జన్యః' అవుతుంది. అనగా 'రక్షించువాడు'.

817. పావనః

పవనః

- వాయువురూపంలో ఉన్నవాడు.
- భక్తుల కష్టములు బాపుటకై స్వయముగ వారివద్దకు వచ్చువాడు.
- గాలి, అగ్ని, నీరువంటి రూపములలో పవిత్రము చేయువాడు.
- రక్షించేవారిని (అనగా రాజులను) రక్షించేవాడు (పా-అవనః)

ఓం పవనాయ నమః

ఓం పావనాయ నమః

32వశ్లోకము – **భూతభవ్య భవన్నాధః పవనః పావనోఽనలః**

87వ శ్లోకము – **కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః**

శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారము 32వ శ్లోకంలోని 292వ నామము 'పవనః' మరియు 293వ నామము 'పావనః'. ఇక ఈ 87వ శ్లోకములోని ఈ 293వ నామమును 'పవనః'గాను, 'పావనః' గాను కూడా పరిగణించినట్లు కనిపిస్తున్నది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు ఈ నామమును 'పవి' - వెళ్ళుట - అనే ధాతువు ఆధారంగా వ్యాఖ్యానించారు. అమరకోశం వ్యాఖ్యానం ప్రకారం 'పూంగ్'-పవనే; **పవత ఇతి పవనః, పునీతే వా**. వెళ్ళునది, ప్రవహించునది, పునీతము చేయునది అనే అర్థాలున్నాయి.

292వ నామము 'పవనః'కు శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు తన శక్తిలో అదికొద్దిపాటి భాగంతోనే వాయువుగా సంచరిస్తుంటాడు.

ప్రస్తుత 817వ నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – (పవి-వెళ్ళుట) **పవతే ఇతి పవనః**. భగవంతుడు స్వయంగా తన భక్తులవద్దకు వెళ్ళి వారి కష్టాలు తొలగిస్తుంటాడు.

శ్రీ తిరుమంగైయాళ్వారు పెరియతిరుమొళి 1.10.9 – నీవు నీ ఇష్టానుసారం వచ్చి నా హృదయంలో నెలకొనియున్నావు.
శ్రీ నమ్మాళ్వారు తిరువైమొళి 5.7.7 – భగవంతుడా! దయతో నీవు నా హృదయంలో ప్రవేశించావు. కరుణించి ఇక్కడే ఉండు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 32వ శ్లోకంలోని 'పవనః' నామమునకు శ్రీ శంకరుల వ్యాఖ్య: భగవంతుడు వాయువుగా పవిత్రము చేయును గనుక పవనుడు. ఇందుకు ప్రమాణంగా శ్రీ శంకరులు గీత (10.31)నుండి ఉదాహరించారు. **పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్**. చలించువానిలో (పవిత్రము చేయువానిలో) నేను వాయువును. ఆయుధధారులలో రాముడను.

ప్రస్తుత (87వ శ్లోకంలోని) నామమునకు శ్రీ శంకరుల వ్యాఖ్య – **స్మృతిమాత్రేణ పునాతి ఇతి పవనః**. స్మరించినంతనే పవిత్రము చేయువాడు పవనుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – శ్రీ విష్ణుసహస్రనామము పూర్వపీఠికలో **'పవిత్రాణామ్ పవిత్రమ్ యః'** అని ఉంది. భగవంతుని స్మరించుట, ఆయన దివ్యమంగళ విగ్రహాన్ని అర్చించుట, ఆయనను కీర్తించుట, పూజించుట, ధ్యానించుట, ప్రణామము చేయుట – ఇవన్నీ కూడా మన పాపములను తొలగించుకొనే మార్గాలు. పవిత్రజలాలలో స్నానం చేయుట, పుణ్యక్షేత్రాలు దర్శించుట కూడా ఇలాంటి కార్యాలే.

శ్రీ చిన్మయానంద 87వ శ్లోకంలోని నామాన్ని 'పావనః' అని పరిగణించారు. అహంకారము, కామము, ప్రలోభములు పాపములకు కారణాలు. అలాంటి మాలిన్యాలను తొలగించుకోవడానికి మనం సదా భగవంతుని మనసులో నిలుపుకోవాలి. సదా పవిత్రం చేసేవాడు పావనుడు.

శ్రీ వాసిష్ఠ కూడా 'పావనః' అనే నామాన్ని పరిగణించారు. కాని 'పవనః' అన్నా, 'పావనః' అన్నా ఒకే అర్థం వస్తుందని వ్యాఖ్యానించారు.
స పావనో విష్ణు రమర్త్యకర్మా పునాతి విశ్వమ్ వివిధ ప్రభేదైః
స ఏవ సూర్య స హి వాస్తి వాయౌ జలే స్థలే వా సవితా స ఏవ
భగవంతుడైన విష్ణువు గాలిగా వీచి, అగ్నిగా కాల్చి, నీటిగా కడిగి, భూమిగా లోగొని తన పవిత్రముచేసే తత్త్వమును అంతటా తెలియజేస్తున్నాడు.

ఋగ్వేదము 1.160.3 – **పునాతి ధీరో భువనాని మాయయా.**
నిరుక్తము 5.6 – **వాయుః పవిత్రమ్ స మా పునాతు అగ్నిః పవిత్రమ్ స మా పునాతు.**

శ్రీ సత్యసంధ యతిరాజ – పా-అవనః = పావనః; **పాన్తి ఇతి పా రాజానః, తేషామ్ అవనమ్ యస్మాత్ ఇతి పావనః**. రక్షించేవారు రాజులు. అలాంటి రాజులను రక్షించేవాడు పావనుడు.

818. అనిలః

- మరెవ్వరి ప్రేరణ (ప్రోత్సాహము) లేకుండానే భక్తులకు దీవెనలు ప్రసాదించువాడు (అన్-ఇలః).
- ఆయనకు ఆదేశము ఇచ్చేవారుండరు.
- తన భక్తులకు తేలికగా అందుబాటులో ఉండేవాడు (అ-నిలః).
- అన్నింటికీ ప్రాణమైన ఊపిరినిచ్చేవాడు.
- సదా జాగరూకుడై ఉండేవాడు.
- ఆధారము అవుసరం లేనివాడు.
- స్థిరమైన ఆవాసము లేనివాడు. వాయురూపమున సంచరించేవాడు.
- అంతము లేనివాడు.
- పాపపుణ్యములకు కట్టబడనివాడు.
- (కంసుని వధించి, ఉగ్రసేనునకు) రాజ్యమునిచ్చినవాడు.
- (రుక్మిణిని రక్షించుటకొరకు) నిదురలేని రాత్రులు గడిపినవాడు.

ఓం అనిలాయ నమః

ఈ నామము రెండుమార్లు వచ్చినది.

25వ శ్లోకము. 236వ నామము. అనిలః – **అహః సంవర్తకో వహ్నిరనిలో ధరణీధరః**

87వ శ్లోకము. 818 నామము. అనిలః – **కుముదః కుందరః కుందః పర్జన్యః పావనః అనిలః**

ఈ నామములో 'ఇల' శబ్దమునకు 'ప్రేరేపించుట' అని అర్థము. ఆప్టే నిఘంటువులో నిదురించుట, వెళ్ళుట, కదలుట, విసురుట అనే అర్థాలుకూడా ఇవ్వబడ్డాయి. (ఇల - స్వప్న క్షపణయోః - నిదురించుట, వెళ్ళుట). శ్రీ భట్టులు ఈ నామము వివరణను 'అన - ప్రాణనే - బ్రతుకుట' అనే ధాతువు ఆధారంగా కూడా చెప్పారు. 'ఇల' అంటే భూమి అనే అర్థంకూడా ఉంది.

శ్రీ భట్టులు ప్రస్తుత (818వ) నామము 'అనిలః'ను 'ఇల - ప్రేరణే' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. ఒక పని కొరకు ఎవరైనా వ్యక్తిని ప్రేరేపించే వ్యక్తిని 'ఇల' అని ప్రస్తావిస్తారు. భగవంతుడు ఎవరిచేతను ప్రేరేపింపబడడు గనుక ఆయన అనిలుడు. అందుకు శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణ. విష్ణుధర్మము 74.42 – **తదస్య ప్రార్థితమ్ ధ్యాతో దదాతి మధుసూదనః** మధుసూదనుని ధ్యానించినట్లయితే తన భక్తులపై వరాలు వర్షిసాడు.

స్వస్య స్వస్మాత్ప్రేరకోఽస్య ప్రపన్నానుగ్రహే సదా

నాస్తీతి నోऽనిలః ప్రోక్తో మున్యర్ణో మనురుత్తమః
ప్రపన్నులను అనుగ్రహించడానికి తనకన్న మరియొక ప్రేరకుడు లేనివాడు. ఈ నామము సప్తాక్షరి. ఉత్తమమైనది. ఓం అనిలాయ నమః.

శ్రీ శంకరులు చెప్పిన అర్థాలలో ఒక్కటి – **ఇలతి ప్రేరణమ్ కరోతి ఇతి ఇలః, తద్ రహితత్వాత్ అనిలః**. ప్రేరణము చేయువాడు 'ఇలః'. అలాంటి ప్రేరకుడు లేనివాడు అనిలుడు. భగవంతునికి చెప్పేవారూ, ఆదేశించేవారూ ఎవరూ ఉండరు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక అర్థం భగవంతుని భక్త సౌలభ్యాన్ని సూచిస్తుంది. (అ-నిలః) నిల్ - గహనే - లోతైనది, మందమైనది, అర్థం కానిది 'నిలః'. **అ-గహనః అ-నిలః భక్తేభ్యః సులభః**. భక్తులకు అందుబాటులో ఉండేవాడు అనిలుడు.

25వ శ్లోకం 236వ నామమునకు శ్రీ భట్టులు చెప్పిన వ్యాఖ్య – అన్ - ప్రాణనే - జీవించుట, శ్వాసించుట. **అననాత్ ఉజ్జీవనాత్ అనిలః**. ఆయన అందరియందు ఊపిరిగా ఉండి వారిని బ్రతికిస్తున్నాడు గనుక అనిలుడు.

తిరువైమొళి 5.6.2 – మనచుట్టూ ఉన్న వాయువంతా ఆయనయందు చిన్న భాగమే.
తైత్తరీయ నారాయణము 7 – **కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్?** ఆకాశం (పరమాత్మ) లేకుండా ఎవరు శ్వాసించగలరు? ఎవరు జీవింపగలరు?
పురుష సూక్తము 14 – **ప్రాణాత్ వాయుర్ అజాయత్**. ఆయన శ్వాసనుండి వాయువు జన్మించినది.
ఇక్కడ గమనించవలసిన విషయం – ఈ వ్యాఖ్యానంలో 'అనిలః' అంటే 'గాలి' అని అర్థం ఉన్నదనుకోరాదు. భగవంతుని శ్వాస (ప్రాణము)వల్ల గాలి మరియు సమస్త జీవులు ఆధారపడి ఉన్నాయి.

శ్రీ శంకరులు మరికొన్ని వ్యాఖ్యానాలు ఇచ్చారు. (అన్-ఇలః). ఇల - నిదుర. **ఇలతి స్వపితి ఇతి అజ్ఞః ఇలః, తద్ విపరీతో నిత్యప్రబుద్ధ స్వరూపత్వాత్ ఇతి వా అనిలః**. 'ఇలతి' అనగా 'నిదురించును' అనగా అజ్ఞాని. అలా కాకుండా సంపూర్ణజ్ఞాని అయినవాడు అనిలుడు.

25వ శ్లోకంలోని నామానికి శ్రీ రాధాకృష్ణశాస్త్రి వివరణ – ఇల - భూమి - అనగా ఆధారము. అన-ఇలః - అనిలః - ఆధారము అవుసరంలేనివాడు. **అవిద్యమానా ఇలా ఆశ్రయతయా అన్-ఇలః**. భూమి, గాలి వంటి ఆధారములు లేనివాడు అనిలుడు.

అమరకోశము వ్యాఖ్యానము – **న విద్యతే నిలః నిలయమ్ స్థానమ్ యస్య ఇతి అనిలః**. స్థిరమైన స్థానము (నిలయము) లేనివాడు అనిలుడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక వ్యాఖ్య – **అనాదిత్వాత్ అనిలః**. ఆది, అంతము లేనివాడు అనిలుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ 'అనిలః' బదులు **'నిలః'** అనే పాఠం గ్రహించినట్లు అనిపిస్తున్నది. **నితరామ్ లాతి గృహ్ణాతి ఐకాంతినో భక్తాన్ ఇతి.** తదేక ధ్యానమగ్నులైన భక్తులను పూర్తిగా తనవైపు ఆకర్షించేవాడు.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – **అనాదానాత్ అనిలః.** బంధింపబడనివాడు అనిలుడు. అనగా శ్రీరాధాకృష్ణశాస్త్రి ఇలా వివరించారు. **నిలాతి ఆదత్తే పుణ్యమ్ పాపమ్ వా.** పుణ్యము గాని, పాపముగాని ఆయనను అంటవు.

శ్రీ బలదేవ విద్యాభూషణ మరొక వ్యాఖ్య – **కంసవధ నిర్జితాయా ఇలాయా భూమేః ఉగ్రసేన దానాత్.** కంసుని వధించిన తరువాత భూమిని (రాజ్యాన్ని) ఉగ్రసేనునకిచ్చినవాడు అనిలుడు.

శ్రీ విద్యాభూషణ మరొక వ్యాఖ్య – ఇల - నిదుర; అనిలః - నిదుర లేనివాడు; **రుక్మిణీ స్పృహయా నిద్రా పరిత్యాగాత్ అనిలః.** రుక్మిణిని (రక్షించడం) గురించి ఆలోచిస్తూ నిదురలేని రాత్రులు గడిపినవాడు అనిలుడు. అందుకు ఆయన కృష్ణుడన్న ఈ మాటలను ఉదాహరించారు – **తథాహమపి తచ్చిత్తో నిద్రామ్ న లభే నిశీతి.**

ధర్మచక్రము రచయిత – గాలి లేకుండా మనం జీవించలేము. భగవంతుని స్మరింపకుండానూ జీవించలేను. తాను నీరు, అన్నం లేకుండా అనేక దినాలు ఉండగలనని, కాని ప్రార్ధన చేయకుండా ఒక్కరోజుకూడా గడపలేనని మహాత్మా గాంధీ అన్నారు. వాయురూపుడై మనచుట్టూ ఉండి మనలను బ్రతికించే భగవంతుని అనిలునిగా ధ్యానింపవలయును.

819. అమృతాశః

- తన భక్తులచే తన గుణములనే అమృతమును ఆస్వాదింపజేయువాడు.
- క్షీరసాగరమధనము అనంతరము అమృతమును సేవించినవాడు.
- ఫలములను ప్రసాదించుట కొరకు అమృతమైన (అంతులేని) వాంఛ గలవాడు.
- మొక్కవోని, సదా ఫలించెడి, సంకల్పము కలవాడు.
- ముక్తులకు అత్యంత ప్రియమైనవాడు.
- తాను సృష్టించిన సకల జీవులకు జీవనానికి అవుసరమైనవాటిని లభింపజేయువాడు.

ఓం అమృతాశాయ నమః

అ-మృత-ఆశః – అమృతాశః. అమృతము - మరణము లేనిది; అశ్ - భోజనే - తినుట; **అశ్నాతి ఆశయతి వా ఆశః** – భుజించువాడు. 'ఆశ' అనగా కోరిక అనే అర్థం కూడా ఉన్నది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **తాన్ స్వగుణ అమృతమ్ ఆశయతి ఇతి అమృతాశః.** తన గుణములు అనే అమృతమును తన భక్తులకు తినిపించువాడు 'అమృతాశః'.

యశ్చాశయతి భక్తాన్స్వై స్వగుణామృత మాదరాత్
అమృతాశ స ఇత్యుక్తః శృత పీయూషదో మునుః
తన భక్తులకు తన కళ్యాణగుణములను ఆదరముతో అమృతమువలె అనుభవింపజేయువాడు అమృతాశుడు. ఈ నామము చెవులకు అమృతము వంటిది. ఓం అమృతాశాయ నమః.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి 8.8.4 – ఆయనను నేను నా శరీరంలోను, రక్తమాంసాలలోను, ఊపిరిలోను, ఆలోచనలలోను అనుభవిస్తున్నాను. ఆయన తేనెవలె, పాలవలె, చక్కెరవలె, మిఠాయివలె మధురమైనవాడు.
శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి 2.5.5 – భగవంతుడు స్వయంగా నాలో ప్రవేశించి అంతులేని అమృతంలాగా ఆనందాన్ని ఇచ్చాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **అమృతమ్ అయాచితమ్ మోక్షమ్ ఆశయతి భోజయతి భక్తాన్ ఇతి అమృతాశః.** అడుగకుండానే భక్తులకు మోక్షమనే అమృతమును భుజింపజేయవాడు అమృతాశుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు అనేక వ్యాఖ్యలు ఇచ్చారు. **స్వరూప అమృతమ్ అశ్నాతి ఇతి**. తన స్వరూపము అనే అమృతాన్ని ఆస్వాదింపజేయువాడు 'అమృతాశః'.

క్షీరసాగర మధనానంతరము అమృతమును దేవతలకు ఒసంగుటయేగాక తానును పానము చేసినవాడు అమృతాశుడు.

అమృత అవినశ్వర ఫలత్వాత్ ఆశా వాంఛా అస్య ఇతి అమృతాశః. ఫలములను ప్రసాదించుటకూ అమృతములైన (వినాశం లేని) ఆశ గలవాడు అమృతాశుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఆయన ఆశలు (సంకల్పము) అమృతములు (సదా నెరవేరును).

శ్రీ సత్యసంధ యతిరాజ – ఆశ - కోరిక, ఆసక్తి; అమృత - ముక్తులైనవారు. **అమృతానామ్ ముక్తానామ్ ఆశా ఇచ్ఛా యస్మిన్ విషయ ఇతి అమృతాశః**. ముక్తులైనవారికి ఆయనయందే ఆసక్తి ఉండును గనుక భగవంతుడు 'అమృతాశః'.

శ్రీ వాసిష్ఠ – **ప్రవాహతో నిత్య స్థాయీదమ్ చతుర్విధ భేద విభక్తమ్ యథా తదర్థః జీవన సాధనాని ఆశయతి - భోజయతి ఇతి అమృతాశో విష్ణుః**. తాను సృజించిన అన్ని విధములైన జీవులకు అవుసరమైన జీవన సాధనములను సమకూర్చువాడు 'అమృతాశః'.

820. అమృతవపుః

- అమృతమువంటి శరీరము కలవాడు.

- మృతము కాని (మరణము లేని) శరీరము కలవాడు.

- విశ్వములో జీవులను పుట్టించి, మరల సమయము వచ్చినపుడు మరణింపజేయువాడు.

ఓం అమృతవపుషే నమః

'అమృతము' అనగా మృతము కానిది, అనగా మరణము లేనిది, క్షీణించనిది. అమృతము అనగా ఒక దివ్య పానీయము కూడ. 'వపుః' అనగా దేహము, స్వరూపము. (వప్ - బీజసంతానే ఛేదనే చ - విత్తుట, కోయుట, చల్లుట, నేయుట). శ్రీ భట్టులు అమృతము అనగా దివ్యపానీయము అనే అర్థంలో వ్యాఖ్యానించారు. శ్రీ శంకరులు 'మరణము లేని' అన్న అర్థంలో వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – అమృతమువంటి దేహము కలవాడు 'అమృతవపుః'. ఆయన తిరుమేణి – దివ్యమంగళ విగ్రహము – గురించి భక్తులు ఎంత ధ్యానించినా వారి తనివి తీరదు. ఆళ్వారులు భగవంతుని 'ఆరావముదన్' అని ఎన్నో సందర్భాలలో కీర్తించారు. ఉదా: (తిరువైమొళి 5.8.1 నుండి 5.8.11 వరకు, 2.5.4, 2.5.5, 10.10.5, 10.10.6). ఎంబెరుమానార్ శ్రీ భగవద్రామానుజులు శ్రీవైకుంఠగద్యంలో – **అమృత సాగరాంతర్నిమగ్నః సర్వావయవః సుఖమాసిత్** – అని శ్రీ భగవంతుని వర్ణించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మృతమ్ మరణమ్ తద్ రహితమ్ వపుః అస్య ఇతి అమృతవపుః**. మరణము లేని శరీరము గలవాడు 'అమృతవపుః'. భగవంతుని శరీరము భౌతికము కాదు. శుద్ధ సత్వమయము, శాశ్వతము. ఆయనకు క్షీణాది స్వభావములు లేవు.

శ్రీ రాధాకృష్ణమూర్తి – వేల సంవత్సరాల క్రితం కృష్ణునిగా అవతరించిన భగవంతుడు నేటికీ అలా దర్శనమివ్వడంలో అర్థం ఇదే. (దేవాలయాలలో అర్చామూర్తిగా పెరుమాళ్ళు దర్శనమివ్వడంలో అంతరార్థం కూడా ఇదే).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – 'వపుః' వా - బీజ సంతానే ఛేదనే చ - విత్తుట, కోయుట. **భగవాన్ ప్రవాహ నిత్యమ్ ఇదమ్ విశ్వమ్ వపతి సంతనోతి తథా సర్వమ్ అంతకాలే ఛిన్నతి**. భగవంతుడు విశ్వములో జీవులను పుట్టించును. సమయం వచ్చినపుడు నాశనం చేయును. విస్తార ధర్మము, అనగా ఒక జాతిలో జీవులనుండి అదే ధర్మముగల ఇతర జీవుల పుట్టించుట – జరిపించును.

821. సర్వజ్ఞః

- అంతా తెలిసినవాడు.

- తన భక్తుల అవుసరాలను పూర్తిగా తెలిసినవాడు.

ఓం సర్వజ్ఞాయ నమః

ఈ నామము రెండుమార్లు చ్చినది.

48వ శ్లోకము. 454వ నామము. సర్వజ్ఞః – **సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్**

87వ శ్లోకము. 821వ నామము. సర్వజ్ఞః – **అమృతాశోऽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః**

శ్రీ భట్టుల వ్యాఖ్య –

48వ శ్లోకములోని 454వ నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – **తథా సర్వాత్మనా ఆత్మాన్ జానాతి ఇతిసర్వజ్ఞః.** అన్నింటా తానే అంతరాత్మయని తెలిసినవాడు గనుక సర్వజ్ఞుడు. ఇందుకు శ్రీ రాధాకృష్ణశాస్త్రి శ్రుతులనుండి పెక్కు ఉదాహరణలు చెప్పారు –

బృహదారణ్యక 6.5.7 – **ఇదమ్ సర్వమ్ యద్ అయమ్ ఆత్మా.**

ముండకోపనిషత్తు 1.1.9 – **యః సర్వజ్ఞః సర్వవిత్.**

ప్రశ్నోపనిషత్తు 4.10 – **స సర్వజ్ఞః సర్వో భవతి.**

మాండూక్యోపనిషత్తు 6 – **ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞః.**

శ్వేతాశ్వరోపనిషత్తు 2.6.2,16 – **స విశ్వకృత్ విశ్వవిద్ ఆత్మయోనిః సర్వజ్ఞః కాలకాలో గుణీ సర్వవిద్యః.**

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – అంతా భగవంతుని సృష్టియే గనుక ఆయనకు తెలియనిది ఏమీ లేదు. ఇందుకు శ్రీ వాసిష్ఠ శ్రుతులనుండి పెక్కు ఉదాహరణలిచ్చారు –

అధర్వ 17.1.111 – **త్వమ్ ఇంద్ర అసి విశ్వజిత్ సర్వవిత్ పురుహూత స్త్వం ఇంద్రః.**

యజుర్ 3.2.10 – **స నో బంధుర్జనిత స విధాతా ధామాని వేద భువనాని విశ్వా.**

ఋగ్ 10.82.3 – **యో నః పితా జనితా యో విధాతా ధామాని వేద భువనాని విశ్వ.**

యస్తిష్ఠతి చరతి యశ్చవంచతి యోనిలాయమ్ చరతి యః ప్రతంకమ్

ద్వౌ సన్నిషద్య యన్మంత్రయేతే రజతద్ వేద వరుణ స్తృతీయః – అధర్వ 4.26.2

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **శ్రీ భగవాన్ హి సర్వమ్ సర్వత్ర సర్వదా సర్వధా చ జానాతి.** అంతా, అంతటా, ఎల్లవేళలా, అన్నివిధాలా తెలిసినవాడు శ్రీ భగవంతుడే. భూత భవిష్యద్వర్తమానాలుతెలిసినవాడు ఆయన మాత్రమే. అందరిలోనూ, అన్నింటిలోనూ ఉన్నవాడు ఆయన మాత్రమే. ఆయనకు అందనిది ఏదీ లేదు. తెలిసిందీ, తెలియాల్సిందీ అంతా ఆయనకు తెలుసు.

ప్రస్తుత (821వ) నామమునకు శ్రీ భట్టుల వ్యాఖ్య – **తేషామ్ శక్య, అశక్య సాధ్య, అసాధ్యాదికమ్ అనుసంధత్తే ఇతి సర్వజ్ఞః.** తన భక్తులకు అవసరమైనది ఏది? వారి చేతనైది ఏది? వారివల్ల కానిది ఏది? అన్నీ తెలిసినవాడై

భగవంతుడు తన భక్తులకు అవుసరమైన పనులను చేసి వారిని కాపాడుచుండును గనుక ఆయన సర్వజ్ఞుడు. **శక్యాశక్యాదికం సర్వం సాధ్యాసాధ్యాదికం చ యః భక్తానా మనుసంధత్తే సర్వజ్ఞ ఇతీరితః.**

శ్రీ తిరుమంగైయాళ్వారు పెరియతిరుమోళి 4.9.6 – నీ ఎడబాటును భరించలేని భక్తులెవరో నీకు తెలుసు. నీ సాన్నిహిత్యం విలువ తెలియనివారెవరో నీకు తెలుసు. ఈ విశ్వంలో నీకు తెలియనిది ఏదీ లేదు. కాని నీకోసం తపిస్తున్న నా బాధ నీకు తెలిసినట్లు లేదు. అందుకే నీ దర్శనాన్ని నాకు ఇవ్వకున్నావు.

శ్రీ శంకరుల వ్యాఖ్య –
48వ శ్లోకంలో 'సర్వజ్ఞః' – సర్వ-జ్ఞః – **సర్వశ్చ అసౌ జ్ఞశ్చ ఇతి సర్వజ్ఞః**. అంతా తానైనవాడు మరియు అంతా తెలిసినవాడు సర్వజ్ఞుడు.

87వ శ్లోకంలో 'సర్వజ్ఞః' – సర్వమ్-జ్ఞః – **సర్వమ్ జానాతి ఇతి సర్వజ్ఞః**. అంతా తెలిసినవాడు సర్వజ్ఞుడు. 'సర్వ' పదం మొదటి అర్థంలో నామవాచకము మరియు రెండవ అర్థంలో విశేషణము.

శ్రీ చిన్మయానంద – అన్ని ఆలోచనలను, భావాలను, ఉద్దేశ్యాలను, జ్ఞానాన్ని వెలిగించేవాడు సర్వజ్ఞుడు.

822. సర్వతోముఖః

- అనేకవిధాలుగా పొందదగినవాడు.
- అన్ని దిక్కులా ముఖము కలిగినవాడు.

ఓం సర్వతోముఖాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – **యేన కేనాపి వ్యాజేన సుప్రవేశత్వాత్ సర్వతోముఖః**. భగవంతుని అనేకవిధాలుగా పొందవచ్చును. ఇదే మార్గం అనే నియమం లేదు. కనుక ఆయన సర్వతోముఖుడు.
తత్తన్నియమ ముత్సృజ్య యో జ్ఞాతు శక్యతే బుధైః
వ్యాజేన యేన కేనాపి స స్మృత సర్వతోముఖః
ఇంత గొప్పవాడు కాబట్టి ఈ ఉపాయాలతో మాత్రమే తెలుసుకోవాలి అని కాకుండా తన భక్తులైన జ్ఞానులకు ఏదో ఒక రకంగా తెలుసుకోదగినవాడు గనుక సర్వతోముఖుడు.

శరణాగతి గద్యము 17 – **యేన కేనాపి ప్రకారేణ ద్వయ వక్తా త్వమ్ కేవలమ్ మదీయయైవ దయాయా** – ద్వయమంత్రంతో భగవంతునికి శరణాగతులైనవారిని భగవంతుడు ఏదో ఒక విధంగా కాపాడుతాడు. సహృదయులైనవారు, కపటులైనవారు, కష్టంలో ఉన్న ఆర్తులు, ముందు ముందు రక్షణ అవుసరమైనవారు, మిత్రులు, శత్రువులు, ఎవరైనా సరే భగవంతుని శరణుజొచ్చి ఆయన రక్షణ పొందవచ్చును.
ఆర్తోవా యది వా దృప్తః పరేషామ్ శరణాగతః

అరిః ప్రాణాన్ పరిత్యజ్య రక్షితవ్యః కృతాత్మనా – యుద్ధకాండ 18.28

శ్రీ శంకరుల వ్యాఖ్య – భగవంతుడు సర్వవ్యాపి. అంతటను ముఖములు కలవాడు. కనుక సర్వతోముఖుడు.

సర్వతః పాణిపాదమ్ తత్ సర్వతోఽక్షి శిరోముఖమ్
సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి – గీత 13.13
ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములై యున్నవి. అతడు సర్వమును ఆవరించియున్నాడు.

తైత్తరీయారణ్యకము 10.1 – **విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖః**
శ్వేతాశ్వరోపనిషత్తు 2.16 – **ప్రత్యంగ జనాస్తిష్ఠతి సర్వతోముఖః**
తైత్తరీయారణ్యకము 10.1 – **ప్రత్యంగ ముఖాస్తిష్ఠతి విశ్వతోముఖః**

శ్రీ చిన్మయానంద చెప్పిన ఉదాహరణ – సూర్యుని కాంతి అన్నివైపుల ప్రసరించును. అలాగే భగవంతుని ముఖం అన్నియెడలా ఉండును.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సర్వాసు దిశాసు భజమాన్యైః భక్తైర్హి శ్రీమద్ భగవతో ముఖమ్ అవలోక్యతే**. భక్తులు అన్నియెడలనుండీ భగవంతుని భజించుచున్నారు. భగవంతుడు అందరినీ ఒకేమారు చూస్తున్నాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **అతః సర్వతోముఖః సర్వదిగ్దేశ వర్తిషు భక్తేషు ముఖమ్ అస్య ఇతి సర్వతోముఖః**

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సులభః సువ్రతః సిద్ధః శత్రుజిచ్ఛత్రుతాపనః |
న్యగ్రోధోదుంబరోऽశ్వత్థశ్చాణూరాంధ్రనిషూదనః || (88)

823. సులభః

- తేలికగా లభించువాడు.

-సుఖము కలిగించువాడు.

ఓం సులభాయ నమః

సు - సుఖము, సౌకర్యము; లభ్ - ప్రాప్తౌ - పొందుట. శ్రీ విశిష్టాద్వైత సంప్రదాయములో భక్తులు అనుభవించి కీర్తించే రెండు ముఖ్య భగవద్గుణాలు (1) సౌలభ్యము (2) సౌశీల్యము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అనర్ఘోऽపి మూల్య-భాసేన స్వీకర్తుమ్ శక్యః సు-లభః.** భగవంతుడు వెలలేనివాడు అయినా తేలికగా లభిస్తాడు. ఇందుకు శ్రీ భట్టులు భాగవతంలోని కుబ్జ వృత్తాంతాన్ని ఉదాహరించారు. ఆమె కురూపి. అయినా ఆమె ఇచ్చిన చందనాన్ని స్వీకరించి భగవంతుడు ఆమెను అనుగ్రహించాడు. **వస్త్రే ప్రగృహ్య గోవిందమ్ మమ గేహమ్ వ్రజేతి వై** (విష్ణుపురాణము 5.20.11). ఆమె గోవిందుని వస్త్రాన్ని పట్టుకొని తన ఇంటికి రమ్మంది.

శ్రీ నమ్మాళ్వారు తిరువైమోళి మూడవ దశకం మొదటి పాశురంలో భగవంతుని యశోద రోట బంధించిన వైనాన్ని వర్ణించారు. మహాయోగీశ్వరులకు అందరాని పురాణపురుషోత్తముడు ఆ తల్లి ప్రేమకు కట్టుబడెను. ఈ ఎంపెరుమాన్ భక్త సౌలభ్యాన్ని తలచినంతనే శ్రీ నమ్మాళ్వారు ఆనంద పరవశులై ఆరునెలల కాలంపాటు

మైమరచి స్పృహలేకుండా ఉన్నారట. శ్రీ ఆండాళ్ నాచియార్ తిరువైమొళిలో కూడా ఇదే భావం తెలియవస్తుంది.

తిరువైమొళి 1.10.2 – మనం యదాలాపంగా అంకెలు లెక్కపెడుతూ 25 తరువాత 26 అనగానే భగవంతుడు తనను పిలుస్తున్నామనుకొని పరుగున వస్తాడు. (తత్వాలలో 25వది జీవము. 26వది పరమాత్మ.)

శ్రీరాముడు సుగ్రీవునితో ఇలా అన్నాడు (శ్రీ వేదాంత దేశికన్ ఉదాహరించిన విషయం):
త్వయి కంచిత్ సమాపన్నే కిమ్ కార్యమ్ సీతాయా మమ
భరతేన మహాబాహో లక్ష్మణేన యవీయసా
శత్రుఘ్నేన చ శత్రుఘ్న స్వశరీరేణ వా పునః (రామాయణం. యుద్ధకాండ 41.5)
ఓ వీరుడా! నీకు ఏమైనా ఆపద సంభవించినట్లయితే ఇక నాకు సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, చివరికి స్వయంగా నేను కూడా ఉన్నాగాని ఎవరూ లేనట్లే.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పత్ర పుష్పాదిభిః భక్తిమాత్ర సమర్పితైః సుఖేన లభ్యత ఇతి సు-లభః**. భక్తితో సమర్పించిన పూలు, ఆకులు వంటివానితో తేలికగా లభించువాడు సులభుడు. ఇక్కడ 'భక్తితో' అనే మాట చాలా ముఖ్యమైనది. శ్రీ శంకరులు మహాభారతంనుండి ఉదాహరించారు.
పత్రేషు పుష్పేషు ఫలేషు తోయేషు అక్రీత-లభ్యేషు సదైవ సత్సు
భక్త్యైక-లభ్యే పురుషే పురాణే ముక్త్యై కథమ్ న క్రియతే ప్రయత్నః
పురాణ పురుషుడు భక్తిమాత్రంచేత సమర్పించిన ఆకులు, పూలు, పండ్లు, నీరు వంటివానిచేత సులభంగా లభిస్తాడు. అయినా ఆయనకోసం ప్రజలు యత్నించకపోవడం విచిత్రం కదా!

అనన్య చేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః
తస్యాహం సులభః పార్థ నిత్య యుక్తస్య యోగినః – గీత 8.14
పార్థా! నిత్యము నిరంతరము అనన్య భావముతో చిత్తమును నాయందే నిలిపి, పురుషోత్తముడనైన నన్ను స్మరించుచు, సంతతము మత్పరాయణుడైన యోగికి నేను సులభుడను. అనగా అతనికి సహజముగానే నేను లభింతును.

శ్రీ సత్యసంధ యతిరాజ – **సుఖమ్ లభత ఇతి సులభః**. సుఖమును కలిగించేవాడు సులభుడు.

శ్రీ మద్భాగవతంలో కుబ్జ వృత్తాంతము (శ్రీ ఏల్చూరి మురళీధరరావు రచననుండి) –

రాజేంద్రా! భగవానుడంతట సుదాముని భక్తిభావాన్ని స్మరిస్తూ పురవీధిని సాగుతుండగా మార్గంలో ఒక గూని స్త్రీ సుగంధద్రవ్యపాత్రలను మోస్తూ ఎదురు వచ్చింది. కృష్ణుడామెను చూసి, 'సుందరీమణీ! నీవెవ్వతెవు? ఈ గంధాలు ఎవరికోసం? మాకు కొంచెం ఇస్తావా? నీకు మేలవుతుంది' అని పలకరించాడు. ఆ మాటలు విని కుబ్జ 'సుందరాకారా!

చక్కదనం అందరికీ సమకూడే భాగ్యం కాదు. నేను దాసిని. నాకు గ్రీవోరఃకటాలు మూడూ వక్రంగా ఉన్నందున నన్ను 'త్రివక్ర' అంటారు. కంసరాజుకు అనులేపనాలు కూర్చడం నా పని. మా రాజుకు ఇవి ఎంతో ప్రియమైనవి. మీవంటివారు తప్ప తక్కినవారు వీటికి తగరు' అంటూ వారికి మైపూత ద్రవ్యం ఇచ్చింది.

రాజేంద్రా! రామకృష్ణులు సితాసిత శరీరులు. ఆ అనులేపాలను వారు పూసికొన్నంతనే సితాసితులు అసిత సితులవలె కాన్పించారు. కృష్ణుడప్పుడు ఆమెయెడ కరుణ వహించి ఆమె పాదాలమీద తన పాదాలు నిలిపి ఆమె గడ్డంక్రింద చేతినుంచి రెండువేళ్ళయెత్తుకు ఆమె శరీరాన్ని పైకెత్తాడు. ఆ దాసియొక్క కటి వక్షః కంఠ స్థలాలు మూడింటి కుంటు అప్పటికప్పుడే తొలగిపోయింది. ఆమె అమిత సౌందర్యవతియై కృష్ణుని ఉత్తరీయాన్ని ఒడిసిపట్టి 'పురుషాగ్రణీ! మా యింటికి దయసేయుము. నిన్ను చూసినంతనే నా మనసు నీయందు లగ్నమయింది. నీదాననయ్యాను; నన్ను అనుగ్రహించు. నిన్ను విడువలేను' అంటూ ప్రార్థించింది.

కుబ్జనుండి మైపూతలు స్వీకరిస్తున్న రామకృష్ణులు.

1650 కాలపు చిత్రం. వికీపీడియానుండి.

824. సువ్రతః

- శరణాగతులను కాపాడుట అనే చక్కని, దృఢమైన వ్రతము కలవాడు.
- తన భక్తులు భక్తితో, అహంకారము లేకుండా సమర్పించిన స్వచ్ఛమైన నైవేద్యమును మాత్రమే స్వీకరించువాడు.
- తన నర-నారాయణ అవతారములో నియమముగా ఆహారమును గ్రహించినవాడు.
- సృష్టిలో అంతటినీ నియమము ప్రకారము తన అధీనములోనుంచుకొనువాడు.
- తాను పరమాత్ముడైనప్పటికీ శ్రీకృష్ణావతారములో అన్ని వ్రతములను నియమముగా ఆచరించినవాడు.

ఓం సువ్రతాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

49వ శ్లోకము. 456వ నామము. సువ్రతః – **సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్**

88వ శ్లోకము. 824వ నామము. సువ్రతః – **సులభః సువ్రతః సిద్ధః శత్రుజిత్ శత్రుతాపనః**

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు 'సు-వ్రతము' అంటే 'దృఢ వ్రతము' అని వ్యాఖ్యానించారు. **యథా కథంచిత్ ప్రవిష్టానామ్ సర్వథా పరిపాలన దృఢవ్రతః సు-వ్రతః**. ఏ విధంగానైనా తన చెంతకు వచ్చినవారిని ఎలాగైనా రక్షించడం అనే దృఢమైన నియమం పాటించేవాడు సు-వ్రతుడు. ఇందుకు శ్రీ భట్టులు రామాయణం యుద్ధకాండ (18.33)నుండి ఉదాహరించారు.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ.

'నేను నీవాడను. రక్షింపుము' అని ఒక్కమారైనను నన్ను వేడుకొన్నట్లయితే వానికి సర్వభూతములనుండి అభయమును ప్రసాదింతును. ఇది నా వ్రతము.

శరణాగతిగద్యంలో భగవానుడు భగవద్రామానుజులకు తన వ్రతాన్ని ఇలా చెప్పాడు – **అనృతమ్ నోక్త పూర్వమ్ మే న చ వక్ష్యామి కదాచన**. నేనేప్పుడూ అసత్యమాడలేదు. నా మాటలు ఎప్పుడూ అసత్యం కావు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ – గీత 18.66

సర్వ ధర్మములను, అనగా సమస్త కర్తవ్య కర్మలను నాకు సమర్పించి సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను ఐన నన్నే శరణుజొచ్చుము. అన్ని పాపములనుండియు నిన్ను నేను విముక్తుని కావించెదను. నీవు శోకింపకుము.

రామో ద్విర్ న అభిభాషతే. రాముడు రెండు విధములుగా మాటలాడడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 9.10.5 – తనను శరణుజొచ్చినవారెవరికైనా వారి అంత్యకాలంలో శ్రీ భగవానుడు వారికి శ్రీవైకుంఠమును ప్రసాదించును.

శ్రీ వచనభూషణము 381 – అనాలోచితంగా, అదేంటో తెలియకుండాకూడా ఎవరైనాగాని ఒక దివ్యదేశం పేరు ఉచ్చరిస్తే, భగవంతుడు వారికి అందుకు సరిపడా పుణ్యం ప్రసాదిస్తాడు. అలా అనేక జన్మలలో ప్రోగుపడిన పుణ్యాన్నంతటినీ కలిపి, దానిని పదిరెట్లు చేసి, అందుకు తగిన ప్రతిఫలాన్ని అందిస్తాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'వ్రతము' అనగా ఆహారవిషయంలో నియమాన్ని ప్రస్తావించారు. **శోభనమ్ వ్రతయతి భుంక్తే.** ఈ వ్యాఖ్యకు వివిధాలైన వివరణలు ఉన్నాయి. శ్రీ అనంతకృష్ణశాస్త్రి ఇలా వివరించారు:

కుచేలునివంటి మోహరహితులైన భక్తులు సమర్పించే స్వచ్ఛమైన నైవేద్యాన్ని పరిగ్రహించేవాడు గనుక భగవానుడు సువ్రతుడు.

శ్రీ శంకరులు చెప్పిన మరొక వ్యాఖ్య – **భోజనాత్ నివర్తయతి ఇతి సువ్రతః**. తాను భుజించే ఆహారంపట్ల నియమం కలిగినవాడు సువ్రతుడు. ఉదాహరణకు నరనారాయణావతారంలో కఠినమైన నియమాలతో తపమునాచరించిన సువ్రతుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – వ్రతము అనగా నియమము. **సువ్రతయతి నియమయతి ఇతి సువ్రతః**. విశ్వంలో అన్నింటినీ నియమానుసారం నడిపేవాడు సువ్రతుడు. వాయువు, అగ్ని వంటివారు కూడ ఆయన ఆజ్ఞను జవదాటరు. **భీషాస్మాద్ వాతః పవతే**. ఇందుకు శ్రీ వాసిష్ఠ శ్రుతినుండి ఉదాహరించారు.
యస్య వ్రతే పృథ్వీ నన్నమీతి యస్య వ్రతే శఫవజ్జర్భురీతి
యస్య వ్రతే ఓషధీర్విశ్వరూపః స నః పర్జన్యమహి శర్మ యచ్ఛ – ఋగ్వేదము 5.83.5

శ్రీ బలదేవ విద్యాభూషణ – **శోభనాని పరమోత్సవ రూపాని జన్మాష్టమీ కార్తీక నియమాదీని వ్రతాని యస్య స సు-వ్రతః**. (శ్రీకృష్ణావతారంలో) తాను పరమేశ్వరుడైయుండి కూడా జన్మాష్టమి, కార్తీకమాసము వంటి వ్రతాలను నియమముగా ఆచరించినవాడు సువ్రతుడు.

825. సిద్ధః

- భక్తులు ఏ విధమైన ప్రత్యేక యత్నాలు చేయకుండానే వారిని రక్షిస్తూ వారికి అందివచ్చేవాడు.
- మోక్షము పొందడానికి సిద్ధముగా ఉన్న ఉపాయము.
- వేరెవరి సహాయమూ, దేని సహాయమూ లేకుండానే సకలసిద్ధులు పొందియున్న పరిపూర్ణుడు.
- భక్తులు ఆచరించే తపస్సు, ప్రయత్నాలలో ఫలాన్ని సిద్ధింపజేసేవాడు.
- మనకు శాస్త్రాలనూ, శుభాలనూ కలిగించేవాడు.
- అన్ని విధాలైన శోధనలకూ, తర్కాలకూ కూడా చిట్టచివరి ప్రమాణము.
- తాను చేసే అన్ని కార్యాలనూ పరిపూర్ణంగా, లోపాలు లేకుండా సాధించేవాడు.

ఓం సిద్ధాయ నమః

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

11వ శ్లోకము. 98వ నామము. సిద్ధః – **అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాదిః అచ్యుతః**

88వ శ్లోకము. 825వ నామము. సిద్ధః – **సులభః సువ్రతః సిద్ధః శత్రుజిత్ శత్రుతాపనః**

ఈ నామమునకు మూలశబ్దము **సిధ్** - సమృద్ధౌ -లక్ష్యము చేరుకొనుట, విజయము పొందుట, సాధించుట. ఇంతకుముందు 27వ శ్లోకములోని 253 నుండి 256వరకు, **సిద్ధార్థః, సిద్ధసంకల్పః, సిద్ధిదః, సిద్ధిసాధనః** నామములు ఇదే ధాతువుపై ఆధారపడినవి. ప్రస్తుత సందర్భములో ఈ నామమునకు చెప్పిన వివరణలు – మనలను రక్షించడానికి వేంచేసియున్నవాడు, మన లక్ష్యాలను సాధిండానికి చేయూతనిచ్చేవాడు, దోషరహిత పరిపూర్ణుడు, మనలను దోషరహితులుగా చేసేవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అస్య గోప్తృత్వమ్ అనుపాధికమ్, సదా స్వత ఏవ సర్వగోప్తృత్వాత్, అయత్నసాధ్యః సిద్ధః.** పరమేశ్వరుడు అయత్నసాధ్యుడు. అంటే ప్రయత్నం లేకుండానే సాధింపబడేవాడు. ఇతరుల అధీనంలో లేనివాడు. తాను తనయొక్క అధీనంలోనే ఉన్నవాడు. భక్తులు ఆయనకోసం ఏమీ కష్టపడకుండానే ఆయన వారికి సిద్ధిస్తాడు గనుక సిద్ధుడు. ఇది ఆయన తత్వము.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 5.7.10 – నీ చరణాలే నా లక్ష్యము. వానిని సాధించడానికి నాకున్నమార్గం నీ పాదాలను అంటిపెట్టుకొని ఉండడమే. ఆ పాదాలు మనకు అందుబాటులో వేంచేసిఉన్నాయి. వాటిని చేరుకోవడానికి శ్రమించనక్కరలేదు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 10.6.3 – మేము ఆయన గుణగాణం చేసే నామాలను స్మరిస్తూ నారాయణుని చేరుకొన్నాము. ఆ దేవదేవుడు మనకు శ్రీవైకుంఠాన్ని అనుగ్రహించడంకోసం పరుగున వేంచేసి తిరువట్టాయంలో కొలువైయున్నాడు. భక్తులను కరుణించడంకోసం ఆయన తొందరపడుతున్నాగాని మనకోసం ఓపికతో వేచియున్నాడు. ఓ మనసా! నీ సహాయంతోనే ఇదంతా జరుగుతున్నది.

స్వామి దేశికన్ – **సిద్ధోపాయస్తు ముక్తౌ నిరవధిక దయః శ్రీసఖః సర్వశక్తిః.** శ్రీమన్నారాయణుడు ముముక్షువుల కొరకు సిద్ధోపాయము. అంతులేని దయగలవాడు. సర్వశక్తిమంతుడు (న్యాయవింశతి 17). అంటే ఆయనకోసం మనం క్రొత్త ఉపాయాలు (సాధనాలు, ప్రయత్నాలు) వెతుక్కోనక్కరలేదు. భక్తి లేదా ప్రపత్తి మార్గాలు అనే సాధ్యోపాయాలద్వారా మోక్షాన్నిచ్చే సిద్ధోపాయము శ్రీమన్నారాయణుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అనన్యాధీన సిద్ధిత్వాత్ సిద్ధః.** ఆయన ఇంకెవరిపైనా ఆధారపడనివాడు. తాను తనయొక్క అధీనంలోనే ఉన్నవాడు. అలా పరిపూర్ణసిద్ధిని కలిగియున్నవాడు సిద్ధుడు.

శ్రీ అనంతకృష్ణశాస్త్రి – భగవంతుని అర్చించే భక్తులు తమ యత్నాలకు సత్ఫలితాలు పొంది పరిపూర్ణతను పొందుతారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి నృసింహతాపిని (9.9)నుండి ఉదాహరించారు. **సదేవ పురస్తాత్ సిద్ధమ్ హి బ్రహ్మ.** భగవంతుడు సద్వ్రతములను ఆచరించేవారికి తగు సిద్ధులు ప్రసాదిస్తాడు. మరియు భగవంతుడు సకల సిద్ధులు కలిగియున్న పరిపూర్ణుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – షిధు - శాస్త్రే మాంగల్యేచ - బోధించుట, ఉపదేశించుట, శుభము కలిగించుట; ధా - ధారణ పోషణయో దానే చ - ఇచ్చుట, పుట్టించుట, పోషించుట. **సిధమ్ మంగళమ్ శాస్త్రమ్ వా ధత్త ఇతి సిద్ధః.** మనకు శాస్త్రములను ఇచ్చినవాడు, శుభములను కలిగించువాడు సిద్ధుడు.

శ్రీ నరనారాయణుల మూర్తులు. స్వామినారాయణ మందిరం వికీపీడియా చిత్రం.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సిధ్యతి స్మ సిద్ధః, భగవాన్ హి సకలైః ప్రమాణైః సిద్ధః, తత్ర ప్రత్యక్ష ప్రమాణమ్ భక్తానామ్, అనుమాన ప్రమాణమ్ తార్కికానామ్, శబ్ద ప్రమాణమ్ చ శ్రుతి శాస్త్రానామ్, ఏవమ్ ప్రమాణ త్రయమపి శ్రీ భగవంతమ్ సాధయతి.** భక్తులకు ఆయన ప్రత్యక్ష ప్రమాణము. తార్కికులకు హేతుప్రమాణము. శ్రుతి శాస్త్రాలలో ఉన్న శబ్దప్రమాణము. ఇలా పరమసత్యాన్ని తెలుసుకోవడానికి అన్నివిధాలుగా చివరిప్రమాణము ఆయనే.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **శ్రమ క్లంతంద్రాభిః వర్జితో యత్నాపేక్షా సిద్ధిశ్చ సిద్ధః.** సాధించవలసినదంతా ఆయన ఏమీ శ్రమ లేకుండానే సాధించేశాడు గనుక సిద్ధుడు. **సర్వతో భావినీ శాశ్వతీ సిద్ధిః అస్య ఇతి సిద్ధః.** ఆయన చేసేదంతా పరిపూర్ణంగా దోషరహితంగా చేస్తాడు గనుక సిద్ధుడు. ఇందుకు ఉదాహరణగా శ్రీ వాసిష్ఠ చెప్పినది – భగవంతుడు తగుపాళ్ళలో గాలి, నీరు, నిప్పు, వివిధ జీవులు వంటివానిని ఉంచి విశ్వాన్ని సృష్టించాడు.

ఇంతవరకు శ్రీ భట్టుల వ్యాఖ్యానం భగవంతుని ప్రత్యక్ష (నేరు) అవతారాలపరంగా సాగింది. ఇంకముందు కొన్ని నామాల వ్యాఖ్యానంలో భగవంతుని పరోక్ష అవతారాలు, అనగా ఆయన ఇతరులలో ప్రవేశించే అవతారాలుగా, చెప్పబడినాయి.

826. శత్రుజిత్

శత్రుతాపనః

శత్రుజిచ్ఛత్రుతాపనః

శ్రీ భట్టులు, ఆయన వ్యాఖ్యను అనుసరించేవారు '**శత్రుజిత్ శత్రుతాపనః**' అనే ఒకే నామముగా పరిగణించారు. శ్రీ శంకరులు, ఇతర వ్యాఖ్యాతలు '**శత్రుజిత్**', '**శత్రుతాపనః**' అనే రెండు నామములను పరిగణించారు. అయితే రెండువిధాల వ్యాఖ్యానాలలోనూ భావం ఇంచుమించు ఒకటే అని గ్రహించాలి. శ్రీ శంకరుల వ్యాఖ్య ప్రకారం భగవంతుడు స్వయంగా, అనగా రాముడు, కృష్ణుడువంటి అవతారాలలో శత్రువులను జయిస్తాడు. శ్రీ భట్టుల వ్యాఖ్య ప్రకారం భగవంతుడు తన శక్తిని ఇతరులలో ప్రవేశపెట్టి (**స్వతేజసా అప్యాయిత్తైః**) భగవంతుని శత్రువులను నశింపజేస్తాడు.

శత్రుజిచ్ఛత్రుతాపనః

శత్రుజిత్తులైనవారిలో తన అంశను ప్రవేశపెట్టి, వారిద్వారా తన భక్తుల శత్రువులను నాశనం చేయువాడు.

ఓం శత్రుజిచ్ఛత్రుతాపనాయ నమః

భగవంతుడు తాను స్వయంగా తన భక్తుల శత్రువులను నాశనం చేయడమే కాకుండా, తన తేజస్సును ఇతరులలో ప్రవేశపెట్టి, వారిద్వారా (శత్రుజిత్తులద్వారా) తన భక్తుల శత్రువులను తపింపజేయును గనుక ఆయన శత్రుజిచ్ఛత్రుతాపనుడు.

పురుకుత్స కకుత్స్థాద్యైః శత్రుజిద్భి స్వతేజసా
ఆఢ్యే యత్నై రరిగణాన్ యస్తాపయతి నిత్యశః
శత్రుజిచ్ఛత్రుతాపన ఇతి విద్యద్గణోదితః

పురుకుత్సుడు, కకుత్స్థుడు మొదలైన రాజశ్రేష్ఠులయందు తన అంశను ప్రవేశపెట్టి శత్రునాశనము చేసినవాడు శత్రుజిచ్ఛత్రుతాపనుడు. పురుకుత్సుడు బిందుమతి, మాంధాతల కుమారుడు. ఇతడిని నాగకుమారులు తమ లోకానికి తీసుకొనిపోయి తమ చెల్లెలు నర్మదనిచ్చి వివాహం చేశారు. అంగీరసులనే గంధర్వులు నాగలోకానికి వెళ్ళి అక్కడి నాగులను బాధపెడుతున్నారు. ఈ సంగతి విన్న పురుకుత్సుడు వారితో యుద్ధంచేసి అంగీరసులను వధించాడు. శ్రీ భట్టులు విష్ణుపురాణంలోని ఈ ఉదంతాన్ని ఉదాహరించారు.

పరంజయో హి నామ శశాదస్య చ రాజర్షేష్ఠనయః క్షత్రియవర్యః

తచ్ఛరీరే అహం అంశేన స్వయమేవ అవతీర్య తానశేషానసురాన్ నిహనిష్యామి – విష్ణుపురాణము 4.2.8

కకుత్స్థః భగవతః చరాచరగురోః అచ్యుతస్య తేజసా ఆప్యాయితో
దేవాసుర సంగ్రామే సమస్తానేవ అసురాన్ నిజఘాన – విష్ణుపురాణము 4.2.11
నా అంశతో నేను పరంజయులనే రాజశ్రేష్ఠుల శరీరంలో ప్రవేశించి స్వయంగా అసురులను సంహరిస్తాను.... అప్పుడు కకుత్స్థుడు (పరంజయుడు), సమస్త చరాచరములకు ప్రభువైన అచ్యుతుని శక్తితో, యుద్ధంలో దేవతల శత్రువులను సంహరించాడు.

..... **అథ భగవాన్ ఆదిపురుషః పురుషోత్తమో యౌవనాశ్వస్య మాంధాతుః పురుకుత్సనామపుత్రస్తమ్ అనుప్రవిశ్య ఏతాన్ అశేష దుష్ట గంధర్వాన్ ఉపశమమ్ నయిష్యామి** – విష్ణుపురాణము 4.3.7
ఆదిపురుషుడైన పురుషోత్తముడు ఇలా అన్నాడు. నేను యువనాశ్వ, మాంధాతల పుత్రుడైన పురుకుత్సునిలో ప్రవేశించి గంధర్వులను అణచివేస్తాను.

రసాతల గతశ్చ అసౌ భగవత్ తేజసా ఆప్యాయిత ఆత్మవీర్య సకల గంధర్వాన్ జఘాన – 4.3.9
భగవంతుని తేజస్సుతో నిండిన పురుకుత్సుడు రసాతలం ప్రవేశించి సకల గంధర్వులను నాశనం చేశాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ కూడా **'శత్రుతాపనః'** నామానికి ఈ అర్థాన్ని చెప్పారు. **సర్వ సుహృదః సాధూన్ ద్విషన్తి త ఏవ శత్రవః తాన్ శ్చ యః స్వ-పరదత్త-శక్తిభిః మహాపురుషైః తాపయతి ఇతి శత్రుతాపనః**. భగవంతుడు తన శక్తిని మహాపురుషులకు ఇస్తాడు. ఆ మహాపురుషులు భగవద్భక్తులను పీడించే శత్రువులను నాశనం చేస్తారు. ఇందుకు శ్రీ వాసిష్ఠ అధర్వ వేదము (19.28.2)నుండి ఉదాహరించారు –
ద్విషస్తాపయన్ హృదః శత్రూణామ్ తాపయన్ మనః
దుర్హాదః సర్వాస్త్వమ్ దర్భ ధర్మ ఇవాభీన్త్సమ్ తాపయన్

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా ఈ నామమును **'శత్రుజిత్ శత్రుతాపనః'** అనే ఒకే నామంగా పరిగణించారు. కాని జంట అర్థాలు, శత్రుజిత్తు మరియు శత్రుతాపనుడు, కలిసినట్లుగా వ్యాఖ్యానించారు.
శతయన్తి ఉత్పీడయన్తి ధార్మికాన్ ఇతి శత్రవః
తాన్ జయతి ఇతి శత్రుజిత్
శత్రూన్ తాపయతి ఇతి శత్రుతాపనః
శత్రుజిత్ చ అసౌ శత్రుతాపనన్ ఇతి శత్రుజిచ్ఛత్రుతాపనః
ధార్మికులను పీడించేవారు శత్రువులు, అలాంటి శత్రువులను జయించేవాడు శత్రుజిత్తు. మరియు శత్రువులను బాధించేవాడు శత్రుతాపనుడు. వెరసి శత్రుజిచ్ఛత్రుతాపనుడు.

ఇక శ్రీ శంకరులు, ఇతరులు పరిగణించినట్లుగా రెండు వేరువేరు నామముల అర్థం క్రింద ఇవ్వడమైనది.

శత్రుజిత్

- తన శత్రువులను జయించేవాడు.
- అన్నింటికంటే పెద్ద శత్రువైన 'శరీరమే ఆత్మ అనే భావము'ను జయించడానికి తోడ్పడేవాడు.
- సృష్టిలో జీవులకు తమ శత్రువులను ఎదుర్కొనే సదుపాయాన్ని కల్పించినవాడు.

ఓం శత్రుజితే నమః

శత్రువులను జయించేవాడు శత్రుజిత్తు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సుర శత్రవ ఏవ అస్య శత్రవ, తాన్ జయతి ఇతి శత్రుజిత్**. దేవతల శత్రువులే ఆయన శత్రువులు. అలాంటి శత్రువులను జయించేవాడు శత్రుజిత్తు.

శ్రీ చిన్మయానంద – ప్రతి మనిషి హృదయంలోను అతని శరీరంపై వ్యామోహం ఉంటుంది. తద్వారా కలిగే కోర్కెలు ఎంత బలమైనవంటే వాటిని అణచడం మనిషికి కష్టం. ఇలాంటి శత్రువును జయించాలంటే నారాయణుని శరణు వేడుకొనడమే మార్గము. ఇలా నారాయణ ధ్యానం అన్నింటికంటే పెద్దశత్రువును జయించడానికి తోడ్పడుతుంది గనుక నారాయణుడు శత్రుజిత్తు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – సృష్టిలో జీవులకు తమ శత్రువులను ఎదుర్కోవడానికి గోళ్ళు, కోరలు, కొమ్ములు వంటి ఆయుధాలను దేవుడు సమకూర్చాడు. ఈ అమరికలో భగవంతుని 'శత్రుజిత్' గుణం మనకు కనిపిస్తుంది.

శత్రుతాపనః

- తన భక్తుల శత్రువులను హింసించేవాడు.
- భక్తుల హృదయాలలో దురాలోచనలను నాశనం చేసేవాడు.

ఓం శత్రుతాపనాయ నమః

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సురశత్రూణామ్ తాపనాత్ శత్రుతాపనః**. దేవతల శత్రువులను తపింపజేయువాడు శత్రుతాపనుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు దుష్టులకు అనేక కష్టములు కలిగించును.

శ్రీ చిన్మయానంద – భగవంతుని పాదములను శరణుజొచ్చిన భక్తుల హృదయములలో అన్ని దురాలోచనలు దగ్ధమగును. కనుక భగవంతుడు శత్రుతాపనుడు.

827. న్యగ్రోధోదుంబరః

న్యగ్రోధః

ఉదుంబరః

శ్రీ పరాశరభట్టులు, ఆయన మార్గమును అనుసరించినవారు ఈ నామమును '**న్యగ్రోధోదుంబరః**' అనే ఒకే నామంగా పరిగణించారు. శ్రీ శంకరులు మరియు ఇతర వ్యాఖ్యాతలు '**న్యగ్రోధః**', '**ఉదుంబరః**' అనే రెండు నామములుగా పరిగణించారు. ఈ నామవివరణను శ్రీ భట్టుల వ్యాఖ్యానంలోని ప్రత్యేకతకు ఒక ఉదాహరణగా గ్రహింపవచ్చును.

ముందుగా 'న్యగ్రోధః', 'ఉదుంబరః' అనే వేరు వేరు నామముల అర్థాలను పరిశీలించుదాము.

న్యగ్రోధః

- ఆయనకంటే అతినీచులైె కూడా, ఆయనకు (భగవంతునికి) అంజలి ఘటించే వారివారి ఇష్టానుసారం నడచుకొనేవాడు.
- తన క్రిందివారిని నియంత్రించేవాడయ.
- అందరికంటె సనాతనుడు. అందరికంటె పైన ఉన్నవాడు.
- స్థిరముగా వేళ్ళూనుకొని అన్నిదిశల వ్యాపించిన విశ్వరూపుడు.
- భక్తులు తమ కామితార్థముల కొరకు పైనున్న ఆయనను వేడుకొందురు.
- తన భక్తుల శత్రువులను శిక్షించేవాడు.
- భగవంతుని పూజించే భక్తులు తమ హృదయాలలో ఆయననే కోరుకొంటారు.

ఓం న్యగ్రోధాయ నమః

అంచ్ - గతి పూజనయో - వెళ్ళుట, పూజించుట; **నీచై అంచతి ఇతి న్యక్**. క్రిందికి వంగేవాడు న్యక్.

రుధ్ - కామే - అనుసరించుట; రుధ్ - ఆవరణే - ప్రతిఘటించుట.

న్యగ్రోధము అంటే 'వటవృక్షము' అనే అర్థం కూడా ఉన్నది.

కొందరు వ్యాఖ్యానకర్తలు ఈ నామమును '**న్యగ్రోహః**' అని కూడా గ్రహించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **న్యగ్భూతైః, అధ-కృతాంజలిభిః, రుధ్యతే స్వప్రసాదౌన్ముఖ్యేన వ్యస్థాప్యతే ఇతి న్యగ్-రోధః.** తనకంటే ఎంతో క్రింద ఉన్నవారు కూడా అంజలి ఘటించి తనకు ప్రియం కలుగజేయగానే వారియందు అనుగ్రహం చూపేవాడు న్యగ్రోధుడు. ఇక్కడ శ్రీ భట్టులు భగవంతునికి 'అంజలి' ఘటించడంయొక్క ప్రభావాన్ని వక్కాణించారు. **అంజలిః పరమాముద్రా క్షిప్రమ్ దేవప్రసాదినీ.** అంజలిముద్రను చూడగానే భగవంతుడు ప్రసన్నుడౌతాడు (విష్ణుధర్మోత్తర 33.105).

త్వదంఘ్రిమ్ ఉద్దిశ్య కదాపి కేనచిత్ యథా తథా వాపి సకృత్ కృతోऽంజలిః
తదైవ ముష్ణాత్యశుభాన్యశేషతః శుభాని పుష్ణాతి న జాతు హీయతే – అళవందార్. స్తోత్రరత్నము 28
ఎవరైనా, ఎప్పుడైనా, ఏ కారణంచేతనైనాగాని ఒక్కమారు చేతులు జోడించి నీ పాదములను అర్చించినట్లయితే ఆ క్షణమే వారి పాపాలన్నీ నశిస్తాయి. వారికి ఎనలేని శుభములు కలుగుతాయి.

శ్రీ వి.వి. రామానుజన్ యశోద చేత పరమాత్ముడు రోట బంధింపబడిన వైనాన్ని ఉదాహరించారు. అంటే భగవానుడు భక్తికి, ప్రేమకు లొంగిపోతాడన్నమాట.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **న్యగ్ రుణద్ధి ఇతి న్యగ్-రోధః**. తన క్రింద ఉండేవారిని ఆదేశించువాడు న్యగ్రోధుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'న్యక్-రోహతి' అని విశ్లేషించారు. **పృషోదరాదిత్వాత్ హకారస్య ధకారాదేశః** – అనే వ్యాకరణసూత్రం ప్రకారం ఈ నామమును **'న్యగ్రోహః'** అని కూడా గ్రహింపవచ్చునని చెప్పారు. **న్యక్ అర్వాక్ రోహతి సర్వేషామ్ ఉపరివర్తత ఇతి న్యగ్రోధః**. క్రింది భాగమున పుట్టి (సర్వస్వమునకు మూలమై యుండి) అందరికంటె పైనున్నవాడు (సర్వేశ్వరుడు) గనుక న్యగ్రోధుడు. రుహ్ - బీజ జన్మాని ప్రాదుర్భావేచ - పుట్టుట, పెరుగుట, వర్ధిల్లుట – అనే మూలం ప్రకారం ఈ అర్థ వస్తుంది.

శ్రీ సత్యసంధ యతిరాజ కూడా **'న్యగ్రోహః'** అని పరిగణించారు కాని వేరే అర్థాన్ని చెప్పారు (రుహ్ - పెరుగుట). **సర్వాణి భూతాని న్యకృత్య రోహతి వర్ధతి ఇతి.** అన్ని భూతములను పుట్టించి, వాని వృద్ధికి కారణమగువాడు న్యగ్రోధుడు.

న్యక్ - క్రింద; రోధః - చిత్తగించుట (రుధ్ - కామే). 1948లో ముద్రింపబడిన శ్రీ కామకోటి కోశస్థానం (శ్రీ శంకరుల వ్యాఖ్యకు తమిళ అనువాదం)లో ఇచ్చిన అర్థం. తన క్రింద ఉన్న సమస్త భూతములను తన మాయచే అడ్డగించినవాడు, వారిని నియంత్రించువాడు న్యగ్రోధుడు.

'న్యగ్-రోహతి' అనగా క్రిందికి పెరుగునది, అనగా వటవృక్షము. ఎందుకంటే మర్రిచెట్టు భూమిపైన ఎంత విస్తరించి ఉంటుందో భూమిలోపల కూడా అలానే విస్తరించియుంటుంది (**నీచైర్గతా పరోహైర్వర్ధతే**). ఇలా స్థిరంగా ఉండి విశ్వమంతటా విస్తరించినవాడు న్యగ్రోధుడు. కొందరు వ్యాఖ్యాతలు మట్టిచెట్టు భగవద్విభూతి గనుక భగవంతుడు న్యగ్రోధుడు అని వ్యాఖ్యానించారు.

శ్రీ వాసిష్ఠ చెప్పిన మరొక వ్యాఖ్య – **న్యగ్భిః అనురుధ్యతే - ప్రార్థయతే ఈప్సితాప్తయ ఇతి న్యగ్రోధః**. క్రిందనున్నవారు తమ కోర్కెలు తీర్చుకోవడానికి పైనున్న భగవంతుని ప్రార్థిస్తారు గనుక భగవంతుడు న్యగ్రోధుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – రుధ్ - ఆవరణే - ఎదిరించుట, అణచివేయుట. న్యక్ - కృత్య - అణచివేయుట. **న్యక్-కృత్య రుణద్ధి నిరయే నిక్షిపతి స్వ-భక్త-ద్రోహిణా ఇతి న్యగ్-రోధః.** తన భక్తుల శత్రువులను శిక్షించి అణచివేయువాడు న్యగ్రోధుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – రుధ్ - కామే - కోరుట. న్యగ్భిః **ప్రణతైః రుధ్యతే హృదయ ప్రదేశే ఇతి న్యగ్-రోధః.** భగవంతుని అర్చించే భక్తులు తమ హృదయంలో ఆ భగవంతునే కోరుకుంటారు గనుక భగవంతుడు న్యగ్రోధుడు.

ఉదుంబరః

- సర్వోత్తమ పరంధామము శ్రీ వైకుంఠము తన స్థానముగా గలవాడు.
- ఆకాశముకంటె పై స్థాయిలో, అనగా అందరికంటె గొప్పవాడైయున్నవాడు.
- అన్నాదులచే విశ్వమంతయును పోషించువాడు.
- సర్వోత్తమ శబ్దాలైన వేదములే తన స్వరూపముగా గలవాడు.
- భజన, నామ, సంకీర్తనాది శ్రేష్ఠమైన శబ్దములద్వారా కీర్తింపబడువాడు.
- ఉత్కృష్టమైన అంబరము, అనగా పీతాంబరమును ధరించువాడు

ఓం ఉదుంబరాయ నమః

ఉత్-అంబరః - ఉదుంబరః; అమ్ - గతిశబ్ద సంభక్తిషు - వెళ్ళుట, తినుట, ధ్వనించుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సర్వగుణైః ఉద్గతమ్ అంబరమ్ - పరమ్ ధామ అస్య ఇతి ఉదుంబరః.** శ్రీలక్ష్మీనిలయమై, అన్నింటికంటె గొప్ప వైభవము (ఉత్) కలిగిన పరంధామము (శ్రీ వైకుంఠము) తన నివాసముగా కలిగినవాడు ఉదుంబరుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అంబరాత్ ఉద్గత ఉదుంబరః.** ఆకాశముకంటె మిక్కిలి పై స్థాయిలో ఉండువాడు, అనగా అందరికంటె అధికుడు ఉదుంబరుడు.

శ్రీ చిన్మయానంద – ఫలితముకంటె కారణము గొప్పది మరియు సూక్ష్మమైనది. అన్నింటికి మూలమైన నారాయణుడు ఆకాశమునకు కూడ అందనివాడు. ఉదుంబరుడు.

శ్రీ శంకరుల మరొక వ్యాఖ్య – ఊర్క్ అనగా అన్నము అనే భావమునుండి; **ఊర్క్-అన్నమ్, తదాత్మనా విశ్వమ్ పోషయన్ ఉదుంబరః.** అన్నము మొదలైనవానిద్వారా విశ్వమును పోషించువాడు ఉదుంబరుడు. ఇందుకు శ్రీ శంకరులు చెప్పిన ఉదాహరణ. **ఊర్గ్వా అన్నద్ యద్ ఉదుంబరమ్** (తైత్తరీయ బ్రాహ్మణము 1.2.7, 1.3.8).

శ్రీ వాసిష్ఠ – అమ్ - శబ్దే - ధ్వనించుట; **ఉచ్చైః సర్వతః ఉత్తమో వేదరూపః శబ్దో యస్య స ఉదుంబరః సర్వేశ్వరో విష్ణుః**. సర్వోత్తమ శబ్దములైన వేదములే తన స్వరూపముగా కలిగినవాడు సర్వేశ్వరుడైన విష్ణువు ఉదుంబరుడు.

శ్రీ వాసిష్ఠగారి మరొక వ్యాఖ్య – **ఉత్ సర్వత ఉత్కృష్టత్వేన అంబ్యతే - శబ్ద్యతే సంకీర్త్యత ఇతి ఉదుంబరః**. ఉత్కృష్ట శబ్దములైన సంకీర్తనలచే కీర్తింపబడువాడు ఉదుంబరుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **ఉత్ - ఉత్కృష్టమ్ అంబరమ్ - పీతాంబరమ్ యస్య సః ఉదుంబరః**. సర్వోత్తమమైన పీతాంబరమును ధరించువాడు ఉదుంబరుడు.

న్యగ్రోధోదుంబరః

భగవానుడు శ్రీలక్ష్మీసమేతుడై అత్యంతవైభవముగా పరమపదమున ఉండి, సకల దేవతలచేత పూజలు అందుకొంటూఉండి కూడా, అతి నీచులతో కూడా సేవింపబడేవాడు. అత్యల్పజీవులకు కూడా అందుబాటులో ఉన్నవాడు.

ఓం న్యగ్రోధోదుంబరాయ నమః

ఇంతకు ముందు 'న్యగ్రోధః', 'ఉదుంబరః' అనే నామములకు వేరువేరుగా అర్థాలు చూశాము. ఇప్పుడు ఆ రెండింటినీ ఒకేనామంగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించిన విధం చూద్దాము.

'న్యగ్రోధః'కు శ్రీ భట్టులు చెప్పిన అర్థం – భగవంతుడు తనముందు చేతులు జోడించి ఉండే భక్తులకు అందుబాటులో ఉంటాడు (చెప్పుచేతలలో).

'ఉదుంబరః'కు శ్రీ భట్టులు చెప్పిన అర్థం – సకలవైభవయుతము, శ్రీ లక్ష్మీనిలయము అయిన పరమపదము తన నివాసంగా గలవాడు.

ఈ రెండింటినీ కలిపితే వచ్చే అర్థం – భగవంతుడు సర్వోత్తమమైనవి అన్నీ కలిగియున్నాగాని, తన భక్తులు చేతులు జోడించి ఎదుట నిలిస్తే వారి ఆనతి పాటిస్తాడు. **అత్యుచ్ఛ్రిత సేవ్యోऽపి అత్యంత నీచానామపి అనువర్తన సాధ్యః**. ఎందుకంటే భగవంతుడు భక్తసులభుడు. ఎంపెరుమాన్ యొక్క ఈ సౌలభ్యాన్ని భాషతో వర్ణించ సాధ్యం కాదు. శ్రీ భట్టుల వ్యాఖ్యలోని వైశిష్ట్యాన్ని చెప్పడానికి ఈ నామము వ్యాఖ్య ఒక చక్కని ఉదాహరణ. అందుకే శ్రీ భట్టుల వ్యాఖ్యానానికి 'భగవద్గుణ దర్పణము' అని పేరు పెట్టారు. ఎందుకంటే ఆ వ్యాఖ్యానంలో భగవంతుని సౌశీల్యము, సౌలభ్యము అనే గుణాలు మరల మరల ప్రస్తావింపబడ్డాయి.

న్యగ్భూతైః ప్రణతైః స్వానుగ్రహాన్ముఖ్యేన రుధ్యతే

యో వ్యవస్థాప్యతే నిత్యం న్యగ్రోధ స్స ఉదాహృతః
గుణ త్రయాదుద్గతం యత్ పరంధామ చాంబరం
లక్ష్మీపరిజనాధిశ్చ యస్యాస్తి స ఉదుంబరః
న్యగ్రోధోదుంబర ఇతి హ్యేక నామ ప్రకీర్తితమ్
అత్యుచ్ఛ్రితానామ్ సేవ్యో యోऽప్యత నీచానువర్తనాత్
న్యగ్రోధోదుంబర స్సస్యాత్ దశార్ణ సర్వసిద్ధిద

ఉదంబరుడు అనగా గుణత్రయముతో కలియక వాటిని దాటియుండు పరమపదము తనకు నివాసస్థానముగా గలవాడు. పరమపదములో లక్ష్మీదేవితో కూడియున్నవాడు. మహాత్ములచేతనేగాక అతి నీచులతో కూడా సేవింపబడువాడు. న్యగ్రోధోదుంబరుడు అను ఇది ఒకేనామము. దశాక్షరి. సర్వసిద్ధిప్రదము. ఓం న్యగ్రోధోదుంబరాయ నమః.

828. అశ్వత్థః

- అనిత్యములైన ఇంద్రాది దేవతలను ఏర్పరచి, వారిద్వారా సకల కార్యములను నిర్వర్తించువాడు.
- సంసారమనే అవ్యయమైన అశ్వత్థవృక్షము (రావిచెట్టు) తన స్వరూపముగా కలవాడు.
- సదా మారుతూ ఉండే జగత్తును శాశ్వతంగా ఏలేవాడు.
- పంచభూతములుగా విశ్వమంతా వ్యాపించినవాడు.

ఓం అశ్వత్థాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – అ+శ్వ+స్థః – అశ్వస్థః – అశ్వత్థః. పృషోదరాది వ్యాకరణసూత్రం ప్రకారం 'స'బదులు 'త' వస్తుంది. శ్వ-రేపు; అశ్వ-రేపు లేనిది, అనగా శాశ్వతమైనది; స్థః-నియమించువాడు; **న శ్వః, అనిత్యమ్, ఇంద్రాదిత్యాది పదమ్ ఏషామ్, తేషు నియామకతయా తిష్ఠతి ఇతి అశ్వస్థః**. అనిత్యములైన ఇంద్రుడు, బ్రహ్మ, ఆదిత్యుడు వంటి పదవులను నియమించువాడు అశ్వత్థుడు. ఇందుకు శ్రీ భట్టులు విష్ణుపురాణమునుండి ఉదాహరించారు.

మూర్తిమ్ రజోమయీం బ్రాహ్మీమ్ ఆశ్రిత్య సృజతి ప్రజాః
ఆశ్రిత్య పౌరుషీమ్ మూర్తిమ్ సాత్వికీమ్ యః స పాలయన్
కాలాఖ్యామ్ తామసీమ్ మూర్తిమ్ ఆశ్రిత్య గ్రసతే జగత్

రజోగుణాత్మకుడైన బ్రహ్మయందుండి భగవానుడు జగత్తును సృష్టిస్తాడు. సత్వగుణాత్మకుడైన విష్ణువుగా లోకములను పాలిస్తాడు. తమోగుణమూర్తియైన కాలునిగా (శివునిగా) విశ్వమును కబళిస్తాడు.

అనిత్యమింద్రాది పదం యేషాం తేష్వపి నిత్యశః
నియామకత్వేనాశ్వత్థః తిష్ఠతీతి స కీర్తితః

ఇంద్రాది దేవతల స్థానములు నిత్యమైనవి కావు. అటువంటి పదవులందున్నవారిని తాను నిత్యుడైయుండి శాశించేవాడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 5.2.8 – అనేక ఐహిక భాగ్యాలకై మీరు పూజించే దేవతలు పన్ను వసూలు చేసే అధికారులవంటివారు. దేవదేవుడైన నా దేవుడువారిని నియమించువాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ కూడా ఒక వ్యాఖ్యలో 'శ్వస్-రేపు' అనగా 'కాలము' అనే అర్థాన్ని వాడారు. **శ్వః - కాలే, తిష్ఠతి ఇతి శ్వత్థః, న శ్వత్థః అశ్వత్థః, కాల బాహిర్భూతో భగవాన్ విష్ణుః.** కాలముకు అతీతుడైన భగవానుడు విష్ణువు అశ్వత్థుడు. శాశ్వతుడు. ఇందుకు శ్రీ వాసిష్ఠ కఠోపనిషత్తు (2.3.1)నుండి ఉదాహరించారు –

ఊర్ధ్వమూలోऽవాక్ శాఖ ఏషోऽశ్వత్థ సనాతనః
తదేవ శుక్రమ తద్ బ్రహ్మ తదేవామృతముచ్యతే

శాశ్వతమైన రావిచెట్టుకు వ్రేళ్ళు పైకి, కొమ్మలు క్రిందికి ఉంటాయి. అది ప్రకాశవంతమైనది. బ్రహ్మము. అంతము లేనిది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అశ్వత్థ ఇవ తిష్ఠతి ఇతి అశ్వత్థః.** రావిచెట్టురూపంలో ఉన్నవాడు అశ్వత్థుడు. ఇలా తల్లక్రిందులుగా ఉన్న అశ్వత్థవృక్షం గురించి గీతలోను, ఉపనిషత్తులలోను ప్రస్తావించారు.

ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ అశ్వత్థమ్ ప్రాహురవ్యయమ్
ఛందాంసి యస్య పర్ణాని య స్తం వేద స వేదవిత్ – గీత 15.1

ఆదిపురుషుడైన పరమేశ్వరుడే (పైనుండు) మూలముగా, బ్రహ్మయే ముఖ్యశాఖ (కాండము)గా, వేదములే ఆకులుగా గల ఈ సంసారరూప అశ్వత్థ వృక్షము నాశరహిమైనది (శాశ్వతమైనది). ఈ సంసారవృక్ష తత్వమును మూలసహితముగా తెలిసినవాడు నిజముగా వేదార్థములను ఎఱిగినవాడు. ఈ సంసారమనెడు అశ్వత్థవృక్షము వివిధ జీవుల రూపములో అన్నియెడల విస్తరించియున్నది. దానియందు ఆకుల రూపములో జ్ఞానము ప్రవర్తిల్లుచున్నది. ఈ జ్ఞానము (వేదము) రెండు విధములు (1) సంసారమును పొడిగించే కామ్యకర్మలు, పూజాదికములు (2) కామాదులవలన విస్తరించే ఈ వృక్షమును ఛేదించే జ్ఞానము.

శ్రుతులలో కూడ సంసారమును అశ్వత్థవృక్షముతో పోల్చారు.

ఊర్ధ్వమూలోऽవాక్ శాఖ ఏషోऽశ్వత్థ సనాతనః – కఠోపనిషత్తు 2.3.1
ఊర్ధ్వమూల మవాక్ శాఖమ్ వృక్షమ్ యో వేద సంప్రతి – (?)అరణ్యకము 1.11.5

శ్రీ బలదేవ విద్యాభూషణ – అశ్వత్థము - ప్రపంచము. **శ్వస్తాద్ రూపేణ న స్థాతేతి అశ్వత్థః ప్రపంచః; స అస్య అస్తి నిత్యమ్ నియమ్యత ఇతి అర్థః.** స్థిరముగానుండక, ఎప్పుడూ మారుతూనే ఉండే ప్రపంచమును పాలించేవాడు అశ్వత్థుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ చెప్పిన మరొక అర్ధము – అశ్ - వ్యాప్తౌ సంఘాతే చ - వ్యాపించుట, పోగుపడుట.

అశ్నువతే - వ్యాప్నువంతి విశ్వమ్ ఇతి అశ్వాని - పంచమహాభూతాని, తేషు వ్యాపకత్వేన అస్థితః అశ్వత్థః.

పంచమహాభూతముల రూపంలో విశ్వమంతటా వ్యాపించినవాడు అశ్వత్థుడు.

829. చాణూరాంధ్ర నిషూదనః

- చాణూరుడు అనే మల్లయోధుని సంహరించినవాడు.

- సాత్త్వికులను పీడించేవారిని కఠినంగా శిక్షించేవాడు.

- చాణూరుడు, దుర్యోధనుడు మొదలగువారిని పరిమార్చినవాడు.

ఓం చాణూరాంధ్ర నిషూదనాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య –

తద్విరోధినమ్ చాణూర నామానామ్ మల్లమ్

నిషూదితవాన్ ఇతి చాణూరాంధ్ర నిషూదనః

ఆంధ్రజాతి (తక్కువ జాతికి)కి చెందిన, ఇంద్రాదులకు శత్రువైన, చాణూరుడు అనే మల్లుని హతమార్చినవాడు చాణూరాంధ్ర నిషూదనుడు. (ఈ చాణూరుడు, కంసుడు కృష్ణుని చంపడానికి పంపిన చాణూరుడు వేరు వేరు అని, ఇద్దరూ మల్లులేనని, శ్రీ వి.ఎన్. వేదాంతదేశికన్ వ్యాఖ్యానించారు.)

చాణూరాఖ్యాసురం యోऽరిం మల్లం సూదితవాంశ్చవః

ప్రోచ్యతే మునిభిర్నిత్యం చాణూరాంధ్ర నిషూదనః

ఈ నామంలో 'ఆంధ్ర' అనే పదానికి వివిధ వ్యాఖ్యాతలు వివిధ అర్థాలు చెప్పారు. ఆంధ్రజాతి, ఆంధ్రదేశము, తక్కువజాతి – ఇలా.

శ్రీశంకరుల వ్యాఖ్యకు కొందరు చెప్పిన వివరణ ప్రకారం ఆంధ్రదేశానికి చెందిన చాణూరుని కంసుడు పంపాడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – చణ్ - దానే గతౌ చ - ఇచ్చుట. **చణతి - దదాతి దానశీల సాత్త్విక వృత్తయః చాణూరః.**

దానమువంటి కార్యములు చేయు సాత్త్వికులు చాణూరులు.

చై - పూజా నిశామనయోః - పూజించుట, పరిశీలించుట. **చాయ్యంతే పూజయన్తే ఇతి చాణూరః, ప్రశస్త హృదయ సాధవః.** పూజాదులు చేసే సాధువులు చాణూరులు.

అంధ - దృష్ట్యుపఘాతే దృశ్యుపసంహారే - కళ్ళు మూసుకొనుట, గ్రుడ్డివారగుట. **అంధయతి ఇతి అంధ్ర.**

గ్రుడ్డివారు, అంధులు, అనగా మోసము చేయువారు.

చాణూరాంధ్రులు – సాధువులను మోసము చేయువారు.

సూద్ - క్షరణే - నాశనము చేయుట.

నిషూదన - అనేకవిధాలుగా నొప్పిని కలిగించువాడు.

చాణూరాంధ్రనిషూదనః – సాత్వికులను హింసించేవారిని కఠినంగా శిక్షించేవాడు చాణూరాంధ్రనిషూదనుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ **'చాణూరాంధ నిషూదనః'** అనే పాఠాన్ని గ్రహించారు. **చాణూరశ్చ అంధాశ్చ దుర్యోధనాదయః, తాన్ నిషూదయతి ఇతి**. సత్యాన్ని, ధర్మాన్ని చూడలేని గ్రుడ్డివారు దుర్యోధనాదులు (ధృతరాష్ట్రుని కొడుకులు అని కూడ). అట్టి అంధులను, చాణూరుని నాశనం చేసినవాడు చాణూరాంధనిషూదనుడు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

సహస్రార్చిః సప్తజిహ్వః సప్తైధాః సప్తవాహనః |
అమూర్తిరనఘోऽచింత్యో భయకృద్భయనాశనః || (89)

830. సహస్రార్చిః

- వేలాది (అనంతమైన) కిరణములు కలిగి విశ్వమునంతనూ ప్రకాశింపజేసేవాడు.

- ఆయన దివ్యమంగళవిగ్రహము (తిరుమేణి) ఎంతగా వెలిగిపోతున్నదంటే, వేలాది కాంతికిరణాలు ఆయననుండి వెలువడుతున్నట్లున్నాయి.

ఓం సహస్రార్చిషే నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతునినుండి (అంతులేని) కాంతికిరణాలు వెలువడుతున్నాయి. సూర్యచంద్రాదులనుండి వచ్చే కాంతికూడా భగవంతుని కాంతియే. భగవంతుడు ఇచ్చిన కాంతి కారణంగా సూర్యుడు నాలుగు కార్యములు – పచనము (వండుట, పండించుట), శోషణము (ఎండించుట), ప్రతాపనము (వేడి చేయుట), ప్రకాశనము (వెలుగునిచ్చుట) – అనేవి చేయగలుగుతున్నాడు.

సూర్యే సహస్రమర్చీషి శోషణాదిషు హేతవః
అనివిష్టాని యేనాసౌ సహస్రార్చిరితి స్మృతః

ఇందుకు శ్రీ భట్టులు పౌష్కరసంహితమునుండియు, గీత (15.12)నుండియు ఉదాహరించారు.

అగ్నీషోమాత్మ సంజ్ఞస్య దేవస్య పరమాత్మనః
సూర్యచంద్రాంసౌ విద్ధి స ఆకారౌ లోచనేశ్వరః – శ్రీ పౌష్కరము

అగ్నిషోమాత్ముడనే పరమాత్మునికి సూర్యుడు, చంద్రుడు అనే దేవతలు రెండు కన్నుల స్వరూపములు అని తెలిసికొనుము.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్

యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ – గీత 15.12

సమస్త జగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సును, అటులనే చంద్రుని తేజస్సును, అగ్ని తేజస్సును నా తేజస్సేయని యెఱుంగుము.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సహస్రాణి అనంతాని అర్చీషి యస్య సః సహస్రార్చిః.** వేలకొలది, అనగా అనంతమైన కిరణములు కలిగినవాడు సహస్రార్చి. ఇందుకు శ్రీ శంకరులు గీతనుండి ఉదాహరించారు.

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా

యది భాః సదృశీ సా స్యాత్, భాసస్తస్య మహాత్మనః – గీత 11.12

ఆకాశమున వేలకొలది సూర్యులు ఒక్కుమ్మడిగా ఉదయించినచో వచ్చు కాంతిపుంజములును ఆ విరాట్-రూప తేజస్సులకు సరికావు.

శ్రీ నమ్మాళ్వారు తిరువాయిమొళి (3.4.7)లో ఎంపెరుమాన్ ను **'ఒళి మణివణ్ణన్'** (రత్నమువలె ప్రకాశించుచున్నవాడు) అని వర్ణించారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **సహస్రాణి అర్చీషి శ్రీవిగ్రహోద్గత కాంతికిరణ యస్య ఇతి సహస్రార్చిః.** ఎవని దివ్య తిరుమేని వేలాది కాంతిపుంజములతో వెలుగుచున్నదో అతడు సహస్రార్చి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఇదే అర్థంతో ఉన్న ఇతర నామములను గమనింపదగను – **దీప్తమూర్తిః** (77వ శ్లోకము, 724వ నామము), **సహస్రాంశుః** (51వ శ్లోకము, 484వ నామము).

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భూమిపై ఇసుక రేణువులు, సూర్యుని కిరణాలు లెక్కించలేము. ఇంక అనంతమైన భగవద్వైభవమును ఎలా కొలువగలము? ఎలా వర్ణింపగలము? సూర్యునికాంతి భగవంతుని కాంతిలో కొద్ది భాగము అని మాత్రము గ్రహింపనగును. శ్రుతులలో భగవంతుని విభవమును 'సహస్ర' పదంతో అనేకమార్లు వర్ణించారు – **సహస్రయాజసః, సహస్రపర్ణః, సహస్రపాత్, సహస్రశీర్షః, సహస్రాక్షః, సహస్రపోషమ్, సహస్రపోషిణమ్, సహస్రభావః, సహస్రమృష్టిః, సహస్రభరః, సహస్రయామా, సహస్రవీరమ్, సహస్రశృంగః, సహస్రస్థూణమ్, సహస్రకేతుమ్, సహస్రచక్షసమ్,........**

(శ్రీ కైవల్యసారధినుండి) భైరవ యామళము – పరమేశ్వరినుండి అనేక కోట్ల కిరణాలు ప్రకాశిస్తున్నాయి. అందులో 11 కిరణములను సూర్యుడు, 108 కిరణములను అగ్ని, 136 కిరణములను చంద్రుడు తీసుకొన్నారు. వీరివల్లనే జగద్వ్యాపారము జరుగుతున్నది.

831. సప్తజిహ్వః

ఏడు నాల్కలు గలవాడు. అగ్నిస్వరూపుడు.

ఓం సప్తజిహ్వాయ నమః

జిహ్వ అంటే నాలుక. అగ్నికి ఏడు నాల్కలు ఉంటాయని పురాణకథనం. ఈ 'సప్తజిహ్వః' నామమును వ్యాఖ్యాతలు అగ్నిపరంగా వివరించారు.

యస్మాత్కాళ్యాది జిహ్వాశ్చ అగ్నేర్భవతి సప్త చ

స సప్తజిహ్వఖ్యాతః లోకసంతర్పణేంతః

లోకాలను ఆనందింపజేయడంకోసం పరమేశ్వరుడు అగ్నిదేవుడికి ఏడు నాలుకలనిచ్చాడు (అగ్నిరూపంలో పరమేశ్వరుడు ఏడు నాల్కలు కలిగియున్నాడు). అగ్నిహోత్రుని ఏడు నాల్కల పేర్లు –

1. కాళి – నల్లనిది.
2. కరాళి – భయంకరమైనది.
3. మనోజవ – మనసువంటి వేగము గలది.
4. సులోహిత – ఎరుపురంగు గలది.
5. సుధూమ్రవర్ణ – దట్టమైన పొగరంగు గలది.
6. విస్ఫులింగిని – రవ్వలు ఎగజిమ్మునది.
7. విశ్వరుచి – (దేవీ పేలాయమానా) అనేకరూపములు కలిగిన దేవత.

శ్రీ భట్టులు పౌష్కరసంహితనుండి కూడా ఉదాహరించారు.

తద్వక్త్ర దేవతానాంచ హుతభుక్ పరమేశ్వరః

మంత్రపూతం యదాదాయ హుతమాజ్య పురస్సరమ్

బ్రహ్మాండభువనం సర్వం సంతర్పయత స్సర్వదా

అగ్నిని ముఖంగా గల దేవతల రూపంలో హవిస్సును తీసుకునేవాడు పరమేశ్వరుడు. మంత్రసహితముగా నేయి, హోమద్రవ్యాలు అగ్నిముఖంగా ఆరగిస్తాడు. విశ్వమునకు సంతోషం కలిగిస్తాడు.

శ్రీ శంకరులు ముండకోపనిషత్తు (1.2.4)నుండి ఉదాహరించారు –

కాళీ కరాళీచ మనోజవాచ సులోహితాయాచ సుధూమ్రవర్ణా

స్ఫులింగినీ విశ్వరుచీచ దేవీ పేలాయమానా ఇతి సప్తజిహ్వః

ఇతర శ్రుతివాక్యాలలో కూడా ఏడు నాల్కల గురించి ఉన్నది

ఋగ్వేదము 3.6.2 – **దివశ్చదగ్నే మహినా పృథివ్యా వచయన్తామ్ తే వహనాయః సప్తజిహ్వః**

తైత్తరీయ సంహితము 1.5.3 – **సప్తతే అగ్నే సామిధః సప్తజిహ్వః**

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సాత్త్విక, రాజసిక, తామసిక కర్మలనుబట్టి ఈ సప్తజిహ్వాలు మారుతుంటాయి.

సాత్త్విక కర్మలో – హిరణ్యా, కనక, రక్తా, సుప్రభా, అతిర్కృతా, బహురూపా.

రాజసిక కర్మలో – పద్మరాగా, సువర్ణా, భద్రలోహితా, శ్వేతా, ధూమినీ, కాళికా.

తామసిక కర్మలో – కాళీ, కరాళీ .. మొదలగునవి.

ఈ ఏడు జిహ్వాలకు సంబంధించిన దేవతలు – దేవతలు, పితరులు, గంధర్వులు, యక్షులు, నాగులు, పిశాచములు, రాక్షసులు.

శ్రీ వాసిష్ఠ 'సప్తజిహ్వ' అంటే 'ఏడు నాల్కలు' అనే అర్థంలో మాత్రమే కాకుండా, 'సప్త' అంటే 'అనేక' అనే అర్థంలో మరొక వ్యాఖ్య చెప్పారు. **సప్త ఇతి అనేక ఉపలక్షణమ్ అనేక ప్రకార జిహ్వామ్ విధత్త ఇతి**. జీవులకు అనేక విధములైన నాలుకలను భగవంతుడు ప్రసాదిచాడు. మనం తిన్న అన్నం నాలుకద్వారా ప్రాణవాయువును కలుపుకొని జఠరాగ్నిలోనికి ప్రవేశిస్తుంది. అంటే ఇక్కడకూడా మనం అగ్నికి అహారాన్ని సమర్పిస్తున్నామన్నమాట. అంటే వేదాలలో చెప్పింది, నిజరీతిలో జరిగేదీ ఒకటే. **భవతి లోకేన సమో వేదో వేదేన చ సమోలోకః.**

శ్రీ చిన్మయానంద – మన ముఖంలో ఏడు జ్ఞానద్వారాలున్నాయ – రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసికారంధ్రాల, ఒక నోరు. బాహ్యప్రపంచాన్ని గురించిన జ్ఞానభావన వీనిద్వారా కలుగను. అంటే ఒకవిధంగా ఏడు అగ్ని నాలుకలు ఏడు జ్ఞానద్వారాలద్వారా బయటకు వెడలుచున్నాయి. మన హృదయంలో ఉన్న శ్రీమన్నారాయణుని సప్తజిహ్వాలుగా వీటిని అలంకారికముగా చెప్పవచ్చును.

832. సప్తైధాః

- ఏడు విధములైన సమిధలచే ప్రజ్వలింపబడువాడు.
- ఏడు విధములైన వైదిక క్రియలచే ఆరాధింపబడువాడు.
- ఏడు దీప్తులచే ప్రకాశించువాడు.
- సప్తర్షులకు ఆధారమైనవాడు.

ఓం సప్తైధసే నమః

ఇంతకుముందు నామము 'సప్తజిహ్వః'ను ఏడు విధాలైన మంటలు (అగ్నికీలలు లేదా నాలుకలు) పరంగా వ్యాఖ్యానించారు. వాటి రంగులు లేదా గుణాలు, మరియు వానిద్వారా హవిస్సును స్వీకరించే దేవతల గురించి కూడా చెప్పారు. ప్రస్తుతనామము 'సప్తైధాః'ను ఆ మంటలను వివిధ యజ్ఞాలలో ప్రజ్వలింపజేసే సమిధల పరంగా వ్యాఖ్యానించారు.

ఎధ్ - వృద్ధౌ - పెరుగుట, వర్ధిల్లుట; ఏధాస్ - మంటలను పెంచే పదార్ధము, సమిధ. సప్త ఏధాః యస్య సన్తి సః సప్తైధాః (నిరుక్తి).

ఏధాస్ - సమిధ (ఆప్టే నిఘంటువు). **యథైధాంసి సమిధోగ్నిర్భస్మాత్ కురుతేఽర్జున** (గీత 4.37).

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఏడు విధాల సమిధలద్వారా ప్రజ్వలింపబడిన అగ్నివలె ప్రకాశించువాడు 'సప్తైధాః'. వివిధ యజ్ఞాలలో అగ్ని వివిధ సమిధలద్వారా ప్రజ్వలింపబడుతుంది. యజ్ఞాలలో రకాలను శ్రీ శ్రీనివాస రాఘవన్ మరింత వివరించారు.

- పాకయజ్ఞములు (వంటలతో కూడినవి): 1. ఔపాసనము 2. వైశ్వదేవము 3. స్థాలీపాకము 4. అష్టకశ్రాద్ధము 5. మాసికము 6. ఈశానబలి 7. సర్పబలి.
- హవిర్యజ్ఞములు (మంటలో హవిస్సు వేయునవి): 1. అగ్నిహోత్రము 2. దర్శపూర్ణమాసము 3. పిండపితృయజ్ఞము 4. పశుబంధము 5. అగ్రాయణము 6. చాతుర్మాస్యము 7. సౌత్రామణి.
- సోమసంస్థలు (యాగములు): 1. అగ్నిష్టోమము 2. అత్యగ్నిష్టోమము 3. ఉక్థ్యము 4. షోడశము 5. వాజపేయము 6. అతిరాత్రము 7. ఆప్తోర్యామము.

వివిధ యజ్ఞాలలో వాడబడే సమిధలు వివిధ వృక్షాలనుండి తీసికొనబడుతాయి. ఈ వృక్షాలలో పూలు కనిపించవుగాని పండ్లు కనబడుతాయి (1) పలాశవృక్షము (2) మఱ్ఱిచెట్టు (3) Fig Tree (మేడి?) (4) పనసచెట్టు (5) శమీవృక్షము (6) అశనిహతము (7) పుష్కరపర్ణము.

శ్రీ కైవల్యసారథినుండి –

వనస్పత్యోశ్చ సమిధః సప్త సంస్థాని వా తథా

ఇష్టాపూర్తాది కర్మాణి సప్తైధా స్సంతి యస్య సః

(1) అశ్వత్థః (2) ఉదుంబర (3) పర్ణ (4) శమీ (5) వైకంతక (6) అశనిహత (7) పుష్కరవర్ణ – అనే ఏడురకాలయిన వృక్షములకు సంబంధించిన సమిధలు గలవాడు. ఇష్టా, పూర్తి కర్మలు కలవాడు.

ఇష్టాకర్మలు – అగ్నిహోత్రము, తపస్సు, సత్యము, వేదానుపాలన, ఆతిథ్యము, వైశ్వదేవము.

పూర్తములు – వాపీకూపతటాకాలు, దేవాలయాల ప్రతిష్ట, సత్రవులు కట్టించడము, అన్నదానము మొదలైనవి.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సప్త ఏధాంసి దీప్తయోఽస్య ఇతి సప్తైధాః**. ఏడు మంటలతో ప్రకాశించు అగ్ని సప్తైధ. ఇందుకు శ్రీ శంకరులు శ్రుతినుండి ఉదాహరించారు. **సప్త తే అగ్నే సమిధః సప్తజిహ్వాః** (తైత్తరీయ సంహితము 1.5.3). ఓ అగ్నిదేవా! నీకు ఏడుమంటలు, ఏడు నాల్కలు ఉన్నాయి.

శ్రీ సత్యసంధ యతిరాజ – **సప్తర్షీన్ ఏధయతి వర్ధయతి ఇతి సప్తైధాః**. సప్తర్షులకు ఆధారముగానుండి, వారికి ఆనందము కలిగించువాడు సప్తైధ. సప్తర్షులు అనగా మరీచి, అత్రి, అంగిరసుడు, పౌలస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు.

533. సప్తవాహనః

- ఏడు వేదమంత్రములకు రూపములైన ఏడు గుర్రములుగల వాహనము గలవాడు.
- ఏడు సూర్యుల రూపములో జగత్తునకు ఆధారమైనవాడు.
- ఏడు వాయుమండలములద్వారా ముల్లోకములకు ఆధారమైనవాడు.
- 'సప్త' అనే పేరుగల గుఱ్ఱము పూన్చిన రథము గలవాడు.
- జీవుల శరీరంలో ఏడు ద్రవములు, ముఖంలో ఏడు జ్ఞానద్వారములు – ఇలా ఏడు సంఖ్యలో జీవుల రక్షణకు కారణమైనవాడు.
- ఏడు లోకములకు సమృద్ధి కూర్చువాడు.

ఓం సప్తవాహనాయ నమః

వాహ్ - ప్రాపనే - లాగుట, మోయుట, ప్రవహించుట. వాహనము అంటే బండి లేదా దానిని లాగే జంతువు. ఏడు వాహనములు గలవాడు సప్తవాహనుడు.

సప్తాశ్వ రథమారూఢం ప్రచండం కశ్యపాత్మజమ్
శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఏడు గుఱ్ఱములు పూన్చిన రథముగల సూర్యుడు తన వాహనముగా గలవాడు సప్తవాహనుడు. ఈ ఏడు గుఱ్ఱములు ఏడు వేదమంత్రములకు అధిష్ఠానదేవతలుగా భావింపబడుతున్నవి. ఆ ఏడు మంత్రములు – 1. భూ 2. భువః 3. సువః 4. మహః 5. జనః 6. తపః 7. సత్యమ్. ఈ ఏడు మంత్రములకు సంబంధించిన ఛందస్సులు – 1. గాయత్రి 2. ఉష్ణిక్ 3. అనుష్టుప్ 4. బృహతి 5. పంక్తి 6. త్రిష్టుప్ 7. జగతి. ఈ ఏడు మంత్రములకు అధిష్టాన దేవతలు – 1. అగ్ని 2. వాయువు 3. అర్క (సూర్యుడు) 4. వాగీశ (బృహస్పతి) 5. వరుణ 6. ఇంద్ర 7. విశ్వేదేవ. ఈ ఏడుగురు దేవతలు సూర్యుని మార్గములో ముందుగా నడచుదురు. ఈ ఏడుగురు దేవతలు, సంబంధిత ఏడు మంత్రములు, ఏడు ఛందస్సులద్వారా సూర్యునికి ఆధారమైనవాడు గనుక భగవంతుడు సప్తవాహనుడు. సూర్యమండల మధ్యస్థుడైన ఆయనను మనము ఈ ఏడు ఛందస్సులలో నిక్షిప్తమైన ఏడు మంత్రములద్వారా ఆరాధిస్తున్నాము.

యోవహత్య విలస్కందాన్ సప్తాసౌ సప్తవాహనః
వాహనానిచ సన్న్యస్య సప్తవా సప్తవాహనః

హయశ్చ సప్త చ్ఛందాంసి తేషామ్ నామాని మే శృణు

గాయత్రీ బృహత్ ఉష్ణిగ్ జగతీ త్రిష్టుపేవచ
అనుష్టుప్ పంక్తిరిత్యుక్తాశ్ఛందాంసి హరయో రవేః – విష్ణుపురాణము 2.8.5

శ్రీ సత్యసంధ యతిరాజ – **సప్తవాహ్ అశ్వా యస్య స సప్తవాహః, సూర్యస్తం నయతి ఇతి సప్తవాహనః.** ఏడు గుఱ్ఱములు కలిగిన సూర్యుని నడిపించువాడు సప్తవాహనుడు.

శ్రీ శంకరులు – **సప్త అశ్వా వాహనాని అస్య ఇతి సప్తవాహనః.** ఏడు గుఱ్ఱములు కలిగిన సూర్యుని రూపంలో ఉన్న భగవానుడు సప్తవాహనుడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – **ఆరోగో భ్రాజః పటరః పతంగః స్వర్ణరో జ్యోతిషీమాన్ విభాసః** (అరుణ ప్రశ్నమ్ 20) ఆరోగః, భ్రాజః, పటరః, పతంగః, స్వర్ణరః, జ్యోతిషీమాన్, విభాసః అనే ఏడుగురు సూర్యులున్నారు. వీరిలో ముగ్గురు మేరుపర్వతం పైభాగాన, ముగ్గురు మేరుపర్వతం క్రిందిభాగాన ప్రకాశిస్తున్నందున మనకు కనుపించరు. ఆరోగుడు అనే సూర్యుడు మాత్రం మనకు కనుపిస్తున్నాడు. ఇలా ఏడుగురు సూర్యులద్వారా జగత్తునకు ఆధారమైన భగవంతుడు సప్తవాహనుడు.

శ్రీ శంకరులు మరొక అర్థం కూడా చెప్పారు – **ఏకోऽశ్వో వహతి సప్త నామా** (తైత్తరీయారణ్యకము 3.11.9, ఋగ్వేద సంహితము (1.164.2) సూర్యుని రథానికి ఒకే చక్రం, ఒకే గుఱ్ఱం ఉంటాయి. ఆ గుఱ్ఱం పేరు 'సప్త'. కనుక సూర్యరూపుడైన భగవంతుడు సప్తవానుడు.

శ్రీ భట్టులు కూడా మరొక వ్యాఖ్య చెప్పారు – ఏడు వాయుమండలముల ద్వారా జగత్తులోని ప్రాణశక్తిని కాపాడువాడు గనుక భగవంతుడు సప్తవాహనుడు. ఈ ఏడు వాయుమండలములు (1) ఆవాహ (2) ప్రవాహ (3) సంవాహ (4) ఉద్వహ (5) పరివహ (6) వివహ (7) పరావహ.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – మన శరీరంలో అనేక విషయాలలో 'ఏడు' సంఖ్య కనిపిస్తుంది. ఏడు ధాతువులు (రస, శృంగ, మాంస, మేధ, అస్తి, మజ్జా, శుక్లములు), ముఖంలో ఏడు ద్వారాలు (రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒక నోరు.). వీని ద్వారా జీవుల మనుగడ సాగుతుంది.

సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్ సప్తార్చిష సమిధః సప్తహోమః (జిహ్వాః)
సప్తే మే లోకా ఏషు చరన్తి ప్రాణా గుహాశయా నిహితాః సప్త సప్త – ముండకోపనిషత్తు 2.1.8
(ఈ శ్లోకానికి వివిధ వివరణలున్నాయి). అక్షర పురుషునినుండి ఏడు జ్ఞానేంద్రియాలు, ఏడు నాల్కలు, ఏడు విధాల సమిధలు, ఏడు హోమములు వెలువడ్డాయి. భగవంతుడు ఏడు ఏడు జ్ఞానేంద్రియాలను ప్రాణమనే గుహాశయంలో భద్రపరచాడు. అవి ఏడేడు లోకాలలో తిరుగుతుంటాయి. ఇలా ఏడేడు విధాలుగా జీవాన్ని పరిరక్షిస్తున్నందున భగవంతుడు సప్తవాహనుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సప్తభువనాని వాహయతి ప్రాపయతి అభ్యుదయమ్ ఇతి సప్తవాహనః**. ఏడు లోకాలకు సమృద్ధిని కూర్చువాడు సప్తవాహనుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – శ్రీమద్భాగవతం ప్రకారం భగవంతునికి ఏడు వాహనాలున్నాయి. నాలుగు గుఱ్ఱములు, ఒక రధము, గరుత్మంతుడు, ఆంజనేయుడు. కనుక ఆయన సప్తవాహనుడు.

తత్ర అశ్వాః శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప బలాహకాః స్యందనమ్ చైవ పంచమమ్ – భాగవతము 10.89.49

ఛందోమయేన గరుడేన సమూహ్యమానః చక్రాయుధో అయగమదాశు యతో గజేంద్రః – భాగవతము 8.3.31

భిక్షురూపమ్ పరిత్యజ్య వానర రూపమాస్థితః

పృష్టమారోప్య తౌ వీరౌ జగామ కపికుంజరః – రామాయణము 4.4.34

శ్రీ చిన్మయానంద – సూర్యుని రధానికి ఏడు గుఱ్ఱములు. ఇవి వారములో ఏడు రోజులను సూచించును.

36వ శ్లోకము 333వ నామము, 90వ శ్లోకము 860వ నామము అయిన **'వాయువాహనః'** నామానికి, ప్రస్తుత నామము **'సప్తవాహనః'**కు కొన్ని పోలికలు గమనించవచ్చును.

834. అమూర్తిః

- అప్రాకృత దివ్యమంగళ విగ్రహము. కర్మఫలమైన దేహము లేనివాడు.
- ప్రణవంలో అకారంచే సూచింపబడువాడు.

ఓం అమూర్తయే నమః

భగవంతుడు కర్మబద్ధులైన జీవులకంటే ఎలా భిన్నమైనవాడో తరువాతి కొద్ది నామాలలో శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **స్థూల భౌతిక మూర్తి వ్యావృత్తః అమూర్తిః**. జీవుల దేహము పాంచభౌతికమైనది. కాని భగవంతుని మూర్తి లేదా దేహము పూర్తిగా విలక్షణమైనది. దివ్యమైనది. అలా ఆయన అమూర్తి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ ఉదాహరించినది – ఈశావాస్య ఉపనిషత్తు 8 – **స పర్యగాత్ శుక్రమ్ అకాయమ్ అవ్రణమ్.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **మూర్తిః ఘనరూపమ్ ధారణ సమర్థమ్ చరాచర లక్షణమ్, తద్ రహిత ఇతి అమూర్తిః**. 'మూర్తి' అనగా ఘనమైన రూపము కలిగినది. కదులుతుంది లేదా కదలదు. వ్రేలితో తాకడానికి వీలైనది. ఇలాంటి స్థూలరూపము పరమేశ్వరునకు లేదు. కనుక శ్రీమన్నారాయణుడు అమూర్తి.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – 'మూర్తి' లేదా 'రూపము' లేదా 'దేహము' మనకు కర్మఫలాలను అనుభవించడంకోసం సంక్రమించింది. భగవంతునికి అలాంటి రూపం లేనందున ఆయన అమూర్తి.

శ్రీ వాసిష్ఠ – బ్రహ్మమనేది స్థిరమైన రూపం లేని అగ్ని వంటిది. ఋగ్వేదము 3.19.1 – **అగ్నిమ్ హోతారమ్ ప్రవృణే మియేధే గృత్సమ్ కవిమ్ విశమ్ ఇదమ్ అమూరమ్** (అమూరమ్ = అమూర్తమ్)

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **అకారో మూర్తిః యస్య ఇతి అమూర్తిః.** అకారముద్వారా సూచింపబడిన రూపము గలవాడు అమూర్తి.

స్వామి దేశికన్ – రహస్యత్రయ సారమ్ – అష్టశ్లోకి – **అకారార్థో విష్ణుః జగదుదయ రక్షా ప్రళయ కృత్.** అకారమునకు అర్థము విష్ణువు. ఆయనే జగత్తునకు సృష్టి, రక్ష, ప్రళయము కలిగించుచున్నాడు.

శ్రీ వాసిష్ఠ –

ఆత్మాహి అమూర్తిర్వహతే చ మూర్తమ్ గాత్రమ్ యథా నామ తథా భుపైతి
విష్ణూర్హి అమూర్తిః సకలమ్ చ విశ్వమ్ వహన్ తథా నామభిరుచ్యతే సః
రూపములేని ఆత్మవలనే ఈ దేహము నిలచియున్నది. అలాగే రూపరహితుడైన విష్ణువు నామరూపాత్మకమైన సకల విశ్వమునకు ఆధారమైయున్నందున ఆయనను 'అమూర్తి' అన్నారు.

హళెబీడులోని శ్రీ మోహిని శిల్పం.
వికీపిడియానుండి

835. అనఘః

- పాపము లేనివాడు.
- పాపమునకు వ్యతిరేకి.
- దోషము, మాలిన్యము లేనివాడు.
- దుఃఖమునకు అతీతుడు.

ఓం అనఘాయ నమః

'అఘము' అనగా పాపము. అఘ్ - పాపకరణే - చెడు జరుగుట, పాపము చేయుట. **అఘో నాస్తి యస్మిన్ సోఽనఘః.** పాపము లేనివాడు అనఘుడు. పాపమునకు విరోధి అనఘుడు. 'అఘము' అంటే దుఃఖము అనే అర్థంకూడా ఉంది. దుఃఖము చెందనివాడు అనఘుడు.

ఈ నామము రెండుమార్లు వస్తుంది.

16వ శ్లోకము. 148వ నామము. అనఘః – **అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః**

89వ శ్లోకము. 835వ నామము. అనఘః – **అమూర్తిః అనఘోఽచింత్యో భయకృత్ భయనాశనః**

శ్రీ భట్టుల వ్యాఖ్య –

148వ నామము. అనఘః – **సంసార మధ్యే జనిత్వాఽపి అనఘః**. భగవంతుడు సంసారంలో జన్మించినా గాని ఆయన జన్మ కర్మలకు అతీతమైనది కనుక ఆయనకు పాపములంటవు. ఆయన కార్యములు ఆయన లీలలే. కనుక ఆయన అనఘుడు. అంతే కాకుండా ఆయన ఇతరుల పాపములను హరించేవాడు.

835వ నామము. అనఘః – **అకర్మ వశత్వేన తన్ మగ్న జీవ విలక్షణః అనఘః**. భవంతుడు కర్మలకు అతీతుడు. జీవులు కర్మలకు లోబడి ఉంటారు. ఇలా భగవంతుడు జీవులకంటే విలక్షణమైనవాడు. పాపములు ఆయనను అంటవు. కనుక ఆయన అనఘుడు.

శ్రీ వి.వి. రామానుజన్ – భగవంతుని శరీరము శుద్ధసత్వమయము. ఆయనకు వయసు, క్షీణత, అనారోగ్యము వంటివి వర్తించవు. అలాగే పాపములు అంటవు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 3.3.5 – భగవంతుడు దోషరహితుడు. ఎన్నో పాపాలు చేసిన భక్తులను కూడా అపారమైన కరుణతో ఆశీర్వదిస్తాడు.

శ్రీ వి.ఎన్. వేదాంతదేశికన్ – తనను శరణు వేడినవారిని దరిచేర్చడంకోసం భగవంతుడు తిరువైకుంఠంలో ఓపికగా వేచియున్నాడు. వారి లోపాలతో నిమిత్తం లేకుండా అందరినీ కాపాడేవాడు. కరుణామయుడు. భక్తసులభుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు 'అఘము' అనగా 'పాపము', 'దుఃఖము' అనే రెండు అర్థాలనూ పరిగణించి రెండు నామములకు వ్యాఖ్యలనిచ్చారు.

16వ శ్లోకములో 'అనఘః' – **అఘమ్ న విద్యతే అస్య ఇతి అనఘః**. పాపము లేనివాడు అనఘుడు. ఇందుకు శ్రీ శంకరులు ఛాందోగ్యోపనిషత్తు (8.1)నుండి **'అపహత పాప్మా'** అన్న పదాన్ని ఉదాహరించారు.

89వ శ్లోకంలో 'అనఘః' – **అఘమ్ దుఃఖమ్ పాపమ్ చ ద్వయమ్ అస్య న విద్యత ఇతి అనఘః**. పాపము, దుఃఖము లేనివాడు అనఘుడు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ కూడా శ్రీ శంకరులలాగానే వ్యాఖ్యానించారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతునికి దుష్కర్మలు, తద్వారా సంక్రమించు పాపము, తద్వారా సంభవించు దుఃఖము, ఇవేవీ వర్తింపవు. అన్నింటికీ మూలము పాపపు ఆలోచన. భగవంతునికి అలాంటి భావం ఉండజాలదు. కనుక ఆయనకు దుష్కర్మలు, పాపము, దుఃఖము వర్తింపవు. అలా ఆయన అనఘుడు.

ఈశావాస్యోపనిషత్తు 8 – **శుద్ధమ్ అపాప విద్ధమ్**......
బృహత్.ఉపనిషత్తు 4.3.21 – **అపహత పాప్మా అభయమ్ రూపమ్ .... తదాప్త కామమ్ ఆత్మ కామమ్ అకామమ్ రూపమ్ శోకాంతరమ్....**
ఛాందోగ్యోపనిషత్తు 8.7.1 – **ఆత్మా అపహత పాప్మా విజరజ్....**
ఛాందోగ్యోపనిషత్తు 8.4.1 – **న జరా న మృత్యుర్న శోకో న సుకృతమ్ న దుష్కృతమ్ సర్వే పాప్మానోఽతో నివర్తన్తే అపహత పాప్మా....**

శ్రీ చిన్మయానంద – ఛాందోగ్యోపనిషత్తు 8.1.5నుండి – **ఏష ఆత్మా అపహత పాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామ సత్యసంకల్పః.** ఈ ఆత్మకు పాపము, ముసలితనము, మరణము, దుఃఖము, ఆకలి, దప్పిక అంటవు. ఈ ఆత్మకు నిజమైన కోరిక, నిజమైన సంకల్పము ఉన్నాయి. మన శాంతి, అశాంతి ఆత్మకు అంటవు. కనుక భగవంతుడు అనఘుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – భీష్ముడు భగవంతుని '**పవిత్రాణామ్ పవిత్రమ్ యః**' అని వర్ణించాడు.

836. అచింత్యః

- ఉపమానము లేనివాడు. మరిదేనితోనూ భగవంతుని పోల్చలేము.
- ఆయన శక్తిని ఊహించలేము.
- విశ్వమునకు విలక్షణముగానున్నవాడు గనుక మనస్సుచేత ఆయనను చింతింపజాలము.

ఓం అచింత్యాయ నమః

చిత్ - సంజ్ఞానే - గుర్తించుట, అర్థం చేసుకొనుట. అచింత్యుడు అనగా ఆయనను తెలిసికొనలేము. ఆయన లీలలు అర్థం కావు. ఆయన శక్తికి, అందానికి, సౌశీల్య సౌలభ్యాలకు ఉపమానం లేదు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవానుని మరిదేనితోనూ, మరెవరితోనూ పోల్చలేము. **అచింత్యో దుర్నిరూపస్స్యాత్ ముక్తాద్యుపమయాపి సః.** ముక్తులను, నిత్యులను చూసైనా ఇతడు అసామాన్యుడు అని చెప్పవచ్చును.

ఛాందోగ్యోపనిషత్తులో భగవంతుని వర్ణన – **య ఏషోన్తరాదిత్యే హిరణ్మయః పురుషః దృశ్యతే, హిరణ్మయః స్మశ్రుః, హిరణ్యకేశ అప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః, తస్య యథా కప్యాసమ్ పుణ్డరీకమేవమ్ అక్షిణీ.** ఆయన సూర్యమండలం మధ్య బంగారువర్ణంతో, బంగారు మీసాలు, కేశాలు కలిగి, అప్పుడే విరిసిన

తామరపూవువంటి కన్నులు కలిగి సువర్ణమయుడై యున్నాడు. కాని అదే శ్రుతి (తైత్తరీయోపనిషత్తు)లో ఆయనను వర్ణించడం సాధ్యం కాదని ఉంది. **యతో వాచే నివర్తన్తే, అప్రాప్య మనసా సః.**

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 1.3.2 – ఓ పరంజ్యోతీ! నిన్ను అనుభవించాలేకాని మాటలలో వర్ణించడం అసాధ్యం. నీ కళ్ళనూ, కాళ్ళనూ, చేతులనూ పద్మాలతో పోల్చడం, నీ కాంతిని బంగారంతో పోల్చడం ఎందుకంటే ఇంకే మాటలూ అందక, నిన్ను మాటలలో వర్ణించడమూ, ప్రాపంచిక వస్తువులతో పోల్చడమూ అందరాని విషయాలు – ఆ తరువాతి పాశురాలలో శ్రీ నమ్మాళ్వారు భగవంతుని దివ్యమంగళరూపము, అనితర సౌశీల్యము, సౌలభ్యములను తలచి తలచి పరవశించారు. ఇంక నిన్ను వర్ణించే పని మానుకుంటానన్నారు. ఎందుకంటే భగవానుడు అచింత్యుడు. ఆవులతో కలసి ఆడే పాడే గోవిందుడు. 'వెన్నదొంగ' అని పేరుపడ్డ సర్వలోకేశ్వరేశ్వరుడు.

తిరువైమొళి 1.9.6 – భగవంతుడు మన శరీరము, శరీరంలోని ఆత్మ, పంచమహాభూతాలకు ఆత్మ. (అణియన్) భక్తులకు తేలికగా అందివచ్చేవాడు. (శేయన్) శరణాగతులు కానివారికి అందరానివాడు. (యావరుక్కుమ్ శిందైక్కుమ్ గోచరన్ అల్లన్) అచింత్యుడు, మహాజ్ఞానులకు కూడా గోచరింపనివాడు. (తూయన్) అయినాగాని నా హృదయంలో నెలకొని నన్ను ఆశీర్వదించేవాడు. (తూయన్) నాతో ఉండడమే ఆయనకు కావాలి. (తూయక్కన్) తన గుణముల ప్రభావంతో నన్ను ఆకర్షించేవాడు. (మాయక్కన్) ఆయన గురించి ఆలోచించే ఆనందమే మనలను ఆయన దగ్గరకు చేరుస్తుంది. (ఎన్నుడైత్ తోళ్ ఇణైయాన్) అలాంటి మహానుభావుడు (నన్ను గరుడునిగా భావించి) నా భుజాలపై కూర్చుండి నన్ను తనవానిగా చేసుకొన్నాడు. ఆయన ఆశ్చర్యాలకే ఆశ్చర్యము. మాయామయుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **ప్రమాత్రాది సాక్షిత్వేన సర్వప్రమాణ అగోచరత్వాత్ అచింత్యః.** దేనిని గురించి అయినా తెలిసికోవడానికి భగవానుడే కారణము. మనం కంటితో దేనినయినా చూస్తాము. కాని కంటిని చూడలేము. అలాగే భగవానుని గురించి జ్ఞానేంద్రియాలతో తెలిసికొనలేము.

శ్రీ శంకరులు మరొక వ్యాఖ్య కూడా చెప్పారు – **అయమ్ ఈదృశ ఇతి విశ్వప్రపంచ విలక్షణత్వేన చిన్తయితుమ్ అశక్యాద్ వా అచిన్త్యః.** భగవానుడు ప్రాపంచిక విశ్వముకంటె పూర్తిగా విలక్షణుడు. ఈ ప్రపంచంలో మనం తెలుసుకొనేది అంతా ఆయన విభూతిలో కొద్దిభాగమే. కనుక ఆయన అనంత విభూతులు బుద్ధికి అందరానివి.

నాంతోకస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప
ఏషతూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా – గీత 10.40
యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవ వా
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోऽంశ సంభవమ్ – గీత 10.41

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున

విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ – గీత 10.42

ఓ పరంతప! నా దివ్య విభూతులకు అంతమే లేదు నా విభూతుల విస్తృతిని గురించి నీకు చాలా సంక్షిప్తముగా వివరించితిని. విభూతియుక్తమైన, అనగా ఐశ్వర్యయుక్తము, కాంతియుతము, శక్తియుక్తము ఐన వస్తువేదైనను నా తేజస్సుయొక్క అంశమునుండియే కలిగినదిగా తెలిసికొనుము. అథవా ఓ అర్జున! ఇంతకంటెను విపులముగా తెలిసికొని ప్రయోజనమేమి? ఈ సంపూర్ణ జగత్తును కేవలము నా యోగశక్తియొక్క ఒక్క అంశతోనే ధరించుచున్నాను.

ఇలా భగవంతుడు తన ఒక్క అంశతోనే చరాచర సమస్త జగత్తునూ ధరించుచున్నాడు. కనుక ఆయన సంపూర్ణ శక్తి గురించి ఊహించడం సాధ్యం కాదు. అనగా ఆయన అచింత్యుడు.

శ్రీ చిన్మయానంద గీత (8.9)నుండి ఉదాహరించారు –

కవిం పురాణ మనుశాసితారమ్ అణోరణీయాంస మనుస్మరేద్యః

సర్వస్య ధాతార <u>మచింత్యరూపమ్</u> ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ – గీత 8.9

సర్వజ్ఞుడును, సనాతనుడును, అందరిని శాసించువాడును, అణువుకంటెను సూక్ష్మమైనవాడును, అందరిని ధరించి పోషించువాడును, <u>అచింత్యరూపుడును</u>, సూర్యునివలె నిత్యచేతనప్రకాశరూపుడును, అజ్ఞానాంధకారమును పారద్రోలువాడును ఐన సచ్చిదానంద ఘన పరమేశ్వరుని స్మరించువాడగు (పరమభక్తుడు) ....

శ్రీ బలదేవ విద్యాభూషణ – **తర్కః అగోచరః శ్రుత్యేక గమ్యః**. తర్కమునకు అందరానివాడు. శ్రుతివాక్యముల ద్వారా మాత్రమే తెలియవచ్చువాడు గనుక భగవానుడు అచింత్యుడు.

837. భయకృత్

838. భయనాశనః

తన ఆజ్ఞను ఉల్లంఘించేవారికి భయం కలుగజేస్తాడు. తన ఆజ్ఞలను పాలించే భక్తుల భయాన్ని పోగొడతాడు.

ఓం భయకృతే నమః

ఓం భయనాశనాయ నమః

భీ - భయే - భయపడుట, కలత చెందుట. అనే ధాతువునుండి ఈ రెండు నామములను వివరింపవచ్చును. శ్రీ భట్టులు ఈ రెండు నామములకు కలిపి వ్యాఖ్యానం చెప్పారు. శ్రీ శంకరులు విడివిడిగా వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు తన ఆజ్ఞలను ఉల్లంఘించేవారికి భయం కలిగిస్తాడు.తన ఆజ్ఞలను పాటించేవారి భయాన్ని తొలగిస్తాడు.

ఆజ్ఞాతిలఙ్ఘినాం పుంసాం నరకాది భయంకరః

భయకృత సమాఖ్యాతః సప్తార్ణోఽభవవర్ధనః

పరమేశ్వరుని ఆజ్ఞలే శ్రుతులు, స్మృతులు. వాటిని ధిక్కరించి స్వేచ్ఛగా విహరించేవారిని నరకలోకాలకు పంపి కఠినంగా శిక్షించి భయపెడతాడు గనుక భయకృత్. ఈ నామము సప్తాక్షరీ మంత్రము. సంసార బంధనాలను త్రెంచివేస్తుంది. ఓం భయకృతే నమః.

ఆజ్ఞానువర్తినాం స్వస్య భయం నాశయతీతి యః

భయనాశన ఇత్యుక్తో నవార్ణః కర్మకారకః

తన ఆజ్ఞలను పాలించే భక్తులయొక్క భయాన్ని ఫోగొట్టేవాడు భయనాశనుడు. ఈ నామము నవాక్షరి. పుణ్యకర్మలను చేయిస్తుంది. ఓం భయనాశనాయ నమః.

మహాభారతం – **భయ అభయం కరః కృష్ణః సర్వలోకేశ్వరః ప్రభుః.**

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే

అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ – రామాయణం. యుద్ధకాండ 18.34

తిరువాయిమొళి 6.3.8 – ఒప్పిలప్పన్ కోవెల లోని కణ్ణన్ తన భక్తులకు, దేవతలకు నిశ్చయమైన రక్షకుడు. అసురులకు మృత్యువు. శరణాగతులకు తన పాదాలవద్ద ఆశ్రయమిస్తాడు. శరణు వేడనివారు ఆయన దరిదాపులకు కూడా చేరలేరు.

శ్రీ శంకరుల వ్యాఖ్యలు –

భయకృత్

'కృత్ - కరణే - చేయుట' అనే అర్థంలో – **అసన్మార్గ వర్తినామ్ భయం కరోతి ఇతి భయకృత్**. చెడుమార్గంలో చరించేవారికి భయం కలుగజేసేవాడు భయకృత్.

శ్రీ శంకరులే 'కృత్ - ఛేదనే - ఛేదించుట' అనే అర్థంలో మరొక వ్యాఖ్య చెప్పారు. **భక్తానామ్ భయం కృన్తతి వా భయకృత్.** భక్తుల భయాన్ని తొలగించేవాడు భయకృత్.

శ్రీ వాసిష్ఠ కూడా ఈ రెండు అర్థాలనూ చెప్పారు. మొదటి అర్థానికి ఋగ్వేదం (2.12.13)నుండి ఉదాహరించారు.

ద్యావా చిదస్మై పృథ్వీ నమస్తే, సుష్మాచిదస్య పర్వతా భయన్తే

యః సోమపా నిచితో వజ్రబాహుర్యో వజ్రహస్తః సజనాస ఇంద్రః

భూమి, ఆకాశం కూడా ఆయనకు ప్రణమిల్లుతాయి. ఆయన ఊపిరికి పర్వతాలు వణుకుతాయి. వజ్రహస్తుడైన ఆ సోమపానం చేసేవాడే ఇంద్రుడు. ఇంద్రుడు కూడా భగవానునిముందు భయపడతాడు గనుక భగవానుడు భయకృత్.

భీష్మాస్మాద్ వాతః పవతే, భీషోదేతి సూర్యః
భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ, మృత్యుర్ధావతి పంచయ ఇతి – తైత్తరీయోపనిషత్తు
ఆయనపట్ల భయంతో గాలి వీస్తుంది. సూర్యుడు ఉదయిస్తాడు. అగ్ని, ఇంద్రుడు తమ పనులు చేస్తారు. ఆయనంటే భయంతో మృత్యువు పరుగెడతాడు.

భయనాశనః

ఈ నామం వ్యాఖ్యలో శ్రీ శంకరులు వర్ణాశ్రమధర్మాలను పాటించవలసిన అవుసరాన్ని పేర్కొన్నారు.
వర్ణ ఆశ్రమ ఆచారవతామ్ భయం నాశయతి ఇతి భయనాశనః. వర్ణాశ్రమ ధర్మాలను ఆచరించేవారి భయాన్ని నాశనం చేసేవాడు భయనాశనుడు. ఇందుకు శ్రీ శంకరులు విష్ణుపురాణము (3.8.9)నుండి ఉదాహరించారు.
వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్
విష్ణురారాధ్యతే పంథానాऽన్యస్తత్ తోష కారకః
వర్ణాశ్రమధర్మాలను సరిగ్గా ఆచరించేవారే విష్ణువును ఆరాధిస్తున్నట్లు. ఆయనను సంతోషపరచడానికి వేరుమార్గం లేదు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.

అణుర్బృహత్కృశః స్థూలో గుణభృన్నిర్గుణో మహాన్ |
అధృతస్స్వధృతస్స్వాస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః || (90)

తరువాతి కొన్ని నామములను శ్రీ భట్టులు అష్టసిద్ధులు (లేదా అష్టైశ్వర్యములు) పరంగా వ్యాఖ్యానించారు. పరమేశ్వరునివద్ద ఈ సిద్ధులన్నీ సహజంగా ఉన్నాయి. మరియు ఆయన తన భక్తులకు ఈ సిద్ధులను ప్రసాదిస్తాడు. అష్టసిద్ధులు ఏవనగా –

1. అణిమ – శరీరాన్ని అతిచిన్నదిగా చేయడం.
2. మహిమ – శరీరాన్ని అతిపెద్దదిగా చేయడం.
3. గరిమ – శరీరం బరువును విపరీతంగా పెంచడం.
4. లఘిమ – శరీరాన్ని అతి తేలికగా చేయడం.
5. ప్రాప్తి – కావలసిన వస్తువును పొందడం.
6. ప్రాకామ్యము – ఆకాశ గమనము.
7. ఈశిత్వము – అధికారమును పొందడం.
8. వశిత్వము – లోబరచుకోవడం.

839. అణుః

- అతి సూక్ష్మమైనవాడు. సూక్ష్మాతిసూక్ష్మమైన మహదాకాశమందు, అంతకన్న సూక్ష్మమైన జీవునియందు ప్రవేశించువాడు.

- (అణు-శబ్దే) అంతటా, అన్నింటా వ్యాపించే శబ్దమునకు కారణమైనవాడు.

- (అణు-శబ్దే) వేద స్వరూపుడు. వేదములను, శాస్త్రములను మనకు ప్రసాదించినవాడు.

ఓం అణవే నమః

అష్టసిద్ధులలో మొదటిదైన 'అణిమ'గురించి ఈ నామంలో భగవంతుని శక్తిగా సూచింపబడినది. అణు - శబ్దము చేయుట; అణువు - అతి సూక్ష్మమైన పదార్ధము.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు అతి సూక్ష్మమైన హృదయాకాశమందును, అంతకన్నా సూక్ష్మమైన జీవునియందును ప్రవేశించు శక్తి గలవాడు.
అతి సూక్ష్మ హృదాకాశాదవ్యక్తజీవ ప్రవేశనే
శక్తిమానణురిత్యుక్తః షడర్ణ స్సర్వశక్తిదః
ఈ నామము షడక్షరి. సర్వశక్తులను ఇస్తుంది. ఓం అణవే నమః. శ్రీ భట్టులు తైత్తరీయోపనిషత్తునుండి **'అణోరణీయాన్'** అనే వర్ణనను ఉదాహరించారు.

శ్రీ వి.వి. రామానుజన్ – ఈ శక్తులు భగవంతునికి సహజములైనవి. భగవంతుని అనుగ్రహంవల్ల కొన్ని శక్తులు ఇతరులకు లభించును. ఉదాహరణకు సుందరకాండలో హనుమంతుడు అంగుష్ఠమాత్రుడై సురస నోటిలో ప్రవేశించెను.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ముండకోపనిషత్తునుండి ఉదాహరించారు. **ఏష అణురాత్మా చేతసా వేదితవ్యా.** ఈ ఆత్మ (పరమాత్మ) సూక్ష్మమైనది. బుద్ధిద్వారా మాత్రమే తెలిసికొనదగినది.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – మన కంటి చూపుకు కొన్ని పరిమితులు (పెద్దవి, చిన్నవి కూడ) ఉన్నాయి. భగవంతుడు ఈ పరిమితులకు ఆవల ఉన్నాడు గనుక ఆయన ఇంద్రియములకు తెలియరాడు. శ్రీ శాస్త్రి శ్రుతులనుండి పెక్కు ఉదాహరణలు ఇచ్చారు.

కఠోపనిషత్తు 2.20, తైత్తరీయారణ్యకము 10.1 – **అణోరణీయాన్.**
కఠోపనిషత్తు 1.21 – **న హి సువిజ్ఞేయమ్ అణురేషా ధర్మః**. సత్యము అణువువలె సూక్ష్మమైనది. తెలియడం కష్టము.
ముండకోపనిషత్తు 2.2.2 - **యదణుభ్యాఽణుచ**. అణువుకంటె చిన్నది.
కఠోపనిషత్తు 2.8 – **అణీయాన్ హ్యతర్క్యమ్ అణు పరమాణాత్**. అణువుకంటె సూక్ష్మమైనది. తర్కమునకు అందనిది.
ఛాందోగ్యోపనిషత్తు 3.14.3 – **ఏష స ఆత్మా అంతర్హృదయే అణీయాన్ వ్రీహేర్వా యవాద్వా సర్షపాదా శ్యామాకాద్వా శ్యామాక తండులాద్వా**. నా హృదయంలో ఉన్న ఈ పరమాత్మ బియ్యపుగింజకంటెను, ఆవగింజకంటెను చిన్నది.
ఛాందోగ్యోపనిషత్తు 6.8.7 – **స య ఏషో అణిమా.** ఈ (సత్) సూక్ష్మమైనది.

శ్రీ చిన్మయానంద గీతనుండి ఉదాహరించారు. **సర్వస్య చాహమ్ హృదిసన్నివిష్టః**. నేను అందరి హృదయాలలోను స్థితుడనైయున్నాను.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – భగవంతుని అణుత్వము కారణంగా ఆయన అన్నింటా, అంతటా, మరియు సూక్ష్మాతిసూక్ష్మమైన జీవునియందును వ్యాపించియున్నాడు. అంతేగాక ‘అణ్’ అనే ధాతువునకు ‘శబ్దము’ అనే అర్థం ఉంది. అంతటా వ్యాపించే శబ్దము రూపంలో కూడా భగవంతుడున్నాడు. మరియు జీవులనుండి వెలువడే శబ్దాలకుకూడా కారణం భగవంతుడే.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – అణతి - శబ్దయతి - ప్రకటించును, తెలియజేయును. **అణతి శబ్దయతి వేదాది శాస్త్రమ్ ఇతి అణుః**. వేదాది శాస్త్రములను ప్రసాదించిన (ప్రకటించిన)వాడు అణువు. శ్రీ భరద్వాజ ఈ నామాలకు అష్టసిద్ధులపరంగా కాక, స్వతంత్రంగా వ్యాఖ్యలు ఇచ్చారని గ్రహించాలి.

840. బృహత్

- చాలా పెద్దవాడు. విశ్వమునకంటే మూడురెట్లు పెద్దదైన పరమపదమును తన అరచేతనుంచుకొన్నవాడు.
- చాలా పెద్దవాడు. ఇచ్ఛానుసారము పెరుగగలవాడు.
- ప్రతిచోటా సౌందర్యాన్ని పెంపొందించువాడు.
- వృద్ధిచెందిన మంగళగుణములు కలవాడు.

ఓం బృహతే నమః

ఈ నామంలో భగవానుని ‘మహిమ’ అనే సిద్ధి (ఐశ్వర్యం) సూచింపబడింది. ‘అణిమ’ అనగా సూక్ష్మత్వము. ‘మహిమ’ అనగా గురుత్వము. బృహ్ - వృద్ధౌ - పెరుగుట, వృద్ధి చెందుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు అంతటా వ్యాపించియున్నాడు. భౌతికమైన జగత్తుకు మూడురెట్లు పెద్దదైన పరమపదము (త్రిపాద్విభూతి) కూడా ఆయన చేతిలో గోళీకాయ అంత ఉంది.

విపులం పరమం వ్యోమ మహిమ్నా చుళుకీకృతమ్

యేన నామ్నా బృహత్ స స్యాత్ షడర్ణశ్చ బృహత్వదః

అవధులు లేని పరమాకాశమును అరచేత ధరించినవాడు. ఈ నామము షడక్షరీమంత్రము. గొప్ప దశనిచ్చును. ఓం బృహతే నమః.

శ్రీ భట్టులు శ్రుతులనుండి చెప్పిన ఉదాహరణలు –

పురుషసూక్తము – **స భూమిమ్ విశ్వతో వృత్వా అత్య తిష్ఠాత్ దశాంగుళమ్**. ఆయన భూమి మొత్తాన్ని ఆవరించి పదిరెట్లు పెద్దగా ఉన్నాడు.

తైత్తరీయోపనిషత్తు 6.10 – **మహతో మహీయాన్**. పెద్దవానికంటే పెద్దది. **వర్షీయాంశ్చ పృథివ్యా**. భూమికంటె పెద్దవాడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి చెప్పిన శ్రుతి ఉదాహరణలు –

కఠోపనిషత్తు 2.2.2 – **అబ్జా గోజా ఋతజా అద్రిజా ఋతుమ్ బృహత్**. నీటినుండి పుట్టినవాడు, భూమినుండి పుట్టినవాడు, యాగంనుండి పుట్టినవాడు, కొండనుండి పుట్టినవాడు, నిజమైనవాడు, పెద్దయైనవాడు.

శ్వేతాశ్వరోపనిషత్తు 3.7 –**తతః పరమ్ బ్రహ్మ పరమ్ బృహన్తమ్**. అలా పెద్దవాడైన పరబ్రహ్మను ప్రార్థించి, ధ్యానించి తెలుసుకోవాలి.

మహిమ ఐశ్వర్యము, అణిమ ఐశ్వర్యము పరస్పరం వ్యతిరేకాలుగా కనిపిస్తాయి. తరువాత వచ్చే మరికొన్ని నామాలలో కూడా ఇలాంటి వ్యతిరేకమనిపించే శబ్దాలను గమనింపవచ్చును. అంటే భగవంతునికి అన్నీ సాధ్యమే అని, ఎలాంటి పరిమితులూ ఆయనకు వర్తింపవనీ గమనించాలి.

శ్రీ చిన్మయానంద – ఇవి రెండూ పరస్పర విరుద్ధాలుగా అనిపించవచ్చును. కాని తరచి చూస్తే మనకు ఇలాంటి నామాలలో భగవంతుని పరమైశ్వర్యముయొక్క వెలుగు సోకుతుంది. కఠోపనిషత్తులో చెప్పినట్లుగా – **అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మాऽస్య జన్తోర్నిహితమ్ గుహాయామ్**. చిన్నదానికంటే చిన్నది, పెద్దదానికంటె పెద్దది అయిన ఆత్మ హృదయం అనే గుహలో ఉన్నది.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **బృహత్వాత్ బృంహణత్వాత్ చ బ్రహ్మ బృహత్**. బ్రహ్మము చాలా పెద్దది. మరియు అనంతముగా పెరుగగలది గనుక బృహత్.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ సిద్ధులతో అన్వయం లేకుండా తమ వ్యాఖ్యను కొనసాగించారు. **బర్హతి వర్ధతే ప్రతిపదమ్ శోభాయామ్ ఇతి బృహత్**. ప్రతిచోటా సౌందర్యాన్ని వర్ధిల్లజేసేవాడు బృహత్.

శ్రీ సత్యసంధ యతిరాజ – **గుణైః వృద్ధః**. దివ్యమంగళ గుణములు సమృద్ధిగా కలిగినవాడ బృహత్.

841. కృశః

- తేలికైనవానికంటే తేలికైనవాడు.
- సన్నమైనవానికంటే సన్నమైనవాడు.
- తన భక్తుల కష్టాలను క్షీణింపజేసి తొలగించేవాడు.
- జీవులు సౌకర్యంగా ఉండడంకోసం వారిని తగు పరిమాణంలో రూపొందించువాడు.
- అసురులను తేలికజేయువాడు (నాశనం చేయువాడు).

ఓం కృశాయ నమః

ఈ నామము 'లఘిమ' అనగా చాలా తేలిక అగుట అనే ఐశ్వర్యాన్ని (సిద్ధిని) సూచిస్తుంది. కృష్ - తనూకరణే - సన్నగా అగుట (కృశించుట). శ్రీ భట్టులు 'తేలికగా ఉండుట' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. శ్రీ శంకరులు 'సన్నగా ఉండుట' అనే అర్థంలో వ్యాఖ్యానించారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **సర్వత్ర అవ్యాహత గతిః లఘిమ్నా కృశ ఈరిత**. లఘిమ కారణంగా భగవంతుడు ఎంత తేలికగా (దూదికంటె, గాలికంటె తేలికగా) ఉన్నాడంటే అయన ఎక్కడికైనా వెళ్ళవచ్చును. (అన్నిచోట్లా ఉన్నాడు). ఇందుకు శ్రీ భట్టులు మహాభారతంనుండి ఉదాహరించారు. **యత్ర కామ గతో వశీ.**

శ్రీ బలదేవ విద్యాభూషణ – భగవంతుడు ఎంత సన్నగా (కృశించి) ఉన్నాడంటే ఆయన ఒక రాయి లోపల కూడా ఉండవచ్చును. **శిలాస్వపి అప్రతిహత ప్రవేశత్వాత్ కృశః**.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **అస్థూలమ్ ఇత్యాదినా ద్రుశ్యత్వాత్ ప్రతిషేధాత్ కృశః**. భగవంతుడు ఎంత సన్నగా (అస్థూలంగా) ఉన్నాడంటే ఆయన అసలు కనిపించడు. ఒకరు ఈ వ్యాఖ్యను **'ద్రవ్యత్వ ప్రతిషేధాత్'** అని కూడా వ్రాశారు. అంటే భగవంతునికి అసలు ఆకారమే లేదు (ద్రవ్యత్వము). శ్రీ శంకరులు బృహదారణ్యకోపనిషత్తు (3.8.8)నుండి 'అస్థూలమ్' అనే పదాన్ని ఉదాహరించారు. అనగా 'స్థూలము కాని శరీరము'. తరువాతి నామము 'స్థూలః' గనుక బహుశా శ్రీ శంకరులు ఈ 'కృశః' నామమునకు 'అస్థూలమ్' అనే వివరణను ఎన్నుకొని ఉండవచ్చును.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు చిన్నా, పెద్దా వంటి విషయాలు ఆయనను చూసినవారే చెప్పగలరు. కాని భగవంతుడు ఎంత పెద్దవాడంటే ఆయనను చూడడానికి మన కన్నులు చాలవు. ఎంత చిన్నవాడంటే ఆయన మన కన్నులకు ఆనడు. కనుక ఆయన చిన్నా, పెద్దా – కృశః, స్థూలః – అనే ప్రశ్నకు జవాబు లేదు. ఇది భగవంతుని లక్షణము. శ్రీ శంకరులు బృహదారణ్యకోపనిషత్తునుండి 'అస్థూలమ్' అని ఉదాహరించారు. ఆ పదం తరువాతే 'అనణు' అని ఉంది. (**అస్థూలమ్ అనణు**). అనగా భగవంతుడు తన సంకల్పానుసారము ఎలాగైనా ఉండవచ్చును. అలా ఎప్పుడైనా ఉండవచ్చును. ఈ నామంలో మాత్రం భగవంతుని కృశత్వము (తేలికగా ఉండుట లేదా సన్నగా ఉండుట) చెప్పబడింది.

ఇదే శ్లోకంలో ఇంతకుముందు ఒక నామంలో భగవంతుని '**అణుః**' అని వర్ణించారు. తరువాతి నామంలో అందుకు తేడాగా '**బృహత్**' అని చెప్పారు. అలాగే ప్రస్తుత నామం '**కృశః**'. దీని తరువాతి నామం ఇందుకు భిన్నంగా '**స్థూలః**' అని వస్తుంది. ఇలా వైరుధ్యమనిపించే భావన గురించి శ్రీ చిన్మయానంద – 'ధ్యానాన్ని అభ్యసించేవారి అవగాహనకు భగవంతుని గురించి ఋషులు ఇలా పరస్పర వ్యతిరేక భావాలను సూచించే పదాలు వాడారు' అని అన్నారు. ఇంతకుముందు ఉదాహరించిన ఉపనిషద్వాక్యాలు ఇలాంటివే.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **కృశ్యతి తనూకరోతి స్వజన విపదమ్ ఇతి కృశః.** తన భక్తుల కష్టాలను సన్నబరచేవాడు (తగ్గించేవాడు, తొలగించేవాడు) కృశః.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ కూడా అష్టైశ్వర్యములు (అష్టసిద్ధులు)తో అన్వయం లేకుండా ఇలా వ్యాఖ్యానించారు. కృశ్ - సన్నముగా చేయుట. భగవంతుడు సకల జీవులను తగువిధంగా, తగు పరిమాణంలో రూపొందిస్తాడు. అది ఆయా జీవుల మనుగడకు, సౌకర్యానికి అవుసరం. ఈ విషయంలో శ్రీ వాసిష్ఠ వ్యాఖ్య '**త్వష్టా**' (6వ శ్లోకము, 52వ నామము) అనే నామం అర్థానికి పోలి ఉంది.

శ్రీ సత్యసంధ యతిరాజ – **దైత్యాన్ కర్శయతి ఇతి కృశః.** దైత్యులను కృశింపజేయువాడు, అనగా వారిని నాశనము చేయువాడు కృశః.

842. స్థూలః

- చాలా పెద్దవాడు. కావలసిన వస్తువును స్పృశింప (పొంద)గలవాడు. ప్రాప్తి గలవాడు.
- తన భక్తుల సంపదను ఎన్నోరెట్లు పెంచేవాడు.
- అందరికీ ఆత్మ అయినవాడు.

ఓం స్థూలాయ నమః

స్థూల్ - పరిభ్రమణే - లావుగా, పెద్దగా అగుట. అనే శబ్దంనుండి ఈ నామమును వివరింపవచ్చును. ఇంతకు ముందు నామము 'కృశః' అనగా కావలసినంత సన్నగా లేదా తేలికగా అగుట అని వివరింపబడినది. ప్రస్తుత నామము 'స్థూలః' అనగా కావలసినంత పెద్దదిగా అగుట అనే భగవదైశ్వర్యం పరముగా వివరింపబడినది.

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు కదలకుండానే బ్రహ్మాండంలో ఏ వస్తువునైనా స్పృశింపగలడు (పొందగలడు) గనుక 'స్థూలః' ఈ నామంలో సూచించిన 'ప్రాప్తి' ఐశ్వర్యానికి శ్రీత్రివిక్రమావతారము చక్కని ఉదాహరణ.

స్థిత్వైకత్రాఖిలం స్ప్రష్టుం శక్తిర్యామహతీ సదా
తయా ప్రకృష్టయా శక్త్యా విశిష్ట స్థూల ఉచ్యతే

ఆండాళ్. తిరుప్పావై 3 (శ్రీ వి.వి. రామానుజన్ ఉదాహరించినది) – **ఓంగియుల గళన్ద వుత్తమున్ పేర్ పాడి.** పెరిగి లోకాలు కొలిచిన పురుషోత్తముని కీర్తించి.

శ్రీ వాసిష్ఠ శ్రుతులనుండి ఉదాహరించారు.

అనేజదేకమ్ మనసోజవీయో నైనద్దేవ ఆప్నువన్ పూర్వమర్షత్
తద్ధావతోऽన్యానత్యేతి తిష్ఠత్ తస్మిన్నపో మాతరిశ్వా దధాతి – ఈశావాస్యోపనిషత్తు 4.

పరమాత్మ కదలడు. ఆయనకు సమమైనది లేదు. ఆయన వేగం మనసుకంటే ఎక్కువ. (ఆయన దేవతలవద్దకు చేరుకున్నాగాని దేవతలకు ఆయన అందడు.) కదలకుండానే ఆయన పరుగెత్తేవారిని అధిగమిస్తాడు. ఆయన కారణంగా వాయువు జలాన్ని మోసుకెళతాడు.

సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్
స భూమిమ్ విశ్వతో వృత్వా అత్య తిష్ఠత్ దశాంగులమ్ – పురుషసూక్తము.
ఆయన అంతులేని తలలు, కన్నులు, పాదములు కలిగినవాడు. విశ్వమంతా ఆవరించియున్నవాడు. మనకున్న జ్ఞానంతో ఆయనను కొలవడం సాధ్యం కాదు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సర్వః ఆత్మకత్వాత్ స్థూలః ఇతి ఉపచర్యతే**. అందరికీ ఆత్మ అయినందున ఆయనను 'స్థూలః' అన్నారు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **కోటి బ్రహ్మాండ విగ్రహత్వాత్ స్థూలః**. అనంతమైన బ్రహ్మాండములు ఆయన స్వరూపమే గనుక భగవానుడు స్థూలః.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుడు **అణుః, బృహత్, కృశః, స్థూలః** వంటి ఐశ్వర్యములు కలిగియున్నందున ఆయన ఏ క్షణంలో ఎలా ఉంటాడో ఎవరూ తెలిసికొనలేరు.

6వ శ్లోకం 53వ నామము '**స్థవిష్ఠః**'. 47వ శ్లోకం 437వ నామము '**స్థవిష్ఠః**' ఈ '**స్థవిష్ఠః**' నామము '**స్థూలః**', '**ఇష్ట**' అనే పదాలు కలిసి ఏర్పడినట్లుగా చెప్పుకోవచ్చును. అనగా సంకల్పానుసారము చాలా పెద్దగా ఉన్నవాడు అని. ఇంకా '**స్థవిష్ఠః**' అనగా భగవంతుడు బ్రహ్మాండము రూపంలోను, నక్షత్రమండలాల రూపంలోను ఉన్నాడు అని కూడా అర్థాలు చెప్పారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **స్థూలయతి బృంహయతి స్వజన సంపదమ్ ఇతి స్థూలః**. తన భక్తుల సంపదను ఎన్నోరెట్లు పెంచేవాడు 'స్థూలః' ఇక్కడ సంపద అంటే భౌతికమైన ధనాదులు మాత్రమే కాదు. భగవంతునికి, భాగవతులకు కైంకర్యము చేయడంలో ఉన్న ఆనందమే ఆ సంపద.

తిరుప్పావై. 3వ పాశురము. చిత్రకవి ఆత్రేయ తెలుగు సేత మరియు వివరణ –

పెరిగి లోకాలు కొలిచిన పురుషోత్తముని కీర్తించి
నోము పేరునకలసి మేము నీరాడితే, దేశమంతా
నెల మూడు వానలు కురిసీ ఈతి బాధలు తొలుగు
పెరిగిన ఎణ్లని వరిచేల పైకెగురు చేపలు
నీరజముల మెరసి నిదురించు తుమ్మెదలు

స్థిరమున కూర్చుండి సిరములను లాగ
కలశములను నింపు కామధేనువులు
నిత్య సంపదలతో నిండుగానుండు
జగతికే మంగళము కూర్చు మన శ్రీవ్రతము

ఇది ఆశీర్వచన పాశురం. ఎక్కడ ఏ శుభకార్యం జరిగినా ఈ విశేష పాశురమును పెద్దలు చదువుతారు. త్రివిధ తాపములు (తాపత్రయము) తొలగి, అన్నీ సమృద్ధిగా ఉండాలని పెద్దలు మంగళాశాసనం చేస్తారు. శుభప్రదమైన వామనావతారకథ ఈ గేయంలో వస్తుంది.

843. గుణభృత్

- ఈశిత్వము గలవాడు. అనగా అన్నింటిమీద అధికారము గలవాడు. మరియు అన్నింటికి ఆధారమైనవాడు.
- రజోగుణముతో సృష్టిని, సత్వగుణముతో వృద్ధిని (పాలనను), తమోగుణముతో లయమును నిర్వహించువాడు.
- జ్ఞానానంద మాధుర్య వాత్సల్యాది అనంత కళ్యాణ గుణములు కలవాడు.

ఓం గుణభృతే నమః

గుణములు అనగా దయాదాక్షిణ్యాది లక్షణములు మరియు సత్వరజస్తమోగుణములు కూడ. భృ - ధారణ పోషణయోః - కలిగియుండుట, నిర్వహించుట. **గుణ దయాదాక్షిణ్యాదయః సత్వరజస్తమ ఆదయశ్చ, తేషామ్ భృత్-ధారక ఇత్యర్థః** (శ్రీ వాసిష్ఠ).

శ్రీ భట్టుల వ్యాఖ్య – భగవంతుడు తన సంకల్పమాత్రమున అన్ని జీవులను, అన్ని స్థితుల (గుణముల) యందును, తన అధీనములో ఉంచుకొని వానికి ఆధారమై యున్నాడు. ఈ నామము ఆయన ఈశిత్వము అనే ఐశ్వర్యమును సూచించును.
సంకల్పాత్వ గుణీభూత సర్వావస్థమిదం జగత్
కుర్వన్ బిభర్తి నిత్యం యః గుణభృత్ స స్మృతో బుధైః
ఇందుకు శ్రీ భట్టులు తైత్తరీయోపనిషత్తు (6.1)నుండి ఉదాహరించారు. **సర్వస్య వశీ సర్వస్య ఈశానః**. ఆయన అన్నింటినీ తన అధీనంలో ఉంచుకొని వానికి ప్రభువైయున్నాడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సత్వరజస్తమసామ్ సృష్టి స్థితి లయ కర్మసు అధిష్ఠానత్వాత్ గుణభృత్**. భగవంతుడు సత్వరజస్తమో గుణముల ద్వారా సృష్టిస్థితిలయాది కార్యములకు అధికారియై ఆయా గుణములకు ఆధారమై యున్నాడు గనుక గుణభృత్.

శ్రీ బలదేవ విద్యాభూషణ కూడా మించు ఇదే అర్థం చెప్పారు. **గుణాన్ సత్వాదీన్ బిభర్తి ఇతి గుణభృత్**.

శ్రీ కృష్ణత్త భరద్వాజ – **గుణాన్ జ్ఞాన ఆనంద మాధుర్య వాత్సల్యాదీన్ బిభర్తి ఇతి గుణభృత్.** భూతభవిష్యద్వర్తమానములను గురించి సదా సంపూర్ణజ్ఞానము, సచ్చిదానంద పరిపూర్ణత్వము, శత్రువులపట్ల కూడామాధుర్యము, భక్తులయెడ దూడపట్ల ఆవుకుండే వాత్సల్యము ఇలాంటి అనంత కళ్యాణగుణములు కలిగినవాడు గుణభృత్.

శ్రీ సత్యసంధయతిరాజ కూడా ఇలాంటి అర్థమే చెప్పారు. **గుణాన్ ఆనందాదీన్ బిభర్తి ఇతి గుణభృత్.**



గోవర్ధనగిరినెత్తిన శ్రీకృష్ణుడు. 1800 కాలపు చిత్రం. వికీపీడియానుండి

844. నిర్గుణః

- అన్ని జీవులతోను సదా స్పర్శతో ఉన్నప్పటికీ వాని గుణములు ఆయనకు అంటవు. ఆయన గుణరహితుడు. వశిత్వము కలిగి అన్నింటినీ లోబరచుకొన్నవాడు.
- ఎట్టి గుణములు లేనివాడు.

ఓం నిర్గుణాయ నమః

'గుణము' అనగా ప్రకృతి లక్షణములైన సత్వరజస్తమో గుణములు. ఈ గుణములు గాని, వాని ప్రభావములు గాని భగవంతుని అంటవు. కనుక ఆయన నిర్గుణుడు. '**గుణభృత్**' నామంలో చెప్పిన ప్రకారము అన్ని గుణములకూ ఆయనే ఆధారము అయినా గాని ఆయన మాత్రం నిర్గుణుడు. ఈ రెండు నామములు – **గుణభృత్, నిర్గుణః** – పరస్పరం విరుద్ధములు అనిపిస్తాయిగాని ఇవి రెండూ భగవదైశ్వర్యములను సూచిస్తాయి. '**గుణభృత్**' నామము ఈశిత్వమును, '**నిర్గుణః**' నామము వశిత్వమును తెలియజేస్తున్నాయి.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **అతత్వశ్యతయా తత్ సంస్పర్శేఽపి అస్పృష్ట తద్గుణః నిర్గుణః.** భగవంతుడు అన్ని జీవులతోను కలసిఉన్నాగాని ఆయా జీవుల గుణములు, లక్షణములు, ప్రభావములు భగవంతుని అంటవు. ఎందుకంటే ఆయన నిర్గుణుడు. వానికి పేటికీ ఆయన లోబడడు. అన్నీ ఆయనకు వశమైయుంటాయి. భగవంతుని 'వశిత్వము' అనే ఐశ్వర్యము ఈ నామంలో చెప్పబడింది.

స్థితోఽపి నీ క్షీరవత్ జగతోఽస్పర్శనాద్గుణైః
ఉక్త స నిర్గుణః ఇతి సప్తార్ణ పావనత్వదః

చేతాచేతనములన్నింటిలోనూ పాలలో కలిసిన నీటివలె కలిసి ఉంటాడు. ఈ రకంగా అన్ని భూతాలను లోబరచుకొని ఉంటాడు. అన్ని గుణాలతో ఉన్నప్పటికీ అన్నింటినీ లోబరచుకొని ఉంటాడు. కాని ఆయనకు గుణాలు అంటవు. కనుక ఆయన నిర్గుణుడు. ఇది సప్తాక్షరి. పావనకరము. ఓం నిర్గుణాయ నమః. (శ్రీకైవల్య సారధి).

ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ప్రమాణములు –

తైత్తిరీయోపనిషత్తు 3.6.1 – **విశ్వస్య మిషతో వశీ.** తన చక్కని చూపుతో ఆయన లోకాలను వశం చేసుకొంటాడు.

విష్ణుపురాణము 1.9.44 – **సత్త్వాదయో న సన్తీశే యత్ర చ ప్రాకృతగుణాః.** ప్రకృతిలో ఉండే సత్త్వమువంటి గుణములు ఈశునియందు ఉండవు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **ప్రకృత గుణత్రయ విరహితత్వాత్ నిర్గుణః.**

శ్రీ సత్యసంధ యతిరాజ – **సత్త్వాది గుణరహితత్వాత్ నిర్గుణః.**

శ్రీ శంకరుల వ్యాఖ్య – **వస్తుతో గుణ అభావాత్ నిర్గుణః.** ఏ విధమైన గుణములు లేనివాడు నిర్గుణుడు. ఇందుకు శ్రీ శంకరులు శ్వేతాశ్వరోపనిషత్తు (6.11)నుండి ఉదాహరించారు. **సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ.** అందరిలోనూ సాక్షిగా ఉండేవాడు. కాని వారిలోని త్రిగుణములు అంటనివాడు. నిర్గుణుడు.

845. మహాన్

- అన్ని విషయాలలోను అధికుడు. ఇచ్ఛానుసారము ఎక్కడికైనా వెళ్ళగలవాడు. ప్రాకామ్యము గలవాడు.
- ఊహకు, తర్కానికి అందనంతవాడు.
- పూజ్యనీయుడు. ఇంద్రాదులచే పూజలందుకొనేవాడు.

ఓం మహతే నమః.

మహ - పూజాయామ్ - గౌరవించుట, ఆనందించుట, పెంచుట; మహాన్ - పూజింపదగినవాడు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – **పరమ ప్రకర్షాత్ మహాన్.** అన్ని విషయాలలోను అత్యున్నతుడు మహాన్. ఆయనకు సాధ్యంకానిది లేదు. ఆయన వెళ్ళలేని చోటు లేదు. మనం నీళ్ళలో మునిగి తేలినట్లుగానే భగవంతుడు భూమిలోకూడా మునిగి తేలగలడు. అష్టైశ్వర్యములపరంగా 'మహాన్' అనే నామము భగవంతుని ప్రాకామ్యమును (ఎదిరించరాని ఇచ్ఛను) సూచిస్తుందని శ్రీ భట్టులు వివరించారు. శ్రీ భట్టులు ఉదాహరించిన శ్లోకము –

సంప్రయోజ్య వియోజ్యాయమ్ కామకారకరః ప్రభుః

యద్ యద్ ఇచ్ఛేత్ అయం శౌరిః తత్ తత్ కుర్యాత్ అయత్నతః

శౌరి తన ఇచ్ఛానుసారం ఏమైనా చేస్తాడు. అందుకోసం ఆయన కష్టపడనక్కరలేదు. ఆయన వేనినైనా కలపగలడు లేదా విడదీయగలడు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – ఇక్కడ ప్రాకామ్యము అనగా ఇచ్ఛానుసారము ఎవరి మనసులోనైనా ప్రవేశించుట, వారేదైనా గుర్తుంచుకొనేలాగా లేదా దానిని మరచిపోయేలాగా చేయడంవంటివి.

భూమ్యాసహ మహావీరే హ్యున్మజ్జన నిమజ్జనాత్
మహానితి చ విఖ్యాతః షడర్ణస్తు మహత్వదః
ప్రళయకాలంలో భూమితోబాటుగా తనుకూడా మహాసముద్రంలో మునుగుతూ తేలుతూ ఉంటాడు. అన్నింటికీ ఉత్కృష్టమైన ఆకాశగమనం కలవాడు. ఈ నామము షడక్షరీమంత్రము. మహత్వమును ప్రసాదిస్తుంది. ఓం మహతే నమః. (శ్రీ కైవల్యసారధినుండి)

శ్రీ శంకరుల వ్యాఖ్య – **తర్కతోऽపి యతో వక్తుమ్ న శక్యమ్.** తర్కం కోసం కూడా ఆయనను ఇలా అని వర్ణించడం సాధ్యం కాదు. ఆయనకు శబ్దాది విషయాలు వర్తించవు. ఆయన కొలవరానంత సూక్ష్మమైనవాడు. శుద్ధసత్వమూర్తి. అంతటా వ్యాపించినవాడు. ఆయనకు అవరోధం అనేది ఏదీ వర్తించదు. ఆయన మహాన్.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – భగవంతుని గురించి మాటలలోను, ఊహలలోను, మరేవిధంగాను అర్థం చేసుకొనలేము. ఇంతకుముందు ఆరు నామాలను పరిశీలించినట్లయితే పరిశీలించినట్లయితే భగవంతుడు **అణుః** (సూక్ష్మమైనవాడు), **బృహత్** (చాలా పెద్దవాడు), **కృశః** (చాలా సన్ననివాడు), **స్థూలః** (చాలా లావైనవాడు), **గుణభృత్** (గుణములతో నిండినవాడు), **నిర్గుణః** (గుణములు లేనివాడు). ఇలా ఆయన పరస్పర వ్యతిరేక పదాలతో వర్ణింపబడుచున్నాడు. ఎందుకంటే ఆయన కాలానికి, స్థలానికి, రూపానికి అతీతుడు. పంచభూతముల పరిమితులు ఆయనకు లేవు. శ్రీ చిన్మయానంద కూడా ఇదే వివరణ ఇచ్చారు.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – మహ్యతే - పూజ్యతే; శ్రీ భరద్వాజ ఈ శ్లోకంలో ఇతర నామాలకు, ఈ నామానికి కూడా అష్టైశ్వర్యాలకు లంకె పెట్టకుండా వివరణ ఇచ్చారు. **మహ్యతే పూజ్యతే బ్రహ్మాదిభిః ఇతి మహాన్**. బ్రహ్మాదులు కూడా ఈ భగవంతుని పూజిస్తారు. కనుక భగవంతుడు మహాన్. పూజింపదగినవాడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **సర్వైః అభ్యర్చ్యయత్వాత్ మహాన్.** అందరిచేత అర్చింపబడువాడు మహాన్.

846.అధృతః

- పరిమితులు లేనివాడు, కట్టుపడనివాడు
- ఆధారము లేనివాడు

ఓం అధృతాయ నమః

ధృ - ధారణే - పట్టుకొనుట, ఆధారముగానుండుట.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు నామము **'మహాన్'** అనగా భగవంతుడు ఏదైనా చేయగలడు అని. ప్రస్తుత నామము **'అధృతః'** అనగా ఏదైనా చేయడానికి భగవంతునికి ఎలాంటి నియమాలుగాని, పరిమితులుగాని లేవని. రెండు నామాలు కలిపితే – భగవంతుడు తన ఇచ్ఛానుసారము ఎలాంటి పరిమితులు లేకుండా ఏమైనా చేయగలవాడు. **యశ్చా నియమ్యః కేనాపి హ్యధృతః స్సతు కీర్తితః**. అతడు ఎవరిచేతా నియమింపబడడు కాబట్టి 'అధృతః' అనబడుతాడు.

ఇందుకు శ్రీ భట్టులు చెప్పిన ఉదాహరణ – భగవంతుడు వైదిక బ్రాహ్మణుని కుమారునికి పరమపదం ప్రసాదించాడు. తరువాత ఆ పిల్లవానికి పునర్జన్మ ఇవ్వడంకోసం ఇహలోకానికి తెచ్చాడు. సాధారణంగా పరమపదాన్ని చేరుకొన్నవారికి పునర్జన్మ ప్రాప్తించదు. కాని భగవానుడు తన ఇచ్ఛానుసారం ఏమైనా చేయగలడు. ఈ నామంలో భగవంతుని 'ప్రాప్తి' (ఏదైనా చేయగలడు) అనే ఐశ్వర్యం సూచింపబడిందని శ్రీ వి.వి. రామానుజన్ వివరించారు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **పృథివ్యాదీనామ్ ధారకాణామపి ధారకత్వాత్ న కేనచిత్ ధ్రియత ఇతి అధృతం.** భూమివంటి అన్నింటికీ ఆధారమైనవాడు భగవంతుడు. ఆయనకు మాత్రం వేరు ఆధారం లేదు కనుక ఆయన అధృతుడు.

శ్రీ సత్యదేవో వాసిష్ఠ – **యో హి సర్వస్య ధాతా స కేన ధృతః స్యాత్?** అన్నింటికీ ఆయన ఆధారం అయినప్పుడు ఆయనకు ఆధారం ఏముంటుంది?

శ్రీ చిన్మయానంద – వస్త్రానికి దూది, ఆభరణానికి బంగారం, కుండకు మట్టి ఆధారాలు. అలాగే సమస్త విశ్వానికి భగవంతుడు ఆధారం. మనకు ఆయనే ఆధారం అని గ్రహించి అధృతుడైన శ్రీమన్నారాయణుని ధ్యానింపవలెను.

శ్రీ కైవల్యసారథి నుండి –

1. ఇతరులయందు ప్రవేశించి వారిని వశం చేసుకోవడము.
2. తనను ధ్యానించేవారి హృదయాలలో ఉండడము.
3. జీవునితో కూడినది, కూడనిది అయిన దేహమందు ప్రవేశించడము.
4. ఇష్టాపూర్తి కర్మలయందు ఉండడము

ఈ కర్మలు వేటిలోనూ కట్టుపడకుండా యథేచ్ఛగా ఉండేవాడు అధృతుడు.

847. స్వధృతః

848. స్వాస్యః

849. ప్రాగ్వంశః

850. వంశవర్ధనః

847, 848, 849వ నామములు భగవంతుని ఐశ్వర్యోన్నతిని సూచించునవిగా శ్రీ భట్టులు వ్యాఖ్యానించారు.

స్వధృతః – బద్ధులకంటె భగవానుడు ఉన్నతుడు. బద్ధులకు కూడా తపోధ్యానాదుల ద్వారా కొన్ని ఐశ్వర్యములు సంప్రాప్తించవచ్చును.

స్వాస్యః – ముక్తులకంటె భగవానుడు ఉన్నతుడు. ముక్తులు కూడా భగవంతునివంటి లక్షణములు అనేకములు కలిగి ఉండవచ్చును. కాని ముక్తులు ఒకప్పుడు అజ్ఞానంచే ఆవరింపబడ్డారు.

ప్రాగ్వంశః – నిత్యులకంటె భగవానుడు ఉన్నతుడు. నిత్యులనగా శ్రీవైకుంఠములో ఉండే శాశ్వత జీవాత్మలు. కాని నిత్యులకు మూలము, ఆధారము శ్రీమన్నారాయణుడే.

శ్రీ భట్టులు ఈ మూడు నామముల వివరణను తరువాతి నామమైన 'వంశవర్ధనః' నామం వివరణలో సంక్షిప్తపరచారు. మూడు విధములైన జీవులు – బద్ధులు, ముక్తులు, నిత్యులు – వర్ధిల్లుటకు కారణమైనవాడు వంశవర్ధనుడు.

847. స్వధృతః

- స్వభావసిద్ధంగా మహదైశ్వర్యము గలవాడు. తపోధ్యానాదులచే ఐశ్వర్యము (సిద్ధులు) పొందే బద్ధజీవులకంటే భిన్నమైనవాడు.
- తనకు తానే ఆధారమైనవాడు (స్వ - స్వయంగా)
- భక్తులు భగవంతుని తమ మనస్సులో నిలుపుకొందురు (స్వ - స్వజనులు - భక్తులు).
- తన భక్తుల ఐశ్వర్యమును నిలుపువాడు (స్వమ్ - ధనమ్).

ఓం స్వధృతాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – ఇంతకుముందు నామము **'అధృతః'** అనగా మరెవరిచేత నియమములు లేనివాడు. ప్రస్తుత నామము **'స్వధృతః'** అనగా తనకు తానే నిలుపుకొనువాడు. స్వయంగా మహదైశ్వర్యం గలవాడు. **స్వభావతో ధృతైశ్వర్యః స్వధృతః పరికీర్తితః**. అనగా ఆయన అధికారము, ఐశ్వర్యము మరెవరిపైనో, దేనిపైనో

ఆధరపడియుండవు. అది ఆయన సహజత్వము. బద్ధజీవులు తపోధ్యానాదులద్వారా పొందే సిద్ధులకూ, పరమాత్ముని ఐశ్వర్య సిద్ధులకూ భేదం ఇది.

మిగిలిన దేవుళ్ళందరూ ఆయా కార్యముల నిర్వహణకై ఆయనచే నియమింపబడ్డారు. కనుక వారికి ఆయన నియామకుడు, ఆధారము. అలా నియమింపబడని, పోలికలేని పరమాత్ముడు శ్రీమన్నారాయణుడు ఒక్కడే (తిరువైమోళి 5.10.8).

ఏకోహి వై నారాయణ ఆసీత్.

శ్రీ శంకరుల వ్యాఖ్య – శ్రీ శంకరులు ఛాందోగ్యోపనిషత్తునుండి ఉదాహరించారు. **స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి, స్వే మహిమ్ని**. ఆ పరబ్రహ్మ దేనిచే ప్రతిష్ఠితమైయున్నది? అది తన మహిమ చేతనే నిలిచియున్నది. ఒక వస్తువునకు ఆధారమైనదానికి మరియొక ఆధారం ఉంటుంది. కాని మరే ఆధారం లేకుండా తనకుతానే నిలచియున్నది పరబ్రహ్మము.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – స్వ - స్వజనః - తన భక్తులు; **స్వైః స్వజనైః ధృతః చిత్తే ఇతి స్వధృతః**. తనవారైన భక్తులు తమ మనసులలో నిలుపుకొని ఉండేవాడు స్వధృతుడు.

శ్రీ సత్యసంధ యతిరాజ – స్వమ్ - ధనమ్ - సంపద; **స్వమ్ ధనమ్ ధృతమ్ యేన ఇతి స్వధృతః.** అన్నింటియందూ ఐశ్వర్యమును నిలుపువాడు, పెంచువాడు స్వధృతుడు.

848. స్వాస్యః

- శోభనకరమైన స్థానం సహజంగా గలవాడు. స్థిరమైన ఐశ్వర్యం కలవాడు.
- తామరపూవు మధ్యభాగంవలె ఎర్రని అందమైన ముఖం కలవాడు.
- చతుర్వేదాలు ఉపదేశించిన అందమైన ముఖం కలవాడు.

ఓం స్వాస్యాయ నమః

ఆస్ - ఉపవేశనే - కూర్చొనుట (ఉదా. ఆసనము). 'ఆస్యము' అంటే 'పదవి' లేదా 'స్థానము' అనే అర్థాన్ని శ్రీ భట్టులు గ్రహించారు. 'ఆస్యము' అంటే 'ముఖము' అనే అర్థాన్ని శ్రీ శంకరులు గ్రహించారు. (అమరకోశము వ్యాఖ్యానము అసు - క్షేపణే – విసురుట; **అస్యతే క్షిప్యతే నవనీతాది అస్మిన్ ఇతి ఆస్యమ్.**)

శ్రీ భట్టుల వ్యాఖ్య – (సు-ఆస్యః) స్థిరమైన, శోభనమైన స్థానము (పదవి) గలవాడు 'స్వాస్యః'. **సు-శోభనా, శోభనా ఆస్య యస్య స స్వాస్యః.** గొప్ప స్థానము కలవాడు 'స్వాస్యః.' సహజంగా గొప్ప స్థానం కలవాడు. **ఆసనం శోభనం యస్య స స్వాస్యః ఇతి చోచ్యతే.** శ్రీ భట్టుల వివరణ – ముక్తులు కూడా శ్రీవైకుంఠంలో

భగవంతునితో సామ్యము కలిగిఉంటారు. కాని తేడా ఏమంటే ముక్తులు ఒకప్పుడు అజ్ఞానంలో ఉండి తరువాత ముక్తులయ్యారు. భగవంతుడు మాత్రం ఎప్పుడూ అజ్ఞానానికి లోబడడు. ఇలా ఈయన ముక్తజీవులకంటే భిన్నుడు 'స్వాస్యః'.

శ్రీ శంకరుల వ్యాఖ్య – **సు-శోభనమ్ పద్మోదరం తలవత్ తామ్రమ్ అభిరూపతమమ్ అస్య అస్యమ్ ఇతి స్వాస్యః**. తామరపూవు మధ్యభాగంవలె అందమైన ముఖము కలవాడు స్వాస్యః.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **శోభనమ్ అస్యమ్ వదనమ్ యస్య ఇతి స్వాస్యః**.

శ్రీ శంకరులు మరొక అర్థం కూడా చెప్పారు – **వేదాత్మకో మహాన్ శబ్దరాశిః తస్య ముఖాత్ నిర్గతః పురుషార్థ ఉపదేశార్థమ్ ఇతి స్వాస్యః**. చతుర్విధ పురుషార్థములను సాధించడానికి ఉపదేశించిన అందమైన నోరు గలవాడు స్వాస్యః. ఇందుకు శ్రీ శంకరులు బృహదారణ్యకోపనిషత్తు (2.4.10)నుండి ఉదాహరించారు –

అస్య మహతో భూతస్య నిశ్వాసితమ్ ఏతత్ ఋగ్వేదో
యజుర్వేదః సామవేదః అథర్వాంగిరస ఇతిహాసః
పురాణమ్ విద్యా ఉపనిషదః శ్లోకః అనువ్యాఖ్యాని
వ్యాఖ్యాని అస్యైవ ఏతాని సర్వాణి నిశ్వాసితాని

వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, సూత్రములు వంటివి అన్నీ ఆయన ఊపిరినుండి ఉద్భవించాయి.

849. ప్రాగ్వంశః

- అనాదిగా ముక్తులైన నిత్యసూరులయొక్క ఉత్పత్తి, స్థితి అన్నీ ఇతని అధీనంలోనే ఉంటాయి.
- సనాతన వంశము గలవాడు, అనగా విశ్వమునకు ఆది అయినవాడు.
- అందరికంటె ముందుగా ఆయననుండి బ్రహ్మ ఉద్భవించాడు.
- ప్రకర్షణతో (రాజసంతో) సంచరించేవాడు మరియు ఆయన గొప్పతనం స్పష్టంగా, గట్టిగా చెప్పబడింది.

ఓం ప్రాగ్వంశాయ నమః

'ప్రాక్' అనగా మొదటి, ముందటి. వంశము అనగా జాతి. 'ప్రాక్' అనగా నిత్యసూరులు అని శ్రీ భట్టులు, విశ్వము అని శ్రీ శంకరులు, బ్రహ్మ అని శ్రీ కృష్ణదత్త భరద్వాజ అర్థాలను తీసుకొన్నారు.

శ్రీ భట్టుల వ్యాఖ్య – ప్రాక్ - అనాదిగా ముక్తులై శ్రీవైకుంఠంలో ఉండే నిత్యసూరులు. వంశ - ఆధారము. ప్రాక్ వంశ - అనగా అట్టి నిత్యసూరుల స్థితి, అష్టైశ్వర్యములు, శక్తులు అన్నీ కూడా భగవానుని దయ, సంకల్పము వల్లనే సంభవిస్తున్నాయి.

అనాది ముక్తాః ప్రాంచో యే తేషాం ఉద్భవ భూమిదః

ప్రాగ్వంశ ఇతి విఖ్యాతః సప్తార్ణో మనురుత్తమః

అనాదిగా ముక్తులైన నిత్యసూరులయొక్క ఉత్పత్తి, స్థితి అన్నీ ఇతని అధీనంలోనే ఉంటాయి. ఈ నామము సప్తాక్షరీమహామంత్రము. ఉత్తమ ఫలప్రదము. ఓం ప్రాగ్వంశాయ నమః. (శ్రీ కైవల్య సారధి).

ప్రాచాం వంశః ప్రాగ్వంశః. ఇందుకు శ్రీ భట్టులు పురుషసూక్తంనుండి ఉదాహరించారు. **యత్ర పూర్వే సాధ్యాః సన్తి దేవాః.** విష్ణువు నివాస స్థలమైన పరమపదంలో అనాదిగా సాధ్యదేవతలు (సదా ముక్తులైన దేవతలు) ఉంటారు.

శ్రీ రాధాకృష్ణశాస్త్రి – సూర్యవంశము, చంద్రవంశము, రఘువంశము, ఇలా ఏదైనా వంశంలో ప్రముఖుని పేరుమీద ఆయా వంశాల పేర్లు వస్తుంటాయి. అలాగే ప్రాగ్వంశానికి, అనగా నిత్యుల వంశానికి మూలమైనవాడు భగవానుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – 'ప్రాక్' అనగా అన్నింటికంటె ముందు ఉన్నది. **అస్య వంశః ప్రాగేవ, న పాశ్చాత్య ఇతి ప్రాగ్-వంశః.** అన్నింటికంటె ముందు ఆయన వంశము, అనగా జగత్తు ఉద్భవించింది. తరువాతే అన్నీ వచ్చాయి. సనాతనమైన వంశము గలవాడు అనగా విశ్వమునకు ఆదియైనవాడు (అనాది) గనుక భగవానుడు 'ప్రాగ్వంశః'.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – 'ప్రాగ్' అనగా అన్నింటికంటె ముందు సృష్టింపబడిన చతుర్ముఖబ్రహ్మ. **ప్రాంచతి ఇతి ప్రాగ్ బ్రహ్మ, స వంశః సనాతనో యస్య ఇతి ప్రాగ్-వంశః.** చతుర్ముఖ బ్రహ్మను తన వంశంలో కలిగిన సనాతనుడు 'ప్రాగ్వంశః'.

శ్రీ వాసిష్ఠ – అంచ్ - గతి పూజనయోః - వెళ్ళుట, పూజించుట. ప్ర - అంచు - క్విన్ = ప్రాంచ్ (పాణిని 3.2.59). అనగా ముందున్నవాడు. వన్ - శబ్దే సంభక్తౌ చ - ధ్వనించుట, గౌరవించుట. **ప్రకర్షేణ అంచతి-గచ్ఛతి, వనతి-శబ్దయతే సంబహాజతే చ ప్రాగ్ వంశః.** రాజసంతో పయనిస్తూ చలిస్తూ ఉండేవాడు. ఎవనియొక్క ఔన్నత్యం గొప్పగా ధ్వనించిందో (చెప్పబడిందో) ఆయన 'ప్రాగ్వంశః'.

850. వంశవర్ధనః

- బద్ధులు, ముక్తులు, నిత్యసూరులు, దేవతలు, తన భక్తులు, ఇలా అందరి సంతానాన్నీ వృద్ధిచేసేవాడు.
- జగత్తును వృద్ధిపొందించువాడు (వర్ధ్ - పెంచుట).
- సమయం వచ్చినపుడు జగత్తును పరిసమాప్తం చేసేవాడు (వర్ధ్ - ఖండించుట).

ఓం వంశవర్ధనాయ నమః

శ్రీ భట్టుల వ్యాఖ్య – శ్రీ భట్టులు ఇంతకు ముందు చెప్పిన మూడు నామములను ఈ నామ వివరణలో సంక్షిప్తపరచారు.

847. **స్వధృతః** – బద్ధ జీవులకంటే భిన్నంగా, స్వభావసిద్ధంగా, మహదైశ్వర్యం గలవాడు.

848. **స్వాస్యః** – ముక్తులకంటే భిన్నంగా, ఎప్పుడూ సహజంగా, శోభనస్థానం కలవాడు.

849. **ప్రాగ్వంశః** – నిత్యసూరులకు కూడా ఆధారమైనవాడు.

850. **వంశవర్ధనః** – పైన చెప్పిన బద్ధజీవులు, ముక్తులు, నిత్యులు – ఈ ముగ్గురు జీవుల వంశాలనూ వృద్ధిపరచేవాడు. ఈ మూడు విధాలైన జీవులు అనుభవించే కైంకర్యరసము (భగవత్సేవానందము) మరింతగా వర్ధిల్లడమే శ్రీ భట్టులు ప్రస్తావించిన వృద్ధి. కనుక భగవంతుడు వంశవర్ధనుడు.

నిత్య సిద్ధస్య వర్గో యః వంశం సంతాన లక్షణమ్
తం వర్ధయతి యశ్చాసౌ వంశవర్ధన ఉచ్యతే
తన భక్తులను, జ్ఞానులను తన సంతానముగా భావించి వృద్ధిపొందించువాడు వంశవర్ధనుడు.

శ్రీ నమ్మాళ్వారు. తిరువైమొళి 9.3.4 – దేవతలు, నిత్యసూరులు మొదలైనవారు తడబడే మాటలలో భగవంతుని స్తుతిస్తున్నారు. ఎందుకంటే వారు భగవంతుని తలచుకొన్నపుడల్లా వారి హృదయం ఆనందపరవశం అవుతుంది. వారికి భోగాన్నిచ్చే ఔషధమూ, ఆనందాన్నిచ్చే పానీయమూ, జీవితాధారమూ, ఆనందహేతువూ ఆయనే అని వారంటున్నారు.

ఇలా భగవంతునికి కైంకర్యం చేయడంలో నానాటికి ప్రవృద్ధమయ్యే ఆనందాన్ని మనం కోరుకోవాలి.

శ్రీ కృష్ణదత్త భరద్వాజ – **వంశం భక్తానామ్ వర్ధయతే ఇతి వంశవర్ధనః**. తన భక్తులకు వృద్ధిని చేకూర్చేవాడు వంశవర్ధనుడు.

శ్రీ శంకరుల వ్యాఖ్య – వృధ్ - పెంపొందించుట. **వంశమ్ ప్రపంచమ్ వర్ధయన్ వంశవర్ధనః**. వంశము, అనగా ప్రపంచమును వృద్ధిచేయువాడు వంశవర్ధనుడు. **'ప్రాగ్వంశః'** నామము వ్యాఖ్యలో కూడా శ్రీ శంకరులు 'వంశము' అనగా 'ప్రపంచము' అనే అర్థాన్ని తీసుకొన్నారని గమనింపవచ్చును.

శ్రీ సత్యసంధ తీర్థ – **పరీక్షిత సంరక్షణేన పాండుకులమ్ వర్ధయతి ఇతి వంశవర్ధనః**. పరీక్షిత్తును కాపాడడంద్వారా పండవుల వంశాన్ని వర్ధిల్లజేసినవాడు వంశవర్ధనుడు.

శ్రీ బలదేవ విద్యాభూషణ – **వంశం యదోః వర్ధయతి ఇతి వంశవర్ధనః యత్ర షట్ పంచాశత్ కోటయః ప్రధాన భూతా బభూవుః**. యదువంశం వృద్ధికి కారణమైనవాడు వంశవర్ధనుడు.

శ్రీ శంకరులు మరొక అర్థంకూడా చెప్పారు. వర్ధ్ - ఛేదనే - నరుకుట. **ప్రపంచమ్ ఛేదయన్ వా వంశవర్ధనః.** సమయం వచ్చినపుడు జగత్తును తనలో లీనం చేసుకొనేవాడు వంశవర్ధనుడు.

తన అవతార పరిసమాప్తి సమయంలో శ్రీకృష్ణుడు యాదవవంశమునుకూడా నాశనం చేయడాన్ని శ్రీ రాధాకృష్ణశాస్త్రి ఉదాహరించారు.

(1) శ్రీ నరసింహన్ కృష్ణమాచారి ఆంగ్ల రచనకు ఇది తెలుగు అనువాదము.

(2) భగవద్గీత శ్లోకముల తాత్పర్యము గీతాప్రెస్, గోరఖపూర్ ప్రచురణనుండి.